
15 బహుమతులను గెలవండి



మెజెస్టిక్®

మీ కూపన్ నేడే పొందండి.
పండుగ బహుమతుల పథకంలో చేరండి.

లక్కీ డ్రా:
ప్రతినెలా 15వ తేదీన.
స్థలం: మహావీర్ కంబైన్స్
హైదరాబాదు. ఫోను. 231198



అన్ని మెజెస్టిక్ ప్రెషర్ కుక్కర్లకు పండుగ బహుమతి కూపన్ వుంది. బహుమతి పొందే కూపన్ మీదే కావచ్చు. మీకు చేరువలో వున్న డీలర్ నుండి వివరాలు పొందండి.

మెజెస్టిక్®
ప్రెషర్ కుక్కర్

సొమ్ము విలువకు తగ్గ ప్రెషర్ కుక్కర్

ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్స్ **మహావీర్** కంబైన్స్, కంచన్ జంగ కాంప్లెక్స్, కింగ్ కోఠి రోడ్, హైదరాబాద్-1 ఫోన్ 231198, 235856
అన్ని ప్రఖ్యాత దుకాణములలో లభించును.

ముఖ చిత్రం

26 డిసెంబర్, 86-1 జనవరి 87 ముద్దుగుమ్మ ముచ్చెర్ల అరుణ ముఖచిత్రము ఎంతో ఆకర్షణీయంగాయున్నది.

మల్లిశ్యామ్, పొందూరు

శీర్షికలు

నటి ముచ్చర్ల అరుణ ముఖ చిత్ర పత్రికలో 'గర్భస్థ శిశువు చెప్పిన కథలు' వ్యాసాలు ఫొటో లతో వెరైటీగా వుంది అందులో ప్రచురితమవుతున్న కథలు ఎంతో వాస్తవంగా బావుంటున్నాయి.

కీర్తి కిష్టయ్య, లక్ష్మీదేవిపల్లి

* * *

ముచ్చెర్ల అరుణ ముఖచిత్రంతో వచ్చిన సంచికలోని శీర్షికలన్నీ మమ్మల్ని ఆకట్టుకున్నాయి. "అభిమాన తారలపై అభిప్రాయం" "ఇవే మన పద్యాలు", "ఆరోగ్య దీపిక", "గర్భస్థ శిశువు చెప్పిన కథలు" ఫీచర్లు చాలా బాగున్నవి. అభినేత్రి భానుప్రియ సమాధానాలు మరీ మరీ అలరించాయి.

- బిరెని శ్రీనివాస్‌గౌడ్, రామాయంపేట

ధర్మపథం

మానవుల సుఖజీవనానికి, మర్యాదకూ అవసరమైన ధర్మ కార్యాలను ధనం వల్లనే సాధించగల్గుతామనే సందేశాన్ని తమ 'ధర్మపథం' శీర్షిక ద్వారా శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు చక్కగా వివరించారు.

- జిట్టా రమణిమోహన్, కడప

వ్యాసాలు

26 డిసెంబర్, 86–1 జనవరి 87 సంచికలో 'గుర్తింపు పొందని కుస్తీ, ప్రోత్సాహము అందని మల్లయోధులు'– ఒక ప్రత్యేకత! ప్రభుత్వం యీ విషయం గుర్తించి కుస్తీ, మల్లయోధులకు ప్రోత్సాహమిచ్చుటకు దోహదం కాగలదని ఆశిస్తాను.

–యన్. కనకారావు, పర్లాకిమిడి

సీరియల్స్

ముచ్చర్ల అరుణ ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. ముఖ్యంగా 'పావని' సీరియల్ మృదుమధురంగా వుంది. "ఆరోహణ "సీరియల్ మొదట్లోనే ఆకట్టుకుంది.

–సయ్యద్ జానిబాష, దూపాడు

* * *

"ఒకటి ఒకటి మూడు", "ఒడిలో చెలి మోహన రాగం", "ఆరోహణ" సీరియల్స్ ఒకదాన్ని మించి మరొకటిగా మమ్మల్ని ఆకట్టుకున్నాయి.

- మైత్రేస్ ఉమాకృష్ణ, కోవూరు

* * *

"ఒడిలో చెలి మోహనరాగం" సీరియల్ ఎంతో బాగుంది. మంజీర, ప్రణీత్‌ల పేర్లను ఎన్నుకోవడం లోనే రచయిత్రి నవ్యత్వం ప్రదర్శించింది.

- కె. శ్రీనివాస్, అమ్మాపాలెం

ఉత్తరాలు

కథలు

అరుణ ముఖ చిత్రంలో వెలువడ్డ పత్రిక చాలా ఆకర్షణీయంగా ఉంది. 'ఇరుకు' కథ వాస్తవానికి చాలా దగ్గరగా ఉన్నది.

–ఎ. చంద్రమౌళి, రామకృష్ణాపూర్

* * *

ముచ్చెర్ల అరుణ ముఖచిత్రంతో విడుదలయిన సంచికలోని కథల్లో "ఆడది కోరుకొనే ...", "థాంక్యూ డియర్ పోస్ట్‌మన్" బాగున్నాయి.

- ఎం. శివాజీ, మోదుకూరు

* * *


"ఆడది కోరుకొనే" కథ అనుకోని విధంగా ముగిసింది. ఇది స్త్రీ జాతికి మరో పిలుపు.

- చెంగల కృష్ణమూర్తి, లింగన్నపాలెం

* * *

"ఈ తప్పు నాది కాదు" కథలో జైలర్ ఖైదీని విడుదల చేసినట్టు రాశారు. కోర్టు ఆర్డరు లేకుండా జైలరు ఖైదీలను విడుదల చేయవచ్చునా?

- కె. రామారావు, హైదరాబాద్ □



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : (1938-1972)

23-29 జనవరి '87
శ్రీ అక్షయ నామ సం. పుష్య బ. అష్టమి.
సంపుటము 79 : సంచిక 21

ముఖ్య సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

కార్యనిర్వాహక(యాక్టింగ్) సంపాదకుడు :
మతుకుమల్లి మాధవరావు

విడిప్రతి వెల రు. 2.75
పోస్టులో 6 నెలల చందా రు. 80.60
పోస్టులో 12 నెలల చందా రు. 161.20

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి : శ్రీదేవి
(ఫొటో : ఎం. కె. రామమూర్తి)

కథలు :

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు :



Vaani Krishna

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

రాజకీయ ఎత్తుగడగా భాషా కల్లోలం


గోవా లాంటి చిన్న ప్రాంతంలో కూడా భాషా కల్లోలాలని చెప్పబడుతున్న వాటిలో ఆరుగురు వ్యక్తులు మరణించడం దారుణం. ఈ సంఖ్య ఢిల్లీలో గానీ, బొంబాయిలో గానీ అయితే 500కి సమానం. కొంకణి కార్యకర్తలు తమ భాషకు మద్దతుగా వీధులలోకి వచ్చారని, ఆ క్రమంలో ఒక పద్ధతి ప్రకారం బీభత్సం సృష్టించారని వార్తా పత్రికలు వ్రాశాయి. గత నెలకు గోవా విమోచన జరిగి 25 సంవత్సరాలు నిండిన సందర్భంగా రజతోత్సవాలకు అధ్యక్షత వహించడానికి వెళ్ళిన రాష్ట్రపతి జైల్‌సింగ్‌ను గవర్నర్ భవనం నుంచి రక్షించ వలసి వచ్చింది. విమానాశ్రయానికి హెలికాప్టర్‌లో తీసుకు పోవలసి వచ్చింది. పూర్తిగా వారం రోజుల పాటు ఒక్క కాంగ్రెస్ (ఐ) నాయకుడు కూడా తమ ఇంటి గడపదాటి బైట అడుగు పెట్ట లేకపోయాడు.

గత 25 సంవత్సరాలుగా గోవాను పూర్తిగా భారత దేశపు వలసగానో, కాకపోతే ఢిల్లీకి చెందిన భారతీయుల వలసగానో పరిగణిస్తున్నారు. స్థానిక ప్రజల్ని హీనంగా చూస్తూ, వాళ్ళు గోవాను ఒక రకమైన విలాస స్థలంగా మార్చి వేశారు. కొన్ని సంవత్సరాలుగా గోవా వాసులు తమ వ్యవహారాలని నడపడంలో తమకు ఎక్కువ పాత్ర ఉండాలని కోరుతున్నారు. కాని కుప్పలుగా డబ్బు తప్ప వాళ్ళకు మరేమీ అందలేదు. ఈ డబ్బులో అత్యధిక భాగం స్థానిక కాంగ్రెస్ రాజకీయ వేత్తల పెద్ద పెద్ద జేబుల లోకే తరలి వెళ్ళింది. ఇతరుల భూములను దురాక్రమణ చేయటం ద్వారా డబ్బు చేసుకోవడంలో తలమునకలుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రితో సహా విముక్తి తర్వాత వచ్చిన గోవా నాయకులందరూ నిష్ప్రయోజకులు. గత 25 సంవత్సరాల విమోచనలో కాంగ్రెస్ రాజకీయ నాయకుల నుంచి మీరేం నేర్చుకున్నారని ఏ గోవన్‌ని అడిగినా తక్షణమే వచ్చే సమాధానం అవినీతి అని!

ప్రస్తుత కొంకణి – మరాఠీ వైరుధ్య వివాదానికి బాధ్యులు ఈ అవినీతి పరులైన రాజకీయ వేత్తలే. గోవావాసులలో 99 శాతం మంది కొంకణినే మాట్లాడతారు గనుక ఈ వివాదం నిజానికసలు వివాదమే కాదు. ఈ ప్రాంతపు అధికార భాషగా మరాఠీ ఉండాలని వాదించే వాళ్ళు కూడా కొంకణినే మాట్లాడతారు. గోవావాసులు ఒకరితో ఒకరు మరాఠీలో మాట్లాడుకోరు, కొంకణిలోనే మాట్లాడుకుంటారు. వాళ్ళలో ఎందరికో మరాఠీ తెలుసు. పంజాబీలలో అనేక మంది హిందీని మాట్లాడగలిగినప్పటికీ, వ్రాయగలిగినప్పటికీ ఒకరితో ఒకరు పంజాబీలో మాట్లాడుకోవడం లాంటిదే ఇది. దాదాపు ప్రతి ఒక్కరికీ హిందీ తెలిసిన పంజాబ్‌కు, ఆ మాటకొస్తే బొంబాయికి హిందీ ఎటువంటిదో గోవాకు మరాఠీ అటువంటిదే. కాని ఇంకా అది పూర్తిగా స్థానిక భాషకాదు. ఈ ప్రాంతం మీద దాన్ని రుద్దే ప్రయత్నం చేస్తే వ్యతిరేకత వస్తుంది. బొంబాయిలోని దాదాపు ప్రతి ఒక్కరికీ హిందీ తెలుసుననే కారణం మీద బొంబాయి మీద హిందీ రుద్దితే వచ్చే వ్యతిరేకత లాంటిదే ఇది.

ఈ మొత్తం వ్యవహారానికి కారకుడు ముఖ్యమంత్రి రాణే. విముక్తి ఉద్యమంలో ఎన్నడూ పాల్గొనని, వెన్నెముక లేని మనిషి ఆయన. కాని తన రాజకీయ సంబంధాలను, మహారాష్ట్రలోని ఇరుగు పొరుగు రాజకీయ వేత్తలతో అనుబంధాలను ఉపయోగించుకుని అత్యున్నత స్థానానికి చేరుకోగలిగాడు. ఆయన మద్దతుదారులలో ఎంతో మంది లాగానే ఆయన కూడా జనతా టికెట్పై ఎన్నికయ్యాడు. 1980లో శ్రీమతి ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి రాగానే ఎవరి అనుమతీ అక్కర లేకుండానే కాంగ్రెస్ లోకి దూకాడు. దారుణ హత్యకు గురయ్యే వరకు పంజాబ్‌లో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవర్తించినట్టుగానే, అప్పటి నుంచీ రాణే మరాఠీ, కొంకణి వ్యతిరేకతను రెచ్చగొడుతున్నాడు. రాణే స్వయంగా విచిత్ర మైన కొంకణి మాట్లాడతాడు. ఆయన కొంకణి ఏ మాత్రం రాని వనితను పెళ్ళాడాడు. భాషా సమస్య మీద వివాదం ద్వారా మాత్రమే వోటర్లను చీల్చి ఆయన అధికారంలో కొనసాగగలడు. ఆయన యథావిధిగా అధికారంలో ఉండటానికి అదొక్కటే మార్గం. రాణేను తొలగించే వరకు గోవాలో భాషా సమస్యకు పరిష్కారం ఏదీ కుదర జాలదు. అందువల్లనే కొంకణి మద్దతు దారులూ, మరాఠీ మద్దతు దారులు కూడా రాణేను తొలగించాలని కోరుతున్నారు. గోవా లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ గోపాల్‌సింగ్ ఆయనను ఇంకా తొలగించక పోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది. బహుశా ఆయన ఢిల్లీ నుంచి ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారేమో.

ఈ మొత్తం వ్యవహారానికి రాణే వంటి కాంగ్రెస్ వాదులు మతోన్మాద మలుపు ఇచ్చారు. ఈ విషయంలో కాంగ్రెస్ వాదులకు మంచి నైపుణ్యం ఉంది. ఈ భాషా వివాదం కాథలిక్కులకు (వారిని కొంకణి మద్దతు దారులుగా చిత్రిస్తున్నారు) హిందువులకు (వారిని మరాఠీ భాషోన్మాదులుగా చిత్రిస్తున్నారు) మధ్య వచ్చినట్టుగా మార్చి వేశారు. నేను ఇంతకు ముందే చెప్పినట్టు గోవా వాసులలో 99 శాతం మంది కొంకణి మాట్లాడతారు. కొందరికి, బహుశా మూడో వంతు మందికి, మరాఠీ కూడ తెలుసు. కాథలిక్కులకి మరాఠీ రాదు గాని ప్రస్తుతం చాలామంది ఆ భాషని అభ్యసిస్తున్నారు. త్వరలోనే వాళ్ళు ఇంగ్లీషులో మాట్లాడినంత ధారాళంగా మరాఠీలో మాట్లాడగలరు. ఇంగ్లీషు కూడా వాళ్ళ భాష కాదు. గోవాకు బైట ఉన్న గోవన్ కాథలిక్కులు మంచి మరాఠీ మాట్లాడతారు. ఈ మధ్యనే చండీఘర్‌లో జూలియో



రిబెయిరోతో మాట్లాడినప్పుడు నేనీ విషయం గుర్తించాను. రిబెయిరో గోవావాసియే. ఆయన తన తల్లితో పోర్చుగీస్ మాట్లాడతారు. ఇతర బంధువులతో కొంకణిలో బొంబాయిలో తన ఉద్యోగులతో మరాఠీలో, చండీఘర్ లోని సిబ్బందితో హిందీలో మాట్లాడతారు. పత్తుకునేలా ఉండేందుకు కొన్ని పంజాబీ మాటలు కూడా ఉపయోగిస్తారు. ఆయనకు భాషా దురహంకారం లేదు. కాని ఆయన మాతృభాష ఏమిటని అడిగినప్పుడు మాత్రం వెంటనే కొంకణి అని చెపుతారు.

గోవాలో కాథలిక్కులు అంత కంతకూ ఎక్కువగా భారతీయతను సంతరించుకుంటున్నారు. లేదా బహుశా హిందూత్వాన్ని సంతరించుకుంటున్నారు. ఎందుకంటే వాళ్ళు తమ సంప్రదాయిక కాథలిక్ పేర్లను వదులు కుంటూ సంప్రదాయిక హిందూ పేర్లు పెట్టుకుంటున్నారు. సుభాస్ ఫెర్నాండెస్, దేవికా సెక్వేరా, మోహన్ డిసౌజా, మీరా రిబెయిరో అలాంటి పేర్లు. వాళ్ళు ఇంకా క్రైస్తవులే. మంచి క్రైస్తవులకు నిర్దేశించ బడిన పనులన్నీ చేస్తారు. కాని వాళ్ళు ఇతరులందరి లాగానే భారతీయులు కూడా. అట్లాగే వాళ్ళు గోవన్‌లు కూడా. తమ హిందూ సోదర సోదరీ మణులతో కలిసి ఆ గోవా తత్వాన్ని వాళ్ళు పరిరక్షించుకో దలచుకున్నారు. ఇప్పుడు వాళ్ళకు వాళ్ళు పరాయి వాళ్ళని చెప్పబడుతున్నది. కొంకణి భారతీయ భాష కాదని, అందు వల్ల గోవా అధికార భాష కాజాలదని చెప్పబడుతున్నది. నేను ఇదివరకే అన్నట్టు మరాఠీ ఎంత భారతీయ భాష అవుతుందో కొంకణి కూడా అంతే గోవన్‌ల భాష, భారతీయుల భాషా అవుతుంది. మరాఠీని తలకెత్తుకునే వాళ్ళు కూడా ఇంటిలోనూ, దాదాపు ప్రతి చోటా కొంకణినే మాట్లాడతారు. ఒక గోవన్‌ని మరో గోవన్ నుంచి విడదీయడానికి భాషా సమస్యను వాడు కుంటున్నది రాజకీయ నాయకులు మాత్రమే. ఈ నీతి నియమాలు లేని వ్యక్తులను ముందుకు సాగ కుండా ఆపక పోతే గోవా కూడా పంజాబ్ మార్గంలో నే సాగుతుంది.

ప్రజల సాధికార భావ ప్రకటనా మాధ్యమాన్ని నిరాకరించే భాషా దురహంకారాన్ని నేను అర్థం చేసుకోలేక పోతున్నాను. ప్రజలతో ఏ ప్రభుత్వమైనా వారికి అర్థమయ్యే భాషలో మాట్లాడాలి. లేదా తత్సంబంధిత ప్రజానీకంలో అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాషలో మాట్లాడాలి. భారతదేశం వంటి సువిశాల దేశం ఒక అనుసంధాన భాషను కలిగి ఉండాలి. అది అందరి సమ్మతి మీద రూపొందాలి. అలాంటి భాష హిందీనే. కొన్నాళ్ళ క్రితం నేను బెంగుళూరులో ఒక వ్యక్తిని పోస్ట్ ఆఫీసుకు దారి చూపమని ఇంగ్లీషులో అడిగాను. అక్కడ హిందీ వాడ గూడదని నాకు ఎవరో చెప్పారు. కాని ఆయన ధారాళమైన హిందీలో తనకు ఇంగ్లీషు తెలియదని చెప్పాడు. ఆయన పేరు చిన్నప్ప. మంచి కన్నడ పేరు. □

ఆంధ్రసచిత్రవారపత్రిక

పాఠకులకి మరో సరికొత్త శీర్షిక

చిన్నారి బాలల దీన గాథలు

మన భారతీయ సంస్కృతిలో పసి పిల్లలని దైవ స్వరూపులుగా భావిస్తారు. వారిపట్ల అంతులేని ప్రేమాభిమానాలని ప్రదర్శిస్తారు. వారిపై అత్యాచారాలు జరగటం అన్నది పూర్వం ఎంతో అరుదుగా ఉండేది. కానీ ఇటీవల పరిస్థితి కొంత మారింది. ముక్కుపచ్చలారని చిన్నారి బాలలని వెట్టిచాకిరీకి వాడుకోవటం, వారి బంగారు భవిష్యత్తుని మొగ్గలో నే తుంచివెయ్యటం జరుగుతున్నది. చిన్న పిల్లలని అత్యంత ప్రమాదకరమైన వృత్తులలో, పనులలో అతి తక్కువ వేతనానికి నియమించటం జరుగుతున్నది. వారు ప్రమాదాలకి గురై మరణించటమో, శాశ్వతంగా వికలాంగులై పోవటమో జరుగుతున్నది. ఎందరో పసివారు పెద్దల నిరాదరణ కారణంగా అనాథ శరణాలయాల పాలవుతున్నారు. తలి దండ్రుల నీడలో ప్రేమాభిమానాలతో పెరగవలసిన ఆ వయసులో వారు పెద్దల నిరాదరణకి, క్రౌర్యానికి దారుణంగా గురవుతున్నారు. అద్దంలాంటి స్వచ్ఛమైన వారి లేత మనస్సులపై అటువంటి అకృత్యాలు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. భవిష్యత్తులో వారేవిధంగా మారతారో, వారి మనః ప్రవృత్తులు ఏ విధంగా ఉంటాయన్నది ఊహించటం కష్టం.

పసి పిల్లలపై జరుగుతున్న ఈ దారుణాలకి గల కారణాలని, వాటిని నివారించే పరిష్కార మార్గాలని చర్చించే సహేతుకమైన రచనలని పంపవలసిందిగా పాఠకులని కోరుతున్నాము.

పరిశీలనకి పంపే రచనలు స్వంత రచనలై ఉండాలి. ఒక అరఠావు పేజీ మించకుండా కాగితానికి ఒకవైపే రాసి పంపాలి. రాసిన వారి పేరు, పూర్తి చిరునామా వ్రాత ప్రతిపై స్పష్టంగా రాయాలి. రచనతో పాటు అది రాసిన వారి ఫొటో కూడా జతపరచి పంపవచ్చు. ప్రతి రచనతో కింద ఇచ్చిన కూపన్ జతపరిచి పంపాలి.

ప్రచురణకి స్వీకరించిన రచనలని అవి రాసిన వారి ఫొటోలతో (పంపి ఉంటే) వీలువెంబడి ప్రచురిస్తాము. ప్రచురణకి స్వీకరించని రచనలని తిప్పి పంపగోరేవారు స్వంత చిరునామాకల, తగినన్ని తపాలాబిళ్ళలు అతికించిన కవరు జతపరిచి పంపవలసి ఉంటుంది. వాటిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరుపబడవు. ప్రచురించిన ప్రతి రచనకూ పారితోషికం ఉంటుంది.

పాఠకులు తమ రచనలని "చిన్నారి బాలల దీన గాథలు" శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–520003 అనే చిరునామాకి పంపాలి.

–సంపాదకుడు

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు :...

పూర్తి చిరునామా :...

....

....

పిన్ కోడ్ :

సంక్రాంతి అల్లుడు

మధురాంతకం రాజారాం

ఋతువు లారింటిలోను నాకు హేమంత మంటేనే ఇష్టం. వసంతాన్ని తోసి రాజంటున్నానని అనుకోవద్దు. ఎండలు, ఉక్కపోతలు, చెమట్లు, ఆపసోపాలు తప్పితే ఏముందండీ వసంతంలో? ఇక వర్ష, శరదృతువు లంటారా? రామ రామ, ఆ గాలీ వానా, రొంపీ రొచ్చూ తట్టుకో గలమా? హేమంతం సంగతి అలాకాదే! ఎండలుంటాయి. ఉంటేమాత్రం? యుక్త వయస్కుల మధుర దాంపత్యంలా అవి ఆహ్లాదకరంగా వుంటాయి. వాన లుంటాయి. ఉంటే వుండనీ! ఎదురు చూడని అతిథుల్లా వచ్చి అవి తిష్ఠా వెయ్యవు. ఇట్టే వచ్చి, అట్టే వెళ్ళి పోతాయి. వాగుల్లో, వంకల్లో, చెరువుల్లో, దొరువుల్లో దండిగా నీళ్ళుంటాయి. వెన్ను వదలిన చెరుకు తోటల వైపు చూస్తే శాంతి బావుటాలు ఎగిరినట్లుంటాయి. పండిన వరిమళ్ళు కోత కొస్తాయి. గాదులు, గరిసెలు కొత్త ధాన్యంతో సందడిస్తాయి. తోటల్లో, దొడ్లల్లో పాదులన్నీ తీగలు సాచి, పువ్వులు గుభాళిస్తాయి. తెల్లవారి లేచి చూసే సరికి అప్పుడే తానమాడి, ముఖం నిండుకు పచ్చి పసుపు రాసుకున్న నిండు ముత్తయిదువలా ప్రకృతి పరమ రమణీయంగా వుంటుంది. హేమంత మంటే నాకెందు కిష్టమో యిప్పుడు తెలిసింది గదండీ! లేదంటే మంచు వేపు కలిగిస్తుంది గదా, చలి రాచి రంపాన పెడుతుంది గదా అని మీరన వచ్చు. కానీ చలిమంట లుండగా, గాలి దూరని శయనా గారాలుండగా, వెచ్చని పరుపు లుండగా, రగ్గులు బూర్నీసులు వుండగా మంచును, చలిని ఎవరు లెక్క పెడతారండీ మీ పిచ్చిగానీ!

అందువల్ల మానవాళికి సుఖ సంతోషాలు పంచి పెట్టడానికే హేమంతం వస్తుందని నేననుకుంటాను. హేమంత ఋతు సీమంతిని పైరు పచ్చల నిగారింపులే పట్టు చీరగా వస్తుంది. మంచు బిందువులే ముత్యాల సరాలుగా వస్తుంది. ముదురు గుమ్మడి పువ్వే మణి కిరీటంగా వస్తుంది. గంగిరెద్దులవాడే అంగరక్షకుడుగా వస్తుంది. వచ్చి ఏం చేస్తుంది? గొబ్బిళ్ళ దేవతై మన యింటి ముంగిట ముగ్గులో కొలువు దీరుస్తుంది. బంతుల్లై, చేమంతుల్లై మన పెరటి తోటలో విరగబూస్తుంది. ఇంతలో 'రంగలో రంగా హరీ' అంటూ సాతాని జియ్యరు గంట మ్రోగిస్తాడు. 'హరహరా మహారాజేశ్వరా' అంటూ జంగమయ్య శంఖం పూరిస్తాడు. ఆగంట, ఆ శంఖం గూడా వినిపించే సరికి 'ఓహో, సంక్రాంతి గూడా వచ్చేస్తూ వుంది' అనుకుంటాం.

"ఏమండీ! అమ్మాయి, అల్లుడూ ఎప్పుడొస్తారు?" అంటుంది ఇంటావిడ.

అవును మరి! సంక్రాంతి సంబరాలన్నింటికీ పరాకాష్ఠ అల్లుడి ఆగమనమే! ఆపాటికి పెళ్ళిళ్ళ సీజను అయిపోయి వుంటుంది. ఈడొచ్చిన అమ్మాయిని ఎంత కాలమని యింట్లో వుంచుకుంటారు? ఆ శుభ కార్యమేదో అయిందని అనిపించి వుంటారు. ఆకాశమంత పందిరి గాక పోయినా అంతదో యింతదో షామియానా వేసి వుంటారు. గుర్రం అవుటాఫ్ డేట్ అయిపోయింది గనుక కారు కుదిర్చి వుంటారు. గుమ్మ తప్పెట్లకు, కొమ్ము బూరాలకు రోజులు కావు గనుక, బ్యాండు మేళం ఏర్పాటు చేసి వుంటారు. నాలుగు దినాల పెండ్లి ఊహించ రానిది గనుక ఒక భోజనంతో, ఒక టిఫినుతో సరిపెట్టి వుంటారు. పురోహితుడి పురమాయింపులకన్నా, ఫోటోగ్రాఫరు పోజులే చూపరులను లోగొని వుంటాయి. కాశీయాత్ర, అరంజ్యోతి దర్శనం, సూత్ర ధారణ, తలంబ్రాలు మొదలైన సాంగ్యాలు యథావిధిగా జరిగి పోయి వుంటాయి. ఉదయం తొమ్మిదింటి కల్లా సత్రం ఖాళీ అయి పోయి వుంటుంది. సాయంకాలానికి మీ అమ్మాయి అత్తారింట్లో కుడికాలు మోపి వుంటుంది. మూడు నిద్దర్లు చేసిన తర్వాత ఆమె భర్త సమేతంగా మీయింటి కొచ్చి వుంటుంది. వచ్చిన అల్లుడు నెలో, రెండు నెలలో మీ యింట్లో వుండి, హాయిగా మనుగుడుపులు ఆరగించడానికి అనువైన కాలమాయిది? పాపం, అతగాడు నూటికి తొంభై పాళ్ళు ఎక్కడో ఉద్యోగై వుంటాడు. డ్యూటీకి వెళ్ళక పోతే పై అధికారు లొప్పుకుంటారా? ఇంట్లో భార్యామణి ఎదుట గడగడలాడే ఆఫీసరైనా సరే, ఆఫీసులో మన సాప్పె కొత్తల్లుడికి సెలవు మంజూరు చేస్తాడా? మీ అల్లుడు వెళ్ళే వుంటాడు. కొత్త సంవత్సరంలో కొత్త సెలవు లుంటాయి గనుక అదనంగా కొద్ది రోజులు సెలవు పెట్టి సంక్రాంతి కొస్తానని రాసి వుంటాడు. అదండీ సంగతి! సంక్రాంతి శోభలకు పరవశించి ప్రపంచమంతా ఆనంద నృత్యం చేస్తే చేయవచ్చు గాక! పండుగకు మీ అల్లుడొస్తే గానీ మీ కానందం లేదు.

ఆమాటకొస్తే అల్లుడికి మాత్రం అత్తవారింటికి మించిన ఆనంద ధామం ఎక్కడుంటుంది? పర్వతరాజ పుత్రికను వివాహమాడి పరమ శివుడేం చేశాడు? ఆ పర్వతాల్లోనే కాపురం పెట్టేశాడు. క్షీరసాగర కన్యను పెండ్లాడి విష్ణుదేవుడేం చేశాడు? ఆ సముద్రంలోనే పవ్వళించేశాడు. అందుకే [illegible]గా అంటారు–'ఏమయ్యా, కొత్త పెండ్లి కొడుకా! పండగొస్తోంది. వీలయినంత తొందరగా అత్తారింటికి వెళ్ళు. అక్కడ నీ మరదలు పన్నీరు చిలికి నట్టుగా నీతో ముచ్చటాడుతుంది. పూల చెండ్లు విసరినట్లుగా బావ మరదులు సరాగాలు ఒలికిస్తారు. అత్తగారు మృష్టాన్నాలు వండి పెడుతుంది. ఓరచూపుల ఒయ్యారాలతోనే నవవధువు నిన్ను ఉయ్యాల లూపుతుంది' అని. నిజమే గదండీ! ఆత్మీయతలు, అభిమానాలు ఆఫీసులో దొరుకుతాయా? మర్యాదలు, మన్ననలు బస్స్టాండులో లభ్యమవుతాయా? సిగ్గులు, సింగారాలు మార్కెట్టులో ఎదురౌతాయా? ఇవన్నీ లభ్యమయ్యేచోటు ఒక టుండాలిగదా! అదే అత్తవారిల్లు.

అయితే ఒకటి. అల్లుడి కేదైతే అత్తగారిల్లో, అదే అమ్మాయికి పుట్టిల్లని మనం మరచి పోగూడదు. మెట్టినింట్లో అమ్మాయికి ఆదరణ లభించాలంటే, పుట్టింటి పునాది గట్టిగా వుండాలి. ఏదో ఒక అయ్య చేతికి పట్టిచ్చేశాము గదా అని ముభావంగా వుండి పోగూడదు. తరచుగా ఉత్తరాలు రాసి యోగక్షేమాలు తెలుసుకోవాలి. ప్రతి పండగకూ పిలవనంపాలి. మళ్ళీ ఎందుకు లెమ్మని మొగమాట పడినాసరే, పరవాలేదు లెమ్మని చీరా, సారె పెట్టి పంపాలి. నెలలు నిండితే సీమంతం. తీర్థమాడితే బారసాల. ఇలా ఎంతో తతంగముంది..... పుట్టినింటి వారికి కనుపాపలా వుండాలి. మెట్టినింట్లో దీపమై వెలగాలి. ఇదే ఆడుబిడ్డ కోరుకోవలసిన భాగ్యం. దీన్నే 'సౌభాగ్యం' అంటారు.

ఇంతకూ చెప్పొచ్చిందేమిటంటే సంక్రాంతికి పుట్టింటికి వెళ్ళాలన్న కోరిక ఆడుబిడ్డకు మరింత బలీయంగా వుంటుంది. మనిషి కోసం ఆమె వెయ్యి కళ్ళతో నిరీక్షిస్తుంది. పిలుపు కోసం వెయ్యి చెవులతో వేచి వుంటుంది. ఆహ్వానం అందక పోతే ఆమె మనసు ఎంతగా నలిగిపోతుందో ఊహించుకో వలసిందే! 'ఏమమ్మా, పుట్టింటికి వెళ్ళలేదా?' అని అమ్మలక్కలు ఆశ్చర్యపడి పోతారు. అత్తింటివారు చులకనగా చూస్తారు. భార్యను అలాంటి దయనీయ స్థితిలోనుంచి తప్పించడం కోసం, మా చిట్టి బాబు ఒక అమోఘమైన ఉపాయం కనిపెట్టేశాడు, అది సంక్రాంతి శుభ సందర్భంలో తప్పకుండా చెప్పుకోవలసిన కథ.

చిట్టిబాబంటే ఎవరను కున్నారు? నా డియరెస్టు ఫ్రెండు. వాడి భార్య సుజాత. పాపం, సుజాతకు తల్లి దండ్రులు లేరు. బాబాయే పెళ్ళి చేశాడు. పెళ్ళి చేసే టంత వరకే తన బాధ్యత అనుకున్నాడు. మొదటి సంక్రాంతికే పిలుపు లేదు. రెండో సంక్రాంతి వచ్చేసరికి సుజాత ఒక బిడ్డ తల్లిగూడా అయింది. పండుగింక కొద్ది రోజుల్లోనే వుంది. సుజాత ముఖంలో చీకట్లు అలముకున్నాయి. చీకట్లను పోగొట్టి, ఆముఖంలోకి వెలుగులు తెప్పించాలను కున్నాడు చిట్టిబాబు. బాబాయే రాసినట్లు ఒక [illegible] ఉత్తరం రాసి పోస్టు చేశాడు. సుజాతకు

పుట్టింటి నుంచీ పిలుపొచ్చిందన్న వార్త వీధంతటా ప్రచారమై పోయింది పండుగకు ముందురోజే ప్రయాణం చంటివాణ్ని చంకలో వేసుకుని బయల్దేరింది సుజాత. చిట్టిబాబు సూట్‌కేసు చేత బట్టుకుని మగధీరుడిలా ముందు నడిచాడు

స్టేషనులోకి వెళ్ళేదాకా పెదవి కదిపిన వాడు కాదు చిట్టిబాబు తీరా అక్కడికి చేరుకున్నాక మరింక ప్రమాదమేమీ లేదన్నట్టుగా తన కపట నాటకాన్ని బయట పెట్టేశాడు చిట్ట చివర 'మీ బాబాయి పిలిస్తే ఎంత, పిలవక పోతే ఎంత? పట్నంలో వసంత విహార్' అని ఒకటుంది అది మీ బాబాయి యింటి కన్నా నూరింతలు బాగుంటుంది. రోజు కేభైరూపాయలు పారేస్తే డబుల్ రూం దొరుకుతుంది టిఫిను, భోజనం, పాలూ పళ్ళూ, యిలా ఏది కావాలన్నా నేరుగా గదిలోకే వచ్చేస్తాయి. చూచావా సుజాతా! ఎంచక్కా యిక మీదట అదే నీకు పుట్టిల్లు నీకు పుట్టిల్లు గనుక అదే నాకు అత్తవారిల్లు " అంటూ చొక్కా కాలరు పైకెత్తాడట!

"ఏమండీ! ఇలాంటి పని చేసే వాళ్ళు కూడా వుంటారా ఎక్కడైనా?' అంటూ సుజాత నిర్ఘాంతపడిపోయిందట!

'ఉంటారుంటారు మన మున్నాం గదా!" తీవిగా ముసి ముసి నవ్వులు ఒలక బోస్తూ అన్నాడట చిట్టిబాబు

సరే, వాళ్ళలా వెళ్ళి వసంత విహార్‌లో దిగారనుకోండి! ఈలోగా యిక్కడేం జరిగిందంటే-

చిట్టిబాబు తల్లి, లక్ష్మీ సమానురాలైన శాంతమ్మ "ఏమండీ! పిల్లలు వెళ్ళిపోయాక యింట్లో ఏం తోచడం లేదండీ! మనమూ ఎటైనా వెళ్ళొద్దామండీ! నాకు పట్నం చూడాలని చాలా కాలంగా వుంది అబ్బాయి, కోడలు వచ్చేలోగా తిరిగొచ్చేద్దామండీ! అంటూ ముదిగారాలు మొదలెట్టిందట!

'సరే సరే అట్లాగే వెళ్దాంలే మరి! బయల్దేరు" అన్నారట జగన్నాథంగారు



సంక్రాంతి అల్లుడు

వృద్ధ దంపతులు రాత్రి తొమ్మిదింటికి పట్నంలో దిగారు ఆటో వాడు వాళ్ళని గూడా చక్కా వసంత విహార్‌కే తీసుకెళ్ళాడు అంత వరకూ జరిగింది కాకతాళీయమేనని అనుకోవచ్చు కానీ ఆ తర్వాత పడుచు జంటకు, ముసలి జంటకూ గూడా ఎదు రెదురు గదులే కుదరడముంది చూచారా, అది మాత్రం కేవలం భగవల్లీలే అనాలి

అర్ధరాత్రి కాబోతుండగా కీచుకీచు మంటూ ఎదుటి గదిలో నుంచీ ఏడుపు వినిపించిందట!

ఉలికి పడి లేచి కూర్చున్న కాంతమ్మ భర్తను నిద్రలేపి, 'ఏమండీ' అది మన బుజ్జిబాబు ఏడుపులా లేదూ?" అంటూ ఆరాతీసిందట!

"లోకమంతా నీకు బుజ్జిబాబు మయమే?ఊరుకో, వూరుకో" అంటూ జగన్నాధంగారు గదమాయించేశారట!

మరికొంత సేపటికి చంటివాడి ఏడుపు శ్రుతిమీరి రాగాన పడిపోయిందట. వాడక్కడగుక్క తిప్పుకోకుండా ఏడుస్తుంటే యిక్కడ కాంతమ్మగారికి మతిపోయినట్టయి పోయిందట.

"ఏమండేమండీ! నిజంగా మన బుజ్జి బాబేనండీ! నిఝంగా మన బుజ్జిబాబు ఏడు పేనండీ!' అంటూ ఆమె తహతహలాడి పోయిందట

ఇంతలో ఎదుటి గది తలుపులు తెరుచుకున్న చప్పుడు వినిపించిందట తాళం కంతలో నుంచీ అవతలికి చూచిన కాంతమ్మ నోట మాట రాక నిర్విణ్ణురాలై పోయిందట తేరుకున్నాక భర్త దగ్గరికొచ్చి–

"ఏమండీ' మన వాళ్ళేనండీ' ఎంత పని చేశారో చూశారా' వీళ్ళింతకైనా తగుదురు హవ్వ, హవ్వ. అత్తారింటి కని చెప్పి చక్కావచ్చి హోటల్లో దిగుతారా? ఉండండి, వీళ్ళని .. " అంటూ కారాలు, మిరియాలు నూరడానికి ఉపక్రమించిందట.

అప్పుడు జగన్నాధంగారు భార్యను నింపాదిగా మంచంపైన కూచో బెట్టి "ఒసి, వెర్రి మొగమా! ఇంత వయసొచ్చి మనకే ఉబలాటాలు తప్ప లేదే! ఇక కుర్రవాళ్ళు, వాళ్ళకు సరదా కోరికలుండడం తప్పంటావా? చేసిన నిరవాకానికింక కోపతాపాలు కూడానా! చాల్చాల్లే తేలు కుట్టిన దొంగలా ఊరుకో!" అంటూ చెవిలో హితోపదేశం చేశారట.

కాంతమ్మ గారప్పుడు బుంగముఖం పెట్టి "పోనీ లెండి! నేను వాళ్ళ నేమీ అనను ఏడ్చి ఏడ్చి బిడ్డకు శోష తగిలి పోయేటట్టుంది నేను వెళ్ళి వాణ్ణి ఊరుకో బెడతానండీ" అంటూ ప్రాధేయపడి పోయిందట.

ప్రాధేయపడడమే గాదు జగన్నాధంగారి మౌనాన్నే అంగీకారంగా భావించి ఆమె తలుపులు తీసుకుని తుఫానులా ఎదుటి గదిలోకి జొరబడి పోయిందట. "సముదాయించ డానికి తెలియని వాళ్ళు బిడ్డనెందుకు తెచ్చుకోవాలి? నాదగ్గరే విడిచి పెట్టిరావచ్చుగా'" అంటూ మనవణ్ణి అక్కున చేర్చుకుని చక్కా తన గదిలోకి తీసుకొచ్చేసిందట!

ఈ కథలో కొస మెరు పేమిటంటే – నాన్నమ్మ కనిపించిన తర్వాత ఆకుర్రకుంక కిముక్కుమంటూ నోరు తెరవలేదట నవ్వుకుంటూ, ఆడుకుంటూ ఆమె ప్రక్కన్నే అదమరిచి నిద్రపోయాడట!

సంక్రాంతి అల్లుడికి ఎదురయ్యే అనుభవాలు వింతగా, వినోదంగా, చెప్పుకోదగ్గవిగా ఉంటా యనేందుకు చిట్టిబాబు కథ ఒక నిదర్శనం ఒక్కొక్కప్పుడు అవి కాస్త విడ్డూరంగా గూడా వుండొచ్చు. పనిలో పనిగా యింకొక రాజబాబు కథ అవధరించండి

పట్నంలో పుట్టి పెరిగిన శ్రీమంతుల బిడ్డ రాజబాబు. ఏరీ కోరీ ఎన్నిక చేసి పల్లెటూరి భామందు ముద్దుల కూతురు సావిత్రిని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళయిన కొత్తలోనే వచ్చింది సంక్రాంతి. దర్జాగా, పూలరంగడిలా అత్త వారిల్లు చేరుకున్నాడు రాజబాబు, అక్కడతనికి పగళ్ళు యుగాలుగాను, రాత్రులు క్షణాలు గానూ దొర్లి పోతున్నాయి. బ్రాహ్మపుట్టే దాకా పడుకోవడం పల్లెటూరి సాంప్రదాయాలకు విరుద్ధమని చెప్పి ఒకనాటి ఉదయం మసక మసక చీకట్లోనే సావిత్రి గదిలో నుంచీ వెళ్ళి పోయింది ఎంత బద్ధకంగా వున్నా లేవక తప్పదు గనుక రాజబాబు గూడా లేచి కాలవ గట్టుకు వెళ్ళాడు వెళ్ళి తిరిగొస్తుండగా తట్ట తలపైన పెట్టుకుని పొలాల వైపు వెళ్తున్న ఒక ముసలావిడ అదే పనిగా రాజబాబు ముఖంలోకి చూచి కిసుక్కున నవ్వేసింది. "ఏమిట్రాయిది! ఈ ముసలి దానికేం తెలుసు? మన ముఖంలో దీనికేం కనిపించింది?" అనుకుంటూ మరికొంత ధూరం నడిచాడు రాజబాబు. ఈ సారి మామగారి పాలేరే ఎదురయ్యాడు. బండి తోలుకెళ్తున్న ఆ పాలేరు పగ్గాలు బిగబట్టుకుంటూ ఎద్దుల్ని కాసేపు ఆపి, కొత్తల్లుడి ముఖంలోకి పరకాయించి చూచి, రాబోయిన నవ్వును బలవంతంగా ఆపుకుంటూ బండిని శరవేగంతో ముందుకు దూకించాడు.


'ఏమైందిరా బాబూ! మన ముఖమేమైనా మారిపోయిందా? నిన్నటి సాయంకాలం దాకా బాగానే వుందే!' అనుకుంటూ రాజబాబు మామగారి కాంపౌండులో ప్రవేశించాడు. పాలు నిండిన గుండు చెంబుతో పశువుల కొట్టంలో నుంచి ఈ వలికొచ్చిన అత్తగారు, తటాలున అల్లుడి కెదురుపడి, ఒకక్షణం అలాగే నిలబడి పోయి, పెల్లుబికి రాబోయిన నవ్వును చీర చెరగులో దాచుకుంటూ తుర్రున యింటి వైపు సాగిపోయింది ఉక్రోషంతో యింట్లో అడుగు పెట్టిన రాజబాబు 'ఇదిగో సావిత్రీ! ఒకసారి యిలా వచ్చి వెళ్ళు' అంటూ హుకూం జారీ చేశాడు. ఆమె గదిలోకి రాగానే "ఏమిటి? ఏమైంది? మీ వూళ్ళో వాళ్ళ కందరికీ మూక వుమ్మడిగా మతి భ్రమణం గానీ జరగలేదు కదా? నా ముఖంలో ఏముందని? ఎందుకలా నవ్వుతున్నారు?" అని గద్దించాడు


దగ్గరగా వెళ్ళి పతి దేవుడి ముఖాన్ని పరిశీలనగా చూచిన సావిత్రి ఉన్నట్టుండి తాను గూడా పకాలున నవ్వేసింది.

అప్పుడిక రాజబాబుకు నిలువుటద్దమే శరణ్యమైపోయింది

రాజబాబు అద్దం ముందుకు వెళ్ళి నిల్చున్నాడట! విషయ మేమిటో తెలియగానే అతడి పెదవుల పైకి సైతం ఒక చిరునవ్వు రాబోయిందట! సిగ్గుతో కాసేపు కుంచించుకు పోయి, ఆ తరువాత నాలుగంగల్లో బాత్‌రూంలోకి వెళ్ళి, సబ్బు పెట్టి ముఖాన్ని శుభ్రంగా కడిగేసు కున్నాడట!

రాజబాబు ముఖం చూచిన వాళ్ళందరూ ఎందుకు నవ్వారు? అందులో వాళ్ళకేం కనిపించింది?– అని మీరడగొచ్చు. అమ్మో, ఎంతాశ! అలాంటి విషయాలు చెబుతారటండీ ఎవరైనా! కథకు సస్పెన్సే గదండీ ప్రాణం! రసజ్ఞులైన యువ దంపతులు, అనుభవజ్ఞులైన ప్రౌఢ దంపతులు ఎవరికి వారే ఊహించు కొందురు గాక! మకర సంక్రాంతి మహాలక్ష్మి ఎవరికి కావలసిన ఆనందాలు వారికి పంచి పెట్టును గాక! లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు. ఓం శాంతి శ్శాంతి శాంతిః. □





తాతయ్య గమత్తులు మళ్ళీ మొదలయ్యాయి!

తాతయ్య ఎక్కడ ఉంటే అక్కడ అంతా అల్లరే ప్రతి క్షణం కూడా హడావిడే ఆయన తోటలో మొక్కలకు నీళ్ళు పోస్తు, వాటి మధ్య హడావుడిగా ఉంటారు ఆ పనిలో లేరంటే, ఆయన తన మనవలని ఆడించడానికి కొత్త ట్రిక్కుల గురించి ఆలోచిస్తూ ఉంటారు అరవై అయిదేళ్ళ ఆ వయసులో ఆయన చలాకీతనం చూస్తే, ప్రపంచంలో అంత చురుకైన తాతయ్యలు చాలా తక్కువ మంది ఉంటారని అనిపిస్తుంది


అదంతా హార్లిక్స్ చలవే అదే ఆయనని యిన్నేళ్ళూ ఆరోగ్యంగా, చురుగ్గా ఉండేటట్టు చేసింది కాని, తాతయ్య హార్లిక్స్‌నే ఎంచుకోడానికి ఒక ప్రత్యేక కారణం ఉంది ఆ వయస్సులో తాతయ్యకి తేలిగ్గా, సులువుగా జీర్ణమయ్యే రూపంలో పోషక పదార్థాలు అవసరం

ఆయన ప్రతి రోజు రెండు సార్లు హార్లిక్స్ తాగుతారు అది ఆయన అలవాటు మరి అందులో ఆశ్చర్యపడవలసినది లేదు కదూ!




60 ఏండ్లకు పైగా తాతయ్యకు
యిష్టమైన ఆరోగ్య పానీయం

మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు వన్నె గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో రుచికరమైన పానీయం. పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాలకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది!



మంచి పుష్టికరమైనది



(గత సంచిక తరువాయి)

హైమ మొహంలో విచిత్రమైన మెరుపును ఆశ్చర్యంగా చూస్తూ

"ఏమిటంత హుషారుగా ఉన్నావ్?' అన్నది మంజీర

చెపితే ఏమిస్తావ్?' కవ్విస్తున్నట్లుగా అన్నది హైమ.

'చెప్పకపోతే దాచుకో నీ ఉత్సాహం మీద నాకేం ఇంట్రెస్ట్ లేదు తరువాత విచారిస్తావ్'

ఆ అవసరం నాకులేదు'

'అయినా నీ మీదున్న అభిమానంతో చెప్పేస్తున్నాను త్వరలో నీకు తమ్ముడో చెల్లెలో పుట్టబోతున్నారు'

నిజం' నిజంగానా' జోక్ చేస్తున్నావా? అమ్మకు ఇప్పుడు ఇన్నేళ్ళ తరువాత నిజంగానా హైమా?!"

'నాభుజం ఊడిపోతోంది ముందు నువ్వు చెయ్యి తియ్యి'

ఇది నిజమా హైమా'

నిజమేనే నీ తరవాత ఇహ పిల్లలు పుట్టక పోబట్టి అలా అనిపిస్తోంది గానీ మీ అమ్మ వయసెంత? ముప్పయి నాలుగేళ్ళు' ఈ వయసులో ఆడవాళ్ళు పిల్లల్ని కనరా?

మీ అమ్మ సిగ్గుపడి అభిమానపడి మంచం దిగటం లేదు ఊళ్లో ఉన్న ముత్తయిదువలు మీ తాతగారు మీ అమ్మని మందలించి, ధైర్యం చెప్పి ఆమెను అనునయిస్తున్నారు "

తల్లిని చూడాలనే కోరిక ఉధృతంగా రేగింది మంజీరలో

ఇంటి మీద బెంగ తల్లి ఎడ్ల ప్రేమ ఒక్కసారిగా పొంగి వచ్చాయి

అసలు తను అమ్మను చూడకుండా ఇన్నాళ్ళెలా ఉండ గలిగింది'

'నే వెళ్ళి అమ్మని చూసొస్తాను అన్నది మంజీర

'మీ నాన్న ఇక్కడే ఉన్నారు అన్నది హైమ

నేను నాన్నని బ్రతిమాలుకుంటాను

"ఆయన వినడు ప్రణీత్ మీద పీకలదాకా ఉందాయనకు కసి గూడాన్ని కలపటానికి మీ ఆయన కృషి చేస్తున్నాడటగా? అలాగనక జరిగితే ఈ సారి ఎన్నికల్లో మీ నాన్న తుక్కుతుక్కుగా ఓడిపోయి, రాజకుమార్ బంపర్ మెజార్టీతో గెలుస్తాడు మీ ఆయనకూ రాజకుమార్‌కీ స్నేహం కాబట్టి ఆయన్ను గెలిపించటం కోసమే మీ ఆయన గూడాన్ని కలుపుతున్నాడని పాపారావు క్షణం వదలకుండా మీ నాన్నకి ఊదర గొడుతున్నాడు

ప్రణీత్ కలాంటి చెడు ఉద్దేశాలేం లేవు గూడాన్ని కలపటం రాజకీయ ప్రయోజనాల కోసం కాదు మానవత్వంతో చేస్తున్న పని అది రాజకుమార్, ప్రణీత్ స్నేహంగా ఉంటే వీళ్ళ కెందుకు? మేమంటే గిట్టని వాళ్ళకు మా స్నేహాల సంగతులు దేనికి?'

'అదేంమాట? సాక్షాత్తూ అమాత్య శేఖరులు మీ తండ్రిగారు ఆయన కెదురాడే ధైర్యం మీ ఆయన కెందుకుండాలి? అఫ్ట్రాల్ ఒక ఎస్ ఐ గాడు .

హైమా'

ఇవి నా మాటలు కావు మీ నాన్న మాటలే"

'నాన్నకు తెలియకుండా వెళ్ళి అమ్మను చూసొస్తాను"

ఒద్దు మంజూ. ఆయన పరోక్షంలో కూడా మీ అమ్మ నీతో మాట్లాడ కూడదని నిన్నా ఇంటికి రానివ్వ కూడదని మీ నాన్న తన మీద ఒట్టేసుకున్నాట్ట ఇది తలుచుకుని అవిడెప్పుడూ ఏడుస్తుంటుంది. దాన్ని దాటే ధైర్యం ఆవిడకు లేదు పొరపాటునయినా దాటటానికి అది 'లక్ష్మణ రేఖ' కాదు సొంత భర్త గీసినది ఆవిడ సెంటిమెంట్లు ఆవిడవి"

'అయితే ఎన్నాళ్ళిలా? నాన్నకి మాత్రం నా మీద ప్రేమఉండదా? నేనే వెళ్ళి నాన్నని బ్రతిమాలి ఒప్పించు కుంటాను 'కన్నీళ్ళతో అన్నది మంజీర

"లాభంలేదు మంజూ. ఆ పాపారావు పీడ వదిలితే గానీ మీ నాన్నలో పేరుకు పోయిన మూర్ఖత్వం వదలదు వాడాయన్ని వదలడు వాడిమాటే ఆయనకు వేదం

ఇంకొక్క మార్గముంది మీ ఆయన పాపారావు చర్యల్ని ప్రశ్నించటం మానేసి . రాజకుమార్‌తో తెగతెంపులు చేసుకుని .. గూడాన్ని ఏకం చెయ్యటం

జరిగిన కథ–11: బాబూరావు అహంకారంవల్ల ఆగిపోయిన ప్రణీత్, మంజీరల పెళ్ళి రాజకుమార్ సాయంతో జరుగుతుంది నవవధూవరుల్ని బాబూరావు అవమానించి వెళ్లగొడుతాడు మంజీరతో సంబంధాలు తెంచుకోవాలని ఇంట్లో కట్టడి చేస్తాడు బాబూరావుకు కుడిభుజంగా పనిచేసే పాపారావు ప్రణీత్ మీద ద్వేషాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తుంటాడు పాపారావు హైదరాబాద్‌నుంచి వస్తుండగా కలిసిన అమాయకురాలు దాక్షాయణిని పాపపుటాలోచనతో ఇంటికి తీసుకొస్తాడు పాపారావు భార్య హరిణి దాక్షాయణిని తప్పించి ప్రణీత్ ఇంటికి చేరుస్తుంది దాక్షాయణి వాళ్ల ఇంటికి తిరిగి తీసుకు వెళుతున్న ప్రణీత్‌ను చూసి పాపారావు కళ్లల్లో నిప్పులు పోసుకుంటాడు

లాంటి కార్యక్రమాల్ని ఆపేసి పాపారావు వర్గంలో చేరితే... మీకూ మీ నాన్నకీ రాజీ కుదరొచ్చు. అంత వరకూ ఇంతే". అన్నది హైమ....

తన వాళ్ళను చూడాలనే పిచ్చి మమకారం మంజీర కొదలటంలేదు....

ఒక్కసారి వెళ్ళి నవ్వుతూ తుళ్ళుతూ ఆ ఇంట్లోనూ, ఆపరిసరాల్లోనూ తిరగాలని.... తల్లిదగ్గర గారాలు పోతూ.... తాత గారి ప్రేమాభిమానాల నాస్వాదిస్తూ.... తండ్రి పక్కన కూర్చుని చిన్న చిన్న తగాదాలేసుకుంటూ... నేస్తాలను పలకరిస్తూ అక్కడ నడయాడాలనీ అనిపిస్తోందామెకు. ఈ కోరిక రానురానూ ఉధృత రూపాన్ని దాల్చ సాగింది.....

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

"మంజూ, ఎందుకలా ఉన్నావ్?" అన్నాడు ప్రణీత్ ప్రేమగా.

"ఎలాఉన్నాను?" ముభావంగా అన్నది మంజీర.

"అదో లా... దిగులుగా ఉన్నావు."

"అమ్మను చూడాలనుంది".

"......"

"మీరంటే ఇప్పుడు మానాన్నకి అట్టే కోపం లేదు. మీరు చేసే పనులు నచ్చక... అలా ఎగిరెగిరి పడుతున్నాడు. మీరు కాస్త మానాన్నకి అనుకూలంగా మారకూడదూ? ఆయన పరాయి వాడుకాదు మీకు. అయిన వాళ్ళకు అయినవాళ్ళే సహకరించుకోకపోతే.... పరాయి వాళ్ళు సహకరిస్తారా?"

"నువ్వేమంటున్నావో నీ కర్థ మవుతుందా? మీ నాన్నకి సహకరించాలా? అంటే? మీ నాన్న, ఆ పాపారావు గారు కలిసి చేసే తప్పుడు పనుల్ని... అన్యాయాలనీ నేను సమర్థించాలా! వాళ్ళ వర్గంలో చేరాలా! ఒక పోలీసాఫీసర్ భార్యగా నువ్విలాగేనా మాట్లాడేది?

నాకు డ్యూటీ ఫస్ట్. మిగతావి నెక్స్ట్."

"అంటే? నేను కూడానా?"

"నువ్వు నాప్రాణానివి. కానీ.... డ్యూటీ విషయంలో... నేను నాప్రాణాన్ని సైతం లెక్క చెయ్యను. ప్లీజ్ మంజూ! నన్నర్థం చేసుకో. నాతో సహకరించక పోతే పోనీ... నాకిలా అడ్డం మాత్రం రాకు".

"అయితే మీరా రాజకుమార్‌తో స్నేహం మానరా?"

"మధ్యన అతని ప్రసక్తి దేనికి?"

"వాడే ఇవన్నీ చేసేది. వాడి మూలానే మీరు...."

"మంజూ! వివేకాన్ని కోల్పోయి మాట్లాడకు. ఒకప్పుడు అతనే మనకి అండగా నిలిచాడు. ఏరుదాటాక తెప్ప తగలెయ్యటం అనే లక్షణం మనకుండ కూడదు.

అతను మంచివాడు. నిజాయితీ గలవ్యక్తి. మనవాళ్ళు అనే బంధంతో చెడును సమర్థించే మనస్తత్వం కాదు నాది. అతనూ మీ నాన్న లాంటి వాడే అయితే.... నేనే అతనికి దూరంగా వచ్చేసే వాడిని.

నీకు మీ వాళ్ళ మీద ఉన్న అభిమానాన్ని నేను కాదనను....

కానీ ఆ అభిమానం ఉధృతమై.... ఆలోచనలు గాడి తప్పి ... ఆ ప్రభావం మన అనురాగం మీద పడి కలుషితం చేసేలా ప్రవర్తించకు.

నన్ను నీ నుంచి వేరు చేసి మాట్లాడకు మంజూ! ప్లీజ్...."

"సారీ! ఇంకెప్పుడూ ఇలా అనను."

"థాంక్స్!" అన్నాడ తను తేలికైన మనసుతో.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

కామేశ్వరి, మంజీర కలిసి పేరంటాని కెళ్ళారు. అక్కడి వాళ్ళ సంభాషణ అటు తిరిగి ఇటు తిరిగి మంజీర పుట్టింటి మీదకు మళ్ళింది....

"ఈ అమ్మాయి నింకా వాళ్ళ వాళ్ళు రానివ్వటం లేదా? అయినా... బాబూరావు కిదేం మొండి పట్టుదలమ్మా! అల్లుడు కులం లేనివాడా... గుణం లేనివాడా?" అని ఒకామె అంటే

"మళ్ళీ కొడుకో కూతురో పుట్టబోతున్నారు గదా ఆ సమయంలో మంజూ కూడా నట్టింట్లో ఉంటే బావుండేది చిన్నపిల్ల ఈమెకు మాత్రం వాళ్ళని చూడాలనుండదూ? ఆ జ్ఞానం వాళ్ళ కుండాలి అంది ఇంకో ఆవిడ.

ఇలాంటివి కామేశ్వరి కలవాటే అయినా ఆమె చెక్కు చెదరదు

కామేశ్వరి తన వియ్యాల వారి గురించి ఉక్రోషంగా మాట్లాడుతుంటేమో



ఒడిలో ఛలి మోహన రాగం

వాటిని ఆ ఇంటికి చేర వేసి. మళ్ళీ అక్కడివి తెచ్చి ఈమె కంటించి తమాషా చూద్దామనుకునే వాళ్ళందరికీ కామేశ్వరి ప్రవర్తన భరించ లేనంత నిరాశగా అనిపిస్తుంది. .

పేరంటాళ్ళంతా వెళ్ళి పోయాక ... ఆ ఇంటామె బలవంతం మీద కామేశ్వరీ, మంజీర, హైమ ఇంకా అక్కడే ఉన్నారు .

వాకిటి గుమ్మంలో నుంచి భారంగా కదిలివస్తున్న వ్యక్తిని చూడగానే సంభ్రమంగా లేచి ఒక్క ఉదుటున ముందుకెళ్ళి "అమ్మా"! అంటూ ఆమెను ఆర్తిగా చుట్టేసింది మంజీర

శార్వాణి కళ్ళలో నుంచి తెగిన ముత్యాల సరంలోని ముత్యాల్లా కన్నీళ్ళు జలజలా రాలి మంజీర తల మీద పడ్డాయి కూతుర్ని విడిపించుకుని, కళ్ళకు చేతులడ్డం పెట్టుకుని ఏడుపు నాపుకోటానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది శార్వాణి .

ఆ సన్నివేశం అక్కడున్న వాళ్ళను విచలితుల్ని చేసింది ముందుగా తేరుకుంది కామేశ్వరే

శార్వాణి బుజం మీద చెయ్యేసి 'ఒంట్లో కులాసాగా ఉంటోందా ఒదినా? అన్నది ఆదరంగా కామేశ్వరి

"ఊఁ!" అన్నది శార్వాణి

అమ్మా! నాతో మాట్లాడవా?" అంటూ గద్గదస్వరంతో మళ్ళీ శార్వాణి చెయ్యి పట్టుకుంది మంజీర

ఉద్వేగంతో శార్వాణి ఒణికి పోతోంది కూతుర్ని గుండెలకదుముకుని యోగక్షేమాలడగాలనే ఆమె కోరికను బాబూరావు 'ఒట్టు' తన కబంధ హస్తాలతో నలిపేసి నొక్కి పడుతోంది

ఈ పరిస్థితి నరకంగా ఉందామెకు ఫెయింటయి పడిపోబోతున్న దానిలా ఉన్న శార్వాణిని జాలిగా చూస్తోంది కామేశ్వరి. దీన్నెలా ఛేదించాలో ఆమెకూ అర్థం కావటంలేదు


పోనీ నాతో మాట్లాడొద్దు లేమ్మా! ఊరికే . కాసేపు నిన్ను చూడనీ, శార్వాణి చేతిగాజులు సవరిస్తూ ఆర్ద్రంగా అన్నది మంజీర.

పోనీ! ఓ పని చేద్దామత్తయ్యా! మామయ్య నిన్ను మంజూతో గదా మాట్లాడొద్దన్నాడు?

ప్రతి సమస్యకూ ఏదో ఒక రిలాక్సేష నుంటుంది అలాగే దీనికీను. నువ్వూ మంజూ ఎదురెదురుగా కూర్చోండి కానీ .. మీ ఇద్దరూ ఒకరితో ఒకరు డైరెక్టుగా మాట్లాడొద్దు నాద్వారా మాట్లాడు కోండి.

మంజూ ఎలా ఉందిట? అను నువ్వు.

ఎలాఉన్నావు మంజూ?" అంటాను నేను



"బాగానే ఉన్నాను అమ్మెలాఉంది? ఒంట్లో బావుంటోందా?" అంటుంది మంజూ

"అత్తయ్యా? నీ ఒంట్లో బావుందా? ఎలా ఉన్నావని అడుగుతోంది మంజూ!" అంటాను నేను

ఇలా నామీదుగా మాటలతో గేమ్ ఆడొచ్చు మీరు ' అంటూ మంజీరా, శార్వాణిల చేత కొద్దిసేపలా మాట్లాడించి ఆ విషాదం మీద నవ్వులు చల్లింది హైమ

తేలికైన మనసుతో హైమను దగ్గరకు తీసుకుని నుదుటిని చుంబించింది శార్వాణి.

"థాంక్స్ హైమా!" అన్నదీ మంజీర కృతజ్ఞతగా

'ఏడిశావులే! నువ్వు నాకు థాంక్స్ చెప్పటం ఎప్పుడు నేర్చుకున్నావు?" అన్నది హైమ

'నీతో అంతా గొడవే! చెప్పకపోతే . థాంక్సయినా చెప్పాలని తెలీదా? అంటూ పోట్లాడతావు చెపితే ఇలా."

"అంటే . ఈ థాంక్స్ నువ్వు మనస్ఫూర్తిగా చెప్పింది కాదన్న మాట! కేవలం నేను పోట్లాడతాననే భయంతో మాత్రమే. ."

"నీకు చెప్పలేం తల్లీ! నిజంగా... రాక్షసివి"! మధ్యలో నే అన్నది మంజీర.

"దీని మొగుడు కూడా ఇంతే అత్తా. అఖరుకు మా బావ కూడా ... ఈక్షణంలో నన్ను "దేవతవి" అంటారు. మరునిముషంలో నే "రాక్షసివి" అనేస్తారు. వీళ్ళకిదేం జాడ్యమో నాకర్థం కాదు "

అంటున్న హైమ అభినయానికంతా నవ్వేశారు..

మంజీర, శార్వాణి మనసులు కాస్త తేలికపడ్డాయి

* * * * * * * * *

పెద్దపెట్టున శోకాలు పెడుతూ ఓ యువతి గూడెంనుంచి పరుగెత్తు కొచ్చింది ప్రణీత్ ఇంటికి

'ఎస్ ఐ. బాబునోసారి పిలవండమ్మా!" అన్నది ఖంగారుగా అన్నం తింటున్నారు కూర్చో," అన్నది మంజీర

"అయ్య బాబో! మా చెల్లిని దాని మొగుడూ వాళ్ళంతా కలిసి చెట్టుక్కట్టేశారు తల్లీ, దాన్ని నిలువునా తగలెడతారంట నేనీడ కూర్చుంటే అక్కడ దాన్ని చంపేస్తరమ్మా చెయ్యికడిగేసుకుని లేచివచ్చిన ప్రణీత్‌ని అసహనంగా చూసింది మంజీర

"అన్నీ నెత్తినేసుకుంటారీయన. ఎప్పుడూఏదో గొడవే, తిండి కూడా తిన నివ్వరాయన్ని ' అనుకుంది విసుగ్గా

స్టేషన్‌కు ఫోన్‌చేసి ఇద్దరు కానిస్టేబుల్స్‌ని బండేసుకుని గూడెంవేపు రమ్మని చెప్పి తన మోటర్‌బైక్ స్టార్ట్ చేశాడు ప్రణీత్

"ఎక్కు." అన్నాడా యువతిని చూస్తూ.

"నేనా' భయంతో గుండెలమీద చెయ్యేసుకుందామె

'నువ్వే ఎక్కు త్వరగా." అన్నాడు ప్రణీత్

'ఒద్దయ్యా! నేను లగెత్తుకొస్తాను.'

"ఎంత లగెత్తుకొచ్చినా నాకన్నా ముందు రాలేవు. ఎక్కు."

"ఒద్దయ్యా!"

'ఎక్కమంటుంటే!" గర్జించినట్లుగా అన్నాడు ప్రణీత్. అదిరిపోయి వెనకాల ఎక్కి కూర్చుందామె

"గట్టిగా పట్టుకో

'ఈ దొర వెనక ఇలా కూర్చునివెళ్ళటం ఎవరయినా చూస్తే. . "నీకేం పోయేకాలమే? నువ్వెంత. . నీ జీవమెంత? ఆయన వెనక కూర్చునే మొనగత్తెవయ్యావా? అని చెరిగిపెడతారు." అని భయపడుతోందా యువతి .

ఇదేం పట్టించుకోకుండా రివ్వున గూడెంవేపు సాగిపోయాడు ప్రణీత్ ..

ప్రణీత్ వెనకాల కూర్చుని వెడుతున్న ఆ యువతివేపు కంపరంగా చూసింది మంజీర రానురానూ తన మొగుడికి మతిపోతోంది, ఎంత అవసరమయితే మాత్రం... ఆ అలగామూకని వెనకాల ఎక్కించేసుకుని వెళ్ళటమేనా?" అని చీదరించుకుంది .

ఆ రోజంతా అలా రుస రుస లాడుతూనే ఉందామె...

షేక్ కరీమున్నీసా, బిట్రగుంట

ప్ర · స్వప్రయోజనాల కోసం అమాయకుల్ని బలి తీసుకునే బాబూరావు లాంటి వ్యక్తులకు ఏ శిక్ష విధించాలి మేడమ్?

జ మరోసారి పదవిలోకి రాకుండా చూడాలి

శ్రీనుబాబు, పూనా

ప్ర : నేటి సమాజంలో రాజకీయ నాయకులు సృష్టిస్తున్న అరాజకాన్ని దృష్టిలో పెట్టుకుని మీరు 'ఒడిలో చెలి మోహనరాగం' సీరియల్ రాస్తున్నారు గదా! సీరియల్ రాసేటప్పుడు మీకేమన్నా ఇబ్బంది ఎదురయ్యాయా? ఎదురైతే ఎలా ఎదుర్కొన్నారు?

జ · నాకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురవలేదు.

చోడవరపు నాగేశ్వర్రావు, రమాదేవి, హైదరాబాదు

ప్ర రచయిత్రి తను స్త్రీ అయివుండి మరో స్త్రీ పాత్ర గురించి వర్ణించే టప్పుడు ఎలా ఫీలవుతుంది?

జ : రైటర్ స్త్రీ అయినా పురుషుడయినా. పాత్రలో లీనమై రాసేటప్పుడు ఒకేలాంటి భావాల్ని పొందుతారు స్పందించే తీరులో తేడా ఉండొచ్చు గానీ స్పందనలో కాదు.

ప్ర : మీ బహుమతి పొందిన నవలల పేర్లు తెలియ జేస్తారా?

జ : అనురాగ సంగమం జీవన సంగీతం మొగలి రేకులు– మిన్నాగులు.

అబద్ధాల రాజశేఖర్, కావలి

ప్ర : మీరు అన్నీ ఆడ వాళ్ల ప్రశ్నలకే ఎక్కువగా జవాబు లిస్తున్నారు' అన్యాయం కదూ? మీరేమంటారు?

జ : మీ ఇంటి పేరు తాలూకు ప్రభావం మీ ప్రశ్న మీద కూడా స్పష్టంగా కనిపిస్తోందంటాను



రచయిత్రి జవాబులు

ఉత్తమ ప్రశ్న

మాడభూషి నరసింహాచారి, నర్సాపురం

ప్ర : మీరు వివిధ పత్రికల సాహిత్య స్థాయిని బట్టి కథ, శైలి ఎన్నుకుంటారా? లేక ఏ పత్రికయినా సరే పాఠకులకు మంచిరచన అందించాలన్న దృక్పథంతో రచనలు చేస్తారా? దయచేసి వివరిస్తారు గదూ?

జ : పాఠకులకు మంచి రచన అందించాలనే దృక్పథంతోనే రచనలు చేస్తాను.

ఉపద్రష్ట జగన్నాథరావు, అయినాపురం

ప్ర అక్కయ్యా! ఆనాటి సినీ నటి సావిత్రి తన నటనా కౌశలంతో అభిమానులను ఆకట్టుకుంది ఈనాటి రచయిత్రి సావిత్రి సంఘంలోని లోటు పాట్లను తన రచనల ద్వారా తెలియ జేస్తూ పాఠకుల అభిమాన రచయిత్రి అయింది మీ "ఒడిలో చెలి మోహనరాగం సుపర్బ్‌గా ఉంది

జ · మీ అభిమానానికి ధన్యవాదాలు

ఆలూరి పద్మలత, కలికిరి

ప్ర . యువతరానికి ధైర్య సాహసాలు 'ప్రణీత్' పాత్ర ద్వారా కలగ జెయ్యగలరని ఆశించవచ్చా?

జ తప్పకుండా!

ప్ర · బాబూరావు లాంటి ప్రబుద్ధుల్ని శిక్షించే వారే లేరా?

జ ఎందుకు లేరూ? నవల పూర్తిగా చదవండి

యల్లాపు భాస్కరరావు, గవరపాలెం

ప్ర · సుమారు తొంభై శాతం మంది రచయితలు 'ప్రేమ' అనే పదం లేకుండా నవలలూ కథలూ రాయలేక పోతున్నారు. ఎందువల్ల?

జ · సుమారు 'తొంభయ్యయిదు' శాతం మంది పాఠకులు 'ప్రేమ' అనే పదం కోరుకోటం వల్ల

జె. ఆనందమ్మ, కడప

ప్ర 'ఒడిలో చెలి మోహనరాగం" చాలా ఉత్కంఠను కలిగిస్తోంది ఇందులో పాత్రలన్నీ వాస్తవానికి దగ్గరగా ఉండేలా రాశారు మాకు నచ్చింది

జ థాంక్స్!

ప్ర : ఈ సీరియల్ రాయటంలో ఎవరి ప్రేరణ ఉందో చెప్పగలరా?

జ 'ప్రణీత్' ప్రేరణ □

"మా వోళ్లంతా పనికి పోయారు దొరా! ఈ అదును చూసుకుని వాళ్లీ గోరానికి తలపడ్డారు నేను జొర మొచ్చిందని మధ్యలో వచ్చెయ్య బట్టి సరిపోయింది లేకుంటే నిలువునా సచ్చేదది' అని చెప్పిందా యువతి ప్రణీత్‌తో అక్కడ చిన్నగుంపు ఏర్పడి ఉంది అంతా వినోదం చూస్తున్నారు కొందరు వారించబోయినా పోలిగాడు వినటంలేదు అంతా తెగతాగి ఉన్నారు

లాఠీ ఝుళిపిస్తూ ప్రణీత్ వాళ్ల మధ్యకు దూకేసరికి సగంమంది పారిపోయారు మిగతా వాళ్లు మత్తుబాగా తలకెక్కి అక్కడే ఉండిపోయారు ఆసరికి కానిస్టేబుల్స్ అక్కడికి చేరుకున్నారు పోలిగాడు మాత్రం నిర్లక్ష్యంగానే ఉన్నాడు పాపారావు మనుషు లెక్కించిన విషం వాళ్లమధ్దతు తాగిన మత్తు అతన్ని జంతువులా మార్చాయి

పోలిగాడి భార్య రాజకుమార్ వర్గానికి చెందిన వాళ్ల ఇంటి ఆడపిల్ల గూడెం చీలిపోయాక, తన భార్యకు, ఆమె పుట్టింటి వాళ్లకూ మధ్య సంబంధాలు తెంపేశాడు పోలిగాడు

పాపారావు తన అనుచరుల ద్వారా ప్లానేసి పోలిగాడికి తన భార్యమీద అనుమానం కలిగేలా చేశాడు బాగా ఎక్కేసి తాగించి, 'మీరు పోలీసుల గురించి భయపడక్కర్లేదు అంతా బాబూరావు చూసుకుంటాడని' ధైర్యం చెప్పి పోలిగాడినీ పరిస్థితికి తెచ్చి వదిలాడు పాపారావు

'ఇహ ఈ దెబ్బతో ప్రణీత్‌గాడి ఆటకట్టు వెయ్యిమంది ప్రణీత్ లేకమయినా ఇహ గూడాన్ని కలపలేరు అనుకున్నాడు పాపారావు. బాబూరావు అధికారం భద్రంగా ఉంటేనే ఆ ఊళ్లో తన ఆటలు బాగా సాగుతాయని అతనికి తెలుసు అందుకే ఆ భద్రతకోసం అతనెన్ని దారుణాలైనా చెయ్యటానికి వెనకాడడు

జ్వరంగా ఉందని పోలిగాడి ఒదిన మధ్యలో ఇంటికి రావటంతో పాపారావు ప్లాను భగ్నమయింది వచ్చీ రాగానే పోలిగాణ్ని నాలుగు బాదాడు ప్రణీత్ చుట్టూ ఉన్న వాళ్లని కూడా లాఠీతో వాయించి బుద్ధిలేదూ మీకు? ఆ పిల్లను వాడలా నిలబట్టి కాల్చేస్తుంటే సోద్యం చూస్తూ నుంచున్నారా .' అని అరిచి పోలిగాడివేపు తిరిగాడు ప్రణీత్

నా పెళ్లాం తప్పుచేసింది ఆ రంగిగాడికాడ పడుకుంది " ఉక్రోషంగా అన్నాడు పోలిగాడు


నేనే పాపం ఎరగన్దొరా! అమ్మతోడు, నూకాలమ్మ తల్లిమీద అన, ఎవురో గిట్టనోళ్లు ఆడి మనసు ఇరిచేసినారు లేకుంటే ఆడుమంచోడే, నన్నెంతో ప్రేమగా చూసుకునేవాడు ఏముద నష్టపోళ్లు ఎక్కించారో! ఆడమ్మ కడుపులుకాల అంటూ ఏడుస్తోంది చెట్టుకు కట్టియ్యబడ్డ గౌరి

అదే నిరూపించుకోమంటున్నాను." మొండిగా అన్నాడు పోలిగాడు

ఏం నిరూపించుకోమంటావ్?" అన్నాడు ప్రణీత్

అగ్గిలో దూకి నిరూపించుకోమనంది. తప్పు చెయ్యనప్పుడు దానికింత బయందేనికి? అగ్గిలో కాలిపోతే.. అది తప్పుచేసినట్టు. కాలకుంటే . నేను దాని కాల్లు పట్టుకుని చెమాపన చెప్పుకుంటాను"'

'నిన్నగ్గిలోకి తోస్తే కాలకుండా బయటకొస్తావేమో చూద్దాం పట్టు నువ్వు కూడా ఎవతితోటో తిరుగుతున్నావని ఆ పిల్ల కనుమానంగా ఉందిట. మొదట నువ్వు నిరూపించుకో, ఆ తరవాత ఆమె నిరూపించుకుంటుంది."



ఒడిలో చెలి మోహన రాగం

"నా కెవురితో టీ అలాంటి పవిత్రపు సంబంధం లేదు."

"ఆమె కూడా లేదనే అంటోంది."

"ఏంది మీరు దాని తరుపున మాట్లాడతరు? రాములోరంతటోడే అనుమానంమీద పెళ్లాన్ని అగ్గిలో పార నూకిండు. అయినా కూడా మీరంతా ఆయన్ని నెత్తి నెట్టుకు పూజించటల్లా? అదే పని నేను చేస్తే మక్కెలిరగ బొడిచి బొక్కలో ఏస్తరా?" సవాల్ చేస్తున్నట్టుగా అన్నాడు పోలిగాడు.

నాలుగు తన్ని వాడి నోరు మూయించొచ్చు. కానీ వాడి మనసు మారదు. అది తప్పని వాడు అనుకునేవరకూ మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు.

నిజమే. భార్యని సజీవ దహనం చెయ్యబోయాడని అప్పుడాయన్ని పోలీసు లెందు కరెస్ట్ చెయ్యలేదు?

అప్పుడు రాజే సర్వాధికారి. అతను చేసిన ఏపనినయినా అంతా సమర్థించాల్సిందే. ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు...

రాముడు ఏకపత్నీవ్రతుడు, పితృవాక్పరి పాలకుడు. నీతైన క్యారెక్టర్ కలవాడు. ప్రజల్ని చక్కగా పాలించగల సమర్థుడు. తనవాళ్లకే పదవు లిప్పించుకోటం... ఏ వెధవపని చేసినా తన వాళ్ళను సమర్థించుకోటం... పదవికోసం ఎలాంటి అకృత్యాలకయినా పాల్పడటంలాంటి రాజకీయపు కుళ్ళు నెరగనివాడు. శాంతిభద్రతలు కాపాడటంలో సమర్థుడు.

రామరాజ్యంలో రేపులు... జూదాలు... దొంగతనాలు... హత్యలూ ఉండేవికావు. అంతటి పరిపాలనా దక్షుడాయన. కానీ ఇవన్నీ వీళ్ల తలకెక్కవు...

రోడ్డుమీద పురాణాలు చెప్పేవారు సీతమ్మ అగ్నిప్రవేశం, సీతను అడవిలో వదలడం గురించి వర్ణించినంత గొప్పగా రామరాజ్యాన్ని గురించి, రాముడి సమర్థత గురించీ చెప్పరు. చెపితే ఇలాంటి వాళ్లకు ఇంట్రెస్ట్ ఉండదనేమో! సీతమ్మవారి కష్టాలు ఆకర్షించినంతగా ఇవి ప్రజల్ని ఆకర్షించవనే సత్యాన్ని గమనించి వాళ్ళు వాటినే చెపుతుంటారు కాబోలు.

తన ఆలోచనల్ని ఒక్కతృటిలో అణిచేసుకుని పోలిగాడిని, అతనికి సహకరించిన వాళ్లనీ స్టేషన్‌కి తీసికెళ్లి లాకప్‌లో పడేసి ఇంటికొచ్చాడు ప్రణీత్. పోలిగాడి నెలా మార్చాలా అనే ఆలోచన అతన్నొదల లేదింకా.

"ఏమయింది? ఆ పిల్లని కాపాడావా?" ఆతృతగా అడిగింది కామేశ్వరి..

"ఆఁ" అన్నాడు ప్రణీత్.

"ఆ గూడెం దాన్ని వెనకా ఎక్కించుకుని మరీ వెళ్లాలా? అది నడిచి రాలేదా?" అన్నది మంజీర.

ఆశ్చర్యంగా చూశాడు ప్రణీత్. అతనా కోణంలో నుంచి ఆలోచించటంలేదు, మంజీర మొహం చూస్తుంటే కొద్దిగా నవ్వుకూడా వచ్చిందతనికి...

"జెలసీయా?" అన్నాడు

ఛీ! దానిమీద నాకేం జెలసీ? ఇలాంటి దాన్ని చూసికూడా జెలసీగా ఫీలయ్యేంత దౌర్భాగ్యస్థితిలో లేను నేను "

"ఈజిట్!"

చాల్లెండి. మీకు అసహ్యం వెయ్యలేదూ?'

"ఎందుకు?"


"అంత మురికిగా... దరిద్రంగా ఉండే ఆ అలగాజాతి దానితో.. "

"మురికి అశుభ్రం... అంతవరకూ నిజమే అవి చాతకాక పోబట్టి వాళ్లలా ఉన్నారు. అంతేగానీ, అలగాజాతని ప్రత్యేకంగా ఏంలేదు. వాళ్లే ఏ రాజకీయ నాయకులో అయితే... ఒంగి ఒంగి సలాం కొడతారు .


' ఇలాంటి భావాలు మనసుల్లోంచి తుడిచేస్తేనేగానీ మనం ఎదగలేం." ప్రణీత్ వాదన మంజీరకు నచ్చలేదు, ఆ యువతి అలా కూర్చోవటం గుర్తొచ్చినప్పుడల్లా చికాకు పడుతూనే ఉండేది.

(ఇంకా వుంది)

గెలవండి!
రూ. 20,000/-ల
విలువైన బహుమతులు!



కలువబాల
చందాదారులకు
లక్కీడిప్:
ఈ అవకాశం
జనవరి 31 వరకు



మొదటి బహుమతి
★ ఒక కలర్ టి.వి.

రెండవ బహుమతులు
★★ రెండు బ్లాక్ అండ్ వైట్ టి.వి.లు

మూడవ బహుమతులు
★★★ మూడు "కిచెన్ మెషిన్"లు (మిక్సర్‌లు)

నాలుగవ బహుమతులు
★★★★ నాలుగు "లేడీస్ రిస్ట్ వాచీ"లు

రు. 60లు సంవత్సర చందా కట్టగానే అందమైన 'కలువబాల' పత్రిక నెలకి రెండుసార్లు మీ యింటికి అందుతుంది. అదిగాక మీరీ క్రింది బహుమతులు గెలుచుకోవచ్చు.

"చిరుకానుక" తప్పకుండా అందరికీ వుంటుంది.

మీరేం చెయ్యాలి? చేయవలసిందల్లా 'కలువబాల'కు ఏడాది 'చందాదారులుగా' చేరడమే! కాకపోతే మీ 'చందా' సైకంతో పాటు యిక్కడ యిచ్చిన కూపన్ పూర్తి చేసి పంపాలి!

అంతేకాదు ఈ బహుమతి పథకంలో పాల్గొన్న చందాదారులందరికి 'కలువబాల' నుంచి ఒక 'చిరుకానుక' కాలక్రమంలో అందుతుంది.

"లక్కీడిప్" 31-1-1987 లేదా
ఆ లోపల కట్టే చందాలకి
మాత్రమే వర్తిస్తుంది.

కూపన్‌లు, చందాలు పంపవలసిన చిరునామా :

కలువబాల,
కేరాఫ్: ఆంధ్రపత్రిక,
గాంధీనగరం, విజయవాడ-3.

---- కత్తిరించాలి ----



నిజమయితే ✓
కాకపోతే x
అని గుర్తు పెట్టాలి

ఆంధ్రపత్రిక బొంబాయి నుంచి వెలువడుతూ వుండేది. ( )

దినపత్రిక కన్నా వారపత్రిక ముందే పుట్టింది. ( )

భారతి" సాహితీప్రియుల పక్ష పత్రిక ( )

బాలరంజని పిల్లల పత్రిక ఆంధ్రపత్రిక ప్రచురణ ( )

కలువబాల చందాదారుల 'లక్కీడిప్' చందా కట్టిన వారి పూర్తి పేరు :................................
....

చిరునామా ....
....
....

ఎమ్.ఓ. పంపిన తేది ....
లేదా
డి.డి. జత చేయడమైనది

రక్తదాత గోపికృష్ణ – కొన్ని జ్ఞాపకాలు

తెలుగునాట సుప్రసిద్ధ రక్తదాత గోపికృష్ణ కన్నుమూసి – ఈ జనవరి 25 కి 2 సంవత్సరాలు. తనలోని చైతన్యాన్ని రక్తప్రవంతిగా చిందించి, కాలగర్భంలో కలిసిపోయిన ఆ మానవతామూర్తిని – ఈ సందర్భంలో ఒక్కసారి స్మరిద్దాం.

* * * * * * *

1978 మే నెల ఆఖర్లో అనుకుంటాను – నెల్లూరులోని క్షయాసుపత్రిలో గోపికృష్ణగారిని మొట్టమొదటి సారి నేను కలిశాను. సాదరంగా మాట్లాడి, కౌగలింతతో వీడ్కోలిచ్చారు వారానాడు. వారిని నేను ఆఖరు సారి కలిసింది కూడా ఆసుపత్రిలోనే – 1985 జనవరి 25 – మద్రాసులోని శంకర నేత్రాలయంలో – జీవితం పట్ల ఆశాభావంతో వున్న వారిని చూశాను. మా ఈ రెండు కలయికలూ సంఘటనాత్మకమైనవే అయినా – రక్తదాతగా గోపికృష్ణ గారికీ, రక్తదాతగా, రక్తదాన నిర్వాహకుడిగా నాకూ – వైద్యశాలలు కార్యక్షేత్రాలు కావడంతో పాటు – మా ఇద్దరి ఆ మొదటి, ఆఖరి కలయికలు సంభవించిన ప్రదేశాలు కూడా వైద్యశాలలు కావడంతో – మా మొదటి, ఆఖరి కలయికలు – చాలా సమంజసమైన చోట జరగడంతో పాటు, చాలా సింబాలిక్‌గా కూడా జరిగాయని నాకు అనిపిస్తూ వుంటుంది.

* * * *

నేను బుద్ధుణ్ణి గాను. అశోకుణ్ణి గాను. ఐతే, నా చిన్న జీవితంలో నేనూ ఒక సంఘటనకు ప్రభావితుణ్ణయ్యాను అంటుండే వారు – గోపికృష్ణ. ఇప్పటికి 28 సంవత్సరాల క్రిందట – 1958 లో మద్రాసులోని జనరల్ హాస్పిటల్‌లో, ఒక స్త్రీ – రక్తం దొరక్క మరణించింది. ఆ విషాద దృశ్యాన్ని చూసిన గోపికృష్ణ – దుఃఖంతో వేదనకు గురయ్యారు.

"వేదనయెరిగిన బతుకు
వాడి కన్నీ తెలిసేను,
వేదనలో పుట్టినవు
వేదమ్ములు నాదమ్ములు" (డా. సి. నారాయణ రెడ్డి) – అన్నట్టు, వారి ఆ వేదనలో నుంచి – రోగుల పాలిటి జీవనాదం పుట్టింది – శాశ్వత రక్తదాతగా గోపికృష్ణ ఆవిర్భవించారు. ఆ నాటి నుంచి మరణించే వరకు – స్వచ్ఛంద రక్తదానోద్యమ కేతనాన్ని మోశారు. ఈ మధ్యకాలంలో – రోగాలు [illegible] తమ కర్తవ్యనిర్వహణను [illegible] స్వచ్ఛంద రక్తదానంతో – ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి, ఆదర్శంగా నిలిచారు. తెలుగు గడ్డకి, ప్రత్యేకించి – నెల్లూరు జిల్లాకి కీర్తిని సంతరించారు.

వారి 60 వ – ఆఖరు రక్తదానం – 1981 ఫిబ్రవరి 27న మద్రాసులో జరిగింది. సరిగ్గా అదే రోజు మద్రాసులో ప్రారంభమైన – "ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యూనో హెమటాలజీ" సంస్థ అష్టమ అఖిల భారత మహాసభల్లో – వారిని సొసైటీ సన్మానించింది. ఇది – గోపికృష్ణ తపస్సుకు – ఒక సముచితము, అర్థము అయిన భరతవాక్యం.

* * * *



రక్తదాత గోపికృష్ణతో వ్యాస రచయిత

స్వచ్ఛంద రక్తదాతలు ఈ నాడు కూడా అరుదు కాగా, ఇప్పటికి 28 సంవత్సరాల క్రిందట – ఆ పాత రోజుల్లో, వైద్యశాస్త్ర పరిజ్ఞానమెంతో [illegible] న్యాయశాస్త్ర పట్టభద్రుడైన గోపికృష్ణ – స్వచ్ఛంద రక్తదానం ద్వారా మానవత్వానికి న్యాయం కలిగించ బూనుకొని, విజయాన్ని సాధించారు. [illegible] – అసామాన్యం. అది – మానవతను ప్రేమించే వాళ్ళ హృదయాలను పులకింప చేసే విషయం. అందుకే – తన హృదయం పులకించగా – ఒక వ్యక్తి వారికొక లేఖ వ్రాశారు – "ఒక పవిత్ర హృదయుడైన మనిషికి, ఒక నిరాడంబరుడికి ఒక నిష్కళంక దేశభక్తునికి ఒక సామాన్య మానవుడు ఏమని కృతజ్ఞతలు తెలుపగలడు?... [illegible] తండ్రికి, చెల్లికి, సోదరునికి మందులను కూడ [illegible] మీరు [illegible] మీరు 60 వ సారి రక్తదానం చేసిన వార్త చదివిన తరువాత నా [illegible]" – అనే [illegible] తన హృదయస్పందనని తెలియజేశారు.

* * * *

రక్తసంబంధం ప్రగాఢమైంది. మామూలుగా అందరికీ వ్యక్తులతో రక్తసంబంధం వుంటుంది. ఐతే, రక్తదాతకి సమాజంతో రక్తసంబంధం వుంటుంది. [illegible] తమ రక్తాన్ని స్వచ్ఛందంగా [illegible] గోపికృష్ణ గారికి – సమాజంతో రక్తసంబంధం ఎంతో ప్రగాఢమైంది. తమ ఈ [illegible] రక్తసంబంధంతో వారు – తమ [illegible]. కానీ, రక్తదానం ద్వారా ఎంతో మందికి [illegible] వారి [illegible] – 1985 జనవరి 25న, [illegible]

* * * *

గోపికృష్ణ తమ జీవిత కాలంలో 60 సార్లు రక్తదానం చేసి – తెలుగు గడ్డ మీద స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాన్ని ఎంతో ముందుకు తీసుకుపోయారు. ఐతే, వారు తమ [illegible] – తమ ఆరోగ్య కారణాల [illegible] రక్తదానోద్యమాన్ని [illegible]. రక్తదానం – దాతకు హానికరంగా [illegible]. ఆరోగ్యానికి [illegible] – [illegible] ఒక అభిప్రాయం వుంది. [illegible] రక్తదానం చేసిన గోపికృష్ణ గారు – తమ ఆరోగ్యం [illegible]



గోపీకృష్ణ మానస పుత్రికలు

బలం చేకూర్చింది. వారు బ్రతికుండగా - ప్రజల అపోహను ఖండించారు. ఆ ఖండనలో వారు - తమకు వైద్యం చేసిన వైద్యుల అభిప్రాయాన్ని పేర్కొన్నారు. కాగా, వారి మరణంతో - ప్రజల అపోహను తొలగించే ప్రయత్నం - వారి వైపు నుంచి నిలిచిపోయింది. నేటి సమాజంలో రక్తదానావశ్యకత అంతకంతకీ ఎక్కువౌతున్న దృష్ట్యా - ప్రజల ఈ అశాస్త్రీయమైన అభిప్రాయాన్ని పోగొట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. దానికి - ఈ సేవారంగంలో పని చేస్తున్న సంఘ సేవకులు . వైద్యులు కృషి చెయ్యాలి. నా వంతుగా ఇక్కడ రెండు మాటలు -

రక్తదానం ఉద్దేశం - రోగిని బ్రతికించడమే గాని, ఆ క్రమంలో దాతని చంపడం ఎంత మాత్రం కాదు. దాతని చంపడమే నిజమైతే - దాని బదులు ఆ రోగే మరణిస్తే సరిపోతుంది గదా? బాగున్న దాత, రోగిని బాగుపరిచి, తాను బాగ లేకుండా అయిపోయి, చావడం దేనికి? ఆధునిక వైద్య విజ్ఞానం - అంత కబోధితనంగా రక్తదానాన్ని అమలుపరచడం లేదు.

స్త్రీలకు ప్రతినెలా కొంత రక్తం పోయే సంగతి అందరికీ తెలిసిందే. ప్రసవ సమయాల్లో, గర్భస్రావాల్లో - ఎంతో ఎక్కువగా పోయేది కూడా అందరికీ తెలిసిందే. ఐతే, స్త్రీలు ఎందుకని అనారోగ్యం పాలై, క్రమేణా చచ్చిపోవడం లేదు? స్వచ్ఛంద రక్త దానోద్యమంలో - ఒక స్త్రీ 62 సార్లు రక్తదానం చేసి, ఆ రంగంలో ఉన్నత స్థానంలో వుందని, మద్రాసులో హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నదని - ఎంత మందికి తెలుసు?

అపోహ గాకపోతే - రక్తదాతలు కానివాళ్ళు అనారోగ్యంతో బాధలు పడుతున్న వాళ్ళెంత మంది లేరు - ఆ బాధల్లో - అకాలంగా చచ్చిపోతున్న వాళ్ళెంత మంది లేరు? గోపికృష్ణ గారు మధుమేహ వ్యాధితో బాధపడ్డారు. దీర్ఘకాలంలో - క్రమేణా శరీరావయవాల్ని ధ్వంసం చేసి, ప్రాణం తియ్యడం - ఆ వ్యాధి స్వభావం. ఆ వ్యాధి మూలంగానే వారు మరణించారు. వారికా వ్యాధి రావడానికి - వారి రక్తదాన పరంపర కారణం కానేకాదు. అదే కారణమైతే - సంఘంలో ఎంతో మందికున్న మధుమేహ వ్యాధికి కారణమేమిటి? వారంతా రక్తదాతలు కారే? కాబట్టి, రక్తదానానికి - అనారోగ్యానికి, తద్వారా మరణానికి - ఏమీ సంబంధం లేదు. గోపికృష్ణగారు కూడా అందరి లాంటి మనిషే. వారూ అనారోగ్యానికి గురి కావచ్చు; తర్వాత మరణించనూవచ్చు. నిజానికి అదే జరిగింది.

* * * *

సంఘసేవ చేసే వాళ్ళెవరూ - ప్రభుత్వాదరణని ఎంత మాత్రం ఆశించకుండా చెయ్యడం మంచిది. లేకుంటే - వాళ్ళు సంఘ సేవ చెయ్యడంలో నిరుత్సాహ పడ్డమే కాక, అవమానానికి, ఆవేదనకి గురి కావాల్సొస్తుంది. ప్రభుత్వాన్నించియేమాశించీ గోపికృష్ణ గారు రక్తదానం చెయ్యలేదు. కానీ, తమ జీవన సంధ్యా సమయంలో - ఆర్థిక సమస్యలకి అనారోగ్యం తోడు కాగా - ప్రభుత్వాన్ని ఆర్థిక సహాయం కోరారు. ప్రభుత్వం - కర్కశంగా నిరాకరించి, తన నైజాన్ని, నగ్నంగా ప్రదర్శించింది. ఒక ప్రాణదాతకి, వృద్ధాప్యంలో - అవమానాన్ని, ఆవేదన్ని దండిగా బహూకరించి, అంతులేని అపకీర్తిని నెత్తినేసుకుంది.

* * * *

గోపికృష్ణ ఆశావాది. విరాళాల సహాయంతో తాము ముద్రింప చేసి, పంచిపెట్టిన - స్వచ్ఛంద రక్తదానోద్యమ సాహిత్యం తాలూకు చిన్న చిన్న పుస్తకాల్లో - ఒక చిత్రాన్ని వారు ప్రముఖంగా ప్రచురించేవారు. తాము సొంతంగా గీయించుకున్న ఆ రేఖా చిత్రంలో - ఇద్దరమ్మాయిలుండేవాళ్ళు. ఆ బొమ్మ అర్థమేమిటని వారి నొకసారి నేనడిగితే - చిన్నమ్మాయి - భారద్దేశంలోని నిరాశ అని, పెద్దమ్మాయి -ధైర్యం చెప్తున్న ఆశ అని చెప్పారు. ఈ బొమ్మ, ఈ జవాబు - వారి ఆశావాద తత్వాన్ని చెప్తున్నాయి. కాకుంటే - పెద్ద కుటుంబంలో పుట్టి, ఆఖరిక ఆస్తిపాస్తులు హరించిపోగా, అనారోగ్యం పాలై, సంతాన రహితులైన గోపికృష్ణ - ప్రభుత్వ సహాయాన్నాశించి, విఫలులై అసహజమరణానికి పాల్పడక, బంధుమిత్రుల, అభిమానుల, సానుభూతిపరుల సహాయంతో - జీవన సమరాన్ని కొనసాగిస్తూ నడిపుండే వాడు కాదు.

బహుమతు లియ్యాలని, తీసుకోవాలని - అందరికీ మహా ఇష్టంగా వుంటుంది. కాగా, ప్రపంచంలో అత్యంత విలువైనది - ప్రాణం ఒక్కటే. అటువంటి ప్రాణాన్నే - తన రక్తదానం ద్వారా ఎంతో మందికి బహూకరించి, ప్రాణాన్ని బహూకరించే అభిరుచిని కలిగించుకోమని చాటి, వెళ్ళిపొయ్యాడు - ఆశావాది గోపికృష్ణ. ఇంక ఇప్పుడు మన కాయన లేరు.

50 సార్లు రక్తదానం చేసిన రక్తబంధువు, ప్రజల ఆత్మబంధువు, సామాన్యుడైన అసామాన్యుడు, మాన్యుడు, ధన్యుడు - మా గోపికృష్ణ - మన గోపికృష్ణ. వారి దివ్యస్మృతికి అంజలి ఘటిద్దాం.

వ్యాసం , ఫోటో
—తిక్కవరపు సుకుమార్‌రెడ్డి



ఋణం తీరిపోయింది

చిన్నకోట సుశీలాదేవి

కళ్ళు మూసుకుని పడుకున్న సీత చటుక్కున కళ్ళు తెరిచింది!

ఎక్కడినుండో చక్కటి వీణానాదం వినబడుతోంది! ఎవరో అత్యంత సమ్మోహనకరంగా వాయిస్తున్నారు!

ఇవ్వాళేకాదు. తనీ నర్సింగ్‌హోమ్‌లో చేరిన పది రోజుల నుండీ....మూడు పూటలా క్రమం తప్పకుండా వింటోంది. ఎవరో చాలా శ్రద్ధగా నేర్చుకుంటున్నారు! అని కూడా అనుకుంది!

అప్పుడప్పుడణ వీణతో పాటు ఒక లాత గొంతు కలిపి పాడుతుంటుంది!

ఆ అమ్మాయి వీణ కూడా వాయిస్తోందా? లేక ఇంకెవరైనా పాడుతున్నారా!

అని సీత ఆలోచిస్తూ వుంటుంది!

ఇవ్వాళ వీణానాదం ఒక్కటే వినిపిస్తోంది. వీణపై రాగాలాపన చేశాక - పాట మొదలైంది!

సీతకు ఆ పాట తనకు నచ్చినదిగానే తోచింది.

హఠాత్తుగా సీత కూడా చిన్నగా గొంతు కలపడం ప్రారంభించింది! అది స్పెషల్ రూమ్ అవడం వలన సీత పాట వినే భాగ్యం ఇంకెవ్వరికీ కలగలేదు.

కొంతవరకూ వీణతో పాటు సీత గొంతు కూడా వంపులు తిరిగింది! కానీ పై స్థాయి అందుకోలేకపోయింది! సీత గొంతు కీచుగా పలికి ఆగిపోయింది!

సీత.... వీణానాదంతో పాటు... మళ్ళీ పాడాలని ప్రయత్నించింది! కానీ గొంతు బొంగురు పోయింది!

సీతకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి!

ఒకప్పుడు తనెంతో బాగా పాడేది....

తను వీణ వాయిస్తూ పాడుతూంటే రెండూ ఒక్కలా వుండేవి!

ఆ రోజుల్లో తనకు సంగీతమే ప్రాణం.

వీణావాదనే..... సర్వస్వమూ.

సీతకు ఆ రోజులు..... కళ్ళముందు తిరిగాయి!

* * * * * * *

మధ్య తరగతి కుటుంబంలో పెద్దమ్మాయిగా పుట్టిన సీత చదువు హైస్కూలుతోనే ఆగిపోయింది!

ఎదిగిన ఆడపిల్లని త్వరగా పెళ్ళి చేయాలనే ఆరాటంతో సీత తల్లిదండ్రులు.... సంబంధాలు చూడసాగారు.

పెళ్ళి చూపులకు వచ్చిన వాళ్ళందరూ అన్ని ప్రశ్నలతో పాటు అమ్మాయికి సంగీతం వచ్చా? అనే ప్రశ్న కూడా తగిలిస్తూ వుండేవారు!

ఆ ప్రశ్న విని సీత తండ్రి కూతురికి పెళ్ళి కావాలంటే సంగీతం కూడా వచ్చుండాలేమోననుకుని ఒక మాష్టరుని పెట్టి సీతకు సంగీతం నేర్పించడం మొదలెట్టాడు!

ఇంట్లో వాళ్ళకి అది 'పెళ్ళి సంగీతమే' అయినా సీత మాత్రం ప్రాణాలన్నీ దానిమీదే పెట్టుకుని కష్టపడి సాధన చేస్తూ దీక్షగా నేర్చుకోసాగింది.

చల్లని సాయం సంధ్యా సమయాల్లోనో నిశ్శబ్దంగా వుండే ఉషోదయ కాలంలోనో వీణ పుచ్చుకుని వాయిస్తూ బాహ్య ప్రపంచాన్నే మరిచేది సీత.

వీణ వాయిస్తోంటే తిండీ, నిద్రా కూడా అవసరమయ్యేవి కావు!

ఎప్పుడూ ఇలా వాయిస్తూ వుండిపోతే ఎంత బాగుణ్ణు! అనుకునేది!

సీత శ్రద్ధ చూసి మాష్టారు చాలా ముచ్చటపడేవాడు!

"సీతా! నిన్ను చూస్తే నాకు చాలా గర్వంగా వుందమ్మా! నా పేరు నిలబెట్టే శిష్యురాలివి దొరికావు! నీ గొంతులో పలకని రాగమే లేదు. నువ్వు సంగీత సరస్వతివి" అంటూ మేష్టారు మెచ్చుకుంటోంటే సీత ఆనందంతో పొంగిపోయేది!

తను గొప్ప సంగీత విద్వాంసురాలవ్వాలని కలలు కనేది!

మరింత శ్రద్ధగా సాధన చేయడం మొదలెట్టింది సీత!

ఆ సమయంలోనే తండ్రి రాజారావు సంబంధం తీసుకొచ్చాడు.

రాజారావుతో పాటు అతని తల్లి దండ్రులు అక్క చెల్లెళ్ళు కూడా వచ్చారు పెళ్ళి చూపులకు.

అన్ని ప్రశ్నలతో పాటు "అమ్మాయికి సంగీతం వచ్చా?" అనడిగింది రాజారావు తల్లి!

"ఆ వచ్చుండి! చాలా బాగా పాడుతుంది...."

సీత తండ్రి గర్వంగా చెప్పాడు!

"ఒకపాట పాడమ్మా!" సీతని అడిగారు!

అంత మందిలోనూ పాడాలంటే సిగ్గేసింది సీతకు.

తండ్రి హెచ్చరించడంతో త్యాగరాజ కృతి అందుకుంది!

కానీ ఎత్తుగడలోనే తాళం తప్పింది. దాంతో కంగారెక్కువై.... అపశ్రుతులతో తప్పుడు తాళంతో పాట ఎలాగో అయిందనిపించింది సీత!

చాలా బాగుందని మెచ్చుకున్నారందరూ.

సీతకు వాళ్ళ సంగీత పరిజ్ఞానానికి ఆశ్చర్యం, ఆనందం కలిగాయి!

తనింత అపశ్రుతులతో పాడితేనే ఎంతో బాగుందన్నారు! సరిగ్గా పాడితే ఎంతో సంతోషిస్తారో! అనుకుంది!

తర్వాత ఆ సంబంధం స్థిరపడిందని తెలిసిన రోజున ఎక్కువగా సంతోషించింది సీత ఒక్కతే. ఆ ఇంట్లో!

ప్రైవేటు కంపెనీ వుద్యోగమని తల్లీ కట్నం మరీ ఎక్కువగా వుందని తండ్రీ..... కొంచెం అసంతృప్తిగా వున్నారు!

కానీ సీత ఆనందం చెప్పనలవికాదు!

తను సంగీత విద్వాంసురాలు కావాలనుకుంటోంది! అటువంటి సంగీతాభిమానుల దగ్గర..... తన కోరికలు తప్పక తీరుతాయి అనుకుంటూ సంబరపడింది సీత!

పెళ్ళయ్యాక వీణతో సహా అత్తింట్లో అడుగు పెట్టింది సీత! అది చూసి అత్తగారు...

"మా కోడలు ఎంతగొప్ప సారె తెచ్చిందో?" వెటకారంగా ఇంటికి వచ్చిన వాళ్ళందరికీ చెప్పింది!

"వదినా! నీకు వీణ ఎందుకు! నువ్వు ఇక్కడకు వచ్చింది కాపరం చేయడానికా? లేక కచేరీలు చేయడానికా?..." అంటూ ఆడబడుచులు నవ్వారు.

సీత ముఖం చిన్నబోయింది!

"ఆనాడు వాళ్ళు చూపిన అభిమానమంతా పైపై నటనేనా? ఇక తను సంగీతం నేర్చుకునే అవకాశమే లేదా?.... తన ఆశలన్నీ నిరాశలు కావలసిందేనా?...." అంటూ దుఃఖపడింది సీత!

ఉమ్మడి కుటుంబం సీతకు వూపిరాడని పని. ఎప్పుడైనా....తీరిక దొరికినప్పుడు వీణ తీసేది.

అంతే. అందరూ మీద విరుచుకు పడేవారు!

"వదినా! అబ్బా.... తలనొప్పి వస్తోంది! మమ్మల్ని ఇంట్లో వుండమంటావా? లేక పొమ్మంటావా!" అంటూ మరుదులు తల పట్టుకునేవారు!

వాళ్ళు ఇల్లెగిరిపోయేట్టు పెద్ద సౌండు పెట్టి హిందీ పాటలు విన్నప్పుడు తలనొప్పి రాదా!...." అనుకుంటూ సీత మనసులో బాధ పడేది!

ఇక అత్తగారు:

"మా కోడలు మహారాణి! హాయిగా వీణ వాయించుకుంటూ కూర్చుంటుంది! ఇంట్లో నేనొకదాన్ని వున్నాగా వంట మనిషిని...." అంటూ సాధించేది!

భోజనానికితప్ప వంటింట్లోకి రాని అత్తగారు అలా సాధించడం విని సీత భరించలేకపోయింది!

వాళ్ళందరికీ..... ఎందుకింత కోపం.... అసలీ కోపమంతా..... తనమీదనా? లేక వీణ మీదనా?

ఇది కోపమా? లేక తను బాగా వాయిస్తుందనే అసూయా?... సీత ఆలోచించేది!

ఏదయితే ఏం. వాళ్ళ బాధ భరించలేక వీణ వేపు కన్నెత్తి కూడా చూసేది కాదు! సంవత్సరానికొకసారి దుమ్ము ధూళితో నిండిన వీణని బాగా దులిపి.... చక్కగా పెట్టెలో దాచిపెట్టేది! అంతే!

సీత భర్త రాజారావుకి సంగీతమంటే ఇష్టం లేకపోయినా అయిష్టం మాత్రం లేదు....

అయితే.... ఆ కుటుంబంలో.... అతని మాట ఎక్కువ చెల్లుబాటయ్యేది కాదు.

ఆ తర్వాత సంవత్సరమే సీతకు కొడుకు పుట్టాడు. దానితో సంగీతం విషయమే మర్చిపోయింది!

వరసగా నల్గురు పిల్లలు కలగడంతో సీత పూర్తిగా సంసార సాగరంలో మునిగి పోయింది!

ఇప్పుడు అత్త మామలు లేరు... మరుదులు వుద్యోగరీత్యా పై వూళ్ళకు వెళ్ళిపోయారు! ఆడబడుచులకు పెళ్ళిళ్ళు అయిపోయాయి!

సీతను సాధించేవాళ్ళు. వెక్కిరించేవాళ్ళు ఎవ్వరూ లేరు!

కానీ సీతకు తన సంసారమే ఒక పెద్ద సంగీత కచ్చేరీలా తయారయింది! భర్తకు వచ్చే డబ్బు చాలకపోవడం.... ఎదిగే పిల్లల ఖర్చు.... అధిక ధరలు, అప్పులు, సమస్యలు.... కష్టాలు వీటితో సీత వుక్కిరి బిక్కిరై పోతుంటుంది.

ఇప్పుడు సీతకి వీణ అనే వస్తువు తనింట్లో వుందని కూడా గుర్తు లేదు.

ఇదుగో.... మళ్ళీ ఇప్పుడు.... ఈ నర్సింగ్‌హోమ్‌లో చేరాక ప్రక్క ఇంట్లో నుండి వీణా నాదం వినిపిస్తోంటే ఒంటరితనం, తీరుబాటు ఆమెకు గతాన్ని గుర్తు చేస్తున్నాయి! జ్ఞాపకాల పుట్టలో వున్న ఆశల్ని కెలుకుతూ. వాటిని లేపుతోంది సీత మనస్సు!

* * * * * * *

"ఏమిటి సీతా! దీర్ఘాలోచనలో వున్నావ్!" అంటూ వచ్చాడు రాజారావు!

సీత ఆలోచనలనుండి బయటపడి భర్త వేపు చూసింది!

అతని రెండు చేతులనిండా పళ్ళు - బిస్కెట్లు టిన్లు వున్నాయి! వాటిని చూసి ఆశ్చర్యపోయింది!

తను ఈ హాస్పిటల్లో చేరాక ఆపరేషన్ అయిన మూడో నాటి నుండీ రాజారావు గదంతా పళ్ళతోనూ.... హార్లిక్స్ టానిక్కులతో నింపేస్తున్నాడు! ఇంట్లో పిల్లల్ని చూసేందుకు పని పిల్లనూ.... వంటకు మనిషినీ కుదిర్చాడు.

ఇవన్నీ విని సీత నోరు తెరిచింది.

తమ ఇంటి పరిస్థితి తెలుసు.

పాలవాడికీ.... ఇంటి అద్దె.... ఒక నెలన్నా సరిగ్గా ఇవ్వలేకపోయేవాళ్ళు.... పిల్లల ఫీజు లెప్పుడూ వాళ్ళ పేరు కొట్టేశాకే కట్టేవాళ్ళు.... తనొక క్రొత్త చీర కొనుక్కోవాలంటే సంవత్సరం ఆలోచించేది. నెలాఖరులో అప్పు చేయకపోతే ఆ వారమంతా ఇంట్లో వాళ్ళు పస్తే....

అటువంటిది. ఈ పళ్ళకీ - టానిక్కులకూ పనివాళ్ళకూ డబ్బెలా వచ్చింది?

నెలాఖరులో పది - ఇరవై ఇచ్చేవాళ్ళే కానీ - వందలిచ్చే గొప్ప స్నేహితులెవరూ రాజారావుకు లేరు.

మరి ఈ డబ్బు ఎక్కడిది?

రాజారావు బత్తాయి తొనలు వలుస్తున్నాడు!

"ఏవండీ! మిమ్మల్నో మాట అడగనా?" అందిసీత!


రాజారావు తలెత్తకుండానే-

"అడుగు"- అన్నాడు!

"ఈ పళ్ళకు - పని మనుషులకూ డబ్బెక్కడిది!"

"సీతా! అవన్నీ నీకెందుకు! నేనేదో తంటాలుపడి తీసుకొస్తున్నాగా! నువ్వు డబ్బు గురించి ఆలోచించడం మానేసి.... ఇవన్నీ తిని- ఆరోగ్యవంతురాలవై ఇంటికిరా... ఆ తర్వాత వివరాలు కావలిస్తే చెప్తాను" అన్నాడు!

సీత మాట్లాడలేదు...



ఋణం తీరిపోయింది

రాజారావు తొనలు వలచి సిత కందిస్తున్నాడు!

"సీతా! ఈ పదిరోజులూ హాస్పిటల్లో వుంటే వున్నావుగానీ.... ఎంత మార్పువచ్చిందో నీలో తెలుసా!

ఇప్పుడు అచ్చం పెళ్ళినాటి సీతలా వున్నావ్" అన్నాడు.

ఆమెవేపు ప్రేమగా చూస్తూ!

తనలో వచ్చిన మార్పు సీతకు కూడా తెలుస్తోంది! ఇదివరకున్న నీరసం అనారోగ్యం... పోయి- కొత్త ఉత్సాహం శక్తి వచ్చినట్లుగా వుంది!పనీపాటూ లేదు! కూర్చుని బలమైన ఆహారం తినడంతో శరీరం నునుపెక్కింది. బుగ్గల్లోకి.... ఎర్రదనం... కళ్ళల్లోకి కాంతీ వచ్చాయి!

"సీతా! మేం అక్కడ చాలా హాయిగా వున్నాం! పిల్లల గురించి నువ్వేం దిగులుపడకు. వంటమనిషి చక్కగా వండుతోంది! మరో మూడు నెలల వరకూ నువ్వు విశ్రాంతి తీసుకోవాలికదా. ఇంటికొచ్చినా హాయిగా పడుకోడమే నీ పని... తెలిసిందా"అన్నాడు రాజారావు.

సీత మాట్లాడలేదు.

పక్కింట్లో నుండి వీణావాదన ఇంకా వినబడుతూనే వుంది! సీత ఆలోచనలు- ఎక్కడెక్కడికో పోయాయి.

తనకి మూడు నెలలవరకూ పూర్తి విశ్రాంతి! ఊరికే కూర్చునేబదులు వీణ సాదన చేస్తే... మూడు నెలలంటే - తొంభైరోజులు రోజుకు ఆరుగంటల చొప్పున చేసినా చాలు.నేర్చుకున్నదాన్ని తిరిగి జ్ఞాపకం చేసుకోడమే కదా...

మూడు నెలలు గడిచాక. తను తప్పకుండా సంగీత కచ్చేరీ చేయగలదు.

ఒక్క కచ్చేరీ చేసిందంటే తన ప్రతిభ అందరికీ తెలుస్తుంది! మొదటి మెట్టు ఎక్కడమే కష్టం' ఆ తర్వాత నిచ్చెన పైకి వెళ్ళడం. ఎంతో తేలిక.

కీర్తి ప్రతిష్ఠలతోపాటు ఎంతో ధనాన్ని కూడా ఆర్జించవచ్చు! అప్పుడే డబ్బు సమస్యలుండవు.

తనని ఎగతాళి చేసిన వాళ్ళు... తనని చూసి అసూయపడతారు.

తన కంఠమాధుర్యాన్ని చూసి ఏ సినిమాల్లోనో ప్లేబాక్ గాయనిగా ఛాన్సిస్తే... ఇక తనను ఎదురేలేదు. మేడల్లో వుండొచ్చు... కార్లల్లో తిరగొచ్చు. అనుకుంటూ సీత ఆనందంతో పుక్కిరిబిక్కిరైంది!

అబ్బ వూహే ఇంత బాగుంది కదా!

వూహలు నిజాలైతే... ఇంకెంత బాగుంటుందో! ఏదైనా తన సంగీత సాధనకు ఇదే తగిన సమయం.

మళ్ళీ జన్మలో ఇటువంటి అవకాశం రాదు. అయినా ఆ దేవుడు కూడా తనని సంగీత విద్వాంసురాలిని చేయాలనే... ఈ ఆపరేషన్ కల్పించాడేమో! తనిక ఒక్క క్షణం వృధా చేయకూడదు.ఇంటికి వెళ్ళగానే మొదలెట్టాలి... అనుకుంటూ ఎప్పుడెప్పుడు ఇంటి కెడుదామా అని తహతహలాడిపోయింది సీత!

* * * * * *

ఆ రోజు వచ్చింది!

సీతని హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేశారు!

రాజారావు సీత వద్దంటూన్నా వినకుండా టాక్సీలో ఇంటికి తీసుకెళ్ళాడు! సీత వెళ్ళేసరికి పిల్లలేర్లు! స్కూలుకెళ్ళారు!

వంట మనిషి ఎదురొచ్చి లోపలకు తీసుకెళ్ళింది!

సీత ఇల్లంతా కలయ చూసింది!

ఎక్కడి వస్తువులక్కడ అమర్చబడి ఇల్లంతా ఎంతో అందంగా సర్దేవుంది!

"స్నానం చేసిరా సీతా! బడలిక తగ్గుతుంది" రాజారావు అన్నాడు!

సీత లోపలకు వెళ్ళి- పనిపిల్ల సాయంతో స్నానం ముగించి వచ్చింది!

"అమ్మా! టిఫిను తీసుకోండి "వంటమనిషి వచ్చింది టిఫిను తిని- కాఫీ త్రాగి- సీత తన గదిలోకి వచ్చింది!

తన వీణ కోసం చూసింది!

గదిలో కనబడలేదు...

ఇల్లు సర్దడంలో ఇంకెక్కడైనా పెట్టారేమో అని పనిపిల్లని పిలిచి అడిగింది!

"వీణ ఏదీ?"

"అంటే ఏంటమ్మా!" అమాయకంగా అడిగింది!

విసుగ్గా చూసింది సీత!

"నువ్వెళ్ళు.... అయ్యగారి.... ఎక్కడున్నారు?" అనడిగింది!

"అయ్యగారిని పిలుచుకొస్తానంటూ- పనిపిల్ల వెళ్ళింది!

"పిలిచావా సీతా" అంటూ వచ్చాడు రాజారావు- ఆదుర్దాగా

"నా వీణ ఏదండీ?" అనడిగింది!

"ఓ అదా! ఏకేవన్నా వుందో బాగా లేదేమోనని కంగారుపడ్డాను.." అని తాపీగా నూర్చున్నాడు!

సీత అసహనంగా చూసింది!

వీణ దుమ్ము దులిపి ఎప్పుడెప్పుడు... స్వరాలు పలికిద్దామా అని ఆరాటపడుతోంది సీత!

ఆ క్షణంలో వీణ తప్ప ఆమె కళ్ళకు ఇంకే ప్రపంచమూ కనబడటంలేదు...

"ముందు వీణ సంగతి చెప్పండి! ఏ గదిలో పెట్టారు... లేక ఏ మూలకన్నా విసిరేశారా?" అంటూ నిలేసింది.

"నువ్వలా కూర్చో ముందు..." సీతని చేయిపట్టి కుర్చీలో కూర్చోబెట్టాడు.

"సీతా! ఆవేశం తగ్గించుకో! స్థిమితపడు. నేను చెప్పబోయే విషయం నీకు బాధకలిగించవచ్చు....."

"ఏమిటండీ అది!"


"నువ్వొకసారి హాస్పిటల్లో అడిగావు... గుర్తుందా ఈ డబ్బంతా ఎక్కడిదని...."

"అవును.... అడిగాను."

"ఆ డబ్బంతా ఎలా వచ్చిందంటే..." గుటకలు

గడుసులోకం

—బాబు



ధర్మపథం



గోకులగాథ – అంతరార్థం

శ్రీ హరి దశావతారాలలోను పరిపూర్ణ మైనవి రెండు. అవి శ్రీ రామావతారం, శ్రీ కృష్ణావతారమున్నూ. శ్రీ రాముడు ఆదర్శ మహా పురుషుడుగా చిత్రించబడి ఉన్నాడు. శ్రీ కృష్ణుడు విలాస పురుషుడుగానూ, బాల్యంలో అల్లరి పిల్లవాడు గానూ, అద్భుతకృత్యాలు చేసిన వాడుగానూ భాగవతాన్ని బట్టి గోచరిస్తాడు. భారతాన్ని బట్టి గొప్ప రాజనీతివేత్తగానూ, తత్త్వోప దేశికుడు గానూ కానవస్తాడు. శ్రీరాముడు, తాను భగవదవతారమూర్తినని చెప్పలేదు. ఏశ్వరూపాన్ని ప్రదర్శించిన శ్రీ కృష్ణుడు, తాను భగవంతుడననీ, పరమాత్మ స్వరూపుడననీ తెలియ జేస్తాడు. అందు వల్లనే "శ్రీ కృష్ణపరమాత్మ" అనే పేరు వాడుకలోకి వచ్చింది. "రామపరమాత్మ" అనే పేరు వాడుకలోకి రాలేదు.

దీనిని బట్టి శ్రీ కృష్ణుని గోకుల గాథలో ఒక విశిష్టమైన అంతరార్థం ఇమిడి ఉన్నదని ఊహించడానికి అవకాశం ఉన్నది.

జీవులు నిరవధికమైన భక్తి కలిగి నిర్మల మనస్సుతో ఉండి భగవంతుని ధ్యానిస్తూ ఉండిన యెడల సంసార బంధముల నుండి విడుదలను పొంది ముక్తిని పొందగలరు. వారు మమకారాన్ని విడిచినట్లే ఆత్మాభిమానాన్ని కూడా విడువ వలెను.

పరమాత్మ స్వరూపుడగు శ్రీ కృష్ణుని యందు ప్రగాఢమగు భక్తి గల గోపికలే జీవులు. గోకులమే వారి హృదయము. అందు నివసించు శ్రీ కృష్ణుడే వారి హృదయములలో స్థిరముగా నెలకొని యున్న పరమాత్మ. పావనమైన యమునా నదీ ప్రవాహమే అవిచ్ఛిన్నంగా పొంగి పొరలే భక్తి భావం.

వారు శ్రీ కృష్ణుని వేణునాదాన్ని విని తమ వారిని లెక్క చేయకుండా, గృహాల నుండి అతని సన్నిధికి వెళ్ళడమే మమత్వాన్ని విడిచి పెట్టడం.

శ్రీ కృష్ణుడు గోపికల వస్త్రాలను అపహరించడం, జీవులు ఆత్మాభిమానాన్ని విడిచి పెట్టవలెనని బోధించుట కొరకే అని మనం గ్రహించాలి. అతడు గోకులంలో చేసిన అల్లరి పనులన్నీ జీవుల శాంత గుణాన్ని పరీక్షించడానికే అని తెలుసు కోవాలి. "తానే పరమాత్మ"నని ప్రజలు గ్రహించ డానికే అతడు అద్భుతమైన పనులు చేశాడని, ఆలోచిస్తే తెలియకపోదు.

– బులుసు వేంకటరమణయ్య

మింగాడు'

"చెప్పండి త్వరగా–" వీణ గురించి తనడిగితే– ఆ పాత విషయాలు భర్త ఎందుకు గుర్తు చేస్తున్నాడో సీతకు అర్థం కాలేదు!

'సీతా' ని వీణ అమ్మేశాను–" అన్నాడు'

సీత పిడుగుపడ్డట్టు.... నిశ్చేష్టురాలై పోయింది'

"సీతా! పాతదైనా బలే ధర వచ్చిందిలే. .. అసలు పాతవాటికే డిమాండ్ ఎక్కువట. అందులోనూ నీ వీణ చాలా మంచిదిట..." రాజారావు చెప్పుకు పోతున్నాడు!

సీత షాక్ నుండి తేరుకోలేక పోతోంది! అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. హాస్పిటల్లో పొందిన ఆరోగ్యమంతా ఒక్కసారిగా పోయినట్లయింది.

"సీతా! నీకు చాలా బాధకలుగుతుందని తెలుసు... కానీ ఏం చెయను. నీకు వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు! ఎక్కడా అప్పుపుట్టలేదు. ఇంట పరిస్థితి నీకు తెలియందేముంది! నాకు పిచ్చెక్కి నట్లయింది.. చివరకొక మిత్రుడు సలహా ఇచ్చాడు. ఆ పరిస్థితిలో ఇక అంతకన్నా గత్యంతరం లేకపోయింది. వీణకంటె నాకు నీ ఆరోగ్యం ముఖ్యమనిపించింది. సీతా... నేను చేసింది తప్పంటావా?"

మెల్లగా అడిగాడు. సీత తేరుకుంది!

'మీ తప్పేం లేదండీ.... అర్హత లేకుండా ఆశలు పెంచుకోడం నాదే తప్పు..." అంది బాధగా.

ఆమె కళ్ళముందు.... తను హాస్పిటల్లో కట్టుకున్న ఆశాసౌధాలు కుప్పకూలి పోతున్నట్లుగా కనిపించాయి!

"సీతా! నువ్వు ఆరోగ్యవంతురాలివై.... తిరిగొచ్చావ్!.... అది చాలదూ..." అన్నాడు రాజారావు!

అవును.... ఆ తృప్తి – చాలు.

సంగీతాన్ని ఆధారం చేసుకుని లక్షలు సంపాదించాలనుకుంది కానీ లక్షలిచ్చినా కొనలేని. ఆరోగ్యాన్ని ప్రసాదించింది. వీణ! ఇన్నాళ్లూ తన ఇంట్లో వున్నందుకు.. ఋణం తీర్చేసుకుని వెళ్ళిపోయింది ఆ సంగీత సరస్వతి!

అందుకు తను బాధపడకూడదు....

ఆనందపడాలి! గర్వపడాలి... అనుకుంటూ చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంది సీత! □

బైద్యనాథ్ ఆరోగ్య దీపిక

పాఠకుల ప్రశ్నలకి బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ వైద్య ప్రముఖుని సమాధానాలు

పి. ఎన్. మణి, సోంపేట

ప్ర : ప్రతినెలా బహిస్టులో పొత్తి కడుపు నెప్పి. బాధ, కాళ్ళు పీకులు ఉంటాయి. అవి తగ్గటానికి ఏం చేయాలి?

జ : బహిష్టు నొప్పికి పది తులాల నువ్వులు బెల్లపు లడ్డును ప్రతి రోజూ సేవిస్తూ బైద్యనాథ్ రజః ప్రవర్తినీవటి రోజూ ఉదయం, సాయంత్రం ఒక గోలీ సేవించి, ఆపైన బైద్యనాథ్ సుందరీ కల్ప (ఫోర్ట్) మూడు చెంచాలు నీటితో త్రాగాలి.

జి. వెంకట సుబ్బయ్య, గుంతకల్లు

ప్ర : నాకు ఎప్పుడూ కడుపునెప్పి, తిన్న అన్నం జీర్ణం కాదు. త్రేణుపులు, పదిహేను రోజులకి ఒకసారి విరోచనాలు, నీరసం. అలోపతి వాడాను. కానీ పూర్తిగా నయం కాక అప్పటికి గుణం ఇస్తుంది. మళ్ళీ మామూలే. ఇదీ నా బాధ.

జః మీరు ఉప్పు, కారం తక్కువ తింటూ బైద్యనాథ్ లఘు సూతశేఖర్ రెండు బిళ్ళలు ఉదయం, రెండు సాయంత్రం భోజనానికి ముందుగా నీటితో వేసుకొనవలెను. రాత్రికి బైద్యనాథ్ సూత శేఖర రసం నెం. 1 ఒక గోలీ నిద్ర పోయే ముందు నీటితో గానీ పాలతో గానీ సేవించదగును.

జె. రాజారావు, బద్వేల్

ప్ర : నా శరీరముపై మొటిమలే కాకుండా నల్లని మచ్చలు అసహ్యముగా ఉన్నవి. దయచేసి వీటి నివారణకి మార్గం చెప్పండి.

జ : మీరు బైద్యనాథ్ అమలకీ రసాయకమును అర చెంచా మోతాదులో అన్నము తినే ముందు రోజుకు రెండు సార్లు సేవిస్తూ పైపూతకు బైద్యనాథ్ మహాచందనాది తైలమును వాడగలరు. అన్నము తిన్న తర్వాత బైద్యనాథ్ సురక్తా ప్ర్వాంగ్ 4 చెంచాలు నీటిలో కలిపి రోజుకు రెండుసార్లు సేవించగలరు.

జి. సుబ్బయ్య, కడప

ప్ర : నా వయస్సు 60. గత ఫిబ్రవరిలో గుండెపోటు వచ్చి కోలుకున్నాను. ఇంకా మందులు వాడుతూనే ఉన్నాను. వాటి వల్ల తల తిరుగుడు, దిమ్ము, కడుపులో మంటగా ఉంది. బి. పి. సుగర్ లేదు. కొలెస్టరాల్ మామూలుగా ఉంది. మళ్ళీ గుండె పోటు రాకుండా ఆయుర్వేదంలో మందులు ఏమిటి? ఆయుర్వేదంపైనాకు నమ్మకం ఉన్నది.

జ : గుండెపోటు వచ్చిన వారు లఘు ఆహారం సేవిస్తూ, అల్పశ్రమను అలవాటు చేసుకుని బైద్యనాథ్ లఘు సూతశేఖర్ రెండు బిళ్ళలు ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తీసుకోవాలి. అర్జునారిష్ట (బైద్యనాథ్), పునర్నవాసవము (బైద్యనాథ్) మూడు మూడు చెంచాలు అంతే నీళ్ళతో అన్నం తిన్న తర్వాత త్రాగవలెను. బైద్యనాథ్ హృదయార్ణవ రసము రాత్రికి ఒక బిళ్ళ పాలతో సేవించగలరు.

ఆర్. ఎల్. మూర్తి, పూరి, ఒరిస్సా.

ప్రః కొద్దిగా లావుకావాలి. కాళ్ళు పీకులు-నివారణ తెల్పండి.

జః మీరు బైద్యనాథ్ అశ్వగంధాది చూరన్ 1 స్పూన్ మరియు బైద్యనాథ్ చ్యవన్‌ప్రాష్ (స్పెషల్) రెండు స్పూనులు పాలతో ప్రొద్దున, సాయంత్రము తీసుకోవాలి. భోజనముతో నూనె వంటి పదార్థాలు ఎక్కువ తినాలి.

కె. కమలా, హైద్రాబాద్, సి. లింగయ్య శెట్టి, అనంతపూర్

ప్రః కోపము ఎక్కువ వస్తుంది. బ్లడ్ ప్రషర్ యున్నది. ఏ మందులు వాడాలి?

జః (ఏ) మీరు బ్లడ్ ప్రెషర్ చెక్ చేయించుకో గలరు. మానసిక వొత్తిడిని తగ్గించుకో గలరు. మీకు బ్లడ్ ప్రెషర్ ఎక్కువ ఉంటే బైద్యనాథ్ శర్పగంధా మాత్రలు ఒక్కొక్క మాత్ర రోజుకు రెండుసార్లు చల్లని నీటితో తీసుకోవాలి. మరియు భోజనము తరువాత నాలుగు స్పూనులు బైద్యనాథ్ చందనాశవ్ రోజుకు రెండుసార్లు వాడాలి. (బి) బి. పి. ఉంటే షుగర్ రావాలని లేదు. రావచ్చు. రాకపోవచ్చు. మీరు షుగర్ చెక్ చేయించుకో గలరు.

పి. మదనమోహన్, బొడ్డువారిపాళెం

ప్ర : నా వయస్సు 47 సం.లు. పని చేయాలనే కోరిక. కానీ కొంచెం పని చేస్తే అలసట. అలసట లేకుండా ఏ మందులు వాడాలి?

జ : అలసటగా ఉన్న వారు అన్నం తిన్న ఒక గంట లోపల మూత్ర, రక్త పరీక్ష (సుగర్ ఉందా లేదా అని) చేయించుకుని సుగర్ ఉన్నట్లయితే బైద్యనాథ్ వసంతకుసుమాకరం గానీ, మధుమేహారి యోగ్ (బైద్యనాథ్) ఒక్కొక్క బిళ్ళ చొప్పున రోజుకి ఒకసారి అన్నం తిన్న తర్వాత నీటితో సేవించవలెను. సుగర్ లేకుంటే అశ్వగంధారిష్ట (బైద్యనాథ్) నాలుగు చెంచాలు అంతే నీటితో కలిపి భోజనానంతరం రెండు సార్లు (రోజుకి) సేవించాలి.

మూర్తి, నామాలగుండు, సికింద్రాబాద్

ప్రః ముక్కుపై కురుపులు, జలుబు, తలనొప్పి.

జః బైద్యనాథ్ లక్ష్మిబిలాస్ రస్ (నార్దీల్) 1 మాత్ర + ఆనంద భైరవ్ రస్ (కాస్) 1 మాత్ర ప్రొద్దున, సాయంత్రము నీళ్ళతో తీసుకొనవలెను.

బైద్యనాథ్ చిత్రక్ హారీతకీ తేనెతో ప్రొద్దునా, సాయంత్రము వాడాలి. చల్లని పదార్థాలు తినకూడదు.

కె. ఆశోక్‌కుమార్, పెద్దపల్లి, కరీమ్‌నగర్; జి. పద్మజ, విశాఖపట్నం; జి. భారతి, విశాఖపట్నం.

ప్రఃనా వయస్సు 18, పొడవు 5 అడుగులు. పొడుగు అగుటకు చికిత్స తెల్పగలరు.

జః బైద్యనాథ్ చ్యవన్‌ప్రాష్ (స్పెషల్) రెండు స్పూనులు ప్రొద్దున, రెండు స్పూనులు సాయంత్రం పాలతో టి. రోజు 15 నిమిషాలు దేనినైనా పట్టుకొని ఊగుట మంచిది.

పి. కిషన్, దాదర్, బొంబాయి; జి. పద్మజ, విశాఖపట్నం.

పః వెంట్రుకలు పల్చబడి ఊడిపోతున్నాయి వెంట్రుకలు తెల్లబడుతున్నాయి.

జః మీరు బైద్యనాథ్ మహా భ్రంగరాజ్ నూనె వెంట్రుకలకు వాడాలి. భోజనము తరువాత బైద్యనాథ్ అశ్వగంధారిష్ నాలుగు స్పూనులు నీళ్ళతో తీసుకోవాలి. తలకి సబ్బులు వాడకూడదు.

డి. తులసి, సాయినగర్, అనంతపురం

ప్రః నాకు బహిస్టు సమయాల్లో కడుపునొప్పి ఉంటుంది. కడుపునొప్పివుంటే సంతానం కలుగదంటున్నారు.

జఃమీరు ప్రొద్దున, సాయంత్రము బైద్యనాథ్ సుందరి కల్పఫోర్ట్ మూడు స్పూనులు నీళ్ళతో. మరియు బైద్యనాథ్ అశోక్‌గ్రథ్ 1 స్పూన్ రాత్రికి పడుకున్నే సమయంలో పాలతో తీసుకోవాలి ☐

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

బైద్యనాథ్ ఆరోగ్య దీపిక

ప్రశ్న : ....

....

....

పంపినవారి పేరు :

పూర్తి చిరునామా :

మనము భారతదేశ ప్రజలము

ప్రజా ప్రభుత్వము

సమాజవాదము

ధర్మ నిరపేక్షత

న్యాయము

స్వేచ్ఛ

సమత్వము

సహోదర భావము

సామరస్యము

ఏకత్వము

సమగ్రత

శాంతి

ఉన్నతికి

సమర్పిత మైనాము

మన ఈ గణతంత్ర దేశ
మహా ఆదర్శములకు

మనము ఎల్లప్పుడు
వచనబద్ధులమై ఉన్నాము

సీరియల్

ఆశయం



యం. యస్. ఆర్. చౌదరి

(గత సంచిక తరువాయి)

"డాడీ' పిలిచింది నర్మద

'ఏమ్మా" అగాడు ఎస్ పి నందనరావు

'ఏం లేదులే అంటూ నసిగింది నర్మద

భయమెందుకమ్మా చెప్పు అన్నాడు నందనరావు

"చెప్పమ్మా చెప్పు నాకైతే భయంకాని నీ కెందుకు భయం ఆయన దగ్గర అంది నర్మద తల్లి సుమిత్రమ్మ

"అబ్బా చాలా భయపడుతున్నావు నువ్వు నేనంటే అందుకే ఇలా తయారయ్యావు అన్నాడు హాస్యంగా నందనరావు

అదికాదు డాడీ

"నేను ఆఫీసులో ఎస్ పి నే కాని నీకు మాత్రం కన్న తండ్రిని చెప్పు ఏం కావాలో నా దగ్గర భయం దేనికి అడిగాడు నందనరావు

"విజయ్‌కి ఉద్యోగం

'ఆ విషయం చెప్పటానికి ఇంత భయం దేనికమ్మా సాయంత్రం రమ్మను ఎక్కడైనా చూద్దాం '

అలా కాదు డాడీ రెకమెండేషన్‌తో, లంచంతో ఉద్యోగంలో చేరటం విజయ్‌కి ఇష్టం లేదు ఏధైనా స్వశక్తితో సాధించాలంటాడు '

"అలాగా అయితే పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్ ఐ పోస్టుకై ఇంటర్వ్యూలు త్వరలో జరుగుతాయి వాటికి ఎలాగైనా విజయ్ చేత అప్లైచేయించు తర్వాతి! విషయం నేను చూసుకొంటాను ఆఁ! నాకు టైమయింది నేను వెళుతున్నాను అంటూ వెళ్ళిపోయాడు నందనరావు

ఇప్పటికైనా నీ మనసు శాంతించిందా అడిగింది సుమిత్రమ్మ

ఫోమ్మా' అంటూ సిగ్గుతో తన గదిలోకి వెళ్ళింది నర్మద

కూతురి సిగ్గుకు తనలో తనే నవ్వుకొంది సుమిత్రమ్మ

★ ★ ★ ★

లారీ రివ్వున దూసుకు పోతోంది

మలుపుల్లో సైతం స్లో చెయ్యకుండా నడుపుతున్నాడు లారీని డ్రైవర్ నాగులు

నాగులు కళ్ళు ఎర్రగా చింత నిప్పుల్లా వున్నాయ్ మాటలు ముద్ద ముద్దగా వస్తున్నాయ్ బాగా తాగి ఉన్నాడు అప్పుడప్పుడు ప్రక్కన పెట్టిఉన్న సారాసీసాలోని సారా త్రాగుతూ డ్రైవ్ చేస్తున్నాడు నాగులు.

కాబిన్‌లో నాగులు కాక క్లీనర్ సాంబుగాడు, మరియు నాగులు అనుచరుడు రత్తిగాడు ఉన్నారు.

నాగులు డ్రైవ్ చేస్తున్న లారీ అడవిలోంచి గంజాయి, నల్లమందు దొంగ రవాణా చేస్తున్న లారీ

ప్రభుత్వానికి తెలియకుండా అడవిలో ఉన్న ఫారెస్ట్ ఆఫీసరుకు లంచం ముట్టజెప్పి, అడవిలో గంజాయి మొక్కలు పెంచుతున్నది ఒక ముఠా. దానిని ఇతర రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు

నాగులు, రత్తిగాడు ఆ ముఠాలోని డ్రైవర్స్. లారీని అతి స్పీడుగా, నేర్పుగా నడపటంలో నాగులు పేరు పొందాడు అందుకే ఇలాంటి పనులకు నాగులును పంపుతుంది ఆ ముఠా

నాగులు డ్రైవ్ చేస్తుంటే ప్రక్కనే కూర్చొన్న సాంబు గాడి గుండెల్లో రైళ్ళు పరుగెడుతుంటయ్ బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరచేతుల్లో పట్టుకొని కూర్చుంటాడు

'గురూ నువ్విలా త్రాగుతూ డ్రైవ్ చేస్తుంటావు కదా! ఇంత స్పీడులో, తాగిన మైకంలో స్టీరింగ్ కంట్రోలు తప్పితే" అనడిగాడు సాంబు నాగులును ఒకసారి.

"ఒరే కుర్ర సన్నాసి నా డ్రైవింగ్ సర్వీస్ ప్రారంభమయ్యేసరికి నువ్వసలు పుట్టే ఉండవు. అలాంటిది నీచేత నీతులు చెప్పించుకుంటా నంటరా నేను ఇటువంటి భయాలు ఏం పెట్టుకోక నోర్మూసుకొని కూర్చో' అంటూ కసిరాడు నాగులు

అప్పటి నుంచి నాగులు డ్రైవ్ చేస్తున్నప్పుడు ఏం మాట్లాడడు సాంబు

ఒరేయ్ నాగులు ఈ విషయం విన్నావా?' అన్నాడు ఉన్నట్టుండి ప్రక్కనే కూర్చొని ఆ రోజు దినపత్రిక చూస్తున్న రత్తిగాడు పెద్దగా.

ఉలిక్కిపడి షడన్ బ్రేకేశాడు నాగులు.

దాంతో అందరూ కాబిన్ ముందుకు తూలిపడ్డారు.

"ఏంట్రా? అంత పెద్దగా అరచావు" అడిగాడు నాగులు రత్తిగాడ్ని.

ఏం లేదురా నిన్న రాత్రి మన సిటీలో ఎవరినో దారుణంగా హత్య చేశారంట ఆ విష యం పేపర్లో వేశారు "

ఓస్! అంతేనా అయితే చదువు" అన్నాడు నాగులు గేర్ మారుస్తూ.

నిన్న రాత్రి 10 గంటల ప్రాంతంలో ఎవరో గుర్తు తెలియని హంతకులు నగరంలో ప్రముఖ పారిశ్రామికవేత్త సంతోష్ ఎంటర్ ప్రైజస్ ప్రొప్రయిటర్ అయిన సంతోష్‌కుమార్‌ను ఎవరో దారుణంగా హత్యచేశారు హతుడు మరణిస్తూ ప్రక్కనే తన రక్తంతో 'ముసుగు మనిషి" అని వ్రాసి చనిపోయాడు ఆ ఆధారంతో పేరు తెలియని ఆ ముసుగు మనిషి కోసం పోలీసులు గాలిస్తున్నారు ఎస్ పి నందనరావుగారు స్వయంగా రంగంలోకి దిగారు" ఇదీ ఆ వార్త, అంటూ చదివాడు రత్తిగాడు.

ఒరే రత్తిగా"

"ఆఁ

"ఈ ముసుగు మనిషి ఎవఁ్రా?"

'ఏమోరా? నాకూ అర్థంగావటం లేదు'.

ఇంతకీ దెయ్యమేమో " అన్నాడు అప్పటిదాకా మవునంగా వున్న సాంబుగాడు

"దెయ్యంలేదు గియ్యములేదు. నువ్వు నోర్మూసుకోనుండెహె" అంటు కసురుకున్నాడు సాంబుగాడ్ని నాగులు.

'వాడెవడో పెద్ద దోపిడి దొంగ అయుంటాడు సంతోష్‌కుమారంటే పెద్ద డబ్బున్నోడు. డబ్బుకోసమైనా, లేకుంటే ఏదన్నా పగుండి చంపాడేమో? అయ్యన్నీ మనకెందుకులేరా" అన్నాడు రత్తిగాడు.

ఇంతలో "పోలీసులు" అరిచాడు సాంబుగాడు

ఎదురుగా చెక్‌పోస్టు దగ్గర పోలీసులు నిలబడి ఉన్నారు లారీని ఆపమని చేయిెత్తి నిలబడి

"ఒరేయ్ నాగులూ ఇప్పుడెలారా" అన్నాడు భయపడుతూ రత్తిగాడు.

'నా సర్వీసులో ఇలాంటివార్ని ఎంతమందినో చూశాను చూస్తుందరా

జరిగిన కథ–1 : సలీం జావేద్ అనే అగంతకులు గణేశ్ ఇంట్లోకి జొరబడి గణేశ్‌ను చంపేస్తారు 'సంతోష్ ఎంటర్ ప్రైజెస్'లో విజయ్‌కుమార్‌కు జరిగిన ఇంటర్వ్యూ విఫలమవుతుంది విచారంలో ఉన్న విజయ్‌ను తల్లి సుందరమ్మ, ప్రేయసి నర్మద ఓదారుస్తారు

చూపిస్తా నా తడాఖా పిరికి నాయాలా" అంటూ సారా సీసాలోని సారా గుటకేశాడు నాగులు.

అంతలో పోలీసులు దగ్గరైనారు.

లారీని స్లో చేసినట్లు చేసి ఒక్కసారిగా రైజ్ చేసి ముందుకు దూకించాడు నాగులు.

ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కి దూకాడు లారీని ఆపుతున్న సబిన్స్పెక్టర్.

కన్ను మూసి తెరిచేంతలో లారీ ముందుకు దూసుకుపోయింది.

లారీ గంజాయిని తీసుకుని ఆ రూట్న పోతుందని ఇన్ఫర్మేషన్ అంది అక్కడ కాపు వేశాడు ఆ ఇన్స్పెక్టర్.

కాని ఆపినట్టే ఆపి లారీని రైజ్ చేయటంతో చేతికి చిక్కినట్టే చిక్కి తప్పిపోయినట్లయింది ఆ ఇన్స్పెక్టర్కి.

"కమాన్ హరియప్" అంటూ తొందరచేసి జీపులో ఎక్కి లారీని వెంటాడాడు ఇన్స్పెక్టర్.

కాని బాడ్ లక్ ఆ లారీని అందుకోలేకపోయాడు.

* * * * * *

"అమ్మా ... అమ్మా ..." అంటూ ఇంట్లోకి ప్రవేశించాడు విజయ్, ఆనందంగా.

"ఏమిరా ఇంత సంతోషంగా ఉన్నావు ఈ రోజు" అడిగింది సుందరమ్మ ఆనందంగా ప్రవేశించిన కొడుకుని.

"నాకు ఉద్యోగం వచ్చిందమ్మా"

"ఆఁ నిజమా. ఎంతటి శుభవార్త చెప్పావు బాబూ '

"అన్నయ్యా నువ్వు నోరు తెరు." అంది అక్కడినుండి పరుగెత్తుకెళ్ళి లోపలకెళ్ళి వచ్చిన సుమతి

"ఏమిటమ్మా"

"నువ్వు ముందు నోరు తెరువు తరువాత చెబుతాను."

"ఆఁ" అంటూ నోరు తెరిచాడు విజయ్.

నోటి నిండా పంచదార పోసింది సుమతి.

ఉక్కిరిబిక్కిరయిపోయాడు విజయ్.

"ఇంతకీ ఏం ఉద్యోగంరా" అడిగింది సుందరమ్మ.

"సబిన్స్పెక్టర్ ఉద్యోగమమ్మా! ఇక నుంచి నీ కొడుకు మామూలు విజయ్కాదు. సబ్ ఇన్స్పెక్టర్ విజయ్కుమార్" అన్నాడు సెల్యూట్ కొడుతూ విజయ్.

"చూడండి ఇన్స్పెక్టర్గారూ, ముందు మాకు పార్టీ ఏదైనా ఇవ్వండి ఆ తర్వాతే మీరు ఉద్యోగంలో జాయిన్ అయ్యేది" అంది సుమతి.





ఆశయం

"అలాగే చెల్లెలుగారూ! మీ మాటను ఏనాడైనా మీరాడా ఈ అన్నయ్య. ఈనాడు అంత సాహసం చేస్తాడా. అలాగే తీరుస్తాం మీ కోరికని అయినా ముందు ట్రైనింగ్ చేసి రావాలి. తర్వాతే ఉద్యోగంలో జాయిన్ కావటం" అన్నాడు విజయ్.

"ఎలా అయితేనేం ఉద్యోగమొచ్చిందిగా ఈ సాయంత్రం అందరం సినిమాకు వెళ్లాల్సిందే" అంది సుమతి.

"ఒప్పుకున్నాం నీ మాట ఒప్పుకోకుంటే నువ్వు బ్రతకనిస్తావా" అన్నాడు విజయ్ నవ్వుతూ.

"అమ్మా స్నానానికి నీళ్లు తోడు స్నానం చేయాలి" అంటూ లోపలికి వెళ్లాడు విజయ్.

ఏ సినిమాకు వెళ్లాలా అని పేపర్ తిరగెయ్యసాగింది సుమతి.

"హాయ్ సుమతి" అంటూ వచ్చింది నర్మద.

"హల్లో వదినమ్మగారు కులాసాయేనా"

"చూడు నీకెన్నిసార్లు చెప్పాను. నన్ను అలా పిలవవద్దని నర్మదా అని పిలువు చాలు" అంది లోపలికి తొంగి చూస్తూ.

"పెద్దవారిని గౌరవించాలంటారు. ఈ రోజు కాకపోయినా రేపైనా వదినా అని పిలవాలిగా. ఏదో ఇప్పటినుంచే అలవాటు చేసుకోవాలని. ఆ ఏమిటి అలా తొంగి తొంగి చూస్తున్నావు" అడిగింది సుమతి.

"ఏంలేదు ... ఏం లేదు"

"ఏం లేదా!! మా అన్నయ్య కోసమా ఆ దొంగ చూపులు చూడటం"

"ఆఁ మీ అన్నయ్య కోసం ఇక్కడ ఎవ్వరూ ఎదురు చూడటం లేదులే. అన్నట్లు మీ అన్నయ్యేడి?"

"నీకు చెప్పలా. మధ్యాహ్నమే ఏదో పనుందని ఢిల్లీ వెళ్లాడు ఇంకా వారం రోజులకిగాని రాడు." అందిసుమతి

"ఆఁ నిజంగానా నాకు చెప్పలేదే" అంది నర్మద. ఆ మాటలతో ఆమె ఉత్సాహమంతా అణిగిపోయింది.

ఆమె ముఖం చూసేసరికి సుమతి నవ్వాపుకోలేక గలగలా నవ్వింది

"ఏయ్ నీకు నవ్వులాటగా ఉందా?" అంది కోపంగా నర్మద.

"అవునుమరి అన్నయ్య కోసం ఎదురుచూడటం లేదని చెప్పి అన్నయ్య లేడని చెప్పగానే వదినగారి మొఖం ఎలా వాడిపోయిందో చూసేసరికి నవ్వు వచ్చింది. అన్నయ్య ఎక్కడికి పోలేదు. బాత్‌రూమ్‌లో ఉన్నాడు" అంది నవ్వుతూ సుమతి.

"ఏయ్ అయితే అబద్ధాలు ఎందుకు చెప్పావు?"

"వాడిపోయిన వదినగారి మొఖం చూడాలనీ ...నీ ..."

"ఏయ్ ఫోవే కొంటి కోణంగి" అంటూ చెయ్యెత్తి సుమతిని కొట్టబోయింది నర్మద.

సుమతి తప్పించుకుని నవ్వుకుంటూ అదుగో "అన్నయ్యొస్తున్నాడు" అంటూ లోపలికి పారిపోయింది.

"హాయ్ నర్మదా నీకో శుభవార్త" అన్నాడు విజయ్ వస్తూనే నర్మదని చూసి.

"ఏమిటో అది"

నాకు ఉద్యోగం వచ్చింది"

"నిజంగానా" అడిగింది నర్మద ఏమీ తెలియనట్లుగా.

"యస్. సబ్ ఇన్స్పెక్టర్‌గా" అన్నాడు విజయ్.

"పోనీలేబ్బా ఉద్యోగం వచ్చింది అంతే చాలు" అంది నర్మద ఆనందంగా.

"ఊఁ అంటే ఉద్యోగం కూడా సంపాదించుకోలేని వాడిని అనుకున్నావా? చూడు ఏ రెకమెండేషన్, లంచం లేకుండా నా స్వశక్తితో ఉద్యోగం సంపాదించుకొంటానని చెప్పాను అలాగే తెచ్చుకొన్నాను." అన్నాడు విజయ్ సగర్వంగా

"కంగ్రాచ్యులేషన్స్ మరి మాకు పార్టీ ఎప్పుడిస్తావు" అడిగింది నర్మద అసలు విషయం తెలిస్తే ఏమనుకొంటాడో అనుకొంటూ నర్మద.

"ఇప్పుడు అందరం సినిమా ప్రోగ్రాం వేశాం. నువ్వుకూడా రా అందరం కలిసే వెళదాం" అన్నాడు విజయ్.

"ఓ. కె. ష్యూర్"

"ఏమ్మా నర్మదా ఒక్కదానివే వచ్చావు. అమ్మను కూడా తీసుకు రాలేకపోయావా?" అంది సుందరమ్మ నర్మదతో.

"అమ్మ ఎక్కడో మీటింగ్ ఉందని వెళ్ళింది అత్తయ్యా. నాకు బోర్ కొడుతూ ఉంటే నేనిటు వచ్చాను" అంది నర్మద.

"హలో వదినగారు ఏమిటిలా వచ్చారు" అడిగాడు రాజేష్. అతను అప్పుడే కాలేజి నుంచి వస్తున్నాడు.

"మీ అన్నగారికి ఉద్యోగం వచ్చిన శుభ సందర్భంలో అందరికీ సినిమా చూపిస్తున్నాడు. అందుకని వచ్చాను. పద నువ్వు కూడా రడీకా అందరం వెళదాం సినిమాకు" అంది నర్మద.

రెండు నిముషాల్లో వస్తాను అంటూ టాయిలెట్ రూమ్‌లో కెళ్ళాడు రాజేష్.

"ఎలా అయితేనేం విజయ్‌కు ఉద్యోగం దొరికింది. థాంక్స్ డాడీ" అనుకొంది నర్మద.

ఆ నిముషంలో విజయ్‌ను ఆ ఉద్యోగానికి అప్లై చేయించటానికి ఎంత కష్టపడింది గుర్తొచ్చింది నర్మదకు.

పేపర్లో ప్రకటన పడింది పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీలున్నాయి. ఉత్సాహవంతులైన యువకులు అప్లై చేసుకొమ్మని ప్రకటించారు.

ఆ పేపర్ తీసుకొని విజయ దగ్గరకొచ్చింది నర్మద.

"విజయ్ ఈ ప్రకటన చూడు" అంటూ పేపరందిచ్చింది నర్మద

చూసి పేపర్ అవతల పడేశాడు విజయ్.

"ఏమిటి పక్కన పెడుతున్నావ్".

"చూడమన్నావు చూశాను అంతే".

"చూడమంటే, చూసి ప్రక్కన పెట్టమనికాదు. అప్లై చేయమని".

"ఎందుకులే అప్లై చేయటం రిప్లై రావటం. నాకిష్టంలేదు" అన్నాడు విజయ్.

"ఎందుకో ఈ ఉద్యోగం నీకు వస్తుందనిపిస్తుంది. అప్లై చేయి విజయ్."

"నర్మదా పోలీస్ డిపార్ట్‌మెంటంటే ఈ రోజుల్లో ప్రజల్లో మంచి పేరు లేదు. అలాంటిది ఆ ఉద్యోగానికి అప్లై చేయటం నాకిష్టంలేదు".

"డిపార్ట్‌మెంటంటే మంచి పేరు లేకుంటే నువ్వు ఆ డిపార్ట్‌మెంట్‌లో చేరి మంచి పేరు తీసుకురారాదూ" అంటూ నచ్చజెప్పి విజయ్‌ను ఒప్పించేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది నర్మదకు.

"నర్మదా పోదాం పద పిక్చర్ టైమయింది" అన్నాడు విజయ్.

అప్పటికే అందరూ రడీ అయి ఉన్నారు.

"పదండి" అంటూ నర్మద కూడా బయలుదేరింది. "మీరు కూడా రండత్తయ్యా". సుందరమ్మను పిలిచింది నర్మద.

"నేనెందుకమ్మా మీరు వెళ్ళిరండి" అన్నది సుందరమ్మ.

నర్మదకు విజయ్‌కు గల సంబంధం అటు నర్మద వాళ్ళింట్లో, ఇటు విజయ్ వాళ్ళింట్లో అందరకూ తెలిసి ఆమోదించిందే. అందుకని వాళ్ళు స్వేచ్ఛగా సినిమాకు వెళ్ళినా, షికార్లకు వెళ్ళినా ఎవ్వరూ అభ్యంతరం తెలపరు.

"విజయ్ నువ్వు ట్రైనింగ్‌కు వెళ్ళేది ఎప్పుడు" అడిగింది నర్మద.

"బహుశా ఎల్లుండి పోవచ్చు" అన్నాడు విజయ్.

* * * * * *

కాలేజిలో ఎలక్షన్స్ ప్రకటించారు.

ఎలక్షన్ల హడావిడితో కాలేజి అంతా గందరగోళంగా ఉంది.

ఛైర్మెన్ పదవికి రంగా పోటీ చేస్తున్నాడు.

రంగా ఆ నగరంలో పారిశ్రామికవేత్తలలో ప్రముఖుడుగా పేరుపొందిన చిదానందం కుమారుడు. ఇష్టం వచ్చినట్టు డబ్బు వెదజల్లి అయినాసరే ఛైర్మెన్‌గా గెలవాలని నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తున్నాడు రంగా.

రంగాకు ప్రత్యర్థిగా ఎవ్వరూ నిలబడటానికి సాహసం చేయటంలేదు. ఎందుకంటే రంగాకు ఊర్లో పేరున్న గూండాలతోటి సంబంధాలే కాక, అనేక నేరాలలో రంగాకు ప్రమేయం ఉన్నదని, ఏ సాక్ష్యాధారాలు లేక రంగాను పోలీసులు ఏమీ చేయలేకపోతున్నారని విద్యార్థులందరికీ తెలుసు. అందువలన రంగాకి పోటీ ఎవరూ నిలబడటంలేదు.

ఆ రోజే నామినేషన్లు వేయటానికి ఆఖరి రోజు. సాయంత్రం 4 గంటల దాకా టైముంది.

అప్పటికి సమయం 3 గంటలు కావటంతో ఎవరూ పోటీగా నామినేషన్ వేయకపోవటంతో రంగా ఏకగ్రీవంగా ఛైర్మెన్‌గా నెగ్గటం ఖాయం అనుకొన్నారు అందరూ.

ఎలక్షన్ల తేదీని ప్రకటించిన దగ్గర్నుంచి ఎలక్షన్‌లలో పోటీ చేయమని 'రాజేష్'ను బలవంతం చేస్తున్నారు అతని మిత్రులు.

కాని రాజేష్ ఒప్పుకోలేదు.

"ఫ్రెండ్స్ నన్నీ రాజకీయపు రొచ్చులోనికి దించకండిరా. మా అన్నయ్యకు తెలిసిందంటే కోప్పడుతాడు అనవసరంగా చదువు పాడవుతుంది" అన్నాడు రాజేష్ తప్పించుకోవాలని.

"రాజేష్ మీ అన్నయ్య ప్రస్తుతం ఇంటిదగ్గర లేడుగా. ట్రైనింగ్‌కని ఎక్కడికో వెళ్ళిన మీ అన్నయ్యకు ఈ విషయం తెలియాల్సిన అవసరం లేదు. ఒప్పుకోరా బాబు" నచ్చచెప్పబోయాడు ఒకడు

"ప్లీజ్ నన్నొదిలిపెట్టండిరా అవతలివాడు సామాన్యుడుకాదు. కోటికి పడగలెత్తినవాడు. నేనా మధ్యతరగతి పూట గడవటంకూడా కష్టంగావున్నవాడ్ని. ఎలక్షన్స్ పేరుతో ఖర్చుపెట్టే శక్తి లేదు నాకు"అన్నాడు రాజేష్.

"రాజేష్ టైం 3-45 అవుతుంది. నువ్వు ఊ అను చాలు. మిగతాపనంతా, అవసరమైతే ఎంత డబ్బు ఖర్చయినాసరే అదంతా మేము చూసుకుంటాం"



అన్నాడు ఒక మిత్రుడు.

రాజేష్ ఒప్పుకొని తీరాలి అంటూ అందరూ చుట్టూచేరి బలవంతపెట్టారు ఒప్పుకోక తప్పలేదు చివరికి రాజేష్‌కి.

వెంటనే రాజేష్‌చేత ఆఖరి నిమిషంలో నామినేషన్ వేయించారు

* * * * * *

ఆఖరి క్షణంలో రాజేష్ తనకు పోటీగానామినేషన్ వేశాడన్న వార్త రంగాకు అందింది.

అప్పుడు రంగా తన అనుచర మిత్రబృంద సపరివార సమేతంగా సురాపాన కార్యక్రమంలో మునిగి ఉన్నాడు.

"రేయ్ రాజేష్ గాడంట.ఎవడురా వాడు? నాకు పోటీగా నిలబడగల దమ్మున్న వాడేనా" అడిగాడు రంగాప్రక్కనే ఉన్న మిత్రుణ్ణి.

అప్పటికే రంగాకు మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి. చాలా ఎక్కువగా తాగిఉన్నాడు అప్పటికి.

"వాడెవడోలే గురూ కోన్‌కిస్కాగొట్టంగాడు. వేస్తే, వేసుకోని పోటీకి. మనముందు వాడెంత?" అన్నాడు ప్రక్కనే వున్న ఒక మందుబాబు.

"అలా అని తీసిపారేయకండి. రాజేష్ అంటే కాలేజిలో మంచిపేరే ఉంది. వాడు పోటీగా నిలబడ్డాడంటే ఇది వాడికి పట్టిన బుద్ధి అయుండదు. ఎవరో వాణ్ణి నిలబెట్టి ఉంటారు" అన్నాడు నాగరాజు.

ఆశయం

నాగరాజు రంగామిత్రులలో ప్రముఖుడు. రంగాకు కుడిభుజం లాంటివాడు.

"అవును గురూ మన కాలేజి విద్యార్థులు చాలామంది బలవంతం చేసి మరీ నిలబెట్టారు రాజేష్‌ను. అమ్మాయిలు కూడా అందరూ వాడ్నే సపోర్ట్ చేస్తున్నారంట" అన్నాడు ఆ వార్త అందుకొని వచ్చినతను.

"అలాగా! అయితే వాడి గురించి ఆలోచించాల్సిందే. రేయ్ సాగర్ నువ్వు పోయి వాడి ఆస్తి పాస్తులు, మిగతావివరాలు అన్నీ కనుక్కురా" అంటూ ఆజ్ఞాపించాడు ఒకడికి.

"ఏముంది గురూ వాడికి కనుక్కురావటానికి. వాడిది కూడామా షేటే. ఏదో మధ్యతరగతి కుటుంబీకుడు. వాళ్ళన్నకు ఈ మధ్యనే ఎస్. ఐ. ఉద్యోగం వచ్చిందని ట్రైనింగ్‌కు వెళ్ళాడు." బదులిచ్చాడు సాగర్ అనే మిత్రుడు

"అయితే భయపడాల్సిన పని లేదన్నమాట" అన్నాడు రంగా.

"గురూ చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టమన్నారు. వాడ్ని అలా విడిచిపెడితే లాభం లేదు. కాస్త ఆలోచించండి" అన్నాడు నాగరాజు.

"అయితే ఏం చేద్దామంటావు."

"వాడ్ని పిలచి కొంచెం డబ్బాశ చూపితే మనకు లొంగి వస్తాడనే నమ్మకం నాకు ఉంది. మధ్య తరగతి వాడు కదా ఎప్పుడూ డబ్బు మొఖం చూసి ఉండడు" అన్నాడు నాగరాజు.

"అయితే ఇంకా ఆలశ్యం దేనికి. రేయ్ సాగర్ నువ్వు పోయి వాడ్ని పిలుచుకురా" అన్నాడు రంగా.

"అలాగే" అంటూ సాగర్ వెళ్ళిపోయాడు.

"గురూ వాడు వస్తాడంటావా?" అడిగాడు నాగరాజు.

"వస్తే వాడి అదృష్టం కాష్ ముట్ట జెబుదాము. రాకుంటే వాడి దురదృష్టం. ఎలాగూ వాడు మన ముందర ఆగలేడు. వాడి గురించి మనకు భయం దేనికి" అన్నాడు రంగా.

కొద్ది సేపటికి సాగర్ రాజేష్‌తో కలసి వచ్చాడు.

"హల్లో రాజేష్ రా ఇలా వచ్చి కూర్చో" ఆహ్వానించాడు రంగా.

"ఏమిటి పిలిచారట?"

"రా కూర్చో ముందు తీరిగ్గా విందువు గాని."

"అవతల నాకు పనుంది. తొందరగా వెళ్ళాలి. విషయం చెప్పండి."

"ఏం లేదు. ఎలక్షన్‌లలో పోటీ చేస్తున్నావని విన్నాను."

"ఏం చేయకూడదా?"

"మనది ప్రజాస్వామ్యం కదా! ఎందుకూ పనికిరాని వెధవైనా, కాణీకి టికావీ లేని అనామకుడైనా ఎలక్షన్స్‌లలో పోటీ చేయొచ్చు. నువ్వు కూడా పోటీ చేస్తున్నావని విన్నాను నిజమేనా?"

"అవును చేస్తున్నాను."

"ముసుగులో గుద్దులాట నా కిష్టం లేదు. నేను సూటిగా చెప్తున్నాను. విను. నువ్వు ఎలక్షన్స్ లో పోటీ చేయటం మానుకోవాలి." అన్నాడు రంగా.

"అది జరుగని పని."

"జరిపిస్తాను కాబట్టే నిన్ను పిలిపించాను. నేననుకొన్నది జరిగేదాకా వదలను."

"మీరు పిలిచింది ఇందుకే అయితే ఐ యామ్ సారీ నేను వెళ్తున్నాను" అంటూ వెనక్కి తిరిగి రెండడుగులు వేశాడు రాజేష్.

"మిస్టర్ రాజేష్."

"వాట్?"

"నువ్వు కోరినంత డబ్బు ఇస్తాను. నువ్వు రంగంలోంచి తప్పుకోవాలి. చెప్పు ఎంత కావాలో?"

"మిస్టర్ రంగా! డబ్బుకు గడ్డితినే మనిషిని కాదు నేను. నన్ను అభిమానించే వ్యక్తులు నా మీది ప్రేమతో నన్ను ఛైర్మన్ పదవికి నిలబెట్టారు. నేను మాత్రం వారి అభిమానాన్ని కించపరచలేను. దమ్ముంటే ఎలక్షన్‌లలో గెలువు" అన్నాడు ఛాలెంజ్‌గా రాజేష్.

"రాజేష్ నాతో చెలగాటం నిప్పుతో చెలగాటమే. మర్యాదగా చెపుతున్నాను నా మాట విను. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ముందున్న వాడివి. అనవసరంగా నా చేతిలో పడి నీ జీవితాన్ని నాశనం చేసుకోకు."


"ఏం బెదిరిస్తున్నావా?"

"కాదు హెచ్చరిస్తున్నా... ఇప్పటికే నాలుగు హత్యలు చేసి పోలీసుల చేతికి చిక్కకుండా తప్పించుకొన్న వాణ్ని. నాకు అడ్డు వస్తున్న నిన్ను లేపెయ్యటం నాకు చిటికలో పని. కాని అంత దాకా ఎందుకని నీకు ముందే వార్నింగ్ ఇస్తున్నాను."

"మిస్టర్ రంగా! నీలాంటి తాటాకు చప్పుళ్ళకు బెదిరే పిరికి పందలు ఎవ్వరూ లేరిక్కడ. నీలాంటి హంతకులు విద్యార్థి నాయకుడుగా ఉండటానికి అనర్హులు. చాతనైంది చేసుకో" అంటూ వెళ్ళిపోయాడు రాజేష్.


"ఊఁ! చూస్తా వీడి సంగతి. వీడి కింత పొగరా" అన్నాడు రంగా కోపంగా పళ్ళు కొరుకుతూ.

(ఇంకాఉంది)



బంగారునంది

బొజ్జా సత్యనారాయణ



పొడవైన పెద్దబోర్డు చూసి లారీ ఆగింది. బాడీలో ఎద్దులను పట్టుకున్న కొండయ్య బోర్డువంక చూసేడు. "ఆంధ్రప్రదేశ్ ఎడ్ల పోటీలు" అని పెద్దక్షరాలు కొట్టొచ్చినట్టు కనిపించేయి. నందిబొమ్మ ఆకర్షణీయంగా కనిపిస్తూంది. 'కార్యదర్శి వెంకయ్య' అని వుంది. ఎద్దుల పందేలు ఆ పందిరిలోనే జరుగుతాయి కాబోలు అనుకొని కొండయ్య డ్రైవరుతో లారీని లోపలికి పోనీమని చెప్పాడు.

బోర్డు క్రిందనుంచి లారీ లోపలికి వెళ్ళింది. బేడ్జీలు తగిలించుకున్న వలంటీర్లు లారీ దగ్గర కొచ్చి, "ఎడ్లను దింపటానికి దిమ్మ అక్కడ ఉంది" అని చూపుడు వ్రేలుతో చూపించగానే, లారీని అక్కడకు పోనిచ్చి, వెనక్కి త్రిప్పి బాడీని దిమ్మకు ఆనించి ఆపాడు, డోరు తెరచి ఎద్దులను దింపారు కొండయ్య, అతని పాలేరు. వలంటీర్లు చూపించిన పందిట్లో ఎద్దులను కట్టివేసి, సామాను సర్దుతున్న కొండయ్య దగ్గరకు వచ్చిన వ్యక్తి ఎడ్లను పరిశీలనగా చూసి, "ఈ సంవత్సరం ఎడ్ల తయారీ బాగుందండి కొండయ్యగారూ!" అన్నాడు.

"ఏమిటి రెడ్డిగారూ! మీరెప్పుడొచ్చేరు" అడిగాడు కొండయ్య.

"ప్రొద్దుట వచ్చాం. మా ఎడ్లను అటువైపు కట్టివేశాం. భోజనానికి ఈ పూట మా దగ్గర భోంచేదురుగాని రండి" అని చెప్పి రెడ్డి వెళ్ళిపోయాడు.

* * *

కొండయ్య చూపులు చుట్టూ పరికిస్తున్నాయి. పది ఎకరాల ఖాళీ స్థలంలో చుట్టూ పందిరి. అందులో పోటీలకు వచ్చిన అరవై జతలవరకూ వున్న ఎద్దులను కట్టివేశారు.

ఆ పందిరి మధ్య నలుపలకలుగా చుట్టూ పందిరి. మధ్య ఖాళీస్థలం. పందిరిలో ఒకవైపు గేలరీ, రిజర్వుడూ, రెండవ వైపు స్త్రీలకు కుర్చీలు. మూడోవైపు నేల, నాల్గవవైపు వేదిక అమర్చివుంది. రెండు మోటబళ్ళకు పాలపిట్ట రంగువేసి, తడికలు, తొట్టి లేకుండా ఉన్నాయి. పగ్గం తాళ్ళు, ఇసుక బస్తాలు, మూడు సైజుల్లో మూడు పొడుగ్గా ఉన్న నల్లరాళ్ళు ఉన్నాయి.

రిజర్వుడు వైపు రెండడగులు లోతు, పదకొండడుగులు వెడల్పు, నూట డెబ్బై అడుగులు పొడవు గోతిలో ఇసుకవుంది. దాని పొడవునా పందిరి వుంది. రెండు పందిళ్లకు ఒక ప్రక్కన అయిదు అడుగులు పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పు నేలమీద గచ్చు, దాని చుట్టూ కర్రలుపాతి రింగులా వుంది. లైట్లు, నీటి పైపులు, రంగురంగుల శిల్కు జెండాలు, కాఫీ, భోజన హోటలు, కిళ్ళీ కొట్లు ఉన్నాయి.

నిగనిగలాడుతూ పల్చని శరీరాలతో నల్లని మూపురాలు, మెళ్లో తలవెంట్రుకల త్రాళ్ళు, గంటలున్న ఎలుగుబంటి వెంట్రుకలున్న పట్టెళ్ళు, చిక్కాలు తగిలించి ఆబోతులవలె కనిపిస్తున్న వృషభ రాజములు ఒక దాన్నొకటి చూసుకుంటూ పౌరుషాన్ని చూపిస్తున్నట్టు కాలు దువ్వుతూ రంకెలువేస్తూ, చూసేవారికి ఆనందాన్ని భయాన్ని కలగచేస్తున్నాయి బసవన్నలు.

* * *

కమిటీవారు వేదిక దగ్గర కుర్చీలలో కూర్చుని, కార్యక్రమం గురించి చర్చించుకుంటున్నారు. మోటారు సైకిలు చప్పుడు వినిపించి అటు చూసేరు. దానిమీద వెంకయ్యగారు కనిపించేరు. అది దూసుకుంటూ వచ్చి ఆగింది. టెరీకాటన్ తెల్ల చొక్కా, గ్లాస్కోపంచె ధరించిన వెంకయ్యగారి చామన ఛాయ శరీరాన్ని ఆ దుస్తులు తెల్లపరుస్తున్నాయి.

"వెంకయ్యగారూ! మీ హాఫ్ బట్టతలనుండి చెంపలవరకూ కారుతున్న చెమట పిల్లకాలవలా కనిపిస్తోందండీ!" జోక్ విసిరాడు కవి.

"కవిగారికి వర్ణించటానికి ఏమీలేక నా బట్టతలమీద దృష్టిపడింది" అని వెంకయ్యగారు నల్లద్దాల కళ్లజోడు తీసి, రుమాలుతో ముఖం తుడుచుకున్నారు.

"నేను కవిని కానండి. రచయితను"

"మేము అలాగే పిలుస్తామండి"

మైకులో, "రైతు సోదరులకు విజ్ఞప్తి. ఇప్పుడు కమిటీవారు ఎడ్ల కొలతలు కొలుస్తారు. నేను పిలిచినవారు తమ ఎడ్లను తీసుకు వచ్చి రింగులో నిలబెట్టవలెను" అని వినిపించింది.

మూపురం చుట్టూ తాడు చుట్టి, ముక్కుతాడుకి, చిరుముట్టికి కలిపి లాగి కట్టేరు ఎద్దు మొహం పైకి పెట్టటానికి. ముట్టికి రెండు ప్రక్కలా తలపగ్గాలు పెట్టి, చెరోవైపు ఇద్దరు తాళ్ళు పట్టుకుని తీసుకు వస్తున్న ఎద్దు హంస నడకలు నడుస్తూ వస్తూ వయ్యారంగా మూపురం ఊపుతూంది. దానిని రింగులో నిలబెట్టారు. జనాన్ని చూసి రంకె వేస్తూ పౌరుషాన్ని నిరూపించుకుంటున్న ఎద్దును సరిగ్గా నిలబడమని రైతు కసరగానే, నాలుగు కాళ్ళూ సమానంగా నిలబెట్టి ఠీవిగా నిలబడింది.

కమిటీవారు ఎద్దు వెనక మక్క (శీల) వరకూ కర్ర నిలబెట్టి కొలిచి, ఆ కర్రను టేపుతో కొలిచి, పుస్తకంలో నోట్ చేశారు. అలా రెండు రోజులు ఎడ్ల కొలతలు కొలిచారు. వాటిని ఆరు సైజులుగా విభజించారు. ప్రతీ సైజు ఒంటిద్దుకి, జతలకు లాగుడు పోటీలు జరుగుతాయి. మైసూరు ఎడ్లకు ప్రత్యేకించి పోటీ వుంటుంది.

ఎడ్ల కొలతల్లో రైతులకు, కమిటీవారికి మధ్య పేచీ జరిగింది. నలుగురు రైతులు తమ ఎద్దుల్ని గత పోటీలో నాల్గవ సైజులో వేశారు, ఇప్పుడు ఐదవ సైజులో వేశారని ఒకరు. ఒకటవ సైజు ఎద్దుల జతను రెండవ సైజులో వేశారని ఇంకొకరు. కమిటీవారు పక్షపాతంగా కొలిచేరని. నాలుగు జతల్ని తీసుకుపోయారు. కమిటీవారు వారికి ఎంత చెప్పినా వినిపించుకోలేదు.

* * *

ఉదయం గోపూజ జరిగింది. ఎం. ఎల్. ఏగారు పాల పళ్ళగిత్తల్ని ఇసుక బస్తా ఉన్న బండికట్టి, ఇసుకలో లాగించి పోటీ ప్రారంభోత్సవం చేశారు. అప్పుడు 'వీడియో కలర్ ఫొటో కెమెరా "క్లిక్... క్లిక్" మన్నాయి. మరో వైపు విలేకర్లు.

"మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఎలపటి ఒంటిద్దుల ఇసుక లాగుడు పోటీ జరుగుతుంది పోటీలో పాల్గొనే రైతులు ఇక్కడకు వచ్చి, పేర్లు నమోదు చేయించవలెనని కోరుతున్నాం" అని మైకులో వినిపించింది.

ఎడ్లపోటీ ప్రచారం పల్లెల్లో ముమ్మరంగా చిన్నకారుల్లో చేస్తున్నారు. మధ్యాహ్నం పన్నెండు దాటింది. స్త్రీ, పురుషులు టిక్కెట్టు తీసుకుని పోటీ చూడటానికి ఎవరి తరగతుల్లో వారు కూర్చుంటున్నారు. ఆరోజు జరగబోయే పోటీ ఎడ్ల రైతుల పేర్లు డ్రా తీసేరు. దాపటి ప్రక్కబండికాడి వెనక్కి పోకుండా కాడికి, బండి దొలుపుకి సర్వీబాదు కట్టేరు.

"పది నిముషాల్లో ఆరవసైజు ఎలపటి ఒంటిద్దు ఇసుక లాగుడు పోటీ జరుగుతుంది. ఎద్దును త్వరగా తోలుకురావాలి" మైకులో వినిపించింది.

ఎద్దును తీసుకు వచ్చి బండికి పూన్చి, రెండో వైపు కాడిని ఇద్దరు పట్టుకున్నారు. మరో ఇద్దరు బండిక్రింద వొంగుని పోలుకర్రకు చుట్టిన బిడితాడు పట్టుకుని ముందుకు చూస్తున్నారు. ఒకతను ఎద్దుతల తాడు పట్టుకున్నాడు. ఇంకొకతను కొరడా పట్టుకున్నాడు.

ఎద్దును కొరడా కర్రతో కొట్టకూడదు. కొసతోనే అదలించాలి" మైకు పలికింది."

రిఫరీగార్లు స్టాపు వాచీ బటను నొక్కుతూ విజిలు ఊదగానే బండి కదిలింది. ఇసుకలో ఎద్దుబండిని హుషారుగా లాగుతూంది. దానికి కాడి పట్టుకున్నవారు, బండిక్రింద వంగున్నవారు సాయంచేస్తూ ఉన్నారు. ఆ చివరకు వెళ్ళగానే ఆపి ఎద్దు నోట్లో నీళ్ళుపోసి, వెనక్కి త్రిప్పి మళ్ళీ లాగిస్తుంటే ప్రేక్షకులు ఉత్సాహంగా చూస్తున్నారు. రిఫరీగారు చెయ్యి పైకెత్తి చూపుడు వ్రేలు వేదిక వైపు చూపించగానే మైకులో, "బండి బయలుదేరి నిముషమయింది" అని వినిపించింది. కమిటీలో ఒకరు కర్రపట్టుకుని బండి వెనకాల నడుస్తున్నాడు. ఇంకొకతను టేపు పట్టుకున్నాడు. ఎద్దు ఇట్నుంచి ఆ చివరకు. అట్నుంచి ఈ చివరకు లాగుతూ మధ్య మధ్య ఆగుతుంటే కేకలుతో అదలిస్తున్నారు. ఆరు నిముషాలవగానే విజిలు వినిపించగా కర్ర పట్టుకున్న వ్యక్తి చక్రం వెనకాల కర్ర నిలబెట్టాడు–ఆనవాలుగా. కర్రగుచ్చిన దగ్గరనుంచి, హద్దువరకూ టేపుతో కొలిచి, పుస్తకంలో నోట్‌చేశారు ఎద్దు ఎన్ని అడుగుల దూరం లాగింది.

"ఏడువందల ఎనభైతొమ్మిది అడుగుల మూడు అంగుళాలు దూరం లాగింది" అని మైకులో చెప్పారు ఎద్దు వేసిన పేడ తీసివేసి, కూలీలు పారలతో ఇసుకలో వున్న చక్రాల బాటను ఇసుక దొలుస్తూ కప్పెడుతున్నారు అలాగే ఎలపటి ఒంటిద్దుల ఇసుకలాగుడు పోటీలు మూడు రోజులు జరిగాయి. ఒంటిగంటనుండి, సాయంత్రం ఆరు గంటలవరకూ జరుగుతాయి. సర్కస్ లా మధ్యలో పోటీలు జరుగుతూంటే జనం చుట్టూ కూర్చుని ఉత్సాహంగా చూస్తున్నారు

* * *

అరుణోదయానికి ముందే రైతులు లేచి, వారి వారి ఎడ్లను ఆవరణలో చుట్టూ త్రిప్పుతున్నారు. వాటికి నరాలు సాగటానికి. ఎవరి ఎడ్ల జతలను వారే పోటీకి బాగా కృషిచేసి తీసుకువచ్చేరు. ఇప్పుడు వాటిని బండికట్టనివ్వరు. పోటీలోనే కట్టాలి. అందుకు ఎడ్లకు కాళ్ళు సాగటానికి, ప్రొద్దుట, సాయంత్రం త్రిప్పుతుంటారు. వాటికి మాలీష్‌చేసి, ఉడుకు నీళ్ళగుడ్డ ముంచి కాపడంపెట్టి, కడుగుతున్నారు. పాలు, కోడిగ్రుడ్లు పట్టిన తరువాత, ఉడకబెట్టిన ఉలవలు దంచి, ఉండలు చుట్టి తినిపిస్తున్నారు. గ్లూకోజ్, కొబ్బరినీళ్ళు, చోడి అంబలి, జొన్నపిండి కలిపిన నీరు వగైరాలు సాయంత్రం వరకూ పడుతున్నారు. బడలిక తగ్గటానికి మందులు కూడా వాడుతున్నారు. జొన్న, పిల్లిపెసర, జనుము కలిపి ఉన్న ఎండు చొప్పతో ఎడ్లను మేపుతున్నారు. కమిటీవారు నియమించిన వెటర్నరీ డాక్టరు రెండుపూటలూ వచ్చి ఎడ్లను పరీక్షించి వెళుతున్నారు. ఆపట్నంలో నివశించే వారిలో కొందరు వచ్చి, ఉలవలు నీరు పట్టుకు వెళుతున్నారు 'చారు' కాచుకోవడానికి.

బసవన్నల రంకెలు, మువ్వల సవ్వడులు, రైతన్నలు వాటికి చేసే పరిచర్యల సందడితో పోటీ ప్రదర్శన గోకులాన్ని మరిపిస్తూంది.

* * *

రోజూ జరిగే పోటీల న్యూస్‌తోపాటు ఎద్దుల ఫొటోలు కూడా విలేకర్లు పేపర్లలో ప్రచురిస్తున్నారని, ప్రారంభోత్సవం చేయించిన తనగిత్తల ఫొటోను పేపర్లలో వేయించలేదని ఆ రైతు కమిటీవారిమీద అలిగి గిత్తల జతను తోలుకుపోయాడు.

"ఈరోజు జోడెడ్ల ఇసుక లాగుడు పోటీలు జరుగుతాయి. ఎడ్ల జతలను పోటీకి సిద్ధం చేయమని కోరుతున్నాం. మరో ముఖ్య గమనిక. ఈ ఎడ్ల పోటీలను వెంకయ్యగారు సావనీరు ప్రచురించటానికి సంకల్పించారు. సావనీరు రూపకల్పన చేయటానికి ఎడ్లపోటీ కవిగారు అంగీకరించారు. ఎడ్లపోటీ విజేతలు గతంలో పోటీల్లో గెల్చుకున్న వివరాలు కవిగారికి తెలియపర్చమని కోరుతున్నాను" అని మైకులో వినిపించి, వెంకయ్యగారి నిర్ణయానికి ఆనందించేరు.

"ఎడ్లపోటీ కవి ఎవరు"

"ఆకవి ఒకప్పుడు ఎడ్లపరుగు పోటీ విజేత. ఆయన ఆంధ్రప్రదేశ్ ఎడ్లపోటీ విజేతల చరిత్ర రాసి, సాహిత్యం ద్వారా పాఠకులకు అందిస్తున్నందుకు ఆయన పేరు అలా పెట్టారు." కొండయ్య ప్రక్క రైతుతో చెప్పాడు.

* * *

ఇసుక బస్తాలున్న బండికి జత ఎడ్లను కట్టి ఇసుకలో ఆరు నిముషాలు లాగించారు. జనం వేసే ఈలలు, అరుపులకు ఎద్దులు హుషారుగా పెద్ద పెద్ద అంగలువేస్తూ మెళ్ళోగంటల మోతల మధ్య లాగుతూ తమ జవసత్వాలను నిరూపిస్తూ చూసేవారికి ఉత్సాహాన్ని రేకెత్తించాయి. అలాగే సైజును బట్టి బరువువేసిన బండిని ఆరుసైజుల ఎడ్ల జతలతో మూడురోజులు పోటీలు జరిగేయి. కొండయ్య జతను జరిగిన పోటీల్లో ప్రవేశపెట్టలేదు. అన్ని సైజుల పోటీలలోనూ పాల్గొంటే ఎద్దులు నలిగిపోతాయని. బండి పూటీ లాగుడులో పాల్గొనపెట్టి, ఎక్కువ దూరం లాగించి, పోటల బహుమతి బంగారు నందిని గెలవాలని తలంపుతో ఉన్నాడు కొండయ్య.

వేదికమీద కూర్చుని కవిగారు ఒకవైపు పోటీలను తిలకిస్తూ, మరో వైపు సావనీరుకి వ్యాసాన్ని రాయడం మొదలు పెట్టాడు. "ద్వాపరయుగంలో కోసల దేశాన్ని పాలించిన నగ్నజితుడనే మహారాజు కుమార్తెకు వివాహం తలపెట్టి, తనదగ్గర ఉన్న

బలమయిన ఏడు అబోతులతో పోరాడి, వాటిని జయించిన రాకుమారునకు తన కుమార్తె నిచ్చి వివాహం జరిపిస్తానని స్వయంవరం ప్రకటించాడు." అని కవికలం సాగుతూంది.

కమిటీవారు పోటీలు జరిపిస్తూ, మరో వైపు విరాళాలు వసూలు చేస్తున్నారు. ఎక్కువ విరాళం యిచ్చిన వారి పేరున బహుమతులు చదివించాలని నిర్ణయించుకున్నారు. పోటీ ఖర్చులకు లక్షా ఏభైవేలు వరకూ అవుతాయని కలక్షను వసూలు అవుతుందా లేదా అని వెంకయ్యగారికి అనుమానం వుంది.

ఒంటిద్దు లాగుడు పోటీలో కాడిపట్టుకుని ఎద్దుతో లాగేవారు ప్రత్యేకంగా ఉంటారు. వారికి ఎద్దుతో లాగినందుకు రైతులు ప్రతిఫలం ఇస్తారు పోటీ నెగ్గితే ఎక్కువగా యిస్తారు. కొండయ్య ఒంటిద్దు పూటీలాగుడులో తన ఎద్దుతో కాడిలాగ టానికి మనుషులను నియమించాడు.

"ఈ రోజు ఒంటేద్దు బండి పూటీలాగుడు పోటీ జరుగుతుంది". మైకులో వినిపించింది.

ఈపోటీ కూడా అన్ని సైజుల ఎద్దు జతలకు వుంటుంది. సైజును బట్టి బండిలో బరువువేసి లాగిస్తారు గట్టి నేలమీద చక్రాలు దొర్లకుండా కట్టి. ఈ పోటీ కూడా ఆరు నిముషాలు వరకూ లాగిస్తారు. కొండయ్య ఎద్దును తీసుకు వచ్చి బండికి కట్టేరు. ఇద్దరు రెండవ వైపు కాడి పట్టుకున్నారు. ఇద్దరు బండికింద వంగుని బిడితాడు పట్టుకుని ముందుకు చూస్తున్నారు.

రిఫరీగారి ఆజ్ఞతో బండి కదిలింది. ఎద్దు హుషారుగా లాగుతూ రెండవ హద్దు సమీపిస్తూందనగా పడుకుంది. కొండయ్య ముఖం అవమానంతో మాడిపోయింది.

"తెల్లరెప్పల ఎద్దుకి కన్నుపిరికి ఉంటుంది" అన్నారు ఒకరు.

"ఎద్దును వారంరోజుల నుంచి సుఖపెట్టడంవల్ల దానికి ఒగుర్పొచ్చి పడుకొంది." అని మరొకరు తలావొక రకంగా ఎద్దు గురించి చెప్పుకున్నారు. ఎంత ప్రయత్నించినా ఎద్దు లేవలేదు. ప్రేక్షకులలో నుంచి ఎద్దు చెవిలో నీళ్ళు పొయ్యమని వినిపించగానే దాని చెవుల్లో నీరు పోసేరు. ఎద్దు లేచి నిలబడింది. పోటీ టైము అయిందని రిఫరీగారు విజిలు ఊదారు.


మళ్ళీ పోటీలో లాగించటానికి అనుమతివ్వమని, కొండయ్య అడిగాడు. పోటీలో వదిలిన తరువాత మళ్ళీ ఆ పోటీలో దానిని కట్టకూడదని రిఫరీగారన్నారు. ప్రేక్షకుల్లో కూడా కొందరు లాగించాలన్నారు. కొందరు మళ్ళీ కట్టించి పోటీ నిబంధనలను ఉల్లంఘించకూడదన్నారు. వారిలో వారికి ఘర్షణ పెరిగి కుర్చీలను పైకి లేపా రు. వారిని కమిటీవారు సముదాయించేరు. కొండయ్య ఎద్దును తీసుకుని బయటకు నడిచాడు.

ఇంకొక రైతు ఎద్దును తోలుకు వచ్చి బండికట్టి లాగిస్తున్నారు. బండి ఈ హద్దునుంచి, రెండో హద్దుకి వెళ్ళగానే బండి ఆపి పది సెకండ్లు నిలబెట్టి, మళ్ళీ లాగిస్తూ ఎద్దుకు అలసట లేకుండా నడిపిస్తున్నాడు రైతు. ఎద్దు ఆగకుండా ఉడాయింపుతో లాగుతూ జనాన్ని రంజింపచేస్తూ వుంటే, వారు అరుపులతో ఆ వృషభ రాజమునకు మరింత ఉత్సాహాన్ని ఉసి గొలుపుతున్నారు. అప్పటివరకూ, జరిగిన పోటీలో ఎద్దు లాగిన దూరంకంటే ఈ ఎద్దు అత్యధిక దూరం లాగించి కమిటీ వారి ప్రశంసలు పొందాడు రైతు.

ఒంటిద్దు ఎలపటి దాపటి పూటీ లాగుడు పోటీలు రెండు రోజులు జరిగాయి.

* * *

ప్రతీరోజూ జరిగే పోటీలు ఆఖరున అన్నదమ్ముల ఎద్దు జత, బండి బోల్తా వేయడం, మళ్ళీ



యధాలాపంగా తీయడం. పడుకోవడం; లేవడం; ఎదుటిమనిషిని పొడవమంటే పొడవటం మొదలగు విద్యలను ప్రదర్శిస్తూ, అనేక విన్యాసాలతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నాయి ఆ ఎద్దు జత.

"ఈ రోజు జోడెద్దు బండి పూటీ లాగుడు జరుగుతుంది, ఇప్పుడు పోటీలో లాగబోయే జత గతంలో చాలా పోటీలు గెల్చుకున్నాయి." అని మైకులో వినిపించింది.

ఎద్దును బాగా తోలి ఎక్కువ దూరం లాగించి, బంగారునందిని గెల్చుకోవాలని కూడ బలుక్కుని ఎద్దుజతను తీసుకువచ్చి బండి కట్టేరు. బండిని హద్దుల్లో ఆపకుండా పోనిస్తున్నారు. ఎద్దుగలవారు హడావిడి, ఆడంబరం చేస్తూ ఎద్దులను అదలిస్తున్నారు. వారి తీరు తెన్నులు చూసి కమిటీవారు ఎద్దుల మీద కొరడా కర్ర తగులు తుందేమోనని జాగ్రత్తగా చూస్తున్నారు. టైము నిముష ముందనగా ఆగిపోయాయి. ఎద్దుగలవారు ఎంత అదలించినా బండిని కదలించలేకపోయాయి. ఆదుర్దాగా ఎద్దును ఆపకుండా తోలినందువల్ల, అవి ఒగుర్పుకు తట్టుకోలేక పోయాయని బాధపడ్డారు. జోడెద్దు పూటీ లాగుడులు రెండు రోజులు జరిగాయి.

* * * * * * *

బండలాగుడు పోటీ జరిగేటప్పుడు ఎద్దుకు ఎండతగలకుండా షామియానాలు అమర్చారు. ఒకటవ సైజు బండ పదిహేడువందల ఇరవై కేజీల బరువువుంది. రెండుగజాలు పొడవు, అయిదు అడుగుల ఎత్తు నల్లరాయి. దానికి రెండు చివర్లా బెజ్జాలకు తీగె చుట్టి వుంది. ఆ తీగెకు కాడికి తాడుకట్టి లాగిస్తారు అరగంటసేపు.

ఎద్దు జతను తీసుకు వచ్చి బండకాడికి కట్టి రిఫరీగారి ఆజ్ఞతో లాగిస్తున్నారు. ఆబిరి హద్దు దగ్గరకు, ఈ బిరి హద్దు దగ్గరకు లాగుతున్నాయి. హద్దు బిరిజేరగానే ఎద్దును ఆపి వాటినోట్లో నీళ్ళు పోస్తున్నారు. ఎద్దుజత మెడకల్పి సమానంగా లాగితే బండను సునాసంగా హద్దుకి లాగు తున్నాయి. ఉమ్మడి పట్టుపట్టిలాగితే ఐదారు గజాలకంటే ఎక్కువ దూరం లాగలేకపోతున్నాయి. మళ్ళీ కొన్ని క్షణాలు ఆగిపోతున్నాయి. ఎద్దులువేసే అడుగులు, మూపురాల కదలికలు చూసేవారికి ఆసక్తిని కలిగిస్తున్నాయి.

పుచ్చకాయపేడు తిని పాప అవతలకు విసిరితే అది మరొకామె ఒడిలోపడి చీరను డాగు పరచింది. ఆపేడును తీసిబయటపడేస్తూ, "చీరపాడు చేశావు ?"ంగాయిదానా!" అని ఆమె పాపను కసిరింది. పాపతల్లి ఆమెవంక కొరకొరా చూస్తూ, "ఏవమ్మా! చిన్నపిల్ల తెలియక పడేసింది ఆ మాత్రం దానికి గొడ్రాలిలా విసుక్కుంటావేవిఁటి.'

"నేను గొడ్డురాలినని నీకు తెలుసా. నిపిల్ల నీకు ముద్దు" అని ఇద్దరూ జడలు పట్టుకునేవరకూ వచ్చేరు. వలంటీర్లు వారిని ప్రసన్నులను చేశారు.

మూడు రోజులు బండలాగుడు పోటీలు జరిగాయి.

* * *

ఇంక జాక్‌పాట్ పోటీలు, ఎద్దుపరుగు, అందాల పోటీలు జరగాలి. పోటీలో ఎద్దుపడుకుని అవమానం పొందిన కొండయ్య ఎద్దుజతను తన ఊరు తీసుకుపోవాలని, పాలేరుతో సామాను సిద్ధం చేయమని చెప్పి, రాటకు జేరబడి ఎద్దువంక చూస్తున్నాడు. తనకు బంగారు నంది గెలిసేయోగం లేదని. ఎంతో ఆశతో ఎద్దును మేపి దానికి బండిలాగుడు కృషిచేసి, ఆ ఎద్దులాగే తీరు చూసి పోటీలో గెలవవచ్చుననే ధీమాతో ఎద్దుజతను తీసుకువచ్చేడు కాని తన ఊహ బెడిసి కొట్టిందని కొండయ్య మధనపడుతూ ఎద్దు వంక చూస్తున్నాడు.

ఆ ఎద్దు చెవులు నిక్కబొడిచి మిర్రున చూస్తున్న వైపు చూసేడు. గుబ్బగొడుగు ఎక్కపెట్టి మరో ఎద్దును చూస్తున్న వ్యక్తిని చూసేడు కొండయ్య. తన ఎద్దు గుబ్బగొడుక్కి బెదురుతుందని గ్రహించి అతని మదిలో ఏదో తళుక్కున మెరిసింది. పాలేరుతో సామాను సర్దవద్దని చెప్పాడు.

విరాళాలు, టిక్కెట్టు కలెక్షన్‌లు బట్టి చూస్తే చాలా డబ్బు నష్టం వచ్చేటట్టుందని కమిటీవారికి గంగిర్లు పుట్టాయి. నష్టం వచ్చినా బహుమతులు ఇవ్వడంలో లోపం రానివ్వకూడదని వెంకయ్యగారు

కమిటీవారితో చెప్పారు.

ఆరుసైజుల ఎడ్లజతలను మూడు సైజులుగా విభజించారు. ఆ మూడు సైజుల ఎడ్లకి జరిగిన పోటీల్లో వేసిన బరువుకంటే అదనంగా బరువువేసి లాగిస్తారు. దీనిని జాక్‌పాట్ పోటీ అంటారు. కొండయ్య ఎద్దును ఒంటిద్దు ఇసుకలాగుడు జాక్‌పాట్ పోటీలో ప్రవేశపెట్టాడు. అతను నల్లదుస్తులు ధరించాడు. ఆ దుస్తులను చూసి కొందరు, "అయ్యప్పస్వామి!" అంటున్నారు.

తలతాడు పట్టుకొని, రెండో చేత్తో కొరడా త్రిప్పుతూ ఎద్దు ప్రక్కన నడుస్తున్న కొండయ్యను ఒక కన్నుతో చూస్తూ, రెండో కన్ను ఎదురుగా చూస్తూ ఎద్దు పెద్ద పెద్ద అంగలువేస్తూ బండిలాగుతూంటే చూసేవారు మహదానంద పడుతున్నారు. నల్లగుడ్డకు బెదిరి ఎద్దులాగుతూందని అనుకున్నారు. ఎద్దులో అంత విద్య ఉండబట్టే రైతు పోటీలో పాల్గొన్నాడు కొండయ్య. జనంలో గోల మరింత ఎద్దుకు బలాన్ని చేకూర్చుతూంది. అది సునాసంగా లాగుతూ విజిలు వినగానే ఆగిపోయింది. ఎద్దే లాగిన దూరం వినగానే జనంలో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. కొండయ్య ఆనందం అవధులు దాటేయి.

ఒక జత లాగిన వెంటనే రెండో జతను పోటీలో "త్వరగా కట్టకుండా ఆలస్యం చేస్తున్నారు కమిటీవారు. పోటీలను పొడిగించటానికి" అని నేలనుండి కేకలు వినిపించాయి.

బంగారు నంది

"కమిటీవారు కావాలని ఆలస్యం చెయడంలేదు. ఎడ్లను త్వరగా తీసుకు రమ్మని మైకులో పిలవడం మీరు వింటున్నారు. అయినా ఎడ్లగల రైతులు తీసుకురావడం ఆలస్యం చేస్తున్నారు" అని మైకులో వెంకయ్యగారు మాట్లాడగానే మంత్రించి నట్టు నేలలో అలజడి ఆగిపోయింది. జాక్‌పాట్ పోటీలు కూడా ముగిశాయి.

★ ★ ★


రెండు పందిళ్లకు మధ్య ఖాళీ చట్టూ, నాలుగు గజాల వెడల్పున కర్రలు పాతివాటికి తాళ్ళు చుట్టేరు. దానిమధ్యన ఎడ్ల పరుగుపోటీలు జరుగుతాయి. అన్ని సైజుల ఎడ్లకు ఒకటే పోటీ జరుగుతుంది. ఒక బండిని విడిచిపెట్టి, వెళ్లి వచ్చిన తరువాత మరో బండిని విడిచిపెడతారు. ఈ పోటీలో ఎక్కుగా మైసూరు జతలు పాల్గొన్నాయి.

టాపులేని చక్రాలకు టైర్లు మర్చిన గచ్చకాయ రంగు సవారీ బండికి మైసూరు జతను పూన్చి తీసుకువచ్చి ముగ్గుమీద నిలబెట్టారు. బండితోలే ఇద్దర్ని రిఫరీగారు చెకింగు చేశారు. వారి దగ్గర మేకైనా, బ్లేడయినా ఉంటుందేమోనని. ఇద్దరూ బండి ఎక్కారు. ఒకరు తొట్టిదగ్గర కూర్చుని తలపగ్గాలు వెనక్కిలాగి పట్టుకున్నాడు. రెండవ వ్యక్తి బండి మధ్య ఒంగొని రెండు ప్రక్కల గడికొయ్యలు పట్టుకున్నాడు.

రిఫరీగారి ఆజ్ఞతో గిత్తలు ఉరకలు పరుగులుతో ముందుకు దూసుకుపోతున్నాయి. జోరుగా దొర్లుతూ వున్న బండి చక్రాల మీద ఎండ పొడపడి ఆకులు మిలమిలా మెరుస్తు చూసేవారికి కనులు మిరిమిట్లు కొలుపుతున్నాయి. గిత్తల ఉరకలు చూసి ఆనందం పట్టలేక ఈలలు, కేరింతలువేస్తూ వాటికి మరింత ఉత్సాహాన్ని ఉసిగొలుపుతున్నాయి. పందిరి చుట్టూ వున్న రింగులో రెండుసార్లు ఉరికించారు. వాటిటైము నోట్‌చేసి రెండోబండిని విడచిపెట్టారు. పరుగు పోటీలో పాల్గొన్న జతలు ఒక్కొక్కటి వెళ్లివచ్చి, పోటీలను ముగింపచేశాయి.

★ ★ ★

ఉదయం ఎడ్ల అందాల పోటీలు జరిగాయి. సాయంత్రం వ్యవసాయ శాఖామాత్యులు వేదికను అలంకరించి, పశుపోషణ గురించి, ఎడ్లపోటీల గురించి మాట్లాడారు. అనంతరం పోటీలో ఎడ్లను నేర్పిరి తనముతో తోలిన వారికి, రిఫరీగారికి, కవిగారికి సన్మానాలు జరిగిన పిమ్మట బహుమతి ప్రదానోత్సవం జరిగింది. పోటీలో పాల్గొన్న అన్ని జతలకంటే అత్యధిక దూరం లాగిన కొండయ్య ఎద్దుకు బంగారునంది లభించింది. పోటీ ఖర్చుల నిమిత్తం వెంకయ్యగారి జేబులో పదివేల రూపాయలవరకూ ఖాళీ అయ్యి ఉంటుందని కమిటీవారు అనుకోవడం విన్న కొండయ్య బాధపడకుండా ఉండలేకపోయాడు. □



[illegible]

అనతి కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన హీరో మన చిరంజీవి గారంటే తెలియని వారెవరు చెప్పండి? నాటి 'ఊరికిచ్చిన మాట' మొదలు నేటి 'రాక్షసుడు' వరకు తిరుగు లేని హీరో చిరంజీవి సగటు ప్రేక్షకులు కథ, ప్రేమ, సునిశిత హాస్యం, కరుణరసం కలబోసి నిర్మించిన చిత్రాలను మాత్రమే





విశేషంగా ఆదరించగలరు. చిరంజీవిగారు అలాంటి చిత్రాలను ఎన్నుకుని నటిస్తే ఆయన నటనకు మరింత గుర్తింపు లభించటమే కాకుండా మరెంతో మంది అభిమానులను సంపాదించగలరు అని ఖచ్చితంగా చెప్పవచ్చు

-ఎ. సుధావాణి, కాకినాడ

★ ★ ★

నా అభిమాన తార సుహాసిని. సుహాసిని పేరులోనే ఉన్నది మధురమైన భాష్యం. ఈమె ఇంతగా నా అభిమానము చూరగొనుటకు కారణం 'బావమరదళ్ళు' చిత్రంలో మరదలు పాత్ర

సుహాసిని నటించిన చిత్రాలన్నింటిని నేను చూశాను. 'ముక్కుపుడక' చిత్రంలో అమాయకమైన పల్లెటూరి యువతిగాను, 'స్వాతి' చిత్రంలో తల్లి కోసం త్యాగం చేసే కుమార్తెగాను ఎంతో బాగా నటించారు. 'సింధు భైరవి' చిత్రంలో ఆమె నటనకు మెచ్చి ప్రభుత్వం జాతీయ అవార్డును ఆమె వశం చేసారు. ఇకముందుకూడా అటువంటి జాతీయ అవార్డులను తన వశం చేసుకోవాలని అభిమానిగా





నా కోరిక. 'సిరి వెన్నెల'లో మూగ కళాకారిణి పాత్రలో నిజంగా ఎంత బాగా నటించారంటే నన్ను 3 సార్లు చూసేటట్లు చేసారు. ఇక ముందుకూడా, ఇటువంటి అంటే, కథాబలము గల చిత్రాలలో నటించి మరింత పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని, తనకున్న స్థానమును పటిష్ఠం చేసుకోవాలని ఆశిస్తున్నాను

సుహాసిని అభిమానిగా కొన్ని సలహాలు - డ్రెస్స్ విషయంలో కొంచెం శ్రద్ధ తీసుకోవాలి. మోడరన్ డ్రస్సులు వేయవద్దు. చీరకట్టుకుంటే బాగుంటారు. ఆనాటి సావిత్రిని మరపిస్తారు. నా అభిమాన నటుడైన రాజేంద్ర ప్రసాద్‌గారితో నటిస్తే చూడాలని ఉంది

-డి. రాధ, సుద్దపల్లి, గుంటూరు

★ ★ ★

"యువరత్న" నందమూరి బాలకృష్ణ నా అభిమాన నటుడు. ఏ పాత్రనైనా అవలీలగా మెప్పించగల నటుడు. ఈ ఏడు ఎన్నో ... యాలను





సాధించి, ... పేరు పొందిన ... కలిగిన ... పాత్రలను పోషించి నటనతో ప్రేక్షకులను మెప్పించి తండ్రికి తగ్గ తనయుడు కావాలని నా ఆశ

-బి. యస్. వి. రమణ, భవానీనగర్, తిరుపతి

★ ★ ★

హీరోయిన్ లందరిలోను నాకు బాగా నచ్చిన హీరోయిన్ జయప్రద. ఆమె అంటే ఎందుకో నాకు మొదటి నుండీ అభిమానం. ఆమె నటించిన ప్రతి చిత్రంలో ఏదో ఒక ప్రత్యేకత, ఆకర్షణ ఉంటుంది. ఆనాటి 'అంతులేని కథ' నుండి ఈనాటి "తాండ్రపాపారాయుడు" వరకు ప్రతి సినిమా తప్పకుండా చూశాను. ఆమె నటనకు





మచ్చుతునకలుగా మిగిలి పోయే చిత్రాలు ఎన్నో. అందులో ముఖ్యంగా "సీతారాములు" చిత్రంలో గంభీరంగా, హుందాతనంగా ఉండే పాత్రలోను, "స్వయంవరం" చిత్రంలో ప్రియుడికి, భర్తకు మధ్యన నలిగి పోయే పాత్రలోను 'సూర్య చంద్ర' చిత్రంలో చలాకీగా చిన్న అమ్మాయిగా ఎంతో బాగా నటించి మెప్పు పొందింది. ఇంక ఆమె నటనకు "మేఘసందేశం", "సాగర సంగమం" వంటి చిత్రాలు చక్కని నిదర్శనాలు. ఇటు తెలుగు చిత్ర సీమలోనే కాక అటు హిందీ చిత్రసీమలో కూడా తనకో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న అందాల తార జయప్రద నా అభిమాన తార అని చెప్పుకోటానికి నేను ఎంతో గర్వ పడుతున్నాను.

-పి. విశాల్‌కుమార్, సుభాష్‌నగర్ కాలనీ, బెల్లంపల్లి

మొదటి 'విక్రమ్' చిత్రంతో విజయ పతాకాన్ని ఎగురవేసి, ఎనీ వినీలాకాశ గగన వీధుల్లో విహరిస్తూ నవరసాలను, తన నయనాలలో చూపించే శక్తిగల 'యువ నట సామ్రాట్' అక్కినేని నాగార్జున నా అభిమాన నటుడు

తొలి చిత్రమే తన జీవితానికి పూలబాట వేసింది




... ... నాగార్జున ... ... విజయాన్ని సాధించక పోయినా నటుడిగా నాగార్జున ఎదిగాడనే చెప్పాలి. ఆ చిత్రంలో 'తై తక్కా' అనే పాటకు నాగార్జున చూపిన హావభావ విన్యాసాలు చూస్తుంటే నాట్యరాజు పరమానంద భరితుడై నాట్యం చేశాడా అనిపిస్తుంది

రానున్న 'అరణ్యకాండ' 'మజ్ను' 'సంకీర్తన' 'కలెక్టర్‌గారి అబ్బాయి' అఖండ విజయం సాధించాలని కోరుకుంటున్నాను



కథాబలం ఉన్న చిత్రాలలో నటించాలని, డైలాగులు వేగంగా ఉండాలని అభిమానిగా నాగార్జునకు నా మనవి.

-శివకవి భాస్కర్, ఒంగోలు

★ ★ ★

రెబల్‌స్టార్ కృష్ణంరాజుగారు నా అభిమాన నటుడు. ... ... నటించిన ... ... పాండవులు, ... మొదలగు చిత్రాలను చూసిన ప్రేక్షకులు, ఆయన నటనా చాతుర్యాన్ని ఎన్నటికీ మరవలేరు

నటనలో నవరసాలు అవలీలగా పోషించే

కృష్ణంరాజుగారు వెనకటితరం మహానటులు లేని కొరత తీరుస్తున్నారు

సాధారణంగా తెరమీద కనిపించే వారి లక్షణాలు, ఔదార్యం, మానవత్వం నిజ జీవితంలో కూడా చూపించే మనిషి అని మనందరికి తెలుసు. రాష్ట్రంలో ఏ విపత్కరమైన కష్టాలొచ్చినా ఏ విపత్కర పరిస్థితులొచ్చినా, తనకు తానే ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సహాయము చేసే 'ధర్మాత్ముడు' కృష్ణంరాజు

-బి. బాలరాజు, నంద్యాల □



"మకుటంలేని మహారాజు"లో కృష్ణ



"చక్రవర్తి"లో చిరంజీవి

సినిమా విశేషాలు

— జి.వి.జి.

"అగ్నిపుష్పం"


పుష్పాన్ని ఆస్వాదనకు, ఆరాధనకు పలు రకాలుగా ఉపయోగించుకుంటాం. ఐతే, వాడకూడని రీతిలో వాడితే, అది చుర్రుమంటుంది అదే అగ్నిపుష్పం పూర్తి గ్రామీణ వాతావరణంలో గ్రామీణ సమస్యలను ప్రతిబింబించే ఇతివృత్తం హైదరాబాద్ చుట్టు పక్కల ఫిబ్రవరి రెండవ వారం నుంచి పక్షం రోజులు, మార్చి రెండో వారం నుంచి నెల రోజుల పాటు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు ఈరంకి శర్మ ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో మాజీ గృహశాఖా మాత్యులు, ప్రస్తుత శాసన సభ్యులు చేగొండి హరిరామ జోగయ్య సమర్పించే జూపిటర్ పిక్చర్స్ వారి పై చిత్రంలో రేఖ శుభాకర్, రాజీవ్, పి ఎల్ నారాయణ, రాళ్ళపల్లి వగైరా నటవర్గం డి ప్రభాకర్ మాటలు, ఆత్రేయ పాటలు ఎం ఎస్ విశ్వనాథం సంగీతం బి ఎస్ లోకనాథ్ ఛాయ, కృష్ణమోహన్ సహకార దర్శకత్వం, వెంకటరత్నం కూర్పుతో జి ఎస్ రాజు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ జోనం నరసింహారావు, సి బుద్ధావతారం రాజు నిర్మాతలు

నాగార్జున "సంకీర్తన"

భావకవి అయిన కథానాయకుడు కొన్ని దురాచారాలలో చిక్కుకు పోయిన కథానాయికను రక్షించడం, ఆ దురాచారాలను ఖండించడం – వీటిని సంగీత నృత్య భావ పరంగా పొందుపరిచాం కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలలోని ప్రకృతి రామణీయక ప్రాంతాలలో చిత్రీకరణ జరిపాం, అన్నారు గీతాకృష్ణ ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో డాక్టర్ ఎం గంగయ్య నిర్మించిన కోణార్క్ మూవీక్రియేషన్స్ సంకీర్తన చిత్రంలో ఆత్రేయ, సి నారాయణ రెడ్డి, సీతారామ శాస్త్రి విరచిత ఎనిమిది గీతాలకు ఇళయరాజా కూర్చిన బాణీలు శ్రవణసుఖాన్నిస్తాయి నాగార్జున రమ్యకృష్ణ, శరత్‌బాబు, జె వి సోమయాజులు, గిరీష్ కర్నాడ్ సాక్షి రంగారావు రాళ్ళపల్లి, మల్లికార్జునరావు, థమ్, కె కె శర్మ నర్రా, శ్యామలరావు సాయికుమార్ భాస్కరబాబు శివాజీ, గిరిధర్, వై విజయ, శ్యామల నటించారు తనికెళ్ళ భరణి మాటలు నివాస్ ఛాయ ఇ గిరిధర్ నిర్వహణ, అనిల్ మల్నాడ్ కూర్పుతో ఎం వి ప్రసాద్ సమర్పించే ఈ చిత్రం ఫిబ్రవరి విడుదల


రచయిత శ్రీకాంత్ చిత్రం "దేవుళ్ళారా మీ పేరేమిటి?"

గ్రామీణ రాజకీయ చిత్రం ఇదే పేరున వెలువడిన నా నవలలోని ప్రధాన పాత్రలు ఈ చిత్రంలో ఉంటాయి హీరోగా బాలచంద్రని విలన్‌గా రంగస్థల నటుడు వి రామారావును యామిని అనే నటితో పాటు, మరో యువతిని కూడా పరిచయం చేస్తున్నాం పొలిటికల్ గిరీశంలాంటి పాత్రను గిరిబాబు ధరిస్తున్నారు డిసెంబర్‌లో మొదటి షెడ్యూల్ ముగించాం జనవరి 17 నుంచి ఫిబ్రవరి 5 వరకూ గుంటూరు వద్ద జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది" అన్నారు రచయిత శ్రీకాంత్ ఈయన జన చైతన్య ఆర్ట్ పిక్చర్స్ బానర్‌తో నిర్మిస్తున్న పై చిత్రంలో ప్రభ నారాయణరావు ప్రభాకరరెడ్డి హరిబాబు సురేంద్ర ఇతర పాత్రధారులు బొల్లిముంత శివరామకృష్ణ శ్రీకాంత్ మాటలు రాశారు డి చలపతిరావు స్వరకల్పనలో శ్రీకాంత్ గీతాలు రాశారు సుఖదేవ్ ఛాయ ఎ రంగారావు శిల్పం, శేషు నృత్యాలు, అంకిరెడ్డి కూర్పుతో కె ఎం నాయుడు ప్రొడక్షన్ కంట్రోలర్ కట్టా సుబ్బారావు దర్శకుడు


RCF
यूरिया
UREA
उज्ज्वला
NITROGEN 46·4%
UJJWALA-UREA

జంధ్యాల రచన, దర్శకత్వంలో మరో చిత్రం

యర్రంశెట్టి శాయి నవల జీవితం మైనస్ సెంటిమెంట్ ఆధారం ప్రముఖ మలయాళ హీరో రెహమాన్‌ను రఘు పేరున తెలుగు తెరకు పరిచయం చేస్తున్నాం అన్నారు జంధ్యాల ఈయన మాటలు దర్శకత్వంలో అన్వేషణ అందించిన కామినేని ప్రసాద్ నిర్మించే రాంకుమార్ ప్రొడక్షన్స్ ద్వితీయ చిత్రంలో రఘు సుమలత తులసి వేలు రాళ్ళపల్లి పొట్టిప్రసాద్ మల్లికార్జునరావు ఆదిగాగల వారు పాత్రధారులు వేటూరి గీతాలు



"తండ్రీ కొడుకుల ఛాలెంజ్"లో రాధ,



"బ్రహ్మరాత"లో సుధ

రాజన్–నాగేంద్ర సంగీతం ఎం వి రఘు ఛాయ గౌతంరాజు కూర్పు యోగానంద్ ప్రొడక్షన్ నిర్వహిస్తున్నారు

శోభన్‌బాబు, సుహాసిని "పుణ్యదంపతులు"

ఒక ఊరిలో నెలకొన్న ఓ జటిల సమస్యను పరిష్కరించడానికి వచ్చిన ఒక డాక్టర్‌కు ఆ ఊళ్ళో సేవాతత్పరత భావాలున్న ఒక అమాయకురాలితో పరిచయమేర్పడుతుంది ఏడాది కాపురంలోనే పుణ్యదంపతులుగా పేర్గాంచిన ఆ ఇద్దరికీ సంబంధించిన రసవత్తరమైన కథ డిసెంబర్ 23 నుంచి 31 వరకు మొదటి షెడ్యూల్ పూర్తి చేశాం జనవరి నుంచి మార్చి వరకు ప్రతి 21 వ తేదీ నుంచి నెలాఖరు వరకు జరిగే తదుపరి షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు అనిల్ కుమార్ ఈయన దర్శకత్వంలో ఎన్ రామలింగేశ్వరరావు సమర్పించే శ్రీ లక్ష్మీ అన్నపూర్ణా క్రియేషన్స్ వారిపై తొలి చిత్రంలో శోభన్‌బాబు సుహాసిని శరత్‌బాబు నూతన్ ప్రసాద్ శ్రీధర్ వీరభద్రరావు రమాప్రభ విజయవాణి పాత్రధారులు శ్రీనివాస చక్రవర్తి కథకు పూసల సంభాషణలకర్త వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త వియత్నాం వీడు సుందరం స్క్రీన్‌ప్లే శరత్ చాయ రామచంద్రసింగ్ శిల్పం శివశంకర్ నృత్యాలు ఎన్ ఎ ప్రసాద్ ప్రొడక్షన్ నాగేశ్వరరావు– సత్యం కూర్పు ఎం విజయకుమార్– పూసల రాధాకృష్ణ సహకార దర్శకత్వంతో బి బుల్లి సుబ్బారావు కె వెంకటేశ్వర రావు నిర్మాతలు

మంజుల మనోహర భావరాగ సమ్మిళితమైన కౌముది పిక్చర్స్ "ఓ ప్రేమకథ"

నిర్మాత కవి దర్శకుడు కవి తీసుకున్న ఇతివృత్తం గొప్ప రచయితది ఇన్ని ప్రాశస్త్యాలున్న చిత్రం ఎంత ఉత్తమోత్తమమైనదో నిరూపిస్తుంది ఎం ఎస్ రెడ్డి నిర్మించిన ఓ ప్రేమ కథ సినిమా పాటలకు సాహిత్య విలువ తెచ్చి పెట్టిన వారిలో మల్లెమాల ఒకరు సినీ సాహితీ సమరాంగణంలో సార్వభౌముడైన మల్లెమాల తన అక్షర సంపదతో ఊహల పల్లకిని మల్లెపందిట్లో నిలిపారీ చిత్రంలో. ప్రకృతిలో అణువణువునా దాగి ఉన్న సౌందర్యాన్ని ప్రతిబింబింప చేసి. ప్రేక్షకులను పరవశింప జేసే

"ఓ ప్రేమకథ"లో జయ



రీతిలో తేనెలూరెడి తెలుగుదనంతో రచించారు ఈయన పాదల మీద రాసినా సాద ఉండదు సుద ఉంటుంది ఎద ఉంటుంది కథ ఉంటుంది ఇలాంటివి ఆరు పాటలు ఇంకో ఇరవై ఏళ్ళ తర్వాత కూడా ఇంటిల్లిపాదినీ ఆనందసాగరంలో ఓలలాడించేవి ఈ చిత్రంలో ఉన్నాయి వీటికి ఎం రంగారావు సంగీతం పి ఎస్ ప్రకాష్ ఛాయ రాజశ్రీ దర్శకత్వంతో మై మేనులు పులకింప జేసా_యి సర్వదమన్ బెనర్జీ రాధిక జీవిత జయమాలిని కస్తూ_రి కృష్ణవేణి సత్యనారాయణ గొల్లపూడి జె వి సోమయాజులు వల్లం నరసింహారావు, మిశ్రో బి జి నాయుడు నటించారు రావూరి భరద్వాజ కతకుడు మల్లెమాల మాటలు పాటలు, పద్యాలు రాశారు పి ఎస్ ప్రకాష్ ఛాయ పి.

మాలిని గొల్లపూడి





నేను కోరినంత కట్నం ఇచ్చేవాడు దొరికితే, వెంటనే పెళ్ళి చేసుకుంటాను

సత్తిబాబు సంయుక్త దర్శకత్వం జె. వి. వి. సత్యనారాయణ సహకార దర్శకత్వం, బి.జి. నాయుడు – సాయిరత్న ప్రొడక్షన్‌తో రాజశ్రీ స్క్రీన్‌ప్లే దర్శకత్వం నెఱపారు జనవరి 30న విడుదల

నమ్మిన బంటు లో రజని

త్వరలో 'కనకదుర్గ వ్రత మహాత్మ్యం"

"పౌరాణికాంశాలు గల జానపద చిత్రం. ఫిబ్రవరి విడుదల" అన్నారు బి విఠల ఆచార్య శ్రీనివాస్. ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో కె మహేంద్ర, కె. ప్రకాష్ నిర్మించిన శివశక్తి ఆర్ట్స్ వారిపై చిత్రంలో నరసింహరాజు రామకృష్ణ నూతన్ ప్రసాద్, త్యాగరాజు వీరభద్రరావు జీవా వంకాయల, నళిని, ప్రభ, కృష్ణవేణి జయమాలిని బబిత పాల్గొన్నారు. పేరాల కథ మాటలు రాశారు శంకర్‌గణేశ్ సంగీతం, బి. నాగరాజన్ శిల్పం డబ్ల్యు ఆర్ చంద్రు ఛాయ, నాయని మహేశ్వరరావు కూర్పు డి ప్రసాద్ వి మనోజ్ ప్రొడక్షన్ దిలీప్ సంయుక్త దర్శకత్వం ఉదయకుమార్ నిర్వహణ బాధ్యతలు వహించారు

తులసీరాంతో బాలయ్య యుద్ధకాండ"

మా తులసీరాం సరసన ఖుష్బూ నాయిక జనవరిలో పాటల రికార్డింగ్ ఫిబ్రవరి మార్చి నెలల్లో షూటింగ్ అన్నారు ఎం బాలయ్య ఈయన కథ స్క్రీన్‌ప్లే దర్శకత్వం వహించే అమృతా ఫిలిమ్స్ వారిపై 11వ చిత్రానికి ఆలపర్తి సూర్యనారాయణ మన్నవ వెంకట్రావు నిర్మాతలు



సినిమా



"ఉమ్మడి మొగుడు'లో శోభన్‌బాబు

"ఉమ్మడి మొగుడు'లో భయంకరమైన రహస్యం

అందరూ దిగ్భ్రాంతితో ఉండగా శేఖర్ (శోభన్ బాబు) ప్రవేశించాడు దుర్గాంబ (సూర్యకాంతం) దిగ్గున లేచి ఏం నాయనా! వచ్చావా? కట్టుకున్న పెళ్ళాం గౌరవాన్ని కాలరాచి మరో ఆడదాని కొంగు పట్టుకుని తిరుగుతూ మళ్ళీ ఏం మొహం పెట్టుకొని వచ్చావిక్కడికి? నా కూతురు నీకేం అపకారం చేసిందని తడిగుడ్డతో దాని గొంతు కోశావు? నలుగురిలో దాన్ని తలెత్తుకోకుండా చేశావు? అంటూ ఆరున్నొక్క రాగం ఆలపించింది

సర్వేశ్వరం (జె వి సోమయాజులు) డగ్గుత్తికతో కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన నా పరువు బజారు-కెక్కిస్తావనుకోలేదు అల్లుడివైనా కన్న కొడుకులా చూసుకున్న నన్ను గుండెల మీద తన్ని అవమానిస్తావనుకోలేదు, శేఖర్' అన్నాడు

శేఖర్ అందరి వంకా చూసి ఇందాకట్నుంచి చూస్తున్నాను ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు వాగుతున్నారు అసలు మీరెవరు? మీకూ నాకూ సంబంధమేమిటి? మీ అందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం నాకేముంది? మీ మోచేతి నీళ్ళేమైనా తాగుతున్నానా? మీరంతా నన్ను పెళ్ళి పోషిస్తున్నారా? ఇదంతా నా కష్టార్జితం. ఈ హోదా ఈ అంతస్తు నా స్వార్జితం ఒకర్నే కాదు ఇద్దర్నే కాదు వంద మందిని పెళ్ళి చేసుకుంటాను వందమంది నుంచుకుంటాను మీదిక్కున్న చోట చెప్పుకోండి మీ అందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు అన్నాడు

భార్య లక్ష్మి (రాధిక) "ఏమండీ' వారెవరికీ అధికారం లేదన్నారు నా శరీరం మనస్సు ఆత్మ – అన్నీ మీకు అంకితం చేస్తూ బ్రతుకుతున్నదాన్ని మీరింత అట్టడుక్కి కూరుకు పోతున్నా - రాతి బొమ్మలా కళ్ళప్పగించి చూట్టమే తప్ప, నోరెత్తి మిమ్మల్ని అడిగే అధికారం నాకు లేదా చెప్పండి? లేదంటే మిమ్మల్నేమీ అడగను అని బావురుమంది

శేఖర్ హృదయం ద్రవించింది చెప్తాను లక్ష్మీ! నీకు చెప్పవలసిన బాధ్యత కూడా నా మీదుంది నువ్వు నా ప్రాణానికి ప్రాణానివి నా జీవితానికి అర్ధాంగివి ఇన్నాళ్ళూ నా గుండెల్లో దాచుకున్నాను కీర్తి నా జీవితంలో నీ కంటే ముందు ప్రవేశించింది అన్నాడు

అంతే లక్ష్మి కళ్ళెదుట అగ్నిపర్వతం బ్రద్దలయినట్టయింది

బి భాస్కరరావు దర్శకత్వంలో కె వి వి సత్యనారాయణ నిర్మించిన రామచంద్ర మూవీ క్రియేషన్స్ ఉమ్మడి మొగుడు చిత్రం త్వరలో విడుదల □

"ధర్మపత్ని"లో అనూరాధ





అభినేత్రి భానుప్రియ సమాధానాలు

సిప్పిడి వెంకటరెడ్డి, కంభాల

ఇవాళ చిత్రాలన్ని ఎక్కువ శాతం వినోదం పేరిట సెక్స్, దోపిడీలు, హత్యలు ప్రధానాంశాలుగా రూపొందిస్తూ, ప్రేక్షకులకు హాని కల్గిస్తున్నారు. ఒక నాటి ఉత్తమ చిత్రాల స్థాయిలో ఈ నాటి చిత్రాలు ఎందుకు ఉండడం లేదు? ఈ విషయంలో తారల బాధ్యత ఎంత వరకు ఉంది?

చాలా తక్కువ!

ఎస్. జయకుమార్, రేణిగుంట

"అనాదిగా ఆడది' చిత్రం హిట్ అవడానికి కారణం మీ నటనా లేక ప్రేక్షకులా?

అందరూ.

ఎన్. మధుసూదనరావు, హైద్రాబాద్ –16

భానుప్రియగారూ! తమ చెల్లి రేఖ గారు చిత్రములో నటిస్తున్నారు కదా? తమకు పోటీగా నిలుస్తారా?

ఎవరూ – ఎవరికి పోటీ కారు!

వక్కలంక సి. ఫణీంద్రకుమార్, సామర్లకోట

ప్రేమ – పెళ్లి. వీనిలో ఏది గొప్పదంటారు?

దేనికదే గొప్పది!

బి. భారతి, హన్మకొండ

ప్రియగారూ ! అందాల తారలు శ్రీదేవి, జయప్రదలాగా మీరు కూడా హిందీలో సెటిలైపోతారా?

అయిపోను!

కె. మనోహర్‌రావు, నిర్మల్

నటకేసరి, సుప్రీమ్ హీరో చిరంజీవిపై మీ అభిప్రాయం?

చాలా మంచి అభిప్రాయం!

ఆర్. డి. ఎన్. ప్రభాకర్, విజయవాడ –7

హీరో కొడుకులు హీరోలు అవుతున్నారు. ఇది స్వార్థమంటారా? న్యాయమంటారా?

ఏం? డాక్టర్ కొడుకు డాక్టరైనప్పుడు యాక్టర్ కొడుకు యాక్టర్ కాకూడదా?

చీకోటి శ్రీనివాస్, వేములవాడ

నాట్యంలో మీ గురువు ఎవరు?

నాకు నాట్యం నేర్పిన గురువు శ్రీ ఆనంద్ గారు!

సి. హెచ్. అంజలి, వేములవాడ

'అనాదిగా ఆడది' చిత్రంలో మీ పాత్ర వలన నేటి సమాజంలోని అత్తలకు జ్ఞానం వస్తుందని నా అభిప్రాయం మీరేమంటారు?

రావాలంటాను – వస్తే మంచిదంటాను!

ఉత్తమ ప్రశ్న

కె. భాగ్యలక్ష్మి, జమ్మలమడుగు

మిమ్మల్ని ప్రేమించేవారు, మిమ్మల్ని అభిమానించే వారు, మిమ్మల్ని విమర్శించే వారు – వీరిలో ఎవర్ని మీరు అభిమానిస్తారు?

అందర్నీ.

పోలిశెట్టి గంగరాజు, విశాఖపట్నం

భానుప్రియగారూ! మీరు నృత్యానికి పరిమితమైన పాత్రలే గాని కథ, సెంటిమెంట్ ఎక్కువగా ఉన్న పాత్రలు ఎక్కువగా ధరించుట లేదు. దీనికి కారణం?

ఎందుకు ధరించడం లేదు?

సి. హెచ్. విజయకుమార్, గుడ్లిగూడెం

నేటి సమాజములో అనుక్షణం మగవాడి స్వార్థానికి బలి కాబడుతున్న స్త్రీకి మీరిచ్చే సందేశం?

బలి కావద్దనీ, స్వార్థాన్ని ఎదిరించమనీ!

టి. వి. శైలజ, కడప

భాషా భేదం ఉన్నప్పటికీ మంచి ప్రతిభ ఉన్న మన నటీమణులంతా హిందీ రంగానికి వెళ్లి కన్పించటం మానేశారు. ఆ రంగానికి చెందిన వారు మన ఛాయలకురారు. అలాంటప్పుడు మన వాళ్ళు వెళ్ళడం సబబే నంటారా?

హిందీ రంగానికి చెందిన మందాకినీ, ఖుష్‌బూ, ఫారా మన తెలుగు చిత్రాల్లో కనిపిస్తూనే వున్నారు కదా!

కె. సత్యనారాయణరావు, కడప

మీరు ఎక్కువగా రాశికి ప్రాధాన్యత ఇస్తారా లేక వాశికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారా?

వాశిగల రాశికి.

ఎ. శేఖర్, ప్యాపలి

భానుప్రియగారూ! మీరు కె. విశ్వనాథ్ దర్శకత్వంలో నటిస్తే చూడాలని ఉంది.

నాకూ అలాగే వుంది.

మోటపర్రి సుబ్రహ్మణ్యేశ్వరగుప్త, బెండమూర్లంక

కట్నం ఆశించని పురుషుడ్ని నీచంగాను, అనుమానంగాను చూస్తున్న ఈ సమాజం మారేదెప్పుడు?

దాని కెవరు సమాధానం చెప్పగలరో వాళ్లనే అడగండి.

పి. శారదా సుబ్రహ్మణ్యం, శ్రీశైలం ప్రాజెక్టు

ఈ నాటి సిన్మాలకు, ఆ నాటి సిన్మాలకు తేడా చెప్పండి

ఆనాడు – ఈనాడు. □

కూపన్.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక భానుప్రియ సమాధానాలు

ప్రశ్న : ____________________

____

____

పంపిన వారి పేరు ____________________

పూర్తి చిరునామా ____________________

____



సీరియల్ ఆరోహణ

శైలకుమార్

(గత సంచిక తరువాయి)

ఉదయాన్నే తయారయి శశాంక కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు చక్రవర్తి. శశాంక తప్పక సహాయం చేస్తాడన్న నమ్మకం కలిగింది అతనికి

ఎనిమిది గంటలకు వచ్చాడు శశాంక ఎంతో హుషారుగా కనిపిస్తాడు ఎదుటివారిని ఆకట్టుకునేలా మాట్లాడటం అతని ప్రత్యేకత

కాఫీలు తెప్పించాడు చక్రవర్తి

విజయ గార్డెన్స్‌లో కల్పన వాళ్ళ రికార్డింగ్ వుంది అది చూసుకుని వెళదాం అన్నాడు శశాంక

ఇద్దరూ ఆటోలో బయలుదేరారు. ఆటో విజయా గార్డెన్స్ సమీపించగానే చక్రవర్తి గుండె దడదడా కొట్టుకుంది ఎక్కడ గుర్ఖావాడు ఆపేస్తాడో అని శశాంకను చూసి ధైర్యం తెచ్చుకున్నాడు

డీలక్స్ రికార్డింగ్ థియేటర్ ముందు ఆగింది ఆటో అప్పటికే అక్కడ చాలా కార్లు ఆగివున్నాయి ఇద్దరూ దిగారు

'అదిగో ఆ గుడి చూశారా" మైన్ గేటుకు ఎడమవైపు వున్న గుడిని చేత్తో చూపించాడు శశాంక

చాలా సినిమాల్లో చూసివుంటారు" అన్నాడు తనే మళ్లీ.

చక్రవర్తి గుర్తుకు తెచ్చుకున్నాడు చాలా సినిమాల్లో వుంది ఆ గుడి. నాయికీ నాయకులు పెళ్లి చేసుకున్నట్లు, గుడికి వచ్చినట్లు చాలా సినిమాల్లో చూపించారు దాన్ని

రికార్డింగు థియేటరులోకి కదిలారు ముందుగా ఒక చిన్నరూము దానిలో ఒక పెద్ద టేబులంత మిషను వున్నాయి రకరకాల మీటలతో గజిబిజిగా గీసిన గ్రాఫ్‌లా వుంది ఆ మిషను దాని వెనక ఇరు ప్రక్కల కూడ సినిమా హాల్లో వున్నట్లుగా కుర్చీలు వున్నాయి

ఆ రూమును ఆనుకుని ఒక పెద్ద హాలు వుంది ఆ హాలంతా కనిపించేలా రూముకు హాలుకు మధ్య ఒక పెద్ద అద్దాల కిటికీ వుంది ఆ హాలులో ఒకవైపు పదిమంది వైలన్లు వాయించేవాళ్ళు, ఒకవైపు డ్రమ్స్ వాయించేవాళ్ళు, ఒకవైపు ఫ్లూట్ వాయించే అతను, మరోవైపు కోరస్‌పాడే ఆడవాళ్ళు వున్నారు ఒక్కో గుంపు దగ్గర ఒక్కో మైకు వుంది హాలుమధ్యగా ఓ వ్యక్తి నిలబడి సర్కస్‌లో రింగ్‌మాస్టర్‌లా అందరికీ చేతి సైగల ద్వారా ఆదేశాలు ఇస్తున్నాడు

ఆ వాతావరణ మంతా చాలా కొత్తగా వుంది చక్రవర్తికి అతడు రికార్డింగ్ గురించి విన్నాడేగాని చూడలేదు అందరూ అలా ఎందుకు కూర్చున్నారో, ఆ మైకులు ఏమిటో అతనికి అర్థంకాలేదు

'నమస్తే సార్' అన్నాడు శశాంక కూర్చుని సిగరెట్ కాలుస్తూ అద్దాల కిటికీ నుంచి హాలులో కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తున్న ఓ వ్యక్తిని

'నమస్తే" అన్నాడతను శశాంకవైపు తలతిప్పి

చక్రవర్తి బిడియంగా నిలబడ్డాడు కూర్చోవాలో వద్దో అర్థం కాక.

"షూటింగ్ ఎప్పటి నుంచి సార్" అడిగాడు శశాంక.

"ఇరవై రెండు నుంచి ఒకేషెడ్యూలు"

"సాంగ్స్ అన్నీ రికార్డ్ చేస్తున్నారా"

"లేదయ్యా మనకు థియేటర్ ఇవాళ రేపే వుంది. రెండు సాంగ్స్ బ్యాలెన్స్ వుంటాయి వీలు చూసుకుని చెయ్యాలి '

ఇంతలో బాయ్ కాఫీలు పట్టుకునివచ్చి అక్కడున్న అందరికీ అందించాడు చక్రవర్తితో సహా

"ఏం చేస్తున్నావు" అడిగాడు తను శశాంకను.

'కొత్త పిక్చర్ ఒకటి వచ్చింది సార్ ఇంకా డేటు ఫిక్స్ కాలేదు " అన్నాడు నవ్వుతూ శశాంక.

ఇతను చక్రవర్తి అని మంచి రైటరు శుభోదయా వాళ్ళు పిలిపించారు" చక్రవర్తిని ఆయనకు చూపిస్తూ అన్నాడు శశాంక

"నమస్తే ' అన్నాడు చక్రవర్తి.

'వీరు డైరెక్టరు సుందరంగారు" పరిచయం చేశాడు

'ఆంధ్రాలో చక్రవర్తిగారికి చాలా పేరుందండీ రేడియోలో ఈయన పాటలే మోగిపోతుంటాయి శుభోదయా వాళ్లకు రెండు పాటలు రాశారు ఇంకా రెండు బ్యాలెన్సు వున్నాయి.'

అలాగా" అంటూ ఎగాదిగా చూశాడాయన చక్రవర్తిని.

"ఏ వూరండి"

"తిరుపతి"

'పాటలు మాత్రమే వ్రాస్తారా"

కథలు, మాటలు అన్నీ రాస్తాను సార్" ఆనందంగా చెప్పాడు

రికార్డింగ్ థియేటరులో కూర్చోవటం, డైరెక్టరుతో మాట్లాడుతూ వుండటంతో తాను సినిమా రచయిత అయిపోయినట్లే భావన కలుగుతోంది చక్రవర్తికి

మంచిఛాన్సు ఒకటి కావాలండీ"

'ఎలాంటిది కావాలంటారు" చక్రవర్తి బదులు శశాంక అడిగాడు

జరిగిన కథ—7: ఆఫీసులో వేళనలకు గురవుతూ మనశ్శాంతికోసం కపిలతీర్థం వెళ్ళిన చక్రవర్తికి నీలిమ పరిచయమవుతుంది. నీలిమతో సాన్నిహిత్యాన్ని శాశ్వతం చేసుకోవాలనుకుంటాడు చక్రవర్తి. నీలిమకు పెళ్ళయిందనీ, భర్తకు ప్రమాదంలో కాళ్ళు పోయాయనీ తెలుసుకొని హతాశుడవుతాడు. ఆ నిరాశలో తిరుపతి వదలి మద్రాసు వెళతాడు. కొత్తవారికి స్థానం ఇస్తానని ప్రకటించిన సత్యంవంటి వాళ్ళదగ్గర కూడ ఆశాభంగం అవుతుంది శశాంక పరిచయమవుతాడు

"మంచి ఫ్యామిలీ థ్రిప్ కావాలి సెంటిమెంట్సుతో లేడీసును అట్రాక్ట్ చేసేట్టుగా వుండాలి" చెప్పాడు సుందరం చక్రవర్తిని. శశాంకను మార్చి మార్చి చూస్తూ

"అలాగే సర్ ఒకటి రెండు రోజుల్లో వినిపిస్తాడులెండి' ఈసారి కూడా శశాంకే సమాధానం చెప్పాడు

మ్యూజిక్ డైరెక్టరు వచ్చి ఏదో చెప్పటంతో లేచి వెళ్లాడు సుందరం

'అదేమిటి శుభోదయా వాళ్ళకు రాస్తున్నట్టు చెప్పారు' అడిగాడు శశాంకను చక్రవర్తి

నవ్వి అటూ ఇటూ చూశాడు శశాంక

'అదంతే చక్రవర్తీ! కొత్తగా వచ్చాము అంటే తక్కువగా చూస్తారు అదే మరెవరికో వ్రాస్తున్నాము అంటే గౌరవంగా చూస్తారు మనం మాత్రం ఎందుకు వ్రాయించుకో కూడదు అనుకుంటారు'

మరి వెళ్లి వాళ్లని అడిగితే

"అంత తీరిక వాళ్లకెక్కడిది అసలా కంపెనీ వుంటేకదా" నవ్వాడు శశాంక

"రండి లోపలికెళ్దాం" అన్నాడు లేస్తూ.

ఇద్దరూ రూము దాటి విశాలమైన హాలులోకి వచ్చారు.

"ఎందుకు అందరూ అలా విడివిడిగా కూర్చున్నారు కలసి కూర్చోవచ్చుకదా" అమాయకంగా అడిగాడు చక్రవర్తి.

సినిమాకు సంబంధించిన పరిజ్ఞానం మనకు చాలా అవసరం చక్రవర్తీ! అదిలేక పోతే అందరూ తక్కువగా చూస్తారు'

ఎవరో పలకరించారు శశాంకను అతన్ని చూసి నవ్వి చక్రవర్తి వైపు తిరిగాడు శశాంక

"ఇక్కడ కూర్చున్న ఒక్కొక్కరూ ఒక్కో వాయిద్యాన్ని పలికిస్తారు. ఆ వాయిద్యపు ధ్వనులు కలగాపులగం కాకుండా వుండటం కోసం విడివిడిగా కూర్చుంటారు వారి వాయిద్యపు ధ్వనిని వాళ్ళ ముందు వున్న మైకు రికార్డు చేయటానికి తీసుకుపోతుంది. దాన్ని 'ట్రాక్' అంటారు లోపల రూములో



ఆరోహణ

మ్యూజిక్ డైరెక్టరు, రికార్డింగు ఇంజనీరు కలసి ఏ వాయిద్యపు ధ్వని ఎంత స్థాయిలో కావాలో చూసుకుని మ్యాగ్నటిక్ టేప్‌మీద రికార్డు చేస్తారు" వివరిస్తూ చెప్పాడు శశాంక

'ఆ మధ్యలో వున్నతను అసిస్టెంటు మ్యూజిక్ డైరెక్టరు అతను చేతులు ఊపుతూ ఏ వాయిద్యాన్ని ఎప్పుడు పలికించాలో సూచిస్తూ వుంటాడు అతని సూచనలనుబట్టి వాళ్ళు మ్రోగించటం జరుగుతుంది '

మరి పాడేవాళ్ళు'

'వాళ్ళు వేరే రూములో వుంటారు సంగీతం సరి చూసుకున్న తరువాత గాత్రము, సంగీతము కలిపి రికార్డు చేస్తారు'

అదో కొత్త ప్రపంచంలా అనిపించింది చక్రవర్తికి పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థిలా వుంది అతని పరిస్థితి ఎంతో కుతూహలంగా, ఎంతో ఆసక్తిగా అక్కడ కనిపించే ప్రతిదాన్ని చూడసాగాడు చక్రవర్తి

ఇదేమిటి' అడిగాడు చక్రవర్తి పెద్దసైజు హార్మోనీలా వున్న ఓ వాయిద్యాన్ని చూపిస్తూ

'దాన్ని 'సింథ సైజర్' అంటారు లక్ష రూపాయలపైగా అవుతుంది అదొక్కటే రకరకాల ధ్వనులు పలికిస్తారు దానిలో"

అంతకంతకూ శశాంక పట్ల గౌరవం పెరగ సాగింది చక్రవర్తికి. సినిమా ఫీల్డులో శశాంకకు తెలియని విషయం లేదనిపిస్తోంది.

గాయకుడు రావటంతో ఆ డీలక్స్ థియేటరంతా హడావుడి పడిపోయింది ఎవరి స్థానాలలోకి వాళ్ళు వచ్చి కూర్చున్నారు. శశాంక, చక్రవర్తి హాలు దాటి రూములోకి వచ్చారు. అన్ని సీట్లలోనూ ఎవరెవరో కూర్చుని వున్నారు.

హాలు తలుపులు మూసేశారు రికార్డింగ్ జరుగుతోంది అన్న గుర్తుగా హాలు బయట ఎర్ర దీపం వెలిగింది

కల్పన ఆర్ట్స్ క్రియేషన్స్ సాంగ్ నెంబర్ వన్ టేక్ వన్" గాయకుడు చెప్పాడు మైకులో

వన్, టూ, త్రీ, ఫోర్ అని అసిస్టెంటు మ్యూజిక్ డైరక్టరు సైగ చేయటం, సంగీతం ప్రారంభం కావటం జరిగింది మరో నిమిషంలో గాయకుడి గొంతూ వినిపించింది

మూడవ టేకులో 'ఓ కె.' అయింది పాట ముందు జాగ్రత్త కోసం నాల్గవ టేకు కూడ తీశారు అందరికీ నమస్కారాలు చేసి మరో రికార్డింగుకు వెళ్ళిపోయాడు గాయకుడు. సినిమా పత్రికా విలేఖరులు డైరక్టరు, ప్రొడ్యూసర్ల చుట్టూ మూగారు ప్రశ్నలు వేస్తూ వివరాల కోసం

రికార్డింగ్ ముహూర్తానికి వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపో సాగారు. చక్రవర్తి శశాంకా థియేటరు దాటి ప్రక్కనే వున్న విశాలమైన తోటలోకి వచ్చారు.

"ఎన్నో సినిమాల్లో డ్యూయట్లు, సీన్లు తీశారు ఈ తోటలో"

తోటంతా కలయ చూశాడు చక్రవర్తి. అక్కడ నుంచి వాహినీ స్టుడియోలోని నాల్గవ ఫ్లోర్‌కు వచ్చారు. అంతకు కొద్ది నిముషాల క్రితమే షూటింగ్‌కు లంచ్ బ్రేక్ ఇవ్వటం వల్ల పెద్దతారలు, డైరక్టరు వెళ్ళిపోయారు. అక్కడ నుంచి టెక్నీషియన్లు, చిన్న తారలు భోజనాలు చేస్తున్నారు వరుసగా.

ఎవర్నో వెళ్ళి పలకరించాడు శశాంక. అతనితో కాసేపు మాట్లాడి వెనక్కి తిరిగి వచ్చాడు

"రా భోజనం చేద్దాం' పిలిచాడు చక్రవర్తిని

"ఎందుకండీ మనం హోటలుకు వెళదాం.'

"భలే వాడివే ఇలాంటి మొహమాటాలు పెట్టుకుంటే ఈ ఇండస్ట్రీలో బ్రతికినట్టే ఇది మన కంపెనీయే" అంటూ బలవంతంగా చక్రవర్తిని లాక్కెళ్ళాడు.

భోజనాల తరువాత ఎవరెవరితోనో మాట్లాడుతూ వుండిపోయాడు శశాంక. దూరంగా నిలబడి ఆ వాతావరణాన్ని, మనుషులను గమనించసాగాడు చక్రవర్తి. అంత పెద్ద స్టుడియోలో అందులోను షూటింగ్ జరుగుతున్న ప్రదేశంలో వున్నందుకు గర్వించాడు. తాను చాలా ఎదిగి పోయినట్టు అనిపించింది చక్రవర్తికి

గంట తరువాత తిరిగి వచ్చాడు శశాంక.

"ఇప్పుడు డైరక్టరు గారు బిజీగా వుంటారు. రేపు కలుద్దాం."

ఇద్దరూ చక్రవర్తి రూముకు వచ్చారు. ఆటోలో తిరిగి వస్తున్నప్పుడు దారిలో వున్న డైరక్టర్ల ఇళ్ళు, నిర్మాతల ఇళ్ళు, తారల ఇళ్ళు చూపించాడు శశాంక.

"మీరేమీ అనుకోకపోతే నాకో చిన్న రూము చూసి పెట్టండి. ఎంత కాలం అని ఈ హోటల్లో వుండగలను."

"మద్రాసులో రూము, ఈ ఇండస్ట్రీలో శీలం వున్న ఆడది దొరకటం అంటే కోటి రూపాయల లాటరీ వచ్చినట్టే" నవ్వుతూ అన్నాడు శశాంక.


"అంత కష్టం అంటారా "

"ఎంత కష్టమో అనుభవం అయితేగాని తెలీదు."

"ఎన్ని రోజులని వుండగలనండీ ఈ హోటల్లో" ఖర్చవుతున్న డబ్బును తలచుకుని అన్నాడు చక్రవర్తి.

కొద్ది సేపు మౌనంగా వుండిపోయాడు శశాంక. అతని ఆలోచనలు వేరుగా వున్నాయి. కొంత కాలం వాళ్ళ దగ్గరా వీళ్ళ దగ్గరా పని చేసిన శశాంక ప్రస్తుతం ఖాళీగా వున్నాడు తిరిగి ఎవరి దగ్గరనో మళ్ళీ అసిస్టెంటు డైరక్టరుగా చేరాలి. అంత వరకు మద్రాసులో వుండటానికి ఓ ఆధారం కావాలి అందినంత వరకు అప్పులు చేశాడు. ప్రస్తుతం అప్పు కూడా పుట్టని పరిస్థితి శశాంకది. రెండు నెల్లుగా రూముకు అద్దె బాకీ వున్నాడు.

సినిమా ఫీల్డు గురించి చక్రవర్తికి ఏమీ తెలియక పోవటం వల్ల తాను ఓ






V.V.D

ఊహలలో విహరించే
నవయౌవన సుందరాంగి
ఆమె హృదయాన్ని దోచుకున్నది ఎన్నెన్నో.
అల్లనల్లన సాగే అందాల సెలయేరు
హాయి హాయిగ వీచే చల్లని మలయ మారుతం
హృదయాన్ని చూరగొన్న సొగసైన చెలికాడు
రంగు రంగుల కోమల కుసుమాలు
నిగ నిగలాడే సుదీర్ఘ శిరోజాలు
ఆ శిరోజాలకు
వి.వి.డి. కొబ్బరి నూనె



VVD-2/86 R



వి.వి.డి. కొబ్బరి నూనె

సహజ శిరోజాల యౌవన రహస్యం

V.V.D

ఆరోహణ

సినిమా డైరక్టు చేస్తున్నానని అబద్ధం చెప్పాడు. అవకాశం ఇస్తానని చక్రవర్తికి ఆశ పెట్టాడు. చక్రవర్తికి అందర్నీ పరిచయం చేస్తున్నట్టు నటిస్తూ అతని ఖర్చుతో తాను అందర్నీ కలుసుకొని పని వెతుక్కోవాలన్నది శశాంక ఆలోచన.

నిజానికి సినిమాల్లో నటించి పెద్ద నటుడు కావాలని మద్రాసు వచ్చాడు శశాంక. అవకాశాలు రాలేదు. తెచ్చుకున్న డబ్బు అయిపోయింది. వెనక్కి పోవటానికి ముఖం చెల్లలేదు. ఉన్న పరిచయాల వల్ల జీవనాధారం కోసం ఒకరిద్దరు డైరక్టర్ల దగ్గర అసిస్టెంటుగా చేరాడు. కాని అతని దృష్టి ఆ శాఖ మీద కన్నా నటుడు కావాలనే ఉండటంతో మనసు కేంద్రీకరించి పని చేయలేక పోయాడు. దానితో ఆ అవకాశాలూ పోయాయి. అప్పటి నుంచి డబ్బు కోసం ఎలాంటి పని చేయటానికైనా సిద్ధపడుతున్నాడు శశాంక.

శశాంక లాంటి వాళ్ళు సినిమా రంగంలో ఎందరో వున్నారు. ఆశ ఆవేశం తరుముకొస్తే ఆ రంగంలోని గ్లామర్ ఉక్కు కౌగిలో నలిగి దిగజారి పోయిన వ్యర్థ జీవితాలు ఎన్నో వున్నాయి.

తన మాటలకు లోబడి తానేదో అవకాశం కల్పిస్తానని నమ్మి వున్న చక్రవర్తిని వదులుకోవటం ఇష్టం లేదు శశాంకకు.

"మీరేమీ అనుకోకపోతే నా రూములో నే వుండచ్చు" అన్నాడు శశాంక చివరికి.

"మీ రూములో నా మీకు ఇబ్బంది అవుతుందేమో."

"ఇబ్బంది ఏముంది. స్నేహితులన్న తర్వాత ఆ మాత్రం సర్దుకోకపోతే ఎలా."

"కానీ" ఏదో చెప్పబోయాడు చక్రవర్తి.

"మీరేం మొహమాటం పెట్టుకోవద్దు. మనం ఒకే రూములో వుండటం కూడ చాలా అవసరం. షూటింగ్ మొదలైతే ఎలాగూ ఆఫీసు వుంటుంది. అంత వరకు మనం ఒకే రూములో వుంటే డిస్కస్ చేసుకోటానికి, ఎవరినన్నా కలుసుకోటానికి బావుంటుంది."

"సరే మీ ఇష్టం. కాని నావల్ల మీరిబ్బంది పడకూడదు."

'అలాంటిది ఏమీ లేదు. పదండి."

"ఎమిటి ఇప్పుడేనా" ఆశ్చర్యంగా అన్నాడు చక్రవర్తి.

"అనుకున్న తర్వాత ఆలస్యం ఎందుకు" తొందర చేశాడు.

తుకారాం వీధిలో వున్న శశాంక గదిలోకి అడుగు పెట్టాడు చక్రవర్తి. చాలా చిన్న రూము అది. ఇద్దరు వుండటం కష్టమే అయినా మరో మార్గం లేదు. రూమంతా కలయ చూశాడు చక్రవర్తి.

రెండు చాపలు, మూలగా ఓ ట్రంకు పెట్టి, దండెం మీద కొన్ని మాసిన బట్టలు, కిటికీలో అద్దం దువ్వెన పౌడరు తప్ప ఇంకేమీ లేవు ఆ గదిలో. గదిని. ఊడ్చి చాలా రోజులు అయినట్లుగా వుంది.

"నేను సింపుల్‌గా వుంటాను. ఒక్కడికే పెద్ద గది ఎందుకు. అసలు ఈ గది దొరకటానికే చాలా అవస్థలు పడ్డాను" చెప్పాడు శశాంక గదిని పరిశీలిస్తున్న చక్రవర్తికి.

"ఈ నగరంలో ఈ మాత్రం చోటు చాలు. అద్దె ఎంత."

"నూటయాభై. ఇరుగ్గా వుంది కదూ."

"పరవాలేదు" అన్నాడు చక్రవర్తి తన సామాను ఓ మూల సర్దుకుంటూ.

"తప్పదు సర్దుకోవాలి. అవకాశం లేదు కాని లేకపోతే లెట్రినులు కూడ అద్దెకివ్వగలరు ఈ పట్నంలో."

నవ్వకుండా వుండలేక పోయాడు చక్రవర్తి. చాపలు దులిపి గదిని ఊడ్చాడు శశాంక. ఖాళీగా వున్న కూజాను బయటికి తీసుకుని వెళ్ళి నీళ్ళు నింపి తెచ్చాడు.

"మిమ్మల్ని శ్రమ పెడుతున్నానండీ" ఇబ్బందిగా అన్నాడు చక్రవర్తి.

"ఇంకా ఈ అండీ లెందుకు హాయిగా శశాంకా అనో శశీ అనో పిలవక."

అలాగే అన్నట్లు ప్రేమగా చూశాడు శశాంక వైపు చక్రవర్తి. తనని అంతగా ఆదరిస్తున్న శశాంక పట్ల కృతజ్ఞతా భావం నిండింది మనసులో.

"బహుశా రేపు వారం మన ప్రొడ్యూసరు రావచ్చు. రాగానే నీ విషయం మాట్లాడేస్తాను. మొదటి సినిమా కాబట్టి డబ్బు తక్కువ ఇస్తాడేమో."

"డబ్బుదేముంది అవకాశం ఇస్తే చాలు."

"అట్లా అని ప్రొడ్యూసరుతో అనేవు అసలివ్వరు. ఎంతో కొంత ముందే మాట్లాడదాం" చక్రవర్తి ఆశను మరింత పెంచుతూ అన్నాడు శశాంక.

"డబ్బు సంగతి నీ ఇష్టం."

"ఇతర కంపెనీలు కూడ ట్రై చేద్దాం."

"అలాగే."

"కొంచెం సేపు నిద్రపోయి సాయంత్రం పాండీ బజారుకు వెళ్దాం" అంటూ చాప మీద నడుం వాల్చాడు శశాంక.


తను మద్రాసు వచ్చినప్పటి నుంచి జరిగిన విషయాలు, శశాంకతో పరిచయం. అతని రూములో చేరటం అన్నీ వివరంగా తెలుపుతూ ప్రభాకర్‌కు ఉత్తరం రాశాడు చక్రవర్తి. రూము అడ్రసే ఇచ్చాడు సమాధానం వ్రాయమని.


నీలిమకు కూడా ఉత్తరం రాయాలనిపించింది. కాగితం చేతిలోకి తీసుకున్నాడు. కలం కదలటం లేదు. నీలిమ రూపం, నీలిమ మాటలు అతని కళ్ళ ముందు కదలి మత్తులోకి తీసుకు వెళ్ళాయి. ఏమని రాయాలి నీలిమకు. ఏం సాధించానని రాయాలి. ప్రారంభం కావటానికే ఇంకా కొట్టుమిట్టాడుతున్న కొత్త జీవితం గురించి ఏమని వివరించాలి ఆమెకు. తనిలా వచ్చేయటం ఆమెకు ఆనందం కలిగిస్తుందో, బాధ కలిగిస్తుందో.


ఏం చేస్తూ వుంటుంది నీలిమ. తన గురించి ఆలోచిస్తుందా. తన విషయాలు తెలుసుకుంటూ వుంటుందా?

నవ్వొచ్చింది చక్రవర్తికి. కలం మూసి చాప మీద వెల్లకిలా పడుకున్నాడు. కలుసుకోవద్దనీ ఇంటికి రావద్దనీ ఆమె చెప్పినప్పటికీ ఇంకా ఆలోచిస్తున్నాడు ఆమె గురించి. ఎలా ఆలోచించకుండా వుండగలడు. తనలోని రచయితను పదును పెట్టి వెన్ను తట్టిన స్త్రీ ఆమె

అలాగే నిద్రలోకి జారుకున్నాడు చక్రవర్తి. (ఇంకా ఉంది)







గెలుపు ఓడింది

భమిడి వెంకటేశ్వర్లు

గోపాలరావు కళ్యాణి వైపే చూస్తూ నీళ్ళు నములుతున్నాడు. అప్పుడప్పుడు గుటకలు మింగుతూ ఏవో ఆలోచనల్లో కన్ఫ్యూజు అవుతూ మెలికలు తిరుగుతున్నాడు.

కళ్యాణికి పది నెలల క్రితమే డిగ్రీ చేతికొచ్చింది. అప్పట్నుంచి, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుండగా నాలుగు నెలల క్రితమే ప్రస్తుత వుద్యోగం వచ్చింది. అయితే యీ విరామ సమయంలో ఆమెకు పత్రికలు చదవటం, సినిమాలు చూడటం. పెళ్ళి చూపులకు హాజరవటం తన అనుభవంలో మిగిలాయి.

ఇంక హీరో గోపాలరావుకి వయసు ముప్పయ్... ఏడేళ్ళ ఉద్యోగ జీవితం, నాలుగేళ్ళ పెళ్ళి చూపుల అనుభవం, వుందని చెప్పచ్చు. అతని ప్రస్తుత స్కోరు నలభై ఎనిమిది, స్టిల్ బ్యాటింగ్ యిన్ మారేజ్ అటెండెన్సు. ఎవరైనా అతన్ని 'నీ కెటువంటి అమ్మాయి కావాలి, ఏవేం తీసుకుంటావు,అని అడిగితే – వెంటనే యిలా జవాబు చెప్తాడు, "ఓ అరవై వేలన్నా తీసుకోకపోతే ఏం బాగుంటుంది! డిగ్రీ చదులైనా వుండకపోతే ఏం లాభం! ఉద్యోగం లేని పెళ్ళాం దేనికి! అందం, ఆకర్షణ లేనిదాన్ని కట్టుకుని ఏం చేసేది! సినిమాలు, షికార్లు అంటూ నన్ను వేధిస్తే ఎలా బతికేది' మరో మగాడి వైపు చూసినా, మాట్లాడినా నా మనసంగీకరించదేమో! విలాస జీవితం కావాలంటే నేను తెలుగు గంగలో దూకి చావాల్సిందే! ఆఫీసు నుంచి ఆరున్నరకైనా కొంపకు చేరకపోతే ఎలా! ఏడాది కోమాటైనా బహుమతులు పుట్టింటి నుంచి తేగల్గే తెలివి. నేర్పు వుండే అమ్మాయైతే బెటరు!" అంటూ మానిఫెస్టోలోని వివరాలు ఏకరువు పెడ్తాడు.

"మరి నీకేం ఆస్తిపాస్తులున్నాయ్" అని ఎవరైనా ప్రశ్నించారనుకోండి – అందుకు జవాబు కూడా రెడీగా వుంటుంది. "మా నాన్న, శివరామయ్య రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటులో పని చేస్తూ ఏడెనిమిది లక్షలు పట్టేసాడు. నాలుగు యిళ్ళు కొన్నాడు. అయితే ఓసారి అవినీతి నిరోధక అధికారులకు దొరికిపోయాడు. ఓ రెండు లక్షలు ఖర్చు పెడితే ఉద్యోగం మళ్ళీ వచ్చేదే.. కాని ఎందుకు చెప్పండి... ఇంక నేనొక్కడ్నే కొడుకుని... ముగ్గురు అక్కయ్యలకు వివాహాలు చేసేసాడు మా నాన్న. కాబట్టి మనకు బాధ్యతలు లేవు. నేను నిశ్చింతగా, ఆడబ్బుని ఖర్చు పెట్టుకో వచ్చు" అని.

ఇప్పుడు కళ్యాణి రాకతో, సెక్షన్లో రద్దీ పెరిగింది. ఆమెతో కబుర్లు కాకరకాయలు చెప్పేందుకు కుర్రకారులు పోటీ పడుతున్నారు. అది చూస్తున్నప్పట్నుంచీ గోపాలరావుకి వంటి మీద జెర్రులు పాకుతున్నాయి. కాళ్ళు, చేతులు ఆడటం లేదు... తనని ఎలా ట్రాప్ చేయాలి... తన ధారికి ఎలా తెచ్చుకోవాలి – అనే ఆలోచిస్తున్నాడు.

ఇద్దరి మధ్యా చనువు బాగా పెరిగింది.

ఇంక ఆలస్యం చేయకుండా ఓ రోజు అడిగేసాడు గోపాలరావు "నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను." అని.

కళ్యాణి భళ్ళున నవ్వి అంది "ఎంత కట్నం యిస్తారు."

అంతే, అతని గుండె ఓ సారి ఆగి తిరిగి కొట్టుకోసాగింది. "వాట్ నేను కట్నం యివ్వటం ఏమిటి... నువ్వే నాకు యివ్వాలి" అని గర్వంగా అన్నాడు.

మరోసారి నవ్వింది కళ్యాణి "అది మరొకరి విషయంలో కావచ్చు. నేను ఉద్యోగం చేస్తూ వెయ్యి రూపాయల జీతం తెస్తున్నాను. అంటే ఏడాదికి పన్నెండు వేలు అన్న మాట. మీకు యింటి పని, పడకింటి పని చేసేందుకు నాకు జీతాన్ని

కట్నంగా యివ్వాలి ఎం తిస్తారు చెప్పండి రేపే మా వాళ్ళని పంపిస్తాను నిశ్చయంగా అంది తను

'మగాడు ఏనుగుతో సమానం ఏనుగు చచ్చినా, బతికినా విలువ తగ్గదు మామూలుగా నా రేటు లక్ష నీకు ఏభై వేలు తగ్గింపు

"నాకు తగ్గింపు ధరలో వచ్చే మొగుడొద్దు నాకు క్వాలిఫికేషనుకంటే, క్వాలిటీ ముఖ్యం పైగా మీ ఫాదరు శివరామయ్యగారు గడ్డి తిని సంపాదించి లక్షలు గడించారు అటువంటి వారికి కోడలుగా వెళ్ళటం నాకిష్టం లేదు " కళ్యాణి తన అభిప్రాయం చెప్పింది

ఇదంతా ఎలా తెలిసిందాని ఆశ్చర్యపోతున్నాడు గోపాలరావు వెంటనే తమాయించుకుని, అవకాశం పోగొట్టుకోకూడదన్న వుద్దేశ్యంతో అన్నాడు "ఏభైకి తక్కువైతే బాగుండదు నువ్వు చెప్పు ."

కళ్యాణి బ్యాగ్‌లోంచి ఓ ఫొటో తీసి చూపించింది "ఇతను బాంకులో ప్రొబేషనరీ ఆఫీసరు ఇది కట్నం లేని పెళ్ళి నా పెళ్ళి తనితో నిశ్చయమైంది నువ్వు కేవలం గుమాస్తాగాడివి నువ్వు ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగస్తుడివి మన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు నాకు మేనమామ నిన్ను శంకరగిరి మాన్యాలకు పంపించగలను ఇటువంటి గొంతెమ్మ కోరికలతో అమ్మాయిలను చూడకు నీ సంగతి తెలుసుకునేందుకే యిలా చనువుగా ప్రవర్తించారు నువ్వు కట్నం, కానుకలు తీసుకుని పెళ్ళాడితే నీ ఉద్యోగానికే ఎసరెట్టించేస్తాను నా రిజిగ్నేషను లెటరు రెండు మూడు రోజుల్లో అంగీకరించబడుతుంది బీ కేర్ ఫుల్ " అంటూ ఫొటో లాక్కుంది కళ్యాణి

రెడు రోజుల తరువాత ఆమె వెళ్ళిపోయింది

అంతటి సంచలనాన్ని, తుఫానుని రేపిందామె కలవరం, కంగారు పుట్టించింది దాదాపు రెండు నెలలు దాకా మామూలు మనిషి కాలేకపోయాడు మనసులో బెదురు లేకపోలేదు తప్పనిసరిగా పెళ్ళి చూపులకు వెళ్ళొస్తున్నాడు ఇంకా గ్రీన్ సిగ్నలు యివ్వబడలేదు

ఈ విధంగా రోజూ ఆలోచిస్తుండగానే మరో నెల ఇంకో నెల గడిచిపోయాయి ఏమైనా కళ్యాణికి తన గొప్పదనాన్ని చూపించాలని, పెద్దింటి సంబంధం పొందాలనే ప్రయత్నంలోనే స్కోరుని పెంచసాగాడు గోపాలరావు సరిగ్గా అదే సమయంలో, అతని దగ్గరకు ఓ పెద్దమనిషి వచ్చాడు ఆజానుబాహు విగ్రహం, సిల్కు లాల్చీ, ఖద్దరు పంచె, భుజంమీద కండువా, వేళ్ళకు ఉంగరాలు, కళ్ళకు ఖరీదైన కళ్ళజోడు అయన రాకతో గుభాళించిన సెంటు వాసన

అయన పేరు కనకారావు చేతిలో గోపాలరావుకు సంబంధించిన వివరాలు వున్నాయి ఓ కాగితంలో

కొంచెం మాట్లాడాలి అంటూ ఆ కాగితాన్ని అతని చేతిలో పెట్టాడు కనకారావు ఇద్దరూ బయటకు నడిచారు.

గేటు దగ్గర ప్రీమియర్ పద్మిని కారు వుంది. కనకారావు డోరు తెరిచి డ్రైవింగు సీటులో

నిరుద్యోగ పర్వం

మెడవంచి
మెడలు వేశారు
యూనివర్సిటి ఫస్టొస్తే
మెడపట్టి
గెంటేశారు
అదే యూనివర్సిటీలో
ఉద్యోగానికెళితే

–గుంటుపల్లి కిరణ్‌కుమార్

గెలుపు ఓడింది

కూర్చున్నాడు గోపాలరావుని కూడా కూర్చోమన్నట్లుగా చూసాడు, డోరు తెరుస్తూ

"హొటేల్ అశోకాలో మాట్లాడుకుందాం కొంచెం ఆలస్యమైనా ఫరవాలేదు కదా అంటూ కారుని పోనిచ్చాడు కనకారావు

తన అదృష్టానికి పరవశించిపోతుంటాడు గోపాలరావు కళ్యాణి ఫ్లాష్‌లో మెరిసింది అదృష్టం యీ విధంగా తలుపు తడుతుందని తను ఎప్పుడూ వూహించలేదు. ఆమెను తిప్పి కొట్టే అవకాశంగా భావించాడు గోపాలరావు.

ఇది యిలా వుండగా సెక్షనులో స్టాఫు, సిబ్బంది మరోలా వూహించసాగారు " గోపాలరావు అదృష్టవంతుడు కాదు సంబంధం కట్నం, కానుకలు, లాంఛనాలు బాగానే ముడతాయి దీనితోనైనా ఒప్పుకుంటే మంచిది రొట్టె విరిగి నేతిలో పడింది. మనకు మంచి పార్టీ యిస్తాడు" అని

హొటలు ముందు కారు ఆగింది ఇద్దరూ రూము నెంబరు నూట పదహారులోకి నడిచారు అది ఏ సీ రూము లోపల కూర్చోగానే బోయ్ వచ్చి కూల్‌డ్రింక్స్ పెట్టాడు వారి ముందు

"నా పేరు కనకారావు ఏక్లాస్ కంట్రాక్టరుని మీ ఆఫీసర్లంతా నాకు బాగా తెలుసు ముఖ్యంగా మీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు నా క్లాస్‌మేట్ మీ ఫాదరు శివరామయ్య నాకు తెలుసు కాని ఆయనకు నేను తెలియకపోవచ్చు నేను ఫోను చేస్తే ఏ మినిస్టరైనా చెప్పిన పని చేస్తాడు ఎంతో మంది ఆఫీసర్లు నా డబ్బు తిన్నారు ఇదంతా నా గురించి చెప్పుకోటం కాదు మాట వరసకి చెప్తున్నాను. అంతే" అంటూ జేబులో నుంచి ఓ ఫొటో తీసి గోపాలరావుకిచ్చాడు కనకారావు

ఆ ఫొటో ఓ అమ్మాయిది పేరు మందాకిని వయసు యిరవై రెండు ఎత్తు అయిదు రెండు బరువు నలభై ఆరు చదువు బి ఏ ఫొటో వెనుకనున్న వివరాలు అవి కలర్ ఫొటో కావటంతో ఆమె చాలా అందంగా కనపడుతోంది ముఖ్యంగా కళ్యాణికంటే అందగత్తెలా కనిపించింది ఇప్పుడు గోపాలరావు చూపులు ఫొటో నుంచి తప్పుకోవటంలేదు అప్పుడే మనసులో స్థిరనివాసం ఏర్పరచుకుంది మందాకిని

నువ్వు యింతవరకూ చూసిన అమ్మాయిలు నాకు తెలుసు. ఏ కారణాలతో కాదన్నావో కూడా తెలుసు. నీకు ఏం కావాలో ఎంత కావాలో, ఎందుకు కావాలో తెలుసు నాకు మీ ఫాదరు పావలా లంచంతో ఉద్యోగ జీవితం ఆరంభించాడు లక్షలు సంపాదించినా ఏం లాభం? కాఫీ తాగడు సిగరెట్లు కాల్చడు మందుకొట్టడు పావలా ఖర్చు పెట్టి పెళ్ళానికి పూలు కొనడు ఎందుకీ సంపాదన మందాకిని నాకు ఒక్కత్తే కూతురు నీ గురించి తెలిసాక నీకు యివ్వాలనిపించింది ఏమంటావ్ కనకారావు అంటున్నాడు

గోపాలరావుకు యిదంతా కలగా, సినిమాగా వుంది

నా గురించి, నా కూతురికి పెళ్ళిచేసే ఉద్దేశ్యంతో చెప్తున్నానని భావించవద్దు నేను చూసిన మొదటి సంబంధం యిది నువ్వు కాదంటే మరో ప్రయత్నం చేస్తాను నా పలుకుబడితో పెద్ద ఉద్యోగం వేయిస్తాను లేదంటే యిక్కడే ప్రమోషను త్వరగా వచ్చేలా చూడగలను బాండు మేళాంతో ఘనంగా వివాహం చేస్తాను వీడియో రికార్డింగ్ చేయిస్తాను కనకారావు అతని వైపు చూస్తూ చెప్తున్నాడు

సరే' అనేయాలనుంది గోపాలరావుకి కాని కన్నవాళ్ళకు చెప్పి చేయాలని మరో వైపు. ఇంకా ఎందరిని చూడాలి' ఇప్పటికే వయసు ముప్ఫయికి పెరిగింది ఒంటరి బతుకు. ఏకశయ్య జీవితం కళ్యాణిని పెద్ద దెబ్బతీయాలంటే మందాకిని తన భార్య కావాలి ఏదో చెప్పబోయాడు.

అసలు విషయం నాకు మందాకిని తప్ప ఎవరూ లేరు నీకేం కావాలో ముందే అడుగు పెళ్ళయ్యాక అడిగితే యిచ్చేదిలేదు సాధింపులు వేధింపులు అంటే నాకు గిట్టవు నా కూతురిని పువ్వుల్లో పెట్టి పెంచాను అది బాధపడటం నాకు నచ్చదు నేను ఫోను చేస్తే ఏ పోలీసు అధికారైనా పరుగెట్టుకు వస్తాడు

కనకారావుకి ఎలా జవాబు చెప్పాలో గోపాలరావుకి అర్థం కావటంలేదు కారణం మాత్రం ఒక్కటే' కనకారావు ఛస్తే అంతా తనకే దక్కుతుంది ఎటూ మనసులో వున్న కట్నం ఫిగరు 'అరవై చెప్పాలనుకున్నాడు కానుకలు, లాంఛనాలకు 'ఇరవై చెప్పాలనుకున్నాడు

ముందు నీకు అమ్మాయి నచ్చితే మీ వాళ్ళొచ్చి చూడవచ్చు. ఫొటో పంపించు వారిక్కడకు రావాలంటే కారు పంపిస్తాను పోతే అతిథులు, స్నేహితులు, బంధువులు చూడడానికి మీయిష్టం

నేను ఖర్చుకి వెనుకాడను 'ఫొటో, జేబులో నుంచి మరోసారి తీసి చూసుకుంటూ అన్నాడు కనకారావు

మీ యిష్టం అంటూ ఫొటో తీసుకున్నాడు గోపాలరావు

ఇంక చివరి విషయం విను నీకు అమ్మాయి నచ్చింది మీ వాళ్ళకు నచ్చకపోతే ధైర్యంచేసి పెళ్ళి చేసుకోగలవా' మీ వాళ్ళని ఎదిరించగలవా. లేదంటే యిప్పటి వరకూ అయిన ఖర్చు- పెట్రోలు, రూము రెంటు, కాఫీ ఖర్చు మొత్తం అయిదొందలు నువ్వే చెల్లించాల్సి వుంటుంది. అంగీకార

మేనా?" అడిగాడు ఆయన.

"నాకు నచ్చింది మీ అమ్మాయి. మా వాళ్ళక్కూడా నచ్చుతుంది" చెప్పి లేచాడు గోపాలరావు.

కనకారావు అతన్ని కారులో ఆఫీసు దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు. గోపాలరావులో ఆనందం ... సంతోషం.

★ ★ ★ ★ ★ ★

గోపాలరావు తండ్రిని కలిసి వివరించాడు. శివరామయ్య ఎంతో ఆలోచించాడు. కాని కనకారావు గురించి గుర్తుకురాలేదు. అదీ మంచిదనుకున్నాడు. లేకపోతే తన అవినీతి బతుకు గురించి హేళన చేయవచ్చును. మరో వైపు తామెళ్ళి మందాకినిని చూడటం అనవసరమనిపించింది. అందగత్తె కోడలు, గొప్పింటి వియ్యంకుడు ... ఇంతకన్నా ఏం కావాలి!

మూడో రోజు మళ్ళీ గోపాలరావుని కలిసాడు కనకారావు.

"ఏమన్నారు మీవాళ్ళు" అంటూ పాయింటులోకొచ్చేసాడాయన.

"మా అందరికీ నచ్చింది. మీరు కారు పంపిస్తే వాళ్ళొస్తారిక్కడకు.". వినయంగా చెప్పాడు గోపాలరావు.

కనకారావు జేబులోంచి ఓ ఫోటో తీసాడు. "ఈ కుర్రాడు ఓవర్సీస్ బాంకులో కాషియరు. మాకు దూరపు బంధువని తెలిసింది. మా అమ్మాయి గురించి తెలియగానే ఒకాయన యీ ఫోటో తెచ్చి యిచ్చాడు. ఇంతకీ ఎలాగున్నాడు కుర్రాడు?" తీక్షణంగా చూసాడాయన.

గోపాలరావులో వణుకు ప్రారంభమయింది. తనకు పోటీగా తయారైనాడా? నోరు పెగల టంలేదు. తనకు కావలసిన అందం, డబ్బు యీ వెధవ తన్నుకుపోతాడేమో ... వెంటనే ఫీల్డులోకి వెళ్ళకపోతే తనకు మిగిలేది ఆయాసం, శ్రమ ..." మీకెలా వున్నాడు" ఎదరు ప్రశ్న వేశాడు ఏం తోచక.

"నాకు బాగోదంకాదు. మందాకినికి నచ్చాలి. ఉదయమే వచ్చింది ఈ ఫోటో. మా ఆవిడక్కూడా చూపలేదు. మరో విషయం. నాకైతే యీ సంబంధం నచ్చలేదు. బంధువులతో సంబంధం కలుపుకోకూడదనేది నా పాలసీ. నువ్వు నాకు నచ్చావు. ముఖ్యంగా నా ఫ్రెండు - అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు వున్న ఆఫీసులో నువ్వు పనిచేస్తున్నావు. వాడి సాయంతో నీకు మంచి సీటో, ప్రమోషనో యిప్పించాలన్నది నా ఉద్దేశ్యం. కాని యిప్పుడు నా కూతురు యీ ఫోటో చూస్తే మాత్రం నిన్ను కాదంటుందేమోనని భయపడుతున్నాను. అందుకే నేను తొందరపడుతున్నాను. "కనకారావు ఫోటోని జేబులోకి తోసేసాడు.

గోపాలరావు కూడా భయపడుతున్నాడు. ఆ విషయాన్ని గ్రహించగానే-

"అయితే మనంమీ యింటికే వెడదామా ... లేక మీ వాళ్ళనే యిక్కడకు తీసుకువస్తావా ... నాకు హోమ్ మినిస్టరుతో పనుంది. లేకపోతే నేనే కారు డ్రైవ్ చేసేవాడిని, డ్రైవరు కూడా లేడు ..." అన్నాడాయన.

"కారెందుకులెండి ...మీరిక్కడే వుండండి .. నేను వెళ్ళి తీసుకువస్తాను. ఇంక మీ అమ్మాయిని చూడనవసరంలేదు. కేవలం మాటలు, అంతే!" గోపాలరావు సవినయంగా చెప్పాడు.

కనకారావు వంద రూపాయల నోటు తీసి అతనికందిస్తూ "ఇది దారి ఖర్చుల నిమిత్తం ... సరిపోతుందా" అన్నాడు.

"ఎందుకండీ యీ డబ్బు" అంటూనే అందుకున్నాడా నోటుని. గోపాలరావు వెళ్ళిపోయాడు.

★ ★ ★ ★ ★ ★

ఎనిమిది గంటలకు తిరిగివచ్చాడు గోపాలరావు.

కిటికీలో నుంచి ప్రపంచాన్ని చూస్తున్న కనకారావు, బజ్జరు శబ్దంతో తలుపు తీశాడు. "రావయ్యా ..." అంటూ ఆహ్వానించాడు.

"మావాళ్ళు రాలేదు. నాన్నగారికి వంట్లో బాగుండలేదు. నన్నే మాట్లాడమని చెప్పారు ... విషయాలు చెప్పు"

"నాదేముంది. మీ యిష్టం. అంత్య నిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరమే మంచిది. నాకైలాగైనా సమ్మతమే ... ఇంతకీ ఏమన్నారు మీ ఫాదరు". కనకారావు ఏదో ఆలోచిస్తూ అడిగాడు.

గోపాలరావు యిబ్బంది ఫీలవుతున్నాడు "నాన్నగారికి రాబడి లేకపోవటంతో, మనసు బాగుండటంలేదు. పెళ్ళికూడా ఆర్భాటంగా వుండనవసరంలేదు. ఆ ఖర్చుకూడా కట్నం కింద యిచ్చేయమన్నారు" అన్నాడు ఎల్లాగో.

"మీ యిష్టం. ఇంతకీ కట్నం ఎంత కావాలి ... మొత్తంమీద ఎంత కావాలి ..." ప్రశ్నించాడు కనకారావు.

గోపాలరావు సంశయిస్తున్నాడు.

"చెప్పవయ్యా ... నిర్భయంగా అడుగు. ఇది వ్యవహారం. ఇంతకీ కాష్ కావాలా, చెక్ యిమ్మంటావా ... నీ పేరనా, అమ్మాయి పేరనా!"

ఇప్పుడు కూడా గోపాలరావుకి కంగారుగానే వుంది.

జేబులో నుంచి చెక్కు పుస్తకం తీసాడు కనకారావు "డబ్బు యిస్తే యీ రోజుల్లో ప్రమాదం దొంగల భయం అందుకే చెక్కు యిస్తాను బాంకులో వేసుకో . కావలసినప్పుడు తీసుకోవచ్చు ఏమంటావ్ ." అంటూ ఎనభైవేలకు రాసాడు చెక్కుని ఆయన.


చెక్కు అందుకోగానే చేతులు వణికాయి గోపాలరావుకి.

"ఖర్చుల కోసం రెండు వేలు యిస్తున్నాను. వివాహం గుళ్లో ... నేనూ మీ ఫాదరుతో ఏకీభవిస్తున్నాను. ధరలు యిలా మండిపోతుంటే బంధువులు, స్నేహితుల్ని ఆహ్వానించటంలో అర్థంలేదు. ఆ ఖర్చు మనకే మిగలాలి. రోజుల్నిబట్టి మనము మారాలి. అవునా?" కనకారావు వాస్తవం గురించి బోధించ సాగాడు. కరెక్ట్ అని మాత్రం అన్నాడు గోపాలరావు.

"ఇంక చివరగా చిన్న విషయం. మందాకిని గారాబుగా పెరిగిన పిల్ల.. దాన్ని కష్టపెట్టినా, యిబ్బంది పెట్టినా పరిస్థితులు ఎంతో దూరం వెడతాయి. నా పలుకుబడి, డబ్బు, హోదా గురించి నీకు తెలుసుగా నువ్వు మనస్ఫూర్తిగా యిష్టపడుతున్నట్టేగా.. ఇప్పటికైనా మించి పోయింది లేదు... లేదంటే బాంకు కాషియరు కోసం ప్రయత్నించమంటావా.." అంటూ ఫోటో కోసం జేబులో చేయి పెట్టాడు కనకారావు.

కూతురి పట్ల వున్న ప్రేమ, మమకారం ఆ తండ్రి మాటల్లో ప్రతిధ్వనిస్తోంది. గోపాలరావు కాబోయే మావగారి చేతిలో చేయి వేసాడు. "మీకేం ఫరవాలేదు. నేను ప్రేమగానే నా భార్యని చూసుకుంటాను. నేను ప్రస్తుతానికే డబ్బు మనిషిని" అన్నట్టుగా చూసాడు.

వారం తరవాత మందాకిని గోపాలరావు భార్య అయిపోయింది ఆ వూరి వెంకటేశ్వరాలయంలో. శివరామయ్య, కనకారావు తరపున మొత్తం మీద పాతిక వరకూ వివాహానికి హాజరయ్యారు. డబ్బు పూర్తిగా తమకే మిగిలినందుకు శివరామయ్య,



సంక్రాంతి పర్వదినం.

ఉత్తరాయణ పుణ్యకాలమ్మున మకరసంక్రమణ దివ్య ముహూర్తమ్మున
చిత్తద్యుతిని కలిగించు సంక్రాంతి లక్ష్మి పుష్యరాగమాలికల అలంకంచె
కీర్తి కాంతులీనుచు నవధాన్యరాశులు ప్రతియింట జోగాడగ
ఒత్తగిల్లిన రైతన్నల మెతమెత్తని మనస్సులు కడు కమ్మగా పొంగలించె

నిలువు నామముతోటి హరిల్లో రంగయను హరిదాసుని ధాటి
నెలవు నెలవును దాటి మురిపించె పలు యెదల నలు మూలల మిటుభున్
తెలవారక ముందే భోగిమంటలు లేచె ఎల్లర రప్పించి వడివడిగ
చలిగిలిపోయి చక్కిలిగిలులాయె సరసోక్తులు పలుదెసల నిండుకొనగన్

వేదమంత్రాలు పలుకుచు విప్రవరులు శాంతిపూజలు చేయగ
నాద స్వరాల కులుకుచు గంగిరెద్దులు కడుముద్దుగ దండాలు పెట్టి
వాద ప్రతివాదమ్ములు పలుపందెములై పట్లుపట్టు అందములై కనువిందు చేకూర్ప
మోదభరితమయ్యె ప్రతి డెందము వినోద వేడ్కలన్ పరవశించి పాడ

రంగురంగుల ముగ్గుల నడుమ గొబ్బెమ్మలు కొల్వుగూడగ
కొంగులు బిగగట్టి పంచదార రాచిల్కలు యింపు సొంపుల నటన మాడె
హంగు లొలకబోసి పేరంటాలు పిలిచి బోడికలు పదింపదిగా పోసి
చెంగున వాయనాలు దాచి ముదము కూర్తురె ముదుముద్దుగ ముదిత లెల్లరున్

గోమాతలు పలుపూజలు గైగొను మహా పర్వదినమిది
జామాతలు మరియాద లందెడి పురస్కార దినమిది..
భూమాత కడుపునిండి అన్నదాత నాదుకొనే శుభ దినమిది
శ్రీమాత ఎదదనిండి విశ్వదాతల నుద్ధతించు గర్వదినమిది

–డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

గెలుపు ఓడింది

గోపాలరావు సంతోషించారు.

కనకారావు అల్లుడికి ఓ యిల్లు చూసి, అందులోకి దంపతులని ప్రవేశింప చేసి జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు

* * * *

ఓ రోజు ఆఫీసు కొచ్చింది కళ్యాణి మాజీ ఫ్రెండు గోపాలరావుని కలిసింది తను ఆమెను చూడగానే గతం గుర్తుకొచ్చి కోపం వచ్చినా, వెంటనే తమాయించుకున్నాడు, ముఖమంతా నవ్వుని పులుముకున్నాడు కూర్చునేందుకు కుర్చీ చూపించాడు

"బాగున్నారా" పులకరించింది కళ్యాణి

ఏదో భగవంతుడి దయవల్ల నిర్లిప్తంగానే అన్నాడతను

'మీ లాటి వారికి భగవంతుడి దయ ఎందుకు కల్పవృక్షం లాటి మావగారు, కామధేనువు లాటి భార్యామణి, పుష్పక విమానం లాటి అత్తగారు లభించాలని కోరుకుంటారుగా,అందుకే పూజలు, వ్రతాలు చేస్తారుగా' అంటూ నవ్వేసింది కళ్యాణి.

అది జోకో, ఎగతాళో అర్థం కాలేదు అతనికి

గోపాలరావు మవునంగా వుండిపోయాడు ఇద్దరి మధ్య సాహితీ సమితి మీద కబుర్లు, రాజకీయాల గురించి దొర్లాయి

"మీరు పెళ్ళి చేసుకున్నారని, మీ మావగారు పెద్ద కంట్రాక్టరు అని . కట్నం కానుకలు దండిగా కొట్టేరని, మందాకిని ఒక్కత్తే కూతురుట ప్రీమియర్ పద్మిని కారు కూడా వుందని తెలిసింది పోనీలెండి, నన్ను కాదన్నా మంచి ఛాన్సే కొట్టేసారు . అయినా యీ రోజుల్లో చాలా మందికి డబ్బే కావాలిగా మరి అమె ఎగతాళి చేస్తోంది

"గోపాలరావు అంటే ఏమనుకున్నారు' మీరు కాదంటే నాకు పిల్లే దొరకదా' కట్నమే రాదా ఎంతైనా మగాడు మగాడే' మర్దరు చేసినంత గర్వంగా చెప్పాడు తను

"చాలా సంతోషం ఇంతకీ మందాకిని యిప్పుడు కూడా వంటికి క్రీములు, పౌడర్లు, స్నోలు వాడుతోందా' చటుక్కున అంది ఆమె

ఆ మాటలకాతను అదిరిపడ్డాడు "వాట్, నా భార్య మీ కంటే అందంగా వుంటుంది సౌందర్య సాధనాలు వాడవలసిన కర్మ తనకేమీ లేదు అవన్నీ మీలాటి ఉద్యోగస్తులకు అవసరం ఆడబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు." గోపాలరావు కూడా వెటకారాన్ని తిప్పి కొట్టాడు

'ఇంతకీ మీ మావగారిచ్చిన బాంక్ చెక్కుని కాష్ చేసేరా లేదు ఏం బహుమతులు, వస్తువులు యిచ్చాడు?

కళ్యాణి అతిగా మాట్లాడి విసిగిస్తున్నట్లని పించింది

ప్రస్తుతంకి డబ్బు అవసరం రాలేదు అందుకే అట్టే పెట్టాను ఆరు నెలల వరకూ చెక్కుకి ప్రాణం వుంటుందిగా అన్నాడు గోపాలరావు

మీరు మోసపోయారని నేను చెప్పను ఎందుకంటే మీ లాటి వరుళ్ళకి బాగానే బుద్ధి చెప్తున్నారు నేటి ఆడపిల్లల తల్లిదండ్రులు కనకారావు కంట్రాక్టరు కాదు మా వారి బాంకులో పని చేసే కారు డ్రైవరు ప్రస్తుతం సస్పెన్షన్‌లో కూడా వున్నాడు ఓ ఫ్రెండు దగ్గర ప్రిమియర్ పద్మిని కారు అడిగి కనకారావుని మీ దగ్గరకు పంపించాను నేను ఆయనకు నేను, మా వారు ట్రైనింగు యిచ్చాం మొత్తానికి నాటకాన్ని రక్తి కట్టించాడు మీకు ఇండియాలో వున్న బాంకుల గురించి తెలియదు కాబోలు మీ కిచ్చిన బాంకు చెక్కు చెల్లదు ఆ బాంకు ప్రస్తుతం లేదు పైగా దానిమీద వేసిన తేదీలో పదేళ్ళ క్రితం నాటి సంవత్సరం' వేయబడింది డబ్బు ధ్యాసలో మీరు యిదంతా గమనించినట్లు లేదు పైగా పెళ్ళి ఖర్చులకు కనకారావుకి నేనే రెండు వేలు యిచ్చాను పాపం, మందాకినికి పెళ్ళి చేయలేక పోతున్నాడని తెలిసి, అతనిమీద జాలితో. మీ మీద యిలా కక్ష తీర్చుకున్నాను ఇప్పుడు చెప్పండి, గెలిచిం దెవరో? కళ్యాణి యింకాఏదో చెప్తూనే వుంది

"ఇది నిజమైనా ఎందుకిలా చేసినట్లు ఆమె మాటలకు అడ్డుపడుతూ అడిగాడు గోపాలరావు

'అవునో కాదో మందాకినిని, కనకారావుని అడగండి ఇప్పుడు మీరేం చేయలేరు కనకారావుకి పోలీసులతో బాగా పరిచయం వుంది ఆయన బావమరిది 'ఇనస్పెక్టరు కూడా' పైగా మీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు, సారీ మా మేనమామ ఆయనకు బాగా తెలుసు మీరేం దౌర్జన్యం జరిపినా, మీ అడ్రస్సులు మార్చేయ గలరు కాబట్టి మీకు ముందే చెప్తున్నాను అటువంటి ఆలోచనలు పెట్టుకోకండి జాగ్రత్తగా వుండమని మాత్రం నా సలహా' కళ్యాణి గీతోపదేశం చేసింది

మి మ్మల్ని కాదన్నా ననేగా యిలా చేసారూ?" ప్రశ్నించాడతను


"కాదు మీలాటి వారికి కనువిప్పు కలిగించాలనే నాలాటి వారు యిలా చేయవలసి వస్తోంది నూరు అబద్ధాలాడి ఓ ఆడపిల్ల పెళ్ళి చేయమన్నారు కాని ఓ చిన్న మోసం చేసి పెళ్ళి చేయటంలో తప్పు లేదని నేటి పరిస్థితులు తెలుపు తున్నాయి వరుళ్ళు పొట్లగిత్తలైతే, ఆడపిల్లలు, వారిని కన్నవాళ్ళు అబోతుల్లా ప్రవర్తించక తప్పదు ఎవరి న్యాయం, నీతి వారి కుంటుంది మీకు ఓ మంచి సంబంధం చూసానన్న తృప్తి నాకు మిగిలింది, అదే నాకు పది వేలు కళ్యాణి చెప్పటం ముగించి వెళ్ళిపోయింది, అతని దగ్గర సెలవు తీసుకుని

గోపాలరావు మనసంతా కోపం, కసి, ఆవేశం, చికాకుతో నిండిపోయింది □

వంట గ్యాస్‌ని, ఎక్కువ కాలం వచ్చే మార్గం

మీరు ప్రతిసారి వంటచేసేటప్పుడు గ్యాస్ రూపేణా కొంత ఆదాచేయవచ్చునన్న
సంగతి మీకు తెలుసా? ఇవిగో కొన్ని చిట్కాలు. చాలా చిన్నవి సులువైనవి.
ఇవి మనకు ఆశ్చర్యం కలిగించేంత పొదుపైనదిగా రుజువైంది. కాలం
ఇంధనం రెండు కూడా ఆదా అవుతాయి.

వీటిని ఆచరణలో పెట్టి చూడండి. తేడా మీకే తెలుస్తుంది.



1 **ప్రెషర్ కుక్కర్‌తో వండితే ఇంధనం ఆదా అవుతుంది.**
సమయం, గ్యాస్ కూడా ఆదా అయేందుకు ప్రెషర్ కుక్కర్ వాడండి కుక్కర్ గిన్నెలలో విడి విడిగా బియ్యం, కాయగూరలు, పప్పులు ఉంచి వండినట్లయితే మీకు సమయం, గ్యాస్ కూడా ఆదా అవుతాయి

2 **ఆదా చేసేందుకు నానపెట్టండి**
వండే ముందు వివిధ రకాల పప్పులు, బియ్యం మీరు విధిగా నానబెట్టాలి, దానివల్ల అవి ఉడకడానికి పట్టే సమయం ఆశ్చర్యం కలిగించేంతగా తగ్గుతుంది

3 **తక్కువ నీళ్ళతో ఆదాచేయండి**
వంటచేసేటప్పుడు, సరిగ్గా ఎంత అవసరమో అంతే నీళ్ళు వాడండి ఎక్కువ నీళ్ళు పోస్తే ఉడకడానికి పట్టే సమయం ఎక్కువ అవుతుంది ఎక్కువ గ్యాస్ ఖర్చు అవుతుంది. అధికంగా ఉన్న నీళ్ళని వార్చినప్పుడు, అందులోని, అమూల్యమైన పోషక పదార్థాలు బయటకు పోతాయి

4 **చిన్న బర్నర్‌తో పొదుపు చేయండి**
పెద్ద బర్నర్‌లవల్ల, చిన్న బర్నలకయ్యే దానికంటె ఎక్కువ ఇంధనం ఖర్చు అవుతుంది తరుచు చిన్న బర్నర్‌లనే వాడండి గ్యాస్‌ని ఆదాచేయండి

5 **మూతపెట్టి, వండండి.**
మీరు వంటచేసినప్పుడల్లా, మూత ఉన్న గిన్నెనే ఉపయోగించండి మూతపెట్టినట్లయితే వేడి బయటకుపోదు ఆహారపదార్థాలు, చాలా వేగంగా ఉడుకుతాయి అంటే మీరు సమయం, గ్యాస్ కూడా పొదుపు చేస్తున్నారన్నమాట

6 **సిమ్‌లో ఉంచి, ఆదాచేయండి**
గిన్నెలోని పదార్థాలు ఉడకడం మొదలుపెట్టిన తరువాత ఉష్ణోగ్రతలో పెరుగుదల ఉండదు కేవలం పదార్థాలు యిగిరిపోతాయి అందుచేత మంటని సిమ్‌లోకి తగ్గించి, గ్యాస్ ఆదాచేయండి

7 **గడ్డకట్టినవి వేడెక్కినవి తరువాతనే, వండండి**
శీతల పరిచిన ఆహారపదార్థాలను వండవలసినప్పుడల్లా, వాటిని ఫ్రిజ్ లోంచి బయటకు తీసి, గదిలోని ఉష్ణోగ్రత స్థాయికి వేడి ఎక్కేంత వరకు ఉంచి, ఆ తరువాతనే గ్యాస్ మీద పెట్టండి బాగా చల్లగా ఉన్న ఆహార పదార్థాలను వండటానికి ఎక్కువ గ్యాస్ ఖర్చు అవుతుంది

గ్యాస్‌ని 20% ఆదా చేయగల నూతన్ గ్యాస్ స్టవ్‌నే ఎల్లప్పుడూ ఉపయోగించండి.

ఈ నెల ఆసక్తికరమైన ఒక ప్రయోగం జరిపి చూడండి

నిత్యం యీ చిట్కాలు అమలుపరిచి మీ కొత్త గ్యాస్ సిలిండర్ ఎన్నాళ్లు వచ్చిందో వ్రాసి ఉంచండి కిందటి సిలిండర్ ఎన్నాళ్ళు వచ్చిందో దానితో దీనిని పోల్చి చూడండి మీరు మీ గ్యాసు సిలిండర్ మరిన్ని ఎక్కువ రోజులు వచ్చేటట్టు చేసుకోగలరన్న సంగతి మీకు తెలుస్తుంది గ్యాస్ ఆదాచేసే కొత్త చిట్కా ఏదయినా మీకు తోస్తే, పిసిఆర్ఎ వారికి దాని గురించి వ్రాయండి వారు భారత దేశమంతటా కుటుంబాలకు దానిని తెలియజేస్తారు ఆ ఘనత మీకే యివ్వడం జరుగుతుందిలెండి

మా వంట గ్యాస్ మరింత ఎక్కువ కాలం వచ్చేటట్టు తోడ్పడగల చిట్కాల గురించి తెలుసుకోవాలని కోరుకుంటున్నాను దయచేసి ఉచిత పుస్తకాన్ని పంపించండి

నా పేరు ____________________

నా చిరునామా ____________________

____________________ పిన్ □□□□□□

PCRA

పెట్రోలియం కన్సర్వేషన్ రిసెర్చ్ అసోసియేషన్

306 సేవి భవన్, 7, రాజేంద్ర ప్లేస్ న్యూ ఢిల్లీ 110008

PCRA 9298 TEL

సీరియల్

ఒకటి ఒకటి మూడు

తేజోవతి



(గత సంచిక తరువాయి)

ఆ రోజు లక్ష్మి కొంచెం బిజీగా వుంది.

డెలివరీ కేసు ఫేస్ ప్రెజంటేషన్ వర్షను యివ్వాలి . డాక్టరమ్మగారి దగ్గర వున్నప్పుడు లక్ష్మికి తనమీద తనకు పూర్తి నమ్మకం వుండేది. చెయ్యగలనన్న ధైర్యం వుండేది. వున్న వాళ్లందరిలో తను ఎఫిషియంట్‌గా పేరు కూడా తెచ్చుకున్నది ..

కానీ యిక్కడ వేరు .. అందరూ చాలా సంవత్సరాల అనుభవం కలవాళ్లు. అచ్యుతరావు సదాశివరావులు డాక్టరుగారు జూనియర్‌గా నర్సింగ్‌హోమ్‌లో చేరినప్పటి నుండి వున్నవాళ్లు . .

దానికితోడు యిక్కడకు వచ్చాక తనకేమయిందో తెలియదు .. మనసు గందరగోళంగా వుండడంతో ఆపరేషనప్పుడుపేషెంటు బి. పి. పడిపోవడం కూడా గమనించలేదు . అచ్యుతరావు చూశాడు గనుక సరిపోయింది.

డాక్టరుగారు ఒక్కసారి సీరియస్‌గా చూసారు అంతే ... లక్ష్మికి యిక్కడి నుండి ఎంత త్వరగా వెళ్లిపోతానా అనిపిస్తోంది ..

అక్కడికి వెళితే అనవసరపు ఆలోచనలు లేకుండా మనస్సైనా ప్రశాంతంగా వుంటుంది . .

ఇక్కడ పని ఎక్కువ లేనందున ఆలోచనలు ఎక్కువయినయి . ఏ క్షణాన డాక్టరుగారు ఏం విరుచుకుపడతారోనని భయం .. పైగా క్రమంగా మేల్ నర్సుల్లో వస్తున్న మార్పు లక్ష్మికి యిబ్బందికరంగా వుంటోంది

అందులో జ్వాలామూర్తి. దాదాపు తన యీడువాడే .. డాక్టరుగారు లేనప్పుడు చనువు తీసుకుని మాట్లాడుతూ కూర్చోవడం . నైట్ డ్యూటీ వున్నప్పుడు మందులిచ్చే గది వేరేగా వుంటుంది అందరూ అక్కడే పడుకుంటారు

అలాంటిది డాక్టరుగారి కన్సల్టింగ్ రూమ్‌లో పడుకుంటాననడం . అనవసరంగా ప్రతిదానికీ నవ్వడం .. లక్ష్మికి అతడి ప్రవర్తన తలనొప్పి కలిగిస్తోంది

ఒకటి రెండుసార్లు డాక్టరుగారు గమనించారు కూడా ... ఆయన గమనించినప్పటి నుండి జ్వాలామూర్తికి నైట్ డ్యూటీ వెయ్యడం కట్ చేశారు

ఏమిటో నెల రోజులు పైనే అయిపోయింది ఇంకొక్క పదిహేను రోజులు కళ్లు మూసుకుంటే తనను యిబ్బందిపెడుతున్న యీ పరిస్థితి నుండీ తప్పించుకోవచ్చు ..

లక్ష్మి చిన్నగా నవ్వుకుంది. తనకేమయిందో యీ మధ్య ఆలోచనలు లేని క్షణం వుండటంలేదు అక్కడ డాక్టరమ్మగారి దగ్గర తన ధ్యాస అంతా పేషెంటు మీద ... తను చేస్తున్న పనిమీద వుండేది కానీ యిక్కడికి వచ్చాక అదే కరువయింది

లక్ష్మి ఆలోచనలతోనే వర్షనివ్వడానికి ప్రయత్నిస్తోంది పిండం సరి అయిన పొజిషనులో లేనప్పుడు దాన్ని సరిఅయిన పొజిషన్‌కు తిప్పాలి కానీ పేగు చుట్టుకున్నదో ఏమో . ఎంత ప్రయత్నించినా లాభం లేకుండా వుంది సహజంగా వర్షను డాక్టర్లే యిస్తారు. నర్సులకు అప్పగించరు ఎంత అనుభవం వున్నా ఏదో తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప లక్ష్మికి యింకా ప్రయత్నించడానికి ధైర్యం చాలలేదు. కన్సల్టింగ్ రూమ్‌లో వున్న డాక్టరుగారి దగ్గరకు వెళ్లింది

ఏమిటన్నట్లు చూశారాయన

లక్ష్మి పరిస్థితి చెప్పి మీరు వస్తారా నన్నే ప్రయత్నించమంటారా?" అని అడిగింది

'నే వస్తున్నాను" అన్నారు . . పేషెంటును పరీక్ష చెయ్యబోతున్న ఆయన యిప్పుడే వస్తానని చెప్పి వచ్చేశారు

వర్టెక్స్ పొజిషనుకు వర్షను యిస్తూ,

"ఇదివరకు ఎప్పుడూ ట్రై చెయ్యలేదా??' అని అడిగారు.

"డాక్టరమ్మగారు లేనప్పుడు ఒకటి రెండుసార్లు చేశాను ఏదన్నా చిన్న పొరబాటు జరిగినా డాక్టరమ్మగారు సర్దుకుపోయేవాళ్లు అందుకని అంత భయం వుండేదికాదు'

ఓహో మర్చిపొయ్యాను యిక్కడ రాక్షసుడున్నాడు కదా . సర్దుకుపోకుండా అట్టహాసం చెయ్యడానికి! ' ఆయన నవ్వుతూ అన్నారు

లక్ష్మి తన తప్పు గ్రహించి, "అహఁ నా వుద్దేశ్యం అదికాదు ...' అన్నది

పిండం పొజిషను మార్చి డెలివరీ కూడా చేసేసి .. " యిక నువ్వు చూసుకో" అని చెప్పి వచ్చేశారు.

లక్ష్మి మిగతా అంతా చూసుకుని బిడ్డకు స్నానం చేయించి వుయ్యాల్లో పడుకోబెడుతుంటే ఏదో తెలియని భావం గుండె లోతుల్లో కదులాడింది. మనసులో గజిబిజిగా ఆలోచనలు

ఆ ఆలోచనలతోనె లోపలికి వచ్చి మందు కలుపుతుంటే వెనకగా వచ్చాడు జ్వాలామూర్తి

"ఏమిటి ఏదో ఆలోచనలో వున్నావ్ ... నీలో నువు నవ్వుకుంటున్నావ్?" అని అడిగాడు

జరిగిన కథ–10: అత్త గురిచేసిన ఆరళ్ల కారణంగా సీత ఇంట్లోంచి వెళ్లిపోతుంది. ఐదు సంవత్సరాల తర్వాత సీత పోలికలతో కనిపించిన లక్ష్మిని శ్యామసుందర్‌తోటి డాక్టరు సుధ దగ్గరినుంచి రెండు నెలలకోసం తన దగ్గరికి నర్సుగా తెచ్చుకుంటాడు. లక్ష్మిని శ్యామసుందర్ చాల ఆదరంగా, అభిమానంగా చూస్తుంటాడు. ఆమె ఇతరులతో చనువుగా ఉండడం సహించలేడు. ఆమెకు దగ్గర కావడానికి ప్రయత్నిస్తుంటాడు.

లక్ష్మి అతడ్ని గమనించకుండానే పైకి అనుకొన్నట్టుగా అన్నది

సృష్టి ఎంత విచిత్రమైందో ప్రసవం ఎంత కష్టమయినా, ఎంత బాధపడ్డా, బిడ్డను చూసుకోగానే కష్టమంతా మరిచిపోతుంది తల్లి అందుకే అంటారు మాతృత్వం ఒక వరమని అంటుంటే–

'నువ్వుకూడా పెళ్ళి చేసుకోరాదూ ఆ అదృష్టం నీకూ వస్తుంది నవ్వుతూనే అన్నాడు జ్వాలామూర్తి

మూర్తీ!' యిక ఆపమన్నట్లు కోపంగా అన్నది లక్ష్మి

అంత కోపం ఎందుకు లక్ష్మి నేనేం చెడుగా అనలేదుగా పెళ్ళిచేసుకోమంటున్నాను

ఈలోపల ఎప్పుడు వచ్చారో డాక్టరుగారు గుమ్మంలో నిలబడి,–

మూర్తీ యూకెన్ గో హోమ్ అన్నారు

ఆ మాటలు చలి పిడుగులు పడ్డట్టున్నాయి

మూర్తి అదిరిపడి, ఏదో చెప్పబోతున్నంతలో అడ్డు వచ్చి,

'అయినే యూగో హోమ్ పర్సనల్ విషయాలు మాట్లాడుకోవాలంటే నర్సింగ్‌హోమ్ ప్లేస్‌కాదు యిఫ్ ది లేడీ గివ్స్ యూ గ్రీన్ సిగ్నల్ యూకెన్ టాక్ టు హర్ ఆఫ్టర్ డ్యూటీ అవర్స్ బట్ నౌ యూ గో అన్నారు

అంత పెద్ద రొమాంటిక్ హీరో పిల్లిలా అయిపోయి వెళ్ళిపోయాడు మూర్తి

అతడు వెళ్ళిపోగానే లక్ష్మి వైపు తిరిగి,

నువ్వెళ్ళి నీ సూట్‌కేసు సర్దుకో' అన్నారు

నేను నేనేమి అతడ్ని ఎన్‌కరేజి చెయ్యలేదు

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే పైపెదవిని క్రింది పంటితో కొరుకుతూ వచ్చిన కోపాన్ని బలవంతాన అణుచుకుంటూ అన్నది



ఒకటి ఒకటి మూడు

"అయినే .. గో అండ్ పాక్ యువర్ థింగ్స్" అనేసి అక్కడి నుండి వెళ్ళిపోయారు

సూట్‌కేసు సర్దుకుంటున్న లక్ష్మికి దుఃఖం పొంగులా వచ్చింది ఆయన కనవసరంగా ఎందుకు కోపం వస్తుంతో తెలియదు తను మూర్తితో ఏనాడన్నా చనువుగా వుందా? .. ఎప్పుడన్నా అతడ్ని అలా మాట్లాడమని ప్రోత్సహించిందా

ఆ ఆలోచనల్లోనే లక్ష్మి డాక్టరుగారు కొనిపెట్టిన చీరలన్నీ మడతపెట్టి విడిగా పెట్టేసి తన యూనిఫాం చీరలు మిగతా సామాన్లు తన సూట్‌కేసులో సర్దుకుంది

అలా సర్దుకుంటుంటే ఏదో దిగులు .. చిత్రం యిన్నాళ్ళూ తను యిక్కడినుండీ ఎంత త్వరగా బయటపడదామా అని అనుకుంటుండేది యీ రోజు నిజానికి తను చాలా సంతోషపడాల్సిందిపోయి చాలా బాధగా, దిగులుగా అనిపిస్తోంది

డాక్టరుగారి గదిని ఆనుకుని వున్న యీ గది తనకెంతో సెక్యూరిటీ యిచ్చినట్టుగా వుంది ... అది వదులుకుని పోవడానికి మనసొప్పుకోవటం లేదు

అయిష్టంగా సర్దుతున్న లక్ష్మి గుమ్మంలో అడుగుల చప్పుడు విని తలెత్తింది డాక్టరుగారు నిలబడి వున్నారు

ఆ చీరలు పెట్లో పెట్టుకోలేదేం?"

'అవి . నాకంతగా అవసరం వుండవు . మా డాక్టరమ్మగారు యూనిఫాం వేసుకుంటే ఇష్టపడతారు'

'అయితే వాటిని ఏం చేసుకోమంటావ్ నన్ను?'

"షాపులో రిటన్ తీసుకోవచ్చు నేను వాటిని గడి విప్పలేదు లేబిల్స్ కూడా తియ్యలేదు '


ఒక్కసారి తీక్షణంగా చూశారు కళ్ళలోకి. ఒక్క అంగలో లోపలికి వచ్చి లక్ష్మి సూట్‌కేసులో యూనిఫాం చీరలన్నీ తీసి విసిరికొట్టి కొత్త చీరలన్నీ అందులో కుక్కి సూట్‌కేసులాక్ చేసి,

'పద" అన్నారు

లక్ష్మికి ఒక్కసారిగా ఏదో బాధ కలిగింది. ఎట్టి పరిస్థితుల్లోనూ నేను వెళ్ళనని గట్టిగా అరవాలనిపించింది నేను యీ చోటు వదలి చస్తే! కదలను అని గట్టిగా చెప్పాలనిపించింది ఇంత అకస్మాత్తుగా చెప్పా పెట్టకుండా అవసరం తీరగానే దూరంగా విసిరి కొట్టడానికి నేనేం తప్పు చేయలేదని ఎలుగెత్తి చాటాలనిపించింది

ఒక్క క్షణం కాలు మొరాయించింది కూడా ..

ఇన్ని బావాలను బల వంతాన తొక్కిపట్టి, 'వెంటనే బయలుదేరాలా? అంది ఆయన కళ్ళలోకి సూటిగా చూస్తూ



ఆ కళ్ళల్లో తిరిగిన నీళ్ళు చూసి చిన్నగా మందహాసం చేస్తూ,

"ఇన్నాళ్ళూ మా డాక్టరమ్మగారి దగ్గరకు పంపించెయ్యమని బ్రతిమిలాడేదానవు .. ఈ రోజు వెళ్ళాలంటే కళ్ళనీళ్ళు వస్తున్నాయి

అచ్యుతరావును వదలాలంటే బాధగా ఉందా .. లేక నర్సింగ్‌హోమ్‌నా ." అన్నారు

లక్ష్మికి పిచ్చి తెగింపు వచ్చేసింది ఎలాగూ తనను పంపించేస్తున్నారు యిక తను భయపడాల్సిందేముంది.

కోపంతో వూగిపోతూ, "షటప్ " అన్నది కళ్ళల్లో మంటలు కురిపిస్తూ. అంతలో కొంచెం నిగ్రహించుకుని, 'అచ్యుతరావును వదలి వెళుతున్నందుకు కాదు మూర్తిని వదలి వెళుతున్నందుకూ కాదు జీవితంలో ఎప్పుడూ నేను చెయ్యని వాటికి అనవసరంగా మాటలు పడుతున్నందుకు ఏడుస్తున్నాను' అన్నది

ఆయన చిన్నగా నవ్వుతూ,

"భారతనారి యీ మధ్య సాంప్రదాయాలను మరిచిపోతోంది అని, 'ఊఁ పద" అన్నారు

"ఆగండి ఒక్క క్షణం వెళ్ళి వాళ్ళందరితో చెప్పొస్తాను నేనేమీ తల వంచుకొనే తప్పుడు పని చెయ్యలేదు ఎవ్వరికీ చెప్పకుండా దొంగలాగా వెళ్ళిపోవడానికి . వెళుతున్నానని చెప్పి వస్తాను" అన్నది

సూటిగా ఆ కళ్ళల్లోకి చూస్తూ , "పిల్లి పిల్ల పులి పిల్ల అవుతుందంటే నమ్మేవాడినికాను. మిరకిల్స్ జరుగుతుంటయి కాబోలు . సరే వెళ్ళి రా... అయిదు నిముషాల్లో వచ్చెయ్యాలి

"పరిస్థితులు ఫోర్స్ చేస్తే పిల్లి పిల్ల తప్పకుండా పులి పిల్ల అవుతుంది. అయిదు నిముషాలు కాదు . పది నిముషాలు పట్టినా కో స్టాఫుతోనే కాదు పేషెంట్సుతో కూడా చెప్పే వస్తాను" అని చెప్పి ఇక ఆయన సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయింది

అచ్యుతరావు, సదాశివరావు మందుల డిస్పెన్సింగ్ రూమ్‌లో వున్నారు లక్ష్మి యిలా వెళుతున్నాని చెప్పినప్పుడు "అదేమిటి యింత అకస్మాత్తుగా వెళుతున్నారు . సావిత్రి లీవ్ యింకా పదిహేను రోజులుందిగా" అన్నాడు సదాశివరావు ..

"అకస్మాత్తుగా ఏంకాదు ... డాక్టరుగారి ప్రయాణం ఎప్పుడో ఫిక్స్ అయింది పదిహేను రోజులదాకా ఏం ఆపరేషన్లు లేవుగా ఛార్జిలో వేరే డాక్టరుగారితో కూడా మాట్లాడి ఎమర్జన్సీ అరేంజిమెంట్స్ కూడా చేశారు

బహుశా లక్ష్మి ప్రయాణం అకస్మాత్తేమో" అన్నాడు అచ్యుతరావు లక్ష్మి వైపు తిరిగి, "మంచిదమ్మా వెళ్ళిరా ఆల్ ద బెస్ట్" అని చెప్పాడు

లక్ష్మి వచ్చేస్తుంటే వెనకనుండి మాటలు వినపడ్డాయి

"ఆ మూర్తికప్పుడే చెప్పాను నేను కొంప మునుగుతుంది ఆ అమ్మాయి జోలికి పోకు . ఫర్‌బిడెన్ ఫ్రూట్ అని చెప్పాను వింటేనా

నాకు చెడ్డ తలంపేమీ లేదు వొప్పుకుంటే పెళ్ళిచేసుకుంటానన్నాడు" అంటున్నాడు అచ్యుతరావు

'ఆ అమ్మాయిమీద ఈగ వాలనివ్వలేదు డాక్టరుగారు డాక్టరు సుధాపరిమళతో మన డాక్టరుగారి ఫ్రెండ్‌షిప్ అంత స్పెషల్ ఫ్రెండ్‌షిప్పా?" సదాశివరావు అడుగుతున్నాడు

"వాళ్ళ ఫ్రెండ్‌షిప్ ఏమోగాని యీ అమ్మాయికి డాక్టరుగారిచ్చిన స్పెషల్ ట్రీట్‌మెంట్ ఆవిడ కళ్ళబడితే మాత్రం వాళ్ళ ఫ్రెండ్‌షిప్ బెడిసికొడుతుందని నా అనుమానం" అన్నాడు అచ్యుతరావు.

"డాక్టరుగారు శారదమ్మగారు పొయ్యాక మళ్ళీ పెళ్ళి చేసుకుంటే బాగుండేది ..'

"రెండో పెళ్ళి చేసుకున్నారట ఆయన. డ్రైవరు చెప్పాడు అయితే ఆ అమ్మాయినీ చాలా హీనంగా చూసేదిట అత్తగారు డాక్టరుగారి బర్త్‌డే పార్టీ రోజున దూరం నుండి చూపించాడు కూడా డ్రైవరు పాపం ఆ అమ్మాయిని పనిపిల్లలా చూసేదట అందుకేపెళ్ళయిన నెలకల్లా యిల్లొదిలేసి పోయిందట ఆ అమ్మాయి అత్తగారితో పడలేకనేగా శారదమ్మగారు కూడా ఆత్మహత్య చేసుకుంది

అందుకే ఆ భార్య వెళ్ళిపోగానే వాళ్ళమ్మగారిని వేరే యింట్లో పెట్టారు డాక్టరుగారు. నెలకు నూరో నూట యాభయ్యో పంపుతారు. ఆ భార్య వెళ్ళిపొయ్యాకనే బాగా అప్‌సెట్ అయి డ్రింకింగ్ కూడా అప్పటి నుండే".

లక్ష్మి ఆ పైన వినలేక నెమ్మదిగా అక్కడినుండి తప్పుకుంది. తను అటెండ్ అయిన పేషెంట్సు అందరితో కూడా చెప్పి వచ్చేసరికి పదిహేను నిముషాలు పట్టింది లక్ష్మికి.

అప్పటికి రామూచేత సూట్‌కేస్ కార్లో పెట్టించేసి, కార్లోనే వెయిట్ చేస్తున్నారు డాక్టర్‌గారు

నర్సమ్మగారు వెళ్ళిపోతున్నారంటే అప్పటికప్పుడు వీడ్కోలివ్వడానికి పోగయిన వాళ్ళందరికి చెప్పి, నెమ్మదిగా తప్పుకుని వచ్చేసరికి రామూ బాక్ డోర్ తెరిచి పెట్టాడు.

కారు రోడ్ను మీదకు రాగానే, "ఫర్వాలేదే, నెలరోజులకే చాలామందిని పరిచయం చేసుకున్నావ్" అన్నారు డాక్టరుగారు ...

"నోరు మంచిదవుతే వూరు మంచిదవుతుందిట"

డాక్టరుగారు జవాబు చెప్పకుండా మౌనంగా కారు డ్రైవ్ చేస్తున్నారు.

కారు డాక్టరుగారి యింటి ముందు ఆగగానే,

"ఇదేమిటి. వూరుకని యిక్కడికి తీసుకువచ్చారు?" అన్నది ....

"నీ సూట్‌కేసుంటే చాలా ....నాకు బట్టలక్కరలేదా?"

లక్ష్మి జవాబు చెప్పకుండా కార్లో కూర్చుంది.

"ఒక అయిదు నిముషాలు దిగి లోపలకు రా .. అచ్యుతరావు వాళ్ల ఇంటికంటే తీసిపోలేదు యీ యిల్లు"

వ్యంగ్యంగా వున్న ఆ మాటలకు మనసు చివుక్కుమనగా మాట్లాడకుండా దిగింది లక్ష్మి ...

మేడమీద గదిలోకి తీసుకెళ్ళి,

"కాస్సేపు కూర్చో .." అని, "ఏమిటలా చూస్తున్నావ్?" అన్నారు గదిని వింతగా చూస్తున్న లక్ష్మితో ...

ఆ గదిలో యీ నెలా పదిహేను రోజుల్లోనే చాలా మార్పులు వచ్చాయి. ఒక డబుల్ కాట్ బెడ్ ఒక పక్కగా నిలువుటద్దం వున్న పెద్ద బీరువా. ఇదివరకున్న పాత సోఫా బదులు కొత్త సోఫా కమ్ బెడ్ .. గోడలకు చక్కటి పెయింటింగ్స్.

"గదిలో చాలా మార్పులు వచ్చేనూ" అన్నది తెప్పరిల్లి ...

"బాగుందా?"

"ఊఁ."

"ఇది నా భార్య గది".

ఉలిక్కిపడింది లక్ష్మి ...

"మీ భార్యా! ... లేదన్నారుగా?"

ఆయన నవ్వారు.

"లేదంటే, రాదని అర్థంకాదుగా ..."

"అంటే మళ్ళీ పెళ్ళి చేసుకోబోతున్నారా?"

"చేసుకుంటే తప్పా? . ఎక్కడికి వెళ్ళిందో ... ఎవడితో వుంటున్నదో తెలియని భార్యకోసం ఎన్నాళ్ళు ఒంటరిగా గడపను?!"

లక్ష్మి మాట్లాడలేదు .. ఛప్పున కిటికీ దగ్గరకు వెళ్ళిపోయింది. కిటికీ పైకి అల్లుకుంటున్న సన్నజాజి పూలు కోసుకోడానికి.

డాక్టరుగారు స్నానంచేసి డ్రస్ చేసుకుని వచ్చేసరికి పావు గంటపైనే అయింది.

"నన్ను స్నానంకాదు గదా కనీసం మొహంకూడా కడుక్కోకుండా తొందర చేశారు" ఏష్మారంగా అంది.

"వెల్ ఆలస్యం ఉంటుందనే అక్కడ తొందరచేశాను. ఆ హాస్పిటల్ బట్టలతో స్నానంకూడా లేకుండా రాత్రంతా డ్రైవ్ చెయ్యమంటావా? ... సారీ నువ్వుకూడా స్నానం చెయ్యి. బాత్‌రూమ్ ఖాళీగానే వుందిగా .. ఈ లోపల బట్టలు సర్దుకుంటాను."

"నా సూట్‌కేసు మీ కారు డిక్కీలో వుంది."

"అయితే ఓ పని చెయ్యి" అంటూ నిలువుటద్దం వున్న బీరువా తెరిచి ఒక చీర తీసి ముందు పెడ్తూ, "ఇది కట్టుకో" అన్నారు.

లక్ష్మి ఆశ్చర్యంగా చూస్తూ "యిది ... యిది ..." అన్నది ఏమనాలో తోచక.

"నా భార్య సీతది. మనుషులు పోయినా జ్ఞాపకాలు మిగులుతయిగా".

ఆ వాయిలు చీరను చేతిలోకి తీసుకుని చూస్తున్న లక్ష్మి మొఖంలో మారుతున్న భావాలను గమనించి,

"ఏం అలా చూస్తున్నావ్ ... భార్య చెప్పకుండా వెళ్ళిపోయిందని ఆమె తాలూకు జ్ఞాపకాలన్నిటినీ తగులబెడ్తాననుకున్నావా?" అన్నారు.

"కాదు ... కానీ అంతలా మీరు తలుచుకొనే భార్య జ్ఞాపకాలను అందరికీ పంచుతారనుకోలేదు."

"ఓహో . నువ్వయితే మీవారి జ్ఞాపకాలను పదిలంగా దాచుకునేదానివా ..."

ఏదో ఆలోచిస్తున్న లక్ష్మి అనుకోకుండా తలవూపేసింది.

"అసలు మొగుడనేవాడు ఒకడున్నాడని గుర్తుందా నీకు?" పదునుగా వచ్చింది ప్రశ్న ...


లక్ష్మి ఉలిక్కిపడింది ... ఒక్క సెకనులో తేరుకుని,

"అసలు నాకు పెళ్ళయిందని ఎప్పుడన్నా చెప్పానా మీకు?" అన్నది ... ఒక్క క్షణం ఆ కళ్ళల్లోకి మింగేసేలా చూసి.

"కానీ త్వరగా రెడీ అవు". అనేసి తన గదిలోకి వెళ్ళిపోయారాయన...

పది నిముషాల్లో రెడీ అయివచ్చిన లక్ష్మిని చూసి,

"అదేంటి మళ్ళీ యీ తెల్ల చీరే కట్టుకున్నావ్ ... ఆ చీర కట్టుకోలేదే!!" అని అడిగారు...



"అది మీ భార్య గుర్తుగా మీరట్టే పెట్టుకున్న చీర ... మీ దగ్గరే వుంచుకోండి ... లేదా రేపు మళ్ళీ పెళ్ళి చేసుకున్న తర్వాత ఆ భార్యకు బహుమతిగా యివ్వండి. రేపు నేను మా డాక్టరమ్మగారి దగ్గరకు వెళితే కట్టవలసినవన్నీ తెల్ల చీరలే" అన్నది లక్ష్మి కటువుగా ...

ఒక్కసారి ఆ కళ్ళల్లోకి చూసి,

"సరే – నీ యిష్టం ... పోదాం పద ... మళ్ళీ ఏదన్నా హోటల్లో భోజనం కూడా చెయ్యాలి. యింట్లో కొండమ్మకూడా లేదు".

"ఏం ... ఏమైందామె?"

"శారదా వాళ్ళ అన్న ఫారిన్ నుండి వచ్చాడు. పిల్లల్ని చూసుకోడానికి కావాలి ... నా దగ్గర అట్టేపెట్టుకుంటానన్నాడు. పిల్లా పాపా లేనివాడ్ని గదా ... సరేనాకెందుకని ... పంపించేసాను" అని, "యిక బయల్దేరు" అన్నారు.

హోటల్లో డాక్టరుగారు భోజనానికి ఆర్డరివ్వబోతుంటే,

"వద్దు ... నేను కూడా చపాతీ కాఫీ తీసుకుంటాను" అన్నది.

డిమ్ లైట్‌లో మరెవ్వరూ లేని ఆ ఫామిలీ రూమ్‌లో చుట్టూ పరిసరాలను చూస్తున్నట్లు చూస్తూ వచ్చే నవ్వాపుకుంటూ,

"ఓహో భోజనం చేస్తే నిద్రవస్తుందని కాబోలు" అన్నారు.

లక్ష్మి మాట్లాడలేదు.

కాఫీ తాగుతుండగా అన్నది లక్ష్మి ...

ఒకటి ఒకటి మూడు

"నా వర్క్ నచ్చకనా ... మీ రెండు నెలల గడువు పూర్తికాక ముందే పంపించేస్తున్నారు?"

'కాదు యిక్కడినుండి వెళ్ళిపోవాలని తెగ తాపత్రయపడుతున్నావుగా ... అందుకని "

'కొంచెం ముందుగా చెప్పి వుంటే మా డాక్టరమ్మగారికి ఏమన్నా బహుమతి యివ్వడానికి కొనేదాన్ని?"

ఒక్క క్షణంపాటు డాక్టరుగారు మాట్లాడలేదు.

"ఇప్పుడు మనం వెళ్తున్నది మీ డాక్టరమ్మ దగ్గరకని చెప్పానా నేను?"

లక్ష్మి ఉలిక్కిపడింది. కప్పులో కాఫీ కూడా తొణికి తెల్ల చీరమీద పడ్డయి . కప్పు కింద పెట్టి,

మరయితే ... మరయితే"

"ఆవిడ దగ్గరకు తీసుకెళ్ళడానికి .. యింకా రెండు నెలల గడువు పూర్తికాలేదుగా".

"అయితే ఇప్పుడెక్కడికీ ప్రయాణం??" కంగారుగా అడిగింది.

"కొచ్చిన్‌లో నా ఫ్రెండ్ వున్నాడు. ఆయన పాత పేషెంటు .. ఇదివరలో ఒకసారి ఆపరేట్ చేశాను ... ఆ ట్రబుల్ తగ్గింది మళ్ళీ కొంచెం ప్రాబ్లమ్‌గా వుంది ... వచ్చి చూడమని రాశాడు

ఆయనకు నేను చూస్తేగాని తృప్తి వుండదు . ఆయనకు నర్సింగ్ అవసరం వుంటుందని."

"మీ దగ్గర అంతమంది మేల్ అటెండెంట్సు వున్నారుగా.. బాగా అనుభవం వున్నవాళ్ళు .. వాళ్ళను తీసుకెళ్ళచ్చుగా" లక్ష్మికెందుకో వుడుకుమోత్తనంగా వుంది . ఆయన తనను మోసం చేశారన్న భావన

"ఉన్నారు . కానీ వాళ్ళను తీసుకెళితే వర్క్ సఫర్ అవదా . నేను లేకపోయినా . ఎన్నాళ్ళనుండో వున్న కాంపౌండర్లు వున్నారంటే మందు తీసుకుంటారు తెలిసినవాడని పేషెంట్లు ..

నిన్నొదిలి వాళ్ళ నెవర్నన్నా తీసుకెళితే అలా మానేజి చెయ్యగలవా . పైగా నిన్ను తీసుకొచ్చి యిక్కడ దింపి నామటుకు నేను పదిహేను రోజులు క్యాంప్ వెళితే సుధ మొహం వాచేలా చీవాట్లు వెయ్యదా ..

మరో కారణం కూడా వుంది...

కొన్ని కొన్ని వృత్తులలో మగవాళ్ళకంటే ఆడవాళ్ళే రాణిస్తారు... అందులో నర్సింగ్ ఒకటని నా అభిప్రాయం

ఈలోపల వెయిటర్ రావడంతో బిల్లు యిచ్చేసి బయటకు వచ్చారు.. ఫ్రంట్ డోర్ తెరుస్తుంటే పట్టించుకోకుండా బాక్‌డోర్ తీసుకుని వెనక కూర్చుంది లక్ష్మి...

'యాక్సిడెంటు అయినా ఫర్వాలేదు గానీ, నా పక్కన కూర్చోడం మాత్రం అభ్యంతరం అన్నమాట." నవ్వుతూ అన్నారు.

"యాక్సిడెంటు కాకుండా వెనక కూర్చుని కబుర్లు చెబుతుంటాను లెండి."

డాక్టరుగ్గారు కారు స్టార్ట్ చేసి, సిగరెట్ తీసి వెలిగించు కున్నారు. ఆ తర్వాత చిన్నగా నవ్వుతూ,

"నిన్ను సుధా నర్సింగ్‌హోమ్‌లో చూసినప్పుడు మాటలు రాని మూగ అనుకున్నాను . నా భార్య సీత కూడా అలాగే వుండేది పది మాటలకు ఒక్కమాట జవాబిచ్చేది...

కానీ యిప్పుడు చూస్తే . మాటల్లో నిన్ను ఏ ఆడపిల్లా బీటవుట్ చెయ్యలేదని పిస్తోంది " అన్నారు.

లక్ష్మి దానికి సమాధానం చెప్పలేదు... కానీ కొంచెం ఆగి అన్నది. ..

"నాకు మిమ్మల్నొకటి అడగాలని వుంది."

అడుగు "

మీరు నెల రోజులు కాపురం చేసిన సీతను ఎక్కువగా తల్చుకుంటారు రెండేళ్ళు కాపురం చేసిన శారద కన్నా."

"అదా...." ఆయన ఎక్కడో అలోచిస్తూ అన్నారు.

'శారద రెండేళ్ళు కాపురం చేసింది. కోరి నన్ను చేసుకుంది కానీ తన అందంతో నన్ను ఆకట్టుకోలేక పోతానా అన్న ధీమా వుండేది తనలో.

తన తండ్రి అంతస్తూ అయిశ్వర్యం, తన పుట్టింటి తరపు వారి ప్రేమా ఆదరణ కొండంత వున్నాయన్న ధీమా .

యివన్నీ నన్ను తనకు వశం చెయ్యక పోతాయా అన్న అహం వుండేది తనలో వీటిలో తనకు వశం కానేమోనన్న అనుమానం కలిగినప్పుడు ఎన్నో ఫిర్యాదులు, ప్రశ్నలు . నాకు సుఖం తనకు సుఖం లేకుండా చేసుకుంది..

అంతగా ప్రేమించినా నన్ను పూర్తిగా అర్థం చేసుకోలేక, తల్లి చేతిలో కీలు బొమ్మగా మాత్రమే వుంటానని, ఆమె ఏం చెప్పినా నమ్ముతానని భ్రమపడి జీవితం అంతం చేసుకుంది.

అంతేకాదు లక్ష్మి. యింకోటి కూడా కారణం కావచ్చు ఆ వయస్సులో తను నాకు అందించాలనుకున్న సుఖం కానీ సంతోషం కానీ అందుకోగల తీరిక, ఓపికా అప్పుడు నాకు లేవు

నా కెరియర్ బిల్డ్ అప్ చేసుకోడంతో సరిపోయింది నాకు వాళ్ళ నాన్నగారు చనిపోయిన కొత్తల్లో ఆయన అప్పగించిన ప్రాక్టీసును మెయిన్‌టెయిన్ చేసుకోడానికి అహోరాత్రాలూ కష్టపడాల్సి వచ్చింది నేను వుదయం ఆరు నుండి రాత్రి పన్నెండు వరకూ తన్నుకోవలసి వచ్చేది

ప్రాక్టీసు అనేది ఏ బ్యాంకి కాషో వచ్చిపడ్డట్లు కాదు పెద్దవాళ్ళ ప్రాక్టీసు

లక్ష్మి యిప్పుడు యింతగా బాధపడడం ఎందుకో తెలుసా.. సీత నన్ను ఆరాధిస్తుందనుకొని నేను మోసపొయ్యానన్న బాధ. నన్నూ నా ప్రేమను తేలిగ్గా తృణీకరించిందన్న అవమానం. ." ఆయన వుద్విగ్నతతో అన్నారు. .

'పోనీ మీరలా అనుకునే కంటే– సీత మిమ్మల్ని నిజంగానే ప్రేమించిందని .. మీ సుఖం కోసం. మీ శాంతి కోసమే తను అలా వెళ్ళిపోయింది కానీ మీ ప్రేమను తృణీకరించి కాదని అనుకుంటే మీకు తృప్తిగా వుండదా?!"

శ్యామసుందర్‌గారు కారు పక్కకు తీసి ఆపేశారు . వెనక్కు వాలి కళ్ళు మూసుకుని గద్గదమైన స్వరంతో అన్నారు .

"లేదు లక్ష్మి . సీత నన్ను ప్రేమించ లేదు . ఆరాధించ లేదు. అలా ప్రేమించి వుంటే– నేను తన కోసం యింత తపన పడుతున్నాను . యింత బాధపడుతున్నాను. .


ప్రేమించిన హృదయం స్పందిస్తుందంటారు . పిలుపును అందుకుంటుందంటారు. . అదేమీ లేదుగా '


లక్ష్మి గుండెల్లో మెలి దిప్పినట్లయింది దుఃఖం పొంగులా వచ్చింది .. వెనక్కు వాలి ఏడుస్తుంటే డాక్టరుగారు వెనక్కి తిరిగి ఆశ్చర్యంగా అన్నారు. .

'లక్ష్మి ఏడుస్తున్నావా?" అని

లక్ష్మి జవాబు చెప్పలేదు కారులో లైటు స్విచ్ వేసి పరీక్షగా చూశారాయన.

లక్ష్మి కళ్ళు తుడుచుకుంది .





నిలబెట్టుకోవాలంటే కొడుకులు గానీ అల్లుళ్ళు గానీ ఒకటికి రెండింతలు కష్టపడితే గానీ రాణించరు పెద్దవాళ్ళను మరిపించ లేరు

ప్రతి క్షణాన పెద్ద డాక్టరుగారు అంటూ కంపేర్ చేసుకుంటుంటారు. వాళ్ళ పేరు ప్రఖ్యాతులు మనల్ని ప్రతిక్షణం నీడలా వెంటాడుతుంటాయి... ఆ నీడను తప్పించుకోవాలంటే మనం వాళ్ళకంటే ఎత్తు ఎదగాలి. అదొక్కటే మార్గం అలాంటప్పుడు ఓర్పు కావాలి .. పట్టుదల కావాలి. కృషి కావాలి

శారద తండ్రి రఘునాథ్‌గారు నన్ను కొడుకులా ప్రేమించారు. నా నుండి ఎంతో ఆశించారు.. ఆయన చనిపోయినా ఆయన ఆశించిందాన్ని భగ్నం చెయ్యడం నా కిష్టం లేక పోయింది...

అలాంటప్పుడు చూపించాల్సిన సహనం శారద చూపించలేక పోయింది

ఇక సీత అంటారా?... తను నానుండి ఏమీ ఆశించకుండానే నా యింటికి వచ్చింది.

నేను తన నుండి ఆశించినవన్నీ మహద్భాగ్యంలా అందిచ్చింది. .

ఒక్కరోజు ఒక్క కంప్లయింటు... ఒక్క రోజు ఒక్క అసంతృప్తి వ్యక్తం చెయ్యలేదు... నన్నే కాదు నా నీడను సైతం యీ అమ్మాయి ఆరాదిస్తున్నదేమోననిపించేది నాకు .

అంతేకాదు... అప్పటికి నేను కెరియర్‌లో ఎస్టాబ్లిష్ అయ్యాను యిన్నాళ్ళుగా ఆశించని సుఖాలు ఆశించే స్థితిలో వున్నాను

'డాక్టరుగారూ. . మీకు నేను చెప్పతగ్గ దాన్ని కాదు . కానీ మరిచిపోతేనే గానీ శాంతిలేని కొన్ని విషయాలను మర్చి పోవడం మేలుకాదా

నా జీవితం మీకంటే భయంకరమైంది . కనీసం ఒకటి రెండుసార్లు చెప్పుకుని మీరు బాధ తీర్చుకుంటారు.. అలా కూడా చెప్పుకోడానికి లేని పరిస్థితిలో, చెప్పినా ఎవ్వరూ ఏమీ చెయ్యలేరని తెలుసు కనుక మరిచి పోడానికి, కనీసం మర్చిపోయినట్లు నటించడానికైనా ప్రయత్నిస్తుంటాను నేను

ఇప్పుడు చెప్పండి ఏ పద్ధతి మంచిదంటారు మీరు?"

డాక్టరుగారు జవాబేమీ చెప్పకుండా ఒక్క జర్క్‌తో కారు స్టార్టు చేసి లోపల లైటు ఆపేశారు...

ఆ చీకట్లో ఏ చెట్టుకో కారును యాక్సిడెంట్ చెయ్యడమే పరమావధి అన్నంత వేగంగా కారు పోనిస్తున్నారు...

కొంచెంసేపు తర్వాత లక్ష్మి అన్నది నవ్వుతూ.

"డాక్టరుగారూ. . నాకు చావంటే భయమండీ... ఆ భయంతోనే కష్టాలు భరించడానికైనా సిద్ధపడ్డాను కానీ చావాలని అనుకోలేదు . మీరిలా డ్రైవ్ చేస్తారని తెలుసుంటే కనీసం ఆ హోటలు దగ్గర నుండైనా అటు నుండి అటు పారిపోయి వుండేదాన్ని."

డాక్టరుగారు మాట్లాడ లేదు

(ఇంకాఉంది)



ఎం. ఎస్. ఎన్. అన్నవరం

★ నేటి సాహిత్యంపై మీ అభిప్రాయం?

● దీన్ని సాహిత్యం అనరు. మేటర్ అంటారు. సాహిత్యం మిగులుతుంది మేటరు– ఆ పత్రికతో సరి

★ రిజర్వేషన్స్?

● కావాలి– రాజకీయపుటెత్తులు పారాలంటే

★ సమాజాన్ని ప్రభావితం చేయడంలో రచయితల పాత్ర ఎంతవరకు వుంది?

● చాలా వున్నట్టుంది దోపిడీలు, దొంగతనాలు మానభంగాలు, మంత్రాలు తంత్రాలు– ఇవన్నీ అరిటిపండొలిచి చేతికిచ్చినట్టు చెప్పి– మనకీ విషయాల పట్ల జ్ఞానోదయం కల్గించడంలేదా? వ్యభిచారాలు, పతితలు, భ్రష్టులు వారెంత బాగా దిగజారారో కళ్ళకు కట్టినట్టు తెలియచేప్పి మనని ప్రబావితులను చేయడంలేదా?!

పి. ఎస్. ఆర్. ఎమ్. గుంటూరు

★ ఈ లోకాన్ని చూస్తుంటే మీకేమనిపిస్తుంది?

● లోకమంతా ఎక్కడ చూశాను స్వామి, మా వీధి చివరదాకా కూడా నడవడానికి బద్దకం నాకు మా వీధి చూస్తే చెప్పగలను– జనాభా భయంకరంగా పెరిగిందని

జి. వి. ఆర్. హైదరాబాదు

★ మన ప్రభుత్వం ఎందుకిలా ఏడ్చింది కె రా?

● బలవంతమయిన ప్రత్యర్థులు లేకపోతే– ఏ ప్రభుత్వమేనా ఇలాగే ఏడుస్తుంది వెంకటేశా!

కె. ఎ. ఎమ్మిగనూరు

★ విద్యార్థులు రాజకీయాల్లో దిగితే?

● రెంటికి చెడ్డ రేవళ్ళవుతారు! అక్కడ స్థలం వుండదు ఇక్కడ చదువు పోతుంది

★ రాజకీయాలకి సినిమా నటులు?

● సినిమారంగంలో వున్నంత రాజకీయం– నిజానికి రాజకీయరంగంలో వుండే అవకాశంలేదు! అంచేత అసలే కలుషితంగా వున్న రాజకీయరంగం యింకా కలుషితం అయే అవకాశాలే ఎక్కువ.

★ మనకే ఓటు హక్కు లేకుంటే?

● గూండాలచేత ఓటు వేయించి గెలిచే పద్ధతి లేకపోను?

సి. హెచ్. ఇ. ఆర్. విజయవాడ

★ మీరంతా రాజీపడితే పర్వారు. రాజీపడని రచయితలపై కత్తి కట్టాలా? ...

● ఎందుకు మీరు మరో ఖార్సన్ అని సంతకం చేయవలసి వచ్చింది ఈశ్వరరావుగారూ? ముందా సంగతి చెప్పండి– ఎదుటివారి రాజీ తత్వం గురించి మాట్లాడే ముందు మేం కనీసం మాతోనే రాజీ పడుతున్నాం– ఆ రాజీపడని మేధావులు– దేనితోనూ రాజీపడడంలేదని నమ్మమంటారా?!

ఎస్. వి. ఆర్. సంగంజాగర్లమూడి

★ యుగాల కాలపరిమితి తెలియని మీలాంటి రచయిత్రులను కలిగియుండడం తెలుగు పాఠక లోకం చేసుకున్న ఘోరమయిన దురదృష్టమేమో?

● అవచ్చు రావ్!– ఇంతకంటే దురదృష్టకరం యుగాల కాలపరిమితి ఏకరువు పెట్టి భయపెట్టడం అని నేను భావిస్తాను!?

జి. డి ఖర్గపూర్

★ మీ భావన ఎలా వుందంటే– ప్రతి స్త్రీ ఒక పురుషుని అంతగా అవ్వాలని కోరుకొంటే– మరిక స్త్రీ జన్మ ఎందుకు ... పోయిగా పురుషునిగా ..

● మీ గోల ఎలా వుందంటే– రామాయణం అంతా విని రాముడికి సీతేమౌతుందన్నట్టుంది! స్త్రీ పురుషునితో పోటీపడాలని కాదు.– స్త్రీ మనిషిగా సగర్వంగా బ్రతకాలని నా కోరిక. మీకీ మాత్రం బోధపడలేదంటే– మీరేం చదువుతున్నారో– నాకర్థంకావడంలేదు!

పి. ఎస్. ఆర్. పల్లిసారధి

★ కొన్ని సమయాలలో కొందరు నన్ను హేళన చేస్తుంటారు జన్మలో మరలా నన్ను హేళన చేయకుండా వారికి ఎలా బుద్ధి చెప్పడం?

● హేళన వెనక రవంత ఈర్ష్య వుంటుంది అంచేత మీరలాంటివి పట్టించుకోకూడదు. అదొక్కటే దారి.

★ తాళి కట్టిన భార్య వుండగా పరస్త్రీతో సంబంధం కల్గి వుంటారే మగాళ్ళు. అదే పని స్త్రీ చేస్తే?

● వదిలేస్తారు! వ్యభిచారం స్త్రీ విషయంలో తప్పు. పురుషుని విషయంలో– గొప్ప. మీకు తెలుసో లేదో మగాడు– వ్యభిచార నేరానికి– విడాకులు యివ్వవచ్చు. కాని స్త్రీ అదే నేరానికి భర్తని– కోర్టులో నిలదీయలేదు– ఒక్క "బైగమీ" నేరారోపణచేసి తప్ప? మన న్యాయం అంత ఒంటి కంటి చూపు కలది!?

కె. ఎ., న్యూ బొంబాయి

★ మనవాళ్ళు జాతీయ సమైక్యత అంటారే–

● అంటే– ఏంలేదు అధికార పక్షపు వాదనని అంతా బలపరిస్తే– అది జాతీయ సమైక్యత అని


జి. పి. ఎ. విశాఖపట్నం


★ సుమారు పది సంవత్సరాల క్రితం అందుకో ఈ ప్రేమలేఖ సంపుటిలో కథలు చదివాను. అందులో దంపతుల మధ్య మీరు చూపించిన అనురాగం చూసి పెళ్ళయ్యాక నేను కూడా ఇలాగే వుండాలని అనుకొనేవాడిని ఈ మధ్య మీరు రాసిన కొన్ని కథలు కూడా చాలా బాగున్నాయి. కాని వాటిలోని రమ్యత వీటిలో లేదు. వీటిలో మౌన ఘర్షణ, ఏదో బాధ కన్పిస్తుంది. వయసు ముదిరినకొద్దీ దంపతుల మధ్య అనుబంధం తగ్గిపోతుందా?

● తగ్గిపోదు. గాని జీవితం అంత రమ్యంగా కనిపించడం మానేస్తుంది. దీనికి బాధ్యతలు కారణం కావచ్చు. ఇక వయసులో మోజు ముదిమిని వుండేనా?! చుట్టూ సమాజం చూస్తుంటే– తృప్తిగా మనింట్లో కూర్చుని మనం అన్నం తినలేకుండా వున్నామే– రమ్యమైన కథలిలా వస్తాయి నాకు రావడంలేదు .. పార్వతికి అప్పుడే వేయడం రాలేదుగాని ఆమె కూతురు ఎదిగి మమ్మీ రేప్ అంటే ఏమిటి? అని అడుగుతూంది ... పార్వతితో పాటే– నేనూ నా వూహలు ఎదిగాయి.

★ ఏనుగంటున్నారని పొంగిపోకండి; ఆరోగ్యం కాపాడుకోండి. టోటల్‌గా మీరంటే నాకు గౌరవం.

● థాంక్యూ. కాని అదింక నా చేతిలో లేదు! పోయినదాన్ని గురించి బాధపడే అలవాటులేదు నాకు?! □




గ్యాసు కోసం వేట
* రవీంద్ర
ఫలానా నదిలో గ్యాసు పడింది..... యిహ 21వ శతాబ్దం లో గ్యాసు కొరతే రాదని హామీ ఇస్తున్నా-
కమీషను తీసుకొని ఏం కావాలన్నా తెప్పించి పెడతారంటగా.... ఓ గ్యాస్ సిలెండర తెప్పించండి చూద్దాం-
గ్యాస్ కంపెనీ
ఎలాగయితే నేం.... ఈ మధ్య గ్యాసు లీకేజి మీద కంప్లైంట్స్ రాకుండా చూస్తున్నాం సార్....
ఫిర్యాదుల విభాగం
ఇది చాల కాస్ట్లీ భోజనం - గ్యాస్ సిలెండరు రెండొందలు పోసి బ్లాకులో కొన్నాను...

సూరిగాడు

జి. రామాంజనేయులు

"సార్! మీ పేరు చెప్పుకొని బతుకుతాము. మా సూరిగానికి హాస్టల్లో క్లీనర్ పని యిప్పించండి సార్!" నెల రోజులుగా రాజేంద్ర కనబడిన ప్రతిసారి వెంకయ్య ఇలా ప్రాథేయ పడుతున్నాడు.

రాజేంద్ర యూనివర్శిటీ హాస్టల్ మెస్ సెక్రటరి. వెంకయ్య అడిగినప్పుడల్లా "చూద్దాం!" "సరేలే!" అంటూ తప్పించుకు వస్తున్నాడు. కాని ఈసారి రాజేంద్రకు వెంకయ్యమీద జాలి కలిగింది. ఒక వూరివాడు పోనీ పాపం సాయం చేద్దామనుకొని–

"సరే మధ్యాన్నం డిప్యూటీ వార్డెన్‌తో మాట్లాడుదాం, నువ్వు కూడా రా" అని రాజేంద్ర వెళ్ళిపోయాడు

"మీ దయ సార్" అంటూ వెంకయ్య యూనివర్శిటీ ఆవరణలోని ఒక చెట్టు కింద చతికిల పడ్డాడు

వెంకయ్య తాత రైతు. వెంకయ్య తండ్రి రైతుకూలి. వెంకయ్య పుట్టి పెరిగిన పల్లెలో కూలి దొరక్క, పొట్ట నొక చేత్తో, పెళ్ళాన్ని మరో చేత్తో పట్టుకొని టౌన్ చేరాడు. కొన్నాళ్ళు రిక్షా తొక్కాడు. మరి కొన్నాళ్ళు ఆ పని ఈ పని చేసాడు ఎవరో పుణ్యాత్ముడు దయతలచి ఒక ప్రవేట్ కంపెనిలో చిన్న పనిప్పించాడు అందులో స్వీపర్, అటెండర్, వాటర్‌బాయ్ ఆల్ ఇన్ వన్ వెంకయ్యే

వెంకయ్య జీతం మూడు వందలు పిల్లలు ఐదు మంది ముగ్గురు పిల్లలు పుట్టాక ఆపరేషన్ చేయించుకొమ్మని, ఇద్దరు ముగ్గురు వెంకయ్యకు చెప్పి చూశారు కాని దేవుడిస్తున్న పిల్లల్ని వద్దనుకోవడం మహాపాపమనుకున్నాడు వెంకయ్య అయినా నారు పోసిన వాడు నీరు పోయడా? అని దేవునిపై భారం వేశాడు

ఐదు మంది పిల్లల్నయితే దేవుడిచ్చాడు కాని నీరు గీరు పోసే బాధ్యత తనమీద వేసుకో లేదు ఒకరోజు అప్పులవాడు నక్షత్రకుడిలా వెంటబడేసరికి, ఎక్కడా అప్పు పుట్టక, వాడ్నెలా వదిలించుకోవాలో తెలియక, వెళ్ళి ఆపరేషన్ చేయించుకొని వాడి అప్పు బారినుండి, దేవుడిస్తున్న పిల్లల బారినుండి బతికి బయటపడ్డాడు వెంకయ్య

సూరిగాడు వెంకయ్య పెద్ద కొడుకు. వాడు వాడలోని పిల్లలకంతా పెద్ద దిక్కు. గోలీ లాడ్డంలో మొనగాడు. ఈత కొట్టడంలో చేప పిల్ల. చెట్లెక్కడంలో కోతి పిల్ల. మొత్తానికి వాడు ఎగిరే పక్షి లాంటివాడు పదేళ్ళ పిల్లవాడు

సూరిగాడు స్కూలు కెళ్ళలేదు వాళ్ళయ్య పంపించ లేదు ఉదయాన్నే వాళ్ళయ్య ఉద్యోగాని కెడితే, వాళ్ళ అమ్మ ఇంత ఉడకేసి కూలి కెళుతుంది సూరిగాడు నాలుగు ముద్దలు మింగి నలుగురు పిల్లలను ప్రోగు చేసుకొని ఆటలమీద పడతాడు.

ఎండిపోయిన శరీరం, అతుకులు వేసిన నిక్కరు చిరుగులు పట్టి గుండీ లూడిపోయిన అంగీ. జేబుల నిండా గోలీలు, ఇనుప మేకులు. ఇంకా నానారకాల సామగ్రి. నిర్లక్ష్యంగా మొహం మీద పడే జుట్టు. చీమిడికారే ముక్కు. నడుముకు పాత బెల్టు. ఇదీ సూరిగాడి రూపం. కాని వాడి కళ్ళుమటుకు ఎప్పుడూ ఉత్సాహంగా మెరుస్తూ వుంటాయి.

రాత్రవగానే వాళ్ళ అయ్య మస్తుగా తాగి మాట్లాడే బూతులు, అమ్మ అయ్యను తిట్టే తిట్లు. అన్నం చాలక తమ్ముళ్ళు ఏడ్చే ఏడుపులు వింటూ, రేపటి తన ఆటల ప్రణాళిక గురించి ఆలోచించు కుంటూ నిద్రలోకి జారుకుంటాడు సూరిగాడు.

అప్పుడప్పుడూ చిరుగుల దుప్పటిలోంచి చలిగాడు దూరి బాధిస్తే, ఇంకా అన్నం కావాలని పేగులు వేధిస్తే, స్కూళ్ళకెళ్ళే సీతాకోక చిలుక ల్లాంటి తన ఈడు పిల్లల గురించి, వాళ్ళు తినే ఐస్ క్రీమ్‌లు, బిస్కట్ల గురించి ఆలోచిస్తాడు వాడు

తమ వూరి వాడయిన రాజేంద్ర సహాయంతో సూరిగాడ్ని ముందు క్లీనర్‌గా చేర్పించి తరువాత ఎవరో ఒకరి కాళ్ళో కడుపులో పట్టుకొని సర్వర్‌గా చేస్తే తనకు ఎంతో బరువు వదిలి పోతుందని వెంకయ్య ఆలోచన, ఆశ.

మధ్యాన్నం రాజేంద్ర వెంట డిప్యూటి వార్డెన్ వద్ద కెళ్ళాడు వెంకయ్య 'సార్! ఈయన వెంకయ్యని మా వూరివాడే ఈయన కొడుకుని మన హాస్టల్లో క్లీనర్‌గా చేర్చుకుందాము" అన్నాడు రాజేంద్ర వార్డెన్‌తో

వెంకయ్య వినయంగా చేతులు కట్టుకొని, ఆశగా వార్డెన్ మొహం వైపు చూస్తూ నిలుచున్నాడు.

వార్డెన్ కొన్ని క్షణాలు ఆలోచించి, 'ఇప్పుడెందుకు? మనకు తగినంత మంది వున్నారుగా?" అన్నాడు.

ఆ మాటలు వింటూనే గుండెల్లో రాయి పడింది వెంకయ్యకు.

"సార్! కనికరించండి, బీదముండా కొడుకులం" అన్నాడు దీనంగా చేతులు జోడించి.

"పాపం! పోనీలెండి సార్, చాలా రోజులుగా అడుగుతున్నాడు. మనం జీతం ఇవ్వడం లేదుగా, పని చేసేందుకు తిండి మాత్రం పెడతాం అంతేగా" అన్నాడు రాజేంద్ర, వార్డెన్‌కు నచ్చ జెపుతూ.

"సరేలే, రేపటి నుండి పంపించు' అన్నాడు వార్డెన్ ఒప్పుకుంటూ.

వెంకయ్య సంతోషంతో పొంగిపోయి రాజేంద్రకు, వార్డెన్‌కు నమస్కారం చేసి, వుషారుగా సారా అంగడికి దారి తీసి తను పీకలదాకా తాగి, స్నేహితులిద్దరికి చెరో గ్లాసు పోయించి, రెండు రూపాయల మిరపకాయ బజ్జీలు కట్టించుకొని ఇంటికి దారి తీసాడు. దారిలో కనిపించిన వాళ్ళందరితోనూ ఈ విషయం చెప్పాడు.

వెంకయ్య వూగుతూ ఇంటికి రాగానే సూరిగాడు, వాడి తమ్ముళ్ళు తండ్రి చేతిలోని పొట్లం చూసి మొదట ఆశ్చర్యపోయి, తరువాత ఆవురావురు మంటూ లాక్కున్నారు.

"ఏమే! మన సూరిగాడికి కాలేజీ హాస్టల్లో క్లీనర్ పని యిప్పించినాను. ఎంత కష్టం పడితిననుకుంటావు" అంటూ తను పడిన కష్టాన్నంతా మాటల్లో చూపిస్తూ చతికిలపడ్డాడు నేలమీద వెంకయ్య.

ఆ మాటలు వినగానే తింటున్న మిరపకాయ బజ్జీ వెలక్కాయగా మారింది సూరిగాడికి. కారం నసాళాని కంటింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గాల్లో ఎగిరే పక్షికి రెక్కలు తెగినట్లయ్యింది.

"అయ్యా! నేను పోను పనికి" అన్నాడు నసుగుతూ భయంగా

"పళ్ళు రాలగొడ్తా! దున్నపోతా! నీ పని కోసం నేను ఎందరి కాళ్ళు పట్టుకుండా ననుకున్నావు! మహరాజు కొడుకు వనుకున్నావా?" అంటూ సూరిగాడిని తన్నడానికి కోపంగా లేచాడు వెంకయ్య

వెంటనే సూరిగాడి తల్లి వెంకయ్యకు, సూరిగాడికి మధ్య అడ్డు నిలిచి, "నువ్వుండు, తాగుబోతు ముండాకొడుకా, పిల్లోడు వాడికేం తెలుసు?" అంటూ సూరిగాడ్ని దగ్గరకు తీసుకొని.

"ఒరే నాయనా! మా బతుకు లిట్లా కడుపు నిండా తిండిలేక, ఒంటికి బట్టల్లేక, సుఖానికి మొహం వాచి ఏడుస్తూనే దొర్లిపోయాయి. కనీసం నువ్వయినా బాగుంటే చూసి సంతోషిస్తాం హాస్టల్లో కడుపు నిండా తిండి పెడతారు ఇక్కడ మాదిరి సగం కడుపుకు అన్నంతిని, సగం కడుపును నీళ్ళతో నింపి నిద్రపోనక్కర్లేదురా పనికి పో నాయనా, బీదోళ్ళం! పని చేసుకోకుంటే తిండి ఎట్లొస్తుందిరా?" అని చెపుతూ ఏడ్చింది. ఏడుస్తూ చెప్పింది సూరిగాడు కూడా తల్లి వొళ్ళో తల పెట్టుకొని ఏడ్చాడు

* * * *

మరుసటి రోజు ఉదయాన్నే ఉన్న చిరుగుల బట్టలు, దుప్పటిని ఒక అతుకుల సంచిలో కుక్కుకొని, కళ్ళలో నీళ్ళు నింపుకొని తండ్రి వెంట హాస్టల్‌కి నడిచాడు సూరిగాడు.

అప్పటికే వాడి స్నేహితుల కీవిషయం తెలిసి పోయింది వాడిచుట్టూ మూగి "మళ్ళెప్పుడొస్తావురా సూరి?" అని ప్రశ్నించారు.

సూరిగాడు బదులు చెప్పకుండా దిగులుగా నడిచాడు.

దారిలో సూరిగాడికి పిప్పర మెంట్లు కొని పెట్టి "హాస్టల్లో అంతా పెద్ద చదువు గల బాబులుంటారు. అల్లరి పనులు చెయ్యకుండా మర్యాదగా పని చెయ్యరా" అంటూ కొడుక్కి హిత వచనాలు చెప్పాడు వెంకయ్య.

వెంకయ్య సూరిగాడ్ని హాస్టల్ మెస్‌లోకి తీసుకెళ్ళి అక్కడ స్టే వార్డెన్‌తో "వీడు నా కొడుకు సార్, ఈ రోజు నుండి క్లీనర్ పనిలోకి వస్తాడు" అని చెప్పాడు.

"ఓహో! వీడేనా? నిన్న వార్డెన్ చెప్పాడులే, బాగా పనిచెయ్యాలి తెలిసిందా?" అన్నాడు స్టే -వార్డెన్.

తెలిసిందన్నట్లు సూరిగాడు తలూపాడు

"నే నెళ్ళొస్తాను" అని వెంకయ్య వెళ్ళిపోయాడు.

సూరిగాడు లోనికెళ్ళే సరికి, సూరిగాడి వయసు వున్న పిల్లలే ఇంకా ముగ్గురు అక్కడ పని చేస్తున్నారు. వీడ్ని చూడగానే "కొత్తగా వచ్చావా?" అని పలుకరించారు.

సూరిగాడు అవునని తలవూపాడు.

"సరే పోయి ప్లేట్లు కడుగు మేము డైనింగ్ హాల్లో క్లీన్ చేస్తాము" అని చెప్పారు.

సూరిగాడు ప్లేట్లు కడగటం మొదలు పెట్టాడు. ఓ ఇరవై ప్లేట్లు కడిగే సరికి చేతులు పీకసాగాయి అలవాటు లేక పాపడం వల్ల.

ఇంతలో ఒక కుర్రాడొచ్చి ఒరే, ఎచ్చి నాయాలా! ఒకో ప్లేట్‌ను అంతసేపు కడగ కూడదురా, నీళ్ళలో అలా ముంచి ఇలా తీసి వెయ్యాలి అంతే, ఈ విధంగా కడిగితే ఈ రోజంతా కడిగినా అయిపోవు తెలుసా?" అని మందలించి, నే కడుగుతాను, నువ్వు ఎంగిలి పళ్ళాలు తీసుకొని రాపో! అని పురమాయించాడు.

సూరిగాడు లేచి డైనింగ్ హాల్లోకి వెళ్ళాడు. కొందరు స్టూడెంట్లు టిఫిన్ చేసి వెళ్ళిపోతున్నారు. కొందరు వస్తున్నారు. సూరిగాడు ఎంగిలి పళ్ళేలను ఒక్కొ దాన్ని జాగ్రత్తగా తీయసాగాడు.

ఇంతలో "రేయ్! ఇట్రారా!" అని ఒక మూల నుండి ఒక స్టూడెంట్ గర్జించాడు

సూరిగాడు వెళ్ళాడు.

"ఈ ప్లేటు మీ నాయన తీస్తాడేరా? తిని బాగా కొవ్వు పట్టినారు దున్న పోతుల మాదిరి" తిట్టాడు వాడు.

సూరిగాడు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మౌనంగా ప్లేటు తీసాడు. కొందరు సగం ఉప్మాను వదిలేసి చేతులు కడిగారు.

పని అయిపోగానే వాడికి కడుపు నిండా టిఫిన్ పెట్టారు. ప్రాణం కాస్త కుదుటబడింది వాడికి

మధ్యాహ్నం భోజన సమయంలో కూడా ఇద్దరు ముగ్గురు తిట్టారు వాడిని.

రాత్రి సర్వర్స్ రూంలో మిగతా పిల్లలతో పాటు పడుకున్నాడు వాడు. కొన్ని క్షణాలకే కింద నుండి నల్లులు, పై నుండి దోమలు దాడి చేసాయి. సూరిగాడికి దోమలు అలవాటే కాని నల్లులే కొత్త.

సూరిగాడు పక్కనే పడుకున్న వంటవాడు లేచి నల్లుల్ని, దోమల్ని బండబూతులు తిట్టి 'ఆ గూట్లో నల్లులమందుంది రేపు ఈ రూములో కొట్టు' అని ఒక కుర్రాడికి చెప్పి పడుకున్నాడు.

సూరిగాడు తల్లిని, తమ్ముళ్ళను తలుచుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

* * * * *

సూరిగాడిది, మిగతా పిల్లల దినచర్య సూర్యుడి కంటే ముందే ప్రారంభమవుతుంది. ఐదు గంటలకే లేచి వంటవాడికి కూరగాయలు తరగడం మొదలయిన చిన్న చిన్న పనుల్లో సహాయం చెయ్యాలి తరువాత డైనింగ్ హాల్లో ప్లేట్లు గ్లాసులు సర్దాలి. తొమ్మిదిన్నర వరకు పని చేసి టిఫిన్ తింటారు

తరువాత స్టూడెంట్లు సిగరెట్లు తెమ్మనో, బట్టలు లాండ్రికి ఇచ్చిరమ్మనో ఏదో ఒక పని చెబుతారు. ఒక్కోసారి ఆలస్యమయ్యిందని తిడతారు. ఒక్కోసారి చిల్లర డబ్బులు చేతిలో పెడతారు.

మధ్యాహ్నం భోజనం తయారు చెయ్యడానికి వంట రూంలో వంట వాడికి సహాయం చెయ్యాలి తరువాత రెండు వరకు డైనింగ్ హాల్లో పని. హాస్టల్లో పేకాటా బృందాలుంటాయి వారు పదే పదే టీ తెమ్మనో, సిగరెట్లు కోసం తిప్పుతారు ఒక్కోసారి సర్వర్లు తమ పనిని ఈ పిల్లల మీద తోసేసి వెళ్ళిపోతారు.

సాయంత్రం నాలుగు గంటలకు కాఫీ గ్లాసులు కడగటం, ఐదుగంటల నుండి ఏడుగంటల వరకు కాస్త తీరిక దొరుకుతుంది అది కూడా స్టూడెంట్ల కంట పడకుండా వుంటే

మళ్ళీ ఏడు నుండి తొమ్మిది వరకు డైనింగ్ హాలుపని, కడగటం తుడవటం అలసి పోయిన శరీరాలతో పది గంటలకు నిద్రపోతారు.

మూడు రోజులు గడిచే సరికి సూరిగాడికి ఇంటి మీద బెంగ తీవ్రమయ్యింది. వాడికి కడుపు నిండా తిండి అయితే దొరుకుతూవుంది. కాని వాడికి



స్నేహితులు. అప్యాయంగా మాట్లాడేవారు కరువయ్యారు. ఖాళీ సమయంలో తనతోటి పిల్లలను ఆటలకు పిలిచినా కూడా వారు ఉత్సాహం చూపకపోవడం సూరిగాడ్ని ఆశ్చర్యంలో పడవేసింది. వారు తమ తల్లితండ్రులను వదిలి తిండికోసం చాకిరి చెయ్యడానికి వచ్చిన వాళ్ళే సహజంగా పిల్లల్లో ఆవయసులో ఉండాల్సిన ఉత్సాహం, చురుకుదనం వారిలో మందగించి పోయాయి. పదేళ్ళ వయసులోనే నిర్లిప్తతను అలవరుచుకున్నారు వారు

నాలుగవ రోజు స్టే వార్డెన్‌ను బతిమాలి సూరిగాడు ఇంటికి వెళ్ళాడు. తమ్ముళ్ళు తమకోసం అన్న తెచ్చిన పిప్పరమెంట్లు లాక్కున్నారు

'సూరిగా! నిన్ను చూసి ఎన్నాళ్ళయినట్లు వుందిరా' అంటూ తల్లి వాడిని ప్రేమతో నిమిరింది.

'ఎన్నాళ్ళో అయినట్లు పరుగెత్తు కొచ్చావేరా' పని తప్పించుకుంటే కాళ్ళిరగ్గొడ్తా' అని తండ్రి మండి పడ్డాడు

స్నేహితులు వాణ్ణి మరిచి పోయి మరో నాయకుణ్ణి ఎన్నుకున్నారు. సూరిగాణ్ని చూడగానే వాళ్ళంతా పరుగెత్తు కొచ్చి 'ఏరా సూరి! హాస్టల్లో మంచి తిండి పెడతారట గదా' ఎంతదృష్ట వంతుడివిరా' అని వాడిని పొగిడారు

సూరిగాడు స్వేచ్ఛగా ఆడుకుంటున్న వారి వైపు చూసి 'హూ!' అని మూలిగి అక్కడ నుండి వచ్చేసాడు

* * * * *

ప్రార్థన

బ్రతుకులో రమ్యత
భావాలలో నవ్యత
మదిలో భావుకత
మనుగడలో సవ్యత
మాకు ప్రసాదించు తండ్రీ!

—ఎస్. అబ్దుల్ ఖాలిక్

సూరిగాడు

వారం రోజులు గడిచిపోయాయి యాంత్రికంగా. ఒకరోజు సాయంత్రం కాఫీ కప్పులు కడిగేసి అలసిపోయిన సూరిగాడు కాసేపు ఎక్కడయినా కూలబడదామనుకుంటుండగా

"ఒరే సూరి!" అని ఓ స్టూడెంట్ పిలిచాడు రూములో నుండి.

"ఏం సార్" అని వెళ్ళాడు సూరిగాడు.

"ఈ బట్టలు ఇస్త్రీ చేయించి తీసుకొని రా" అని పురమాయించాడు.

సూరిగాడు ఆ బట్టలు ఇస్త్రీ చేయించుకొని రూమ్ దగ్గరికి వెళ్ళి "సార్" అని పిలిచాడు.

ఎవరూ పలకలేదు. సూరిగాడు తలుపు తీసుకొని లోనికెళ్ళి ఎవరూ లేకపోవడంతో బట్టలను టేబుల్‌పై పెట్టి వచ్చేసాడు.

ఐదు నిముషాల తర్వాత "సూరి!" అని తీవ్రంగా పిలిచాడా స్టూడెంట్.

ఆ పిలుపులోని కాఠిన్యానికి భయపడుతూ రూములోకి బితుకు బితుకు మంటూ వెళ్ళాడు సూరిగాడు.

సూరిగాడ్ని చూసి ఆ స్టూడెంట్ చాలా తీవ్రంగా–

'గడియారం ఏదిరా?' ప్రశ్నించాడు. సూరిగాడికి అర్థం కాలేదు.

"ఏం గడియారం సార్?" అన్నాడు అమాయకంగా.

"ఏం గడియారమా? నువ్వెత్తు కెళ్ళిన గడియారం" అన్నాడు వెటకారంగా. సూరిగాడు బిక్కచచ్చిపోయి 'అమ్మ తోడు. నాకేం తెలియదు సార్ ఏడుపు గొంతుతో అన్నాడు

ఈ గొడవకు నలుగురయిదుగురు స్టూడెంట్స్ గుమికూడారు

ఏం జరిగిందంటూ?"

"తెలియదా రాస్కెల్? నువ్వు తప్ప ఇంకెవరొచ్చార్రా రూములోకి" అంటూ కోపంగా వాడి చెంప మీద పెఢమని కొట్టాడు ఆ దెబ్బకు తూలి ముందున్న కుర్చీ మీద పడ్డాడు సూరిగాడు

"అమ్మా" అంటూ ఏడవసాగాడు సూరిగాడు.

"దొంగతనం చేసింది చాలక, దొంగ ఏడుపు కూడాను?" అంటూ మళ్ళీతన్నబోయాడా స్టూడెంట్

ఇంతలో అతడి స్నేహితుడు వారించి ఇంగ్లీషులో ఇలా అన్నాడు.

సురేష్! తొందరపడకు. ఈ వెధవలకు వర్కర్స్ యూనియన్ వుంది. వాడ్ని తంతే తెలిసాని గొడవపుతుంది పోలసుల. పెరు చెప్పి బాగా

బెదిరిద్దాం, భయపడి వాడే తెచ్చిస్తాడు. లేకపోతే రాత్రి పేకాటలో పోయిన మూడు వందలతో పాటు ఇది కూడా పోయిందనుకో. అంత కంటే చేసేదేమీ లేదు."

వర్కర్స్ యూనియన్ పేరు వినేసరికి అతని ఆవేశం కొంచెం తగ్గింది. ఏడుస్తున్న సూరిగాడ్ని చూసి తీవ్రంగా.

'రేయ్' వాచీ నువ్వే ఎత్తుకెళ్ళావని నాకు తెలుసు. మర్యాదగా తెచ్చివ్వు. లేకపోతే పోలీసులు కీళ్ళు విరగ్గొట్టి బొక్కలో తోస్తారు" అని బెదిరించాడు

అతని స్నేహితుడు కూడా "రేయ్! పోలీసులంటే ఏమనుకున్నావో? కాళ్ళు చేతులు విరిచేస్తారు. నీ ఇష్టం' అన్నాడు.

సూరిగాడు వెక్కిళ్ళు పెడుతూ, బుగ్గల మీద జారిపోతున్న కన్నీళ్ళను అంగీతో తుడుచు కుంటూ బయటికి వచ్చాడు.

సాయంత్రం ఆరు కావడం వల్ల హాస్టల్లో సందడి లేదు. వర్కర్స్ కూడా ఎవరూ లేరు. కాబట్టి ఈ విషయం చాలా మంది చూడలేదు.

వంటవాడు మటుకు ఏడుస్తూ వస్తున్న సూరిగాడ్ని చూసి-

"ఏమయిందిరా సూరి?" అని ప్రశ్నించాడు.

సూరిగాడు బదులు పలుకకుండా వర్కర్స్ రూమ్‌లోకి వెళ్ళాడు.

"ఈ స్టూడెంట్సు ఏదో అని వుంటారు" అనుకొని వంటవాడు వెళ్ళిపోయాడు.

వర్కర్స్ రూం చీకటిగా వుంది సూరిగాడి మనసు వలె. చీకటి నిండిన సూరిగాడి కళ్ళకు యమకింకరు ల్లాంటి పోలీసులు కన్పిస్తున్నారు.

ఒకసారి తమ వాడలో దొంగతనం చేసినవాణ్ణి పోలీసులు తన్నడం చూసాడు వాడు.

పరుగెత్తుతున్న వాడి వెంట పడి చొక్కా పట్టుకొని బూటుకాలుతో ముందు డొక్కలో తన్నారు. వాడు వెల్లకిలా పడ్డాడు. పడిన వాని మొహం మీద కాలితో తన్నారు. వాడు బంతిలా ఎగిరిపడ్డాడు. ముక్కుల్లో నుండి రక్తం వచ్చింది. ఏడుస్తున్న వాణ్ణి లాఠీలతో బూట్ కాళ్ళతో ఇష్టమొచ్చినట్లు బాది, రక్తసిక్తమై మాంసం ముద్దలాగా వున్న వాడ్ని వ్యాన్‌లోకి విసిరేసి తీసికెళ్ళారు.

ఇప్పుడు తనకు కూడా అదే గతి పడుతుందేమో అని భయపడసాగాడు సూరిగాడు.

వాడికి కళ్ళు మూసినా తెరిచినా పోలీసులు కన్పిస్తున్నారు. చీమ చిటుక్కుమన్నా, పోలీసుల బూట్ల శబ్దం మాదిరి వినిపించ సాగింది వాడికి.

"ఇంటికి పోతే?" అనిపించింది వాడికి. తండ్రి చావబాదుతాడు.

భయంతో వణకసాగాడు సూరిగాడు. వాడి గుండె శబ్దం కూడా స్పష్టంగా వాడికి వినిపించి భయపెట్టసాగింది.

ఆ రాత్రి వాడు భోజనం చెయ్యలేదు. రూంలో నుండి బయటికి కూడా రాలేదు. ఎవరూ అంతగా వాణ్ణి పట్టించుకోలేదు.

ఈ వేమన పద్యాలు



పెద్దల వచనములు ప్రేమతో జూచి తా
నటుల నడువ బోవ ననువు పడదు
వ్యాఘ్రము గని నక్క వాతను బడ్డట్లు
విశ్వదాభిరామ వినుర వేమ.

రాత్రి నిద్రలో అనేక మార్లు వులిక్కిపడి లేచి కూర్చున్నాడు వాడు.

* * * *

తెల్లవారగానే వంటవాడు వంట కుపక్రమిస్తూ -

"రాత్రి నుండి సూరిగాడు కనిపించలేదు వాడెక్కడున్నాడో చూడ'మని కుర్రాడికి పురమాయించాడు.

ఆ కుర్రాడు వర్కర్స్ రూంలోనూ, వరండాలోను అంతా వెతికాడు సూరిగాడు కన్పించలేదు,

"సూరిగాడు కన్పడలేదన్నా" అని చెప్పాడు.

"పారిపొయ్యుంటాడు, పిచ్చివెధవ - హాస్టల్లో బాగా తిండి పెడతారనుకొని వుంటాడు. కాని ఈ చాకిరి, చీవాట్లకు భయపడి పారిపోయాడు. ఎట్టి చాకిరి పోవాలంటాడు గవర్మెంటోడు. ఈ హాస్టల్లలో ఈ పిల్లలతో చేయించేదాన్ని ఎట్టి చాకిరనక ఏమంటారు? ఇంతింత పెద్ద పెద్ద సదువులు సదువుకున్న మా రాజులుండే ఇలాంటి చోటే పని చేసే వాడికి యిలువలేదు" అని తనలో తాను గొణుక్కుంటూ కూరగాయలు తరగ సాగాడు వంటవాడు.

అతను ఈ మాటలు అంటున్న సమయానికి హాస్టల్ వెనక వున్న పొలంలో అచేతనంగా పడి వున్నాడు సూరిగాడు.

వాడి పక్కనే నల్లుల మందు సీసా పడి వుంది:

కళ్ళు శూన్యంలో చూస్తున్నాయి. ఎండిన డొక్కల్లో చలనం లేదు. చాలా సేపు నరకయాతన అనుభవించినట్లు వికృతంగా మారి వున్న వాడి మొహం మీద ఈగలు మూగి వున్నాయి. □

వ్యక్తిగతం

తక్షణం అవసరమైన మందు దొరకక మెదడుకు సంబంధించిన ఒక వ్యాధి వల్ల మరణించిన తన భర్త స్మృత్యర్థం శ్రీమతి వైజయంతి మాలా బాలి మద్రాసులో 'డాక్టర్ బాలి ఫార్మా ఫౌండేషన్' అనే సంస్థను స్థాపించారు.



ప్రాణాన్ని రక్షించండి' అనేది ఈ సంస్థ నినాదంగా ఉంటుంది. ప్రాణరక్షణ మందులను విదేశాల నుంచి ప్రభుత్వానుమతితో తెప్పించి అవసరమైన వారికి ఉచితంగా సరఫరా చేయడం ఈ సంస్థ లక్ష్యం. ప్రస్తుతం ఈ సంస్థ అలాంటి 18 ప్రాణ రక్షణ మందులకు అనుమతి సంపాదించింది. ఈ సంస్థకు వైద్య సలహా మండలి ఒకటి ఉన్నదనీ అందులో దేశంలోను, విదేశాలలోను నిపుణులైన 40 మంది వైద్యులున్నారనీ ఆమె చెప్పారు. వారు హృదయ సంబంధమైన వ్యాధులకు, నరాల శస్త్ర చికిత్సకు, కాలిన గాయాలకు, మూత్ర పిండాల వైఫల్యాలకు అత్యవసరమైన మందుల జాబితాను తయారు చేశారు. దేశంలో ఇలాంటి సంస్థ ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం . ఇది మొదట రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తుందని, తర్వాత ఇరవై నాలుగు గంటలు పని చేసేలా విస్తరిస్తామని చెప్పారు. ఈ సంస్థకు అనుబంధంగా ఒక రక్తనిధిని, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని స్థాపించాలనుకుంటున్నామని ఆమె అన్నారు. ఈ సంస్థను నడిపే నిధులకోసం వైజయంతి మాల భరతనాట్య ప్రదర్శన లివ్వదానికి నిశ్చయించుకున్నారు. □



విశ్వ విఖ్యాత టెన్నిస్ క్రీడాకారిణి . మార్టినా నవ్రతిలోవాను 1986 సంవత్సరానికి గాను అంతర్జాతీయ క్రీడా కారిణిగా యూరప్‌కు చెందిన అసోసియేటెడ్ ప్రెస్ క్రీడా వ్యాఖ్యాతలు నిర్ధారించారు. ప్రతి రోజూ, ప్రతి నెలా, ప్రతి సంవత్సరమూ గెలుపు సాధిస్తూ, గెలుపులతో అవిచ్ఛిన్న ధారను నెలకొల్పినందు వల్ల ఆమెకు ఈ బిరుదు అందడం న్యాయమైనదే. మహిళల టెన్నిస్‌ను కూడ అతి ఎక్కువ డబ్బులు సంపాదించే పురుషుల టెన్నిస్ స్థాయికి తీసుకు పోయేందుకు బిల్లీ జీన్‌కింగ్ ప్రారంభించిన ప్రయత్నాన్ని నవ్రతిలోవా విజయవంతంగా పూర్తి చేసింది ఆమె ఇప్పటికి వింబుల్డన్‌లో ఏడు సార్లు విజయం సాధించింది. ఈ ఏడు గెలుపులలో ఐదు వరుసగా సాధించినవే. ఆమె తన 18వ ఏట 1975లో స్వదేశం చెకొస్లొవేకియాను వదిలి వచ్చేసింది. ఆ తర్వాత ఆమె జీవితంలో కొనసాగిన భద్రతా రాహిత్యాన్ని, ఒంటరి తనాన్ని అధిగమించి ఆమె ఆటలో నైపుణ్యం సంపాదించింది. ఇప్పటి దాకా టెన్నిస్‌లో ఆమెకు ఎదురు నిలవగలిగినది క్రిస్ ఎవర్ట్ లాయడ్ మాత్రమే. ఈ ఇద్దరి పోటీలో ఆ ఆటే నూతన శిఖరాల నందుకున్నది..... □

వారఫలం

23-1-1987 శుక్రవారం మొదలు
29-1-1987 గురువారం వరకు

★ **మేషం** :మీది భారీ సంస్థ అయితే ఆదాయమున్నది ప్రచారంగాన పేరు తెచ్చుకొంటారు. సాంఘికంగా మీకు ప్రతిష్ఠ అతిశయిస్తుంది. వృత్తి యందు కొంత పెంపు చేకూరుట గమనింపదగిన అంశం. ఒకానొక ఆశయ పూర్తిక వారమంతా కృషి చేస్తారు స్త్రీలకు . కళాసాహితీ రంగాలలో సదవకాశాలుంటాయి

★ **వృషభం** :వ్యక్తిగతంగా మీకు అపకారం జరుగదు గాని. చెప్పదగిన మేలు లేదు ఉద్యోగ రీత్యా ఒడిదుడుకలుంటాయి గనులందు, భారీ సంస్థలందు, పత్రికా సంస్థలందు పనిపాటలు చేసే వారికి కొంత అనుకూలత చెప్పదగిన సమయం స్త్రీలకు స్థితి యందు పెంపు. ఉద్యోగమందు ఆటంకాదు చేకూరుట నిశ్చయం, గమనించాలి

★ **మిధునం** :అవకాశవాదులు, స్తోత్ర పాఠకులు వారంలో ఒకటి రెండు మార్లు తగులుతారు. ఎవరు హితం చెబుతున్నారో, ఎవరు కాదో తెలియకొలేక ఇబ్బంది పడుతారు వారాంతంలో ధనాదాయమున్నది సుఖశాంతులకు అవకాశమున్నది రాజకీయంగా మేలుగాదు తెలిసకోండి స్త్రీలకు . అనవసర ప్రయాస, ధనాభావం

★ **కర్కాటకం** :దూరబంధువులు అనుకోకుండా యింటికి రాగలఅవకాశాలుంటాయి వ్యాపార నిమిత్తమై చేసిన యత్నాలు ఫలిస్తాయి. వారమంతా సర్వవిధాలా అనుకూలమే. ఎవరో చేసిన పొరపాటు, ఉద్యోగ రీత్యా మిమ్ము వేధింపనున్నది. స్త్రీలకు . పోగొట్టుకొన్న వస్తువులు భోగట్టా కనుగొనగలుగుతారు

★ **సింహం** :ధనాదాయమున్నది ప్రతికూలం కానున్నది అనుకొన్న వ్యవహారం కొంత వరకు అనుకూలమే స్థితిగతులందు కొంత అభివృద్ధి చెప్పదగిన సమయం వస్తు సేకరణ యందు కొంత ఆలస్యం జరుగుట నిశ్చయం. స్త్రీలకు . ఉద్యోగరీత్యా అనుకూలమేగా ఆరోగ్య లోపం చాల మందికి

★ **కన్య** :వారమంతా అనుకూలం. ధనదాయకం లాభదాయకం. విద్యా సంస్థలందు పనిచేయు వారికి అనుకూలం ఇంట శుభం జరుగుటకు అవకాశమున్నది దూరప్రాంతాలకు వెళ్లిన బంధువులు యింటికి రాగలరు. స్త్రీలకు ధన, వస్తు, వాహన సేకరణకు కొందరకు అనుకూలం.

★ **తుల** :ఒకానొకవ్యవహారం ఈ వారం సులభంగా తీరుతుంది. మీ ప్రతిభా వ్యుత్పత్తులు రాణించగలవు. అయివోజా పెరుగుతుంది. రాజకీయంగా ఏమాత్రంబాగుండదు. మీ యత్నాలన్నీ వ్యర్థములే. స్త్రీలకు : అధికారమందు వృద్ధి.

★ **వృశ్చికం** :ఇంకా స్థితి మెరుగు కాలేదని గ్రహింపగలుగుతారు. దూరదేశాలకు కొందరు ప్రయాణించాలని యత్నించి మానుకోవటం కూడా జరుగుతుంది. ఆరోగ్య లోపమున్న వారు కొంత జాగ్రత్త పడుట అవసరం. స్త్రీలకు · వయసు మళ్లిన వారికి ఆరోగ్య భంగం చెప్పదగిన అంశం.

★ **ధనుస్సు** :వెనుక ముందులు, మంచి చెడుగులు, పూర్వాపరాలు, లాభనష్టాలు గమనించి కార్యక్రమానికి దిగండి అనుకొన్న విధాన వ్యవహార ప్రగతిని సాధించండి వృద్ధుల గూర్చి ఆందోళన కలుగకుండా చూచుకోండి. స్త్రీలకు : వస్తు సేకరణకు అవకాశమున్నది అంతో యింతో ధనాదాయమున్నది

★ **మకరం** :దూరభారాలకు పోగల అవకాశాలు కొందరకుసంభవం వ్యవహారం చాల బాధాకరంగా ఉన్నా ఈ వారం సానుకూలం కావటం గమనించాలి మానశికాందోళన, ఒకానొక విషయంలో తొలగటం గ్రహింపదగిన అంశం. స్త్రీలకు :అనుకొనని రీతిగా ఆదాయం, సభా గౌరవం, పత్రికాప్రశంసలు.

★ **కుంభం** :మాటకు విలువ పెరగటం, సభా గౌరవానికి అవకాశం కల్గటం చెప్పదగిన అంశం మీ తాలూకు వస్తువులు పోకుండా జాగ్రత్త పడండి ఇంట శుభ కార్యానికి అవకాశం గల వారం, గ్రహించండి స్త్రీలకు ·కళారంగాన సదవకాశాలు లభ్యమవుతాయి, గ్రహించాలి.

★ **మీనం** :అలవాటుగా చేసే పనుల యందు కొంత ప్రయాస కనిపిస్తుంది. రాజకీయవాదులకు ఈ వారం ఏ మాత్రం అనుకూలంగాదు. వస్తు సేకరణకు అంతకన్న అనుకూలం గాదు. ఒకవేళ దొంగతనం జరుగుతుందేమో జాగ్రత్త! స్త్రీలకు కుటుంబ భారం అధికం పుణ్యకార్యాచరణ వాయిదా పడటం సంభవం

-విద్వాన్ కోటసత్యరంగయ్యశాస్త్రి



దూరదర్శనం

లత

ఖేల్ ఖేల్‌మే

పిల్లల కార్యక్రమం - పిల్లలు కూడా అపరాధ పరిశోధన చేస్తారు పిల్లల ఐక్యూ పెరిగిందనుకోవాలా? వాళ్ళు అనవసరంగా ముందే ముగ్గి రుచీ స్వభావం కోల్పోతున్నారనాలా?

రీచ్‌డ్ బియాండ్ రీచ్

హిమాలయాల నుండి- అండమాన్ నికోబార్‌లాటి చోట్ల వరకూ రోడ్లు వేసే ప్రాజెక్టులు నిర్మించటం, విమానాశ్రయాలు కట్టడం, హాస్పిటల్స్ నిర్మించటం మొదలైన దేశ పునర్నిర్మాణం మీద చక్కని డాక్యుమెంటరీ చాలా ప్రోగ్రాముల కన్నా డాక్యుమెంటరీలే బాగుంటున్నాయి అంటే అతిశయోక్తి కాదు

దిల్‌దియా దర్ద్‌లియా

ఈ సినిమా డైరెక్టర్ కర్దార్ నటీనటులు దిలీప్‌కుమార్- వహిదా- ప్రాణ్ - రహమాన్‌లాటి వాళ్ళు. కథ ప్రేమకథ. సంగీతం బాగుంది ఇలాటి హాయైన సినిమా చూసి కొన్ని యుగాలయినట్టుంది కొట్లాటలూ- రేపులూ- రౌడీ- గూండాల నించి బయటపడి కొంతసేపు మరో లోకంలోకి వెళ్ళాం అది ముప్పయి ఏళ్ళ క్రితం సినిమా- కాని ఎ టర్నర్- అమూల్యం

శుక్రవారం (26–12–86) నాడు హైద్రాబాద్ ప్రోగ్రాంలో గోసం రక్షణను గురించీ – అర్థం కాని పిల్లల కార్యక్రమం ఒకటీ ప్రసారమయినయి పిల్లల ప్రొడ్యూసరు ఎవరో కాని కాస్త బుర్ర తక్కువ లాగా ఉంది మా తెలుగు తల్లికి బాణీలో పిల్లల చేత ఒక పాట పాడించింది – ఢిల్లీ నుంచి వచ్చిన జ్ఞానదీప్‌లో కూడా పిల్లల చేత ఎదో ఎగిరించారు ఆ ఎగురుడుకీ జ్ఞానానికీ కల సంబంధం ఏమిటో టీ వి వారికే తెలియాలి చిత్రహార్ కూడా ఆ రోజు బాగా లేదు యాత్ర శ్యామ్ బెనెగల్ సుదీర్ఘ యాత్ర అంత దూరం ప్రయాణం చేస్తున్నా ఓంపురి ఓపిక మెచ్చుదగినది

తాత సమాధి అజ్మీరులో ఉందని చూడటానికి వచ్చిన ఆంగ్లేయ యువతి వెంట ఒక వెకిలివాడు పడటం – రోజూ రైళ్ళోంచి ఇల్లు చూడటం తప్ప దిగటానికి ప్రాప్తం లేదు- అయినా నాకు ప్రయాణాలంటే ఇష్టం అనే రైల్వే టికెట్ కలెక్టరూ – ఇంగ్లండులోని పెళ్ళి కూతురూ ఆమె చేతి గోరింటాకు చూసి ఆశ్చర్యపడిన ఆంగ్లేయ యువతీ – రైలు కిందపడిన రామ్ బిహారీ వీరందరి మధ్యా ఓంపురీ అతని నటనా ఒక జీవిత యదార్థ చిత్రణ కాని ఎంత దూరం ఈ ప్రయాణం? వారానికి పది వేలు ఎంత దూరమైనా పరవా లేని ప్రయాణం ఇది జీవిత ప్రయాణం కాదు విసుగు పుట్టించుకు చాలా ఖరీదయిన యాత్ర

శనివారం (27–12–86) ఫూల్‌ఖిలే హై గుల్షన్ గుల్షన్ – సుదీర్ దలానీతో ఇంటర్వ్యూ జరిగింది ఇతను షిరిడి సాయిబాబా మీద సినిమా తీశాడట – గుజరాతీలో మాయాబజార్ – ఒక మరాఠీ సినిమా 'ఆశా' అనే మరో సినిమా ఇంకా అనేక బాషల్లోనూ సినిమా తీశాడట గొప్ప ఆస్తికుడల్లే ఉన్నాడు – చిల్లా అనే మలయాళీ సినిమాలో యాక్టు చేశాడట తరువాత అది హిందీలో డబ్ చేసినట్లున్నారు మొత్తానికి సర్వజ్ఞుడతడు ఇంత వరకు మనం వినకపోయినా షేర్ శివాజీ టీ వి ఫిల్ములో కూడా నటించాడు హైద్రాబాద్ టీ వి వారు క్రిస్మస్ సంగీతం కూడా వినిపించి తెలుగు వారినే కాక అందర్నీ ఏడిపించారు ఇది ఢిల్లీ నుంచి అన్ని స్టేషన్లకీ రిలే చేశారు కీచుమని కొన్ని పాటలు వినిపించారు....

పాపం అన్ని స్టేషన్లూ ఆగినట్లున్నాయి నిముషంన్నర పైన. హైద్రాబాదంటే మాటలా మరి? తాతు తెగిందే. అందులో క్రిష్టియన్ల పాటల మధ్యలో. అందరూ ఒకే రకంగా బట్టలు వేసుకుని మెర్రి క్రిస్మస్‌కి పాటలు పాడుతుంటే హైద్రాబాద్ కాస్తా పోయి తద్వారా ఢిల్లీ పోయి... ఢిల్లీ ద్వారా అన్ని స్టేషన్లూ పోయి.. ఉపగ్రహం ఒకటి మిగిలి ఉంటుంది – సారీ ఫర్ ది ట్రబుల్ అంటానికి కూడా వీల్లేకుండా గోవింద కొట్టింది. రెండున్నర నిముషాలు మూడు నిముషాలు నాలుగు అయిదు ఆరు ఇంత బాధ్యతా రహితమైనది టీ వి ఒకటే టీ వి సెట్టు కట్టేస్తున్నాను ఎనిమిదిన్నర టీ వి రాపటం లేదు రాత్రి పదకొండు గంటలకు టీ వి ని బాగు చేశారు

ఆదివారం (28–12–86) ఉదయ రాగాలు భూపాలీ – పూరి – శ్యామ – ఖమాచ్ – కల్యాణ్ పాడాలని చెప్పారు భూపాల రాగం దక్షిణ దేశంలో ఉదయ రాగం కాని దాన్ని ఉత్తర హిందూస్థాన గాయకులు గుర్తించరు

పూరి రాగం ఆలాపించారు అనే కంటే సంగీత పాఠం లాగా చెప్పారు కోమల గాంధారం స్వరాలు – తోడి స్వరాలు ఆలాపన చేశారు ఇది పాత ఆకాశవాణిలో ఓలేటి గారు చెప్పిన సంగీత పాఠం లాగా ఉంది

ఈ యోగం స్వాస్థ్యం కూడా బోరు కార్యక్రమమే టీ వి చూసి యోగం నేర్చుకుంటారా? గురుముఖతా రావాలనుకుంటాను ఏమో మరి నాకు సరిగా తెలియదు □

"ఖేల్ ఖేల్ మే"లో ఒక దృశ్యం



పాఠకుల శీర్షిక


గర్భస్థ శిశువు చెప్పిన కథలు

"శుభవేళ"

"అమ్మా"

ఉలిక్కిపడింది పరిమళ.... ఎవరు పిలుస్తున్నది? తన నెవరు పలుకరిస్తున్నారు.. అమ్మా.... అంత వినసొంపుగా, హృదయ వీణను మీటుతున్నట్టుగా. పిలిచేదెవరు? చుట్టూ చూసింది... ఎవరూ లేరు.... అంతలో గుర్తొచ్చింది పరిమళకు.... నెలలు నిండిన కడుపును తృప్తిగా తడిమింది చేత్తో....

"నేనమ్మా.... లోకం చూడలేని నేను



నా కళ్ళను నీకళ్ళల్లో ఉంచి చూస్తున్నాను.... నా చిన్న నోరును నీ గుండెకు వినిపించేలా విప్పుతున్నాను. చీకటి నుండి వెలుగులోకి నిన్ను బాధిస్తూ, నీ పేగును చీల్చుకుంటూ వచ్చే ముందు చిరునవ్వుతో స్వాగతం చెప్పమని అడిగేందుకు పిలుస్తున్నాను...."

పరిమళ నవ్వుకుంది.... గుండెకు గొంతు కలిపింది....

"అమ్మా.... నీ హృదయం నన్ను పలుకరిస్తుంది...."

"చెప్పు కన్నా.... నా బాధలు ఏం చూసావ్.... నా సమస్యలు ఏం విన్నావు". అడిగింది పరిమళ.

"అమ్మా.... నాకు ఇద్దరు అక్కలున్నారు.... తమ్ముడు కావాలని వాళ్ళు అడుగుతున్నారు... మరి నేను అమ్మాయినో, అబ్బాయినో... ఇప్పుడే చెప్పను".

"చెప్పు కన్నా...."

"ఎందుకని.... అమ్మాయైతే ఛీదరించుకుంటావా! అబ్బాయైతే వెండ గిన్నెలో ఉగ్గు పోస్తావా."

పరిమళ మాట్లాడలేదు...

"మాట్లాడవా అమ్మా.... నా ప్రశ్నకు బదులు చెప్పవా! అవునులే.... ఒకమ్మాయి పెళ్ళికే బెంగ పెట్టుకుంటున్న రోజులివి.... వరకట్నం పేరుతో రాక్షసంగా పీడిస్తున్న అబ్బాయిల తల్లి తండ్రుల మనస్తత్వం మారే రోజు వరకు అమ్మాయిగా పుట్టడమే పాపమంటావా... ఆ అమ్మాయిలకు జన్మ నివ్వడమే శాపమంటావా!

రోజులన్నీ ఇలాగే ఉంటాయంటావా? కన్యాశుల్కం రూపుమాపిన గురజాడ మళ్ళీ అవతరించాలా? రోజులు మారకపోతే, గురజాడ అడుగిడక పోతే ఈ తరం అమ్మాయిలంతా గురజాడను ఆదర్శంగా తీసుకుని వరకట్న నిర్మూలనకు ధ్వజమెత్తాలా, మగ గుండెలవిసేలా ఎలుగెత్తి చాటుతాం.... నేను నాయినకనవుతానమ్మా.... నన్ను అలా తీర్చి దిద్దమ్మా.... అమ్మ లందరికీ చెప్పు... అమ్మాయిలను ధైర్యంతో ముందుకుఅడుగు వేయమని చెప్పమ్మా...."

"ఆపేసావేం" పరిమళ అడిగింది.

"మరి నేను అబ్బాయి నైతే.... సంతోషంతో గంతులేస్తావు... కానీ అమ్మాయిలకున్న సమస్యలు అబ్బాయిలకు లేవా! చదివిన చదువుకు ఉద్యోగం రాక నిరుద్యోగులై రోడ్లంట ఎలా తిరుగుతున్నారో చూసావా! కానీ నేను అలాకానమ్మా.... భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అడుగులేస్తాను.

అమ్మా.... వరకట్నం ప్రశక్తి లేకుండా పెళ్ళిళ్ళు చేసుకొమ్మని తోటి యువతులకు సందేశాన్నిస్తాను.... నా అడుగులో పదిమంది నడిచేలా ఆదర్శవంతుడి నవుతానమ్మా.... నీకు పేరు తెస్తాను అమ్మా.... కన్నతల్లికి, కన్న భూమాతకు గౌరవం తెస్తానమ్మా...."

పరిమళ నవ్వింది.

"అలాగే నవ్వమ్మా..... చిరునవ్వుతో వెలుగులోకి తీసుకురా!



"ఇంతకీ నువ్వు...."

"అదిగో... అదే ప్రశ్న వద్దంటున్నాను.... నా మాట విన్నావు కదా! నా ఆశయం నెరవేరుస్తానన్నాగా.... ఇంకా సందిగ్ధం దేనికి....."

ఆపై చిన్ని గొంతు మాట్లాడలేదు.

నొప్పి లెక్కువవుతున్నా బాధ పడకుండా నవ్వుతుంది పరిమళ .... చుట్టూ ఉన్న వాళ్ళు వింతగా చూస్తున్నారు. ఇంత బాధలోను నవ్వు తుందేమిటా అని....

ఇప్పుడు పరిమళలో బాధలేదు....

అమ్మాయా! అబ్బాయా!

ఎవరైతేనేం....

పుణ్యజీవి వెలుగులోకి రాబోతున్న ఆ శుభవేళ పరిమళ చిరునవ్వులు చిందిస్తూ బాధను ఓర్చుకుంది.....

ఆనందంగా స్వాగతం పలికింది.

కంచుమర్తి వెంకటేశ్వరరావు.
కమలాపురం.

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

గర్భస్థ శిశువు చెప్పిన కథలు

కథ వ్రాసిన వారి పేరు : ______________________

____

పూర్తి చిరునామా ______________________

పిన్ కోడ్ : ______________________

అన్నీ సమస్యలే!

డాక్టర్ విజయలక్ష్మి చెప్పిన విషయం గుర్తుకు తెచ్చుకుంటూ మధుర ఊహలలో తేలిపోతోంది భానుమతి. ఆరోజు ఉదయమే తను, భర్త రాజశేఖరం కలిసి నర్సింగ్ హోంకి వెళ్ళితే టెస్ట్ చేసి 'గర్భస్థ శిశువు' 'ఆడపిల్ల' అని డాక్టర్ చెప్పింది. పెళ్ళయిన ఏడేళ్ళకు అబ్బాయి. మళ్ళీ ఏడేళ్ళకు ఇప్పుడు అమ్మాయి. ఆడపిల్ల నట్టింట నడయాడుతూంటే అదో ఆనందం. అలా ఆలోచనలలో తేలిపోతూ మంచంమీద పడుకుని గోడమీద కేలండరును చూస్తుంటే ఆకేలండరులోని పాప నవ్వుతూ తన కళ్ళముందే తిరుగుతున్నట్లుంది.

"అమ్మా!"

"ఎవరూ?" చుట్టూ చూస్తూ అడిగింది భానుమతి.

"నేనమ్మా!" చిన్ని పాప కంఠం. అచ్చు ఆ కేలండరులోని పాపలాగే ఉంది.


"రామ్మా! రా!!"

"ఆగమ్మా! నన్ను పిలవకు. నేను రాలేనమ్మా నిజమే అమ్మా. ఈ రోజుల్లో చాలమంది, గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలుసుకుని "అబార్షన్' చేయించు కుంటుంటే మీరు అలా కాకుండా, భ్రూణ హత్య చేయకుండా ఆ చిన్ని పాపకు స్వాగతం పలికి అల్లారు ముద్దుగా పెంచాలని అనుకుంటున్నారు. కాని, అమ్మా! మీ నిర్మల హృదయాన్ని చూచి, మరీ బాధ పడుతున్నానమ్మా ఎందుకంటావా అన్నయ్య ఇప్పుడు రెండో తరగతి చదువుతున్నాడు. నాన్నగారికి ఉద్యోగం ఏదమ్మా! నేటి రాజకీయ నాయకులు వ్యవస్థలనే మార్పు చేస్తున్నారు. అది పాలనా పరమైన సంస్కరణ అంటే, ఆ ఉద్యోగికి ప్రత్యామ్నాయం ఏది? వ్యవస్థ మార్పు ప్రజా సౌకర్యం కోసంగాని, కొన్ని వేలమంది ప్రజలకు తిండి లేకుండా చెయ్యడం కాదుగా. ఈ వేలాది నిర్భాగ్యులు కూడా ప్రజలలో వారే. గ్రామోద్యోగుల కుటుంబాల స్త్రీలు కూడా తెలుగింటి ఆడపడుచులే. ఒంటికి జబ్బు చేస్తే డాక్టరు ఆహార మార్పు చేయమంటాడు వరి అన్నం మాని గోధుమ అన్నం తినమంటాడు. ఎందుకో తెలుసా. ఉన్న జబ్బు తగ్గడానికి ఆహారాన్ని మార్చి ప్రత్యామ్నాయ ఆహారం సూచిస్తాడు. ఎందుకంటే ఆ మనిషి కూడా మనిషిలా బ్రతకాలి కనుక. కాని ఇక్కడ వ్యవస్థ మార్పుకోసం, కొత్తరకం వ్యవస్థని సృష్టించారు కాని, ఆ ఉద్యోగి కూడా మనిషేననీ, వాడికీ కుటుంబ బాధ్యతలు ఉంటాయని ఆలోచించలేదు. ఇప్పుడు నాన్నకి ఏ ఉద్యోగం లేదు. వయసు నలభై దాటింది మీకు రెండు పూటలా ఇంత అన్నం పెట్టడానికి ఆయన ఎంత బాధపడుతున్నారో నాకు తెలుసు. అన్నయ్య చదువు సాగడమే కష్టమమ్మా. ఇంక నేను బయటకివస్తే అన్నీ సమస్యలే. నన్ను పెంచాలి, పెద్ద చెయ్యాలి, పెళ్ళి చెయ్యాలంటే కట్నం సమస్య నన్ను కన్న పాపానికి మిమ్మల్నింకా సమస్యల వలయంలోకి, సుడిగుండంలోకి దింపలేను. 'చార్మినార్‌లాంటి" ఎత్తయిన కట్టడాలను ఆశ్రయించమని చెప్పలేను. మీలాంటి అమృతమూర్తుల కడుపున పుట్టలేకపోతున్నందులకు ఏడుస్తూ, నేను పుట్టి మిమ్మల్నింకా ఏడిపించలేక స్వార్థ పరత్వం నిండిపోయిన ఈ సమాజాన్ని శపిస్తూ మా లోకాలకు వెళ్ళిపోతున్నానమ్మా సెలవు..."

* * *

"పాపా" అని అరుస్తూ లేచిన భానుమతి కడుపులో ఏదో ఉండ చుట్టుకు పోతున్నట్లు, మెలి తిరిగి పోతూ. ఏడుస్తోంది; గోడమీద వెల వెలబోతున్న పాప కేలండర్ను చూస్తూ."


—పట్టమట్ట మాణిక్యాలరావు,
నాగిరెడ్డిగూడెం
(పశ్చిమ గోదావరి)



భవిష్యత్తులో నారి లేని భారతం?

మానవుని వైజ్ఞానిక తృష్ణకు అంతం లేకుండా పోయింది. 'స్పేస్ సూట్' ధరించి శూన్యంలో కూడా మానవుడు నడక సాగిస్తున్నాడంటే అతనికి గల మేథా పరిధి అర్థమవుతోంది "టెస్ట్ ట్యూబ్ బేబీ" నుంచి నేటి "ఏమ్నియోసెంటిసీస్" కూడా అంతే. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేసే పరీక్షలను వైద్య పరిభాషలలో "ఏమ్నియో సెంటిసీస్" అంటారు. ఈ పరీక్షలు ముఖ్యంగా గర్భస్థ శిశువుకుగల లోపాలు, వంశపారంపర్యంగా వచ్చే రోగాలు తెలుసుకోడానికి ఉద్దేశింపబడినవి అన్నీ ఉండి 'నోట్లో శని ఉన్నట్లు ఈ విజ్ఞాన ఫలితం అతని పురోగమనానికి కాక తిరోగమనానికి పరాకాష్ఠలా తయారవుతోంది. ఇప్పుడు "భ్రూణహత్యల పర్వంగా" ప్రారంభమైంది "ఏమ్నియోసెంటిసీస్" 'ఆడపిల్ల ఇంట్లో తిరుగుతుంటే నట్టింట మహాలక్ష్మి తిరుగుతున్నట్లు', 'ఎక్కడ స్త్రీలు పూజింపబడుదురో అక్కడ దేవతలు విహరిస్తారు' అని భావించే దేశం మనది. ఇలా స్త్రీని గౌరవించే మనదేశంలోనే గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలియగానే ఆధునిక విజ్ఞానం సమకూర్చిన ఆధునిక పరీక్షల సహాయంతో ఆడశిశువుల హత్యలకు పాల్పడుతున్నారు. మానవుని విజ్ఞాన చరిత్రలోనే 'తిరోగమన చర్య'గా పేర్కొనదగిన ఈ దుశ్చర్యకు అంతం లేదా? వంటింటి బంధిఖానా నుంచి బైటపడి అంతరిక్ష పథాన శిఖరాగ్ర స్థానాలకు చేరుకోవడమే కాక అనేక దేశాల సమక్షంలో ఓ పరాయి దేశంలో 'సిగ్గు చచ్చి బోర్లాపడి బొప్పి కట్టే పరిస్థితిలో' కొంచెం చేయూతనైనా ఇవ్వగల్గింది ఆడదే (సియోల్ ఆసియా క్రీడలు– పి. టి. ఉష) ఇల కాక ఒక్క మాటలో చెప్పాలంటే 'సృష్టికి కారణం స్త్రీనే'. మరి ఇంత ప్రాధాన్యం గల స్త్రీజాతిని మన చేతులారా గొంతు నులిమి ఎందుకు చంపేస్తున్నాం? 'అక్షరాస్యత లోపించా? అంటే ... ఈ పరీక్షలు చేయించుకొని భ్రూణహత్యలకు పాల్పడుతున్న వారంతా చదువుకున్నవారే కావటం విచిత్రం. పోనీ ... ఆడపిల్లల ఖర్చులెక్కువ, పెంచలేం, పెళ్ళి చేయలేం అంటారా? అంటే ... ఉన్నత విద్యావంతులై ఉండి, ఆర్థికంగా ఏ లోటూ లేని సంపన్న కుటుంబాలకు చెందిన తల్లులే ఈ హత్యలకు పాల్పడుతున్నారు. 1981 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యిమంది పురుషులకు 935 మంది మాత్రమే స్త్రీలున్నారు. ఈ పరీక్షలు ఎక్కువగా జరిగే ఢిల్లీ, బొంబాయి నగరాల్లో పుట్టే ప్రతి 1000 మంది ఆడపిల్లల్లో 650 మంది ఆడశిశువులు పుట్టక ముందే లింగ విచక్షణకు గురై హత్యచేయబడుతున్నారు. ఈ విధంగా సమాజం సమతౌల్యం లేక అసమానతలు పెరిగితే ఏమౌతుంది? భవిష్యత్తులో నారిలేని భారతాన్ని ఊహించగలమా? ఈ దుష్ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ఏమ్నియోసెంటిసీస్ పరీక్షలను పూర్తిగా నిషేధించాలన్నా ప్రమాదమే. అది వైద్యశాస్త్ర ప్రయోజనాలను. కాలదన్నుకోవటమే అవుతుంది. దీనికి పరిష్కారమాలోచించాల్సిన బాధ్యత ప్రభుత్వం, యువత, విజ్ఞులైన మేథావులపైనా ఉంది.

– కె. అంజనేయకుమార్,
భోగాపురం □



హైదరాబాద్ నోట్‌బుక్

హమ్మయ్య! సమ్మె ముగిసింది

53 రోజుల సమ్మె డిసెంబర్ 27 వ తేదీ సాయంకాలానికి ముగిసింది మరల ప్రభుత్వ కార్యాలయాలు యథాపూర్వంగా పని ప్రారంభించాయి ఈ సమ్మె వల్ల అటు ఉద్యోగులకూ, ఇటు ప్రభుత్వానికీ నష్టమే కలిగింది సమ్మె మూలంగా ప్రభుత్వానికి వంద కోట్ల రూపాయలు నష్టమయాయని రాష్ట్ర న్యాయశాఖా మంత్రి శ్రీ నర్సేగౌడ్ తెలిపారు సమ్మె కాలానికి జీతం లేనందున ఉద్యోగులు చాల నష్టపడ్డారు సమ్మె కాలాన్ని సర్వీసులో విచ్ఛేదం లేకుండా డ్యూటీలో లేనట్టు పరిగణించే షరతు మీదే ఒప్పందం కుదిరినా, ఎన్ జి వో ల నాయకుడు శ్రీ బి పూర్ణచంద్రరావు మాత్రం సమ్మె కాలాన్ని ప్రభుత్వం లీవుగా పరిగణించి జీతం ఇవ్వాలని, సర్వీసులో విచ్ఛేదం వుండరాదనే షరతు ఆ కాలాన్ని లీవుగా పరిగణించినప్పుడే సహేతుకమని, ఉద్యోగుల సర్వీసు నిబంధనల ప్రాతిపదిక నియమావళి ప్రకారం ఎర్న్‌డ్ లీవు, హాఫ్ పే లీవు వున్నప్పుడు జీతం నష్టంతో లీవు మంజూరు చేయరాదని వాదిస్తున్నారు ఈ వాదం సరికాదని, సర్వీస్ విచ్ఛేదాన్ని ఎలాటి లీవుగానూ పరిగణించక రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి వున్నదని, ఇది వరకు అలాటి సందర్భాలు ఉన్నాయని విషయజ్ఞులు అంటున్నారు ఒప్పందం ప్రకారం 45 రోజుల జీతాన్ని అడ్వాన్సు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లకు ఇతరులకు ఉత్తరువులు జారీ చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రావణ కుమార్ తెలిపారు ఈ మొత్తాన్ని వంతుల వారిగా ప్రభుత్వం రాబట్టుకుంటుంది సచివాలయంలోను, తక్కిన కార్యాలయాలలోను సమ్మెకు పూర్వ స్థితి ఏర్పడింది 29 వ తేదీన సచివాలయానికి వెళ్ళి చూచిన వారికి రకరకాల దృశ్యాలు కనిపించాయి చాలమంది ముఖాలలో నిరాశ కనిపించింది ఎలాటి గట్టి లాభమూ పొందకుండా ఇంత పెద్ద సమ్మెను తుస్సుమనిపించడానికేనా 53 రోజుల శ్రమ అని పలువురు పరస్పరం ప్రశ్నించుకొన్నారు సమ్మె కాలాన్ని సెలవుగా నైనా పరిగణించకపోవడం పలువురికి చాల కష్టం కలిగించింది పనీ లేదు, జీతమూ లేదు – అనడం సమ్మెలలో ఇదే తొలిసారి మరి ఒకరికి సంతోషం మరొకరికి దుఃఖమనే మామూలు సామెత సమ్మె విషయంలో నిజమైంది సమ్మె సమయంలో దినబత్తెంపై తాత్కాలికంగా నియమింపబడిన వారు విచారంతో మరలిపోవలసి వచ్చింది వీరిలో అత్యధిక సంఖ్యాకులు నిరుద్యోగులైన పట్టభద్రులు వీరిలో మహిళలూ ఎక్కువగానే ఉన్నారు వీరంతా సచివాలయంలోని ముఖ్యమంత్రి ప్రధానకార్యదర్శుల కార్యాలయాలున్న భవనాల ముందున్న పచ్చిక మైదానంలో గుమిగూడి తమ సమస్యలను చర్చించి, తమను దినబత్తెంపై ఉద్యోగాలలో కొనసాగనివ్వాలని కోరుతూ ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రావణకుమార్‌కు ఒక విజ్ఞప్తి అందజేశారు వీరిలో టైపిస్టులు, స్టెనోగ్రాపర్లు, అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు వీరికి రోజుకు 15 మొదలు 25 రూపాయల వరకు దినసరి జీతం ఇచ్చేవారు మేము ప్రభుత్వానికి అవసరమున్న గడ్డు సమయంలో సేవ చేశాము కనుక మా విషయాన్ని కొంత శ్రద్ధతో చూడాలి అని వారు కోరారు నియమ నిబంధనలకు లోబడి శాయశక్తులా సహాయం చేయడానికి ప్రయత్నిస్తామని ప్రధాన కార్యదర్శి వారికి హామీ ఇచ్చారు ఇది ఇలా వుండగా, సమ్మెల చరిత్రలోనే తొలిసారిగా సమ్మె కాలపు జీతం కోల్పోయిన ఉద్యోగుల పక్షాన ఉద్యోగుల కార్మికుల పోరాట సంఘం (ఎస్ సి ఇ డబ్ల్యు) నాయకులు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య చెయిర్మన్ శ్రీ కె ఎ కేశవమూర్తితో పాటు ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళి సమ్మె కాలానికి జీతం చెల్లించాలని కోరారు కాని, ముఖ్యమంత్రి పూర్తిగా నిరాకరించారు ససేమిరా వారి అభ్యర్థనను అంగీకరించలేము ముఖ్యమంత్రి ఉద్యోగుల విషయంలో సానుభూతి రహితమైన మొండి వైఖరి ప్రదర్శించారని శ్రీ కేశవమూర్తి తర్వాత పత్రికా ప్రతినిధులతో అన్నారు ప్రభుత్వం ఈ విషయంలో పాత సంప్రదాయాలను గౌరవించకుండా చరిత్రను తారుమారు చేసిందని ఆయన విమర్శించారు

ఉపరాష్ట్రపతి సూచన :–

ఉపరాష్ట్రపతి శ్రీ ఆర్ వెంకట్రామన్ డిసెంబర్ 30 వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయం 66 వ స్నాతకోత్సవంలో స్నాతకోపన్యాసం చేస్తూ, విద్యార్థులకు లేత వయస్సులో శీల సంపాదన దృష్టిని కలిగించని విద్యా సంస్కరణ సత్ఫలితాలను ఇవ్వదని నొక్కి చెప్పారు విద్యార్థుల నైతికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఒక పాఠ్యక్రమాన్ని రూపొందించి ప్రాథమిక పాఠశాలలలో రోజు కొక పీరియడైనా బోధించేట్లు నిర్బంధించాలని ఉపరాష్ట్రపతి సూచించారు ఏ విద్య లక్ష్యమైనా, విద్యార్థులలో దేశభక్తి, కర్తవ్యనిష్ఠ, జాతీయ సమైక్యత, మతసామరస్యం వంటి ఉత్తమ గుణాలు, నిజాయతీ, సమయ పాలనం, క్రమశిక్షణ వంటి సద్భావాలు కలిగించడం గనుక, ఈ గుణాలు బోధించడానికి కిండర్ గార్డెన్, ప్రాథమిక పాఠశాలలే ఉత్తమ రంగాలు నేడు చాల పురోగమించిన కొన్ని దేశాలు సభ్యత తెలియక, బర్బర స్థితిలో ఉన్నప్పుడు, భారతదేశ సభ్యత ఆసియా అంతటాను, ప్రపంచంలోని ఇతర దేశాలలోను వ్యాపించింది ఈ విషయాన్ని ప్రతి భారతీయుడు, ఓనమాలు నేర్వడానికి ముందుగానే తెలుసుకోవాలి శైశవంలో అలవరచిన క్రమశిక్షణ, ఉత్తమ గుణాలు మానవ వ్యవస్థలో బాగంగా శాశ్వతంగా వుండిపోతాయి – అని ఆయన అన్నారు ఆయన డిగ్రీలు, ఉద్యోగాలు గురించి ప్రసంగిస్తూ, ఉన్నత విద్య ఉద్యోగానికి ప్యాస్ పోర్టనే సిద్ధాంతాన్ని ధ్వంసం చేయాలని, ప్రతి సర్వీసుకు ఉద్యోగుల నియామకం ఆ సర్వీసుకు అవసరమైన అర్హతలపై జరుగాలి గాని విశ్వవిద్యాలయ యోగ్యతాపత్రాలపై కారాదని, అలా చేస్తే విశ్వవిద్యాలయాలకు ఎగబ్రాకడం తగ్గిపోతుందని, ఉద్యోగానికి ఎంపిక ఉద్యోగార్హత పైనే జరగాలి గాని, అకెడెమిక్ అర్హతలపై కాదని ఆయన అన్నారు భారత జాతి సాహిత్యాన్ని మనం ఆస్తిగా కాపాడాలి అంతా ఒక్కటిగా ఏకాకారంగా కారాదు కళాసాహిత్య విజ్ఞాన రంగాలలో ప్రయోగాలు చేయడానికి ఎంతో అవకాశం వుంది ఆ ప్రయోగాలు నైతిక సూత్రాలకు అనుగుణంగాను, విశ్వజనీనమైన జీవిత సత్యాలకు కట్టుబడీ వుండాలి భాష వివిద వర్గాలలో సామరస్య సాధనకు ఎంతో కృషి చేయవచ్చు భాషల ఉద్దేశం ప్రజలను సన్నిహితులను చేయడం కాని, భాష, మతం, విజ్ఞానం, సంగీతం వాస్తుశిల్పం, చిత్రలేఖనం విచ్ఛేదానికి విభజనకు, అవిశ్వాసానికి, ద్వేషానికి కారణమయ్యాయి ఈ పరిస్థితి తొలగాలి – అని ఉపరాష్ట్రపతి కోరారు ఉస్మానియా విశ్వవిద్యాలయం విశిష్ట లక్షణం వివిధ విద్యార్థి వర్గాల మధ్య ఐకమత్యమని ఆయన ప్రశంసించారు ఉపరాష్ట్రపతిని ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్ బిరుదంతో సన్మానించింది

భారత సేన :–

భారతసేన అనే నూతన సంస్థ డిసెంబర్ 29 న అవతరించింది ముఖ్యమంత్రిని విమర్శించినందున సస్పెండు చేయబడిన సీనియర్ ఐ ఎ ఎస్ ఆఫీసర్ శ్రీ ఎ వి ఎస్ రెడ్డి ఈ సంస్థ అధ్యక్షుడు రైతులకూ, ఇతర బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు విశదీకరించడం, సంఘాన్ని దేశ భవిష్యత్తును రూపొందించడంలో అవసరమైన పద్ధతులను పూనుకొనేట్టు చేయడం మున్నగునవి దీని లక్ష్యాలని, ఇది రిజిస్టరయిన సంస్థ అని శ్రీ రెడ్డి తెలిపారు భారతసేన జాతి ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన రైతుకు ఉచితంగా విద్యుచ్ఛక్తిని సరఫరా చేస్తుందని; ధాన్యం నిలువ చేసుకొనే సౌకర్యాన్ని ఉచితంగా కలిగిస్తుందని, ఉద్యోగావకాశాలు కలిగిస్తుందని, సహకారోద్యమాన్ని బలపరచడానికి ప్రయత్నిస్తుందని ప్రజల అవసరాలు తీరుస్తుందని ఆయన అన్నారు

ఉపశ్రుతి:–

చూచారా, బావగారూ, మనీ కళ్ళ ఎదుట పుట్టిన అతను చకచకా నిచ్చెన ఎక్కి ఎంత పైకి పోయాడో! అన్నాను, చాల తొందరగా పెక్కు సన్మానాలు, పదవులు పొందుతూ పైకి పాకిపోతున్న ఒక రచయితను గురించి, శ్రీ రాంభట్ల కృష్ణమూర్తితో ఔనండీ, ఆయన పట్టు పారిశ్రామికుడు మరి అన్నారు శ్రీ రాంభట్ల అంటే, వెనుకబడిన తరగతా? – అనడిగాను అయ్యో రామ! పట్టు పారిశ్రామికుడంటే, ఎవర్నైనా పట్టడం చేతనైనవాడు ఉడుంలాగ పట్టుకోగలడు జలగలాగ పీల్చగలడు పనయిన తర్వాత జీబ్రా లాగా తన్ని పోగలడు మీరు చేయగలరా? – అన్నారు శ్రీ రాంభట్ల - ఏదైనా అలాటి సంస్థ ఉంటే చెప్పండి చేరుతాను.

–తిరుమల రామచంద్ర

"వండర్ బాయ్" అజారుద్దీన్‌కు సినిమా అవకాశము



మహేందర్‌సింగ్ ఆలింగనములో అజార్.

క్రికెట్ ఆట నేడు నవనాగరిక లక్షణాలలో ఒకటిగా మనదేశంలో చెలామణి అవుతున్నది మన జట్టులో యువతీ యువకుల అభిమానము చూరగొన్న యువ ఆటగాళ్ళు రవిశాస్త్రి, అజారుద్దీన్ రవిశాస్త్రి సినీతార ప్రేమలో పడి పెళ్ళివరకు వెళ్లాడు హైదరాబాద్ 'వండర్‌బాయ్' అజారుద్దీన్ సినిమా తారల తాకిడికి, సినిమాలలో నటించుటకు అహ్వానములను తట్టుకోలేక అయోమయ పరిస్థితిలో పడ్డాడు

ఇటీవల షార్జాలో జరిగిన నాలుగుదేశాల 'ఛాంపియన్స్ ట్రాఫీ' పోటీలలో మన క్రికెట్ యోధులు నిరాశ కలిగించారు కాని యీ పోటీలు విదేశ జట్లుతో మన జట్టు ఆడిన 'టెస్టు' పోటీలకన్న ఎంతో ఆసక్తి, ప్రచారము పొందాయి మన సినీ తారలు బొంబాయినుండి ప్రత్యేకముగా షార్జా వెళ్లారు నాలుగు దేశజట్టు ఆటగాళ్ళతో పరిచయముకోసమే గాక ఆటను ప్రత్యక్షముగా తిలికించుటకు వెళ్లాము అని వారు పత్రికల వారితో అన్నారు బొంబాయిలో జరుగు 'టెస్టు' పోటీలు 'ఒన్ డే' పోటీలు ప్రత్యక్షముగా తిలకించుటకు సమయము లభించగా షూటింగ్‌ల విరామ సమయములలో టి వి చూచే మన అగ్రగామి సినీ తారలు షార్జా వెళ్లారంటే ఆశ్చర్యముగా యున్నది వీరికి షార్జా 'షా' సదుపాయములు చేయుటయే గాక విందులు వినోదాలు ఏర్పాటు చేశారట బొంబాయి అగ్రగామి తారలు సంజయ్‌ఖాన్ రాజ్‌కపూర్, షమ్మీకపూర్ కుటుంబ సమేతముగా షార్జా



షార్జాలో బొంబాయి సినిమా తారలు

తరలివెళ్లారు. నాలుగు దేశాల జట్టు ఆడిన పోటీలు అన్ని 'స్పెషల్ బాక్స్'లో కూర్చుని తిలకించారు ఇది ప్రత్యేక విశేషము కాక పోవచ్చును కాని సినీతారల 'గ్లామర్'పై మోజు కొద్దివారి దర్శనము, వారితో ఫొటోలకై ఎందరో ప్రయత్నములు చేయుచుండగా యీ తారలు క్రికెట్ తారల'తో పరిచయము, ఫొటోలకై ప్రయత్నాలు చేసారు అనేది వింత కలిపిస్తున్నది

ఆస్ట్రే - ఏషియా కప్ పోటీల సమయంలో న్యూటనీ ఐడల్' సంజయ్‌ఖాన్ అజారుద్దీన్‌తో ఫొటో తీయించుకోవాలని ఎంతో ఆసక్తి చూపాడు అజారుద్దీన్ దగ్గరకు వెళ్ళికోరి 'ఫొటో' తీయించుకున్నాడు బొంబాయి 'సొషలైట్' పరమేశ్వరీ గోద్రెజ్ తన 'అభిమాన ఆటగాడు తమిళనాడుకు చెందిన శ్రీకాంత్‌కు ప్రత్యేక బహుమతిగా వెయ్యిడాలర్లు ఇచ్చారు

రాజకపూర్, షమ్మీకపూర్ సోదరులు అవకాశము దొరికి నప్పుడు అజారుద్దీన్‌ను సమీపించి పిచ్చాపాటి మాట్లాడేవారు రాజ్‌కపూర్ తాను అజారుద్దీన్ అభిమాని (ఫాన్) అని కూడా చెప్పుకున్నాడు అంతటితో ఆగాక అజారుద్దీన్‌కు సినిమాలో నటించు అవకాశము ఇస్తానన్నాడు దానికి అజారుద్దీన్ ఆసక్తి చూపలేదట మొదట క్రికెట్ ఆటగానిగా స్థిరపడాలి అని అజారుద్దీన్ 'హాఫ్ వాలీ' జవాబు యిచ్చాడట

అజారుద్దీన్ యీ పోటీలకు ముందు కొంత నిరాశ కలిగించుటతో ఛాంపియన్స్ ట్రాఫీ పోటీలలో మన జట్టులో అవకాశము అస్తవ్యస్తముగా యుండినది ఆస్ట్రేలియాకు ఆడిన సీరీస్'లో విఫలమగుటతోసెలక్టర్స్ అజారుద్దీన్‌ను జట్టులో అవకాశము యిచ్చుట గురించి ఆలోచనలో పడ్డారు దిలీప్ ట్రాఫీ పోటీలలో అజార్ విజృంభించి అధి పరుగులు సాధించుటతో షార్జా ప్రయాణమునకు 'బెర్త్' దొరికినది లేనిచో యింటిదగ్గ్గయుండి టి వి లో తన మిత్రుల ఆట చూడవలసి వచ్చేది షార్జాలో అజార్ 50 నాట్ అవుట్, 38, 49 పరుగులుచేసి ప్రశంస పొందాడు శ్రీకాంత్ 92 పరుగులకు అవుట్ అగుట కొంత యీ తారలకు నిరాశ కలిగించినది ఒకతార ఎనిమిది పరుగులు కూడాచేసి 'సెంచరీ' చేయలేనందుకు బాధపడ్డాడు

షార్జా కాంటినెంటల్ హోటల్‌లో 714 నెంబరు గది అంతగా రామన్ లాంబాకు కలిసి రాలేదట ఒక పరుగు కూడా సాధించకుండా అవుట్ అయాడు ఆ గదిలో యుండుట వలనట కాని అతని రూమ్‌మేట్' అజారుద్దీన్ మాత్రము అధి ప్రశంసలు పొందాడు ఏది ఏమైనా మన క్రికెట్ ఆటగాళ్ళు ఓటమి పొందినను ఎన్నో తీపి అనుభవాలతో యింటికి తిరిగి వచ్చారు —ముకరమ్



మొహిందర్ అమర్‌నాథ్‌తో నటుడు సంజయ్‌ఖాన్.



జర్నలిజంలో బంగారు పతకాల విజేత ఇసుకపల్లి సుజాత

జర్నలిజం కోర్సులో 1986 ఏప్రిల్‌లో జరిగిన వార్షిక డిప్లొమా పరీక్షలలో అద్భుత ప్రతిభను కనబరచిన కుమారి ఇసుకపల్లి సుజాతకు బొంబాయికి చెందిన ఆర్ పి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ మేనేజ్‌మెంట్ వారు బంగారు పతకాలు ప్రకటించారు అత్యుత్తమ జర్నలిజం విద్యార్థికి ఇచ్చే 'ఖాసా సుబ్బారావు బంగారు పతకం', హైదరాబాదుకు చెందిన భవాన్స్ కాలేజిలో అత్యుత్తమ విద్యార్థికి ఇచ్చే కులపతి బంగారు పతకం, జర్నలిజం బృందంలో అత్యుత్తమ విద్యార్థికి కాలేజి వారు ఇచ్చే కులపతి రజత పతకం ఆమె పొందారు రచన అనే పరీక్షలో ఎక్కువ మార్కులు తెచ్చుకున్నందుకు ఇచ్చే 'నాగపూర్ టైమ్స్' నగదు బహుమతిని ఆమెకు, మరొక విద్యార్థికి సంయుక్తంగా ఇచ్చారు కుమారి సుజాత గతంలో 1980లో ఉస్మానియా విశ్వ విద్యాలయం వారి బి ఎ లో నిజాం బంగారు పతకాన్ని, మాడపాటి మాణిక్యమ్మ బంగారు పతకాన్ని కూడ గెల్చుకున్నారు 1982లో ఎం ఎ తెలుగు పరీక్షలో ప్రతిభా పత్రాన్ని పొందారు


ప్రగతి కళా మండలి నాటిక పోటీలు

ప్రగతి కళామండలి సత్తెనపల్లి వారు తమ సంస్థ 39వ వార్షికోత్సవాల సందర్భంగా 14వ వార్షిక కళా పరిషత్తు 1987 ఏప్రిల్ చివరి వారములో జరుప నున్నట్లు కళా మండలి అధ్యక్షులు శ్రీ పత్రి జగన్నాథరావు తెలియజేస్తున్నారు

ఈ సందర్భముగ రాష్ట్రస్థాయి నాటిక ఏకపాత్రాభినయములలో పోటీలు నిర్వహించ నున్నట్లు ప్రముఖ రంగస్థల, చలన చిత్ర కళా కారులను సన్మానించనున్నట్లు తెలిపారు పూర్తి వివరములకు కార్యదర్శి, ప్రగతి కళామండలి (రిజిష్టర్డు) సత్తెనపల్లి గుంటూరుజిల్లా 522403 వారికి రాయవచ్చు.



కర్ణాటక రాష్ట్రములోని దావనగెరెలో రోటరీ 316 కాన్ఫరెన్సు సందర్భంగా గుండి మహదేవప్ప కల్యాణ మండపంలో కూచిపూడి నృత్య ప్రదర్శన యిచ్చిన "నృత్యకళారత్న" మద్దాలి అపర్ణ.



ఇటీవల బాపట్ల సాంస్కృతీ సమాఖ్య అధ్యక్షురాలు, అక్షర సందేశం రచయిత్రి శ్రీమతి కోకా విమలకుమారి బదిలీ అయిన సందర్భంగా బాపట్ల సాహితీ మిత్రులు నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కోకా విమల కుమారిని దుశ్శాలువతో సత్కరించినప్పటి చిత్రం.

రసమయి అవార్డులు

తెనాలిలోని సాహితీ సాంస్కృతిక సంస్థ 'రసమయి' 1986వ సంవత్సరానికి జాతీయ స్థాయిలో విశిష్ట వ్యక్తిగా శ్రీ దాసరి నారాయణరావుని ఎంపిక చేసింది చక్రపాణి స్మారక ఉత్తమ నిర్మాత అవార్డుకి శ్రీ విడదనాగేశ్వర రావు, డా గరికపాటి రాజారావు స్మారక ఉత్తమ దర్శకుని అవార్డుకి శ్రీ కె విశ్వనాథ్, డా గోవిందరాజుల సుబ్బారావు స్మారక ఉత్తమ నటుడి అవార్డుకి శ్రీ సర్వదమన్ బెనర్జీ, కాంచనమాల స్మారక ఉత్తమనటి అవార్డుకి కుమారి జీవిత, పింగళి నాగేంద్ర రావు స్మారక ఉత్తమ సంభాషణా రచయిత అవార్డుకి శ్రీ పి ఎల్. నారాయణ, కొసరాజు స్మారక ఉత్తమ గేయ రచయిత అవార్డుకి శ్రీ వంగపండు ప్రసాదరావు, కస్తూరి శివరావు స్మారక ఉత్తమ హాస్య నటుడి అవార్డుకి శ్రీ సుత్తి వీరభద్రరావులని ఎంపిక చేసినట్లు, ఫిబ్రవరి 8వ తేదీన తమ సంస్థ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అవార్డుల బహూకరణ జరుగుతుందని, ఈ సందర్భంగా సంస్థ నాలుగురోజుల పాటు నిర్వహించే అఖిల భారత స్థాయి నాటికల పోటీలని సినీనటుడు నిర్మాత శ్రీ మురళీమోహన్ ఫిబ్రవరి 4న ప్రారంభిస్తారని రసమయి ప్రధాన కార్యదర్శి తెలియ చేసారు ☐

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003. Acting Editor: M. Madhava Rao, Chief Editor: S. Radhakrishna.
Phones: Business: 61247, 61248, 75569 Editorial: 75667